



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 95: బుధవారం 19 నవంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్







# మాస్టర్ మైండ్ హతం

## మోస్ట్ వాంటెడ్ మావో నేత హిడ్మా ఎన్‌కౌంటర్

**ఆయన భార్య, మరో నలుగురు సహచరులు మృతి**

**మారేడుపల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్**

- దండకారణ్య స్పెషల్‌జోనల్ కమిటీ కార్యదర్శిగా హిడ్మా
- మావోయిస్టుల కేంద్ర కమిటీ సభ్యుడిగా కూడా సేవలు..
- పీఎల్‌జీఏ ప్లాటూన్1 కమాండర్.. గెరిల్లా దాడులకు వ్యూహకర్త
- 27 ఏళ్లుగా అడవుల్లోనే జీవనం
- 75మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల హతం కేసులో కీలక సూత్రధారి
- దేశంలో జరిగిన భారీ దాడుల్లో వ్యూహకర్త హిడ్మానే
- కీలక నేతలు నేలకూలినా, ఉద్యమ బాటవీడినా.. జీవితం మావోయిస్టు ఉద్యమానికి అంకితమన్న లీడర్
- చివరకు పోరాడి అసువులు బాసిన అగ్రనేత
- హిడ్మాపై రూ.కోటి, ఆయన భార్యపై రూ.50లక్షలకు పైగా రివార్డు

నక్సల్బరి ఉద్యమ శకం ముగిసింది.. మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్లో ఇప్పటికే ఎంతో మం ది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు.. కీలక నేతలు హతం అయ్యారు.. మరో వైపు పెద్ద ఎత్తున లొంగుబాట్లు కూడా జరిగాయి. ఈ క్రమంలో మావోయిస్టు ఉద్యమానికి అండగా.. పార్టీలో కీలకనేతగా ఉన్న మాడవి హిడ్మాపైనే చర్చ జరిగింది. హిడ్మా లొంగిపోతారా? అనే చర్చ జరిగింది. అయితే.. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లోని రంపచోడవరం దగ్గర మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్లో మావోయిస్టు టాప్ లీడర్ హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య హేమ కూడా ప్రాణాలు విడిచారు.. ఇప్పటి వరకు అందుతున్న సమాచారం ప్రకారం ఈ రోజు జరిగిన ఎన్ కౌంటర్లో హిడ్మా, అతని భార్య హేమ(రాజక్క)తో సహా ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు.. హిడ్మా, ఆయన భార్య మరణాన్ని అధికారులు ధ్రువీకరించారు.

*- మారేడుమిల్లి, నవంబర్ 18:*

02

## 27 మంది మావోయిస్టులు అరెస్ట్

విజయవాడలో కలకలం

నేడు డీజీపీ ద్వారా వివరాల వెల్లడి



02

## పోలీసుల అదుపులో దేవ్ జీ?

లొంగిపోయినట్లు ప్రచారం

మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ



02

## ఆరేడు గంటలు ఎదురుకాల్పులు

02

- ఎన్ కౌంటర్ లో హిడ్మా మృతి
- ధ్రువీకరించిన ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా



04

## సర్, ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరు

ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో డిసెంబర్‌లో ర్యాలీ

మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ భేటీలో నిర్ణయం



# నేడు రైతులకు నగదు బదిలీ

- కడపలో అన్నదాత సుఖీభవను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- సీఎం పర్యటన సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం కడప జిల్లాలో పర్యటించనున్నారు. కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రిలో 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' కార్యక్రమంలో పాల్గొననున్నారు. అక్కడే రైతుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు.

.. వివరాలు 2లో



03

## రైతుల ఖాతాల్లో రూ. 560 కోట్లు

- ఇప్పటి వరకు 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు
- మంత్రి నాదెండ్ల మనోహార్

## సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

హాజరైన నటి ఐశ్వర్యా రాయ్, సచిన్ టెండుల్కర్



.. వివరాలు 3లో



## పదిరోజుల పాటు వైకుంఠ ఏకాదశి దర్శనాలు

డిసెంబర్ 30 నుంచి జనవరి 8వరకు అవకాశం

మొదటి మూడు రోజులు 300, శ్రీవాణి దర్శనాలు రద్దు

టీటీడీ బోర్డు సమావేశ వివరాలు వెల్లడించిన ఛైర్మన్

.. వివరాలు 3లో

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# ఆరేడు గంటలు ఎదురుకాల్పులు

## ఎన్ కౌంటర్ లో హిడ్మా మృతి

## ధ్రువీకరించిన ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా



**రంపచోడవరం :** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారని ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. మంగళవారం ఉదయం 6-7 గంటల మధ్య భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని చెప్పారు. ఎన్‌కౌంటర్ వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌తో కలిసి ఆయన వెల్లడించారు. గత రెండు రోజులుగా ఇంటెలిజెన్స్ సమాచారంతో గాలింపు చర్యలను విస్తృతంగా చేపట్టామని మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు. మావోయిస్టుల నుంచి వివిధ రకాలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. మరోవైపు కృష్ణా జిల్లాతో పాటు విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా తెలిపారు. వీరిలో 9 మంది కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నారని వివరించారు. ఎన్‌కౌంటర్ ప్రాంతంలో మరో ఐదుగురు మావోయి స్టులు అక్కడి నుంచి తప్పించు కున్నారని చెప్పారు. ఇటీవల మావోయిస్టులకు సహకరిస్తున్న 31 మందిని అదుపులోకి తీసుకున్నామ ని, ఇంకా మరో 26 మందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని అడిషనల్ డీజీ తెలిపారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టులు ఛత్తీస్‌ఘడ్‌కు చెందినవారని గుర్తించామని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తున్నామని వెల్లడించారు.

# దండకారణ్యం నుంచి ఏపీలోకి నక్సల్స్

## పలు జిల్లాల్లో ఆపరేషన్ నిర్వహించిన పోలీసులు

## ఏలూరులో 15మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం



**విజయవాడ,నవంబరు18:** మావోయిస్టుల కదలికలతో ఏపీలో హై అలర్ట్ కొనసాగుతోంది. అడవిలో నుంచి ఏపీకి వచ్చిన మావోయిస్టుల కోసం భద్రతాబలగాల గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే విజయవాడలో 27మంది మావోయిస్టులను అరెస్టు చేసిన పోలీసులు.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా కొప్పవరంలో ఇద్దరు మావోయిస్టులను అరెస్టుచేశారు. అలాగే ఏలూరులో 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అల్లూరి జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర కీలక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని పరిణామాలతో మావోయిస్టులు ఏపీకి రావాలని చూస్తున్నారని మహేశ్ చంద్ర తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. మావోయిస్టుల కదలిలకపై ఇంటెలిజెన్స్ నుంచి రెండు రోజుల క్రితం పక్కా సమాచారం వచ్చిందని చెప్పారు. మావోయిస్టులు ఏపీ నుంచి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని చూశారని వెల్లడించారు. అలాగే ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో 31 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని మహేశ చంద్ర తెలిపారు. అరెస్టయిన వారిలో 9 మంది మావోయిస్టులు కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్‌జీ అనుచరులుగా గుర్తించామని వెల్లడించారు. మిగిలినవారంతా సౌత్ బస్తర్ జోనల్ కమిటీ సభ్యులు అని పేర్కొన్నారు.

# మావోయిస్టుల నిర్మూలనకు నిరంతరం కూంబింగ్

## 14 నెలలుగా సుమారు 2500 మంది అరెస్ట్

## విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

**నర్సీపట్నం:** విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మంగళవారం నర్సీపట్నం డిఎస్పి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డీఐజీకి గార్డ్ హాఫ్ హానర్ తో స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ గోపీనాథ్ డీఎస్పీ కార్యాలయం రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు తక్షణం చేపట్టాల్సిన కర్తవ్యాలను పోలీస్ సిబ్బందికి వివరించారు. తనిఖీల్లో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పాల్గొన్నారు. అనంతరం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మీడియాతో మాట్లాడారు. మావోయిస్టుల నిర్మూలనకు కూంబింగ్ ద్వారా నిరంతరం తనిఖీలు ఉంటాయన్నారు. గతంలో ఎన్కౌంటర్లు జరిగిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మావోలు అడుగు పెట్టినప్పుడు మాత్రమే ఎదురు కాల్పులు జరుగుతాయన్నారు. గిరిజన ప్రాంతాలలో మావోయిస్టులను నియంత్రించడానికి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. సంకల్పం పేరుతో 20 వేల కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆగతాయిలు గంజాయి వినియోగం వలన మర్డర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా గంజాయికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అల్లూరి జిల్లాలో ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తుందని దీనివల్ల జిల్లాలో గంజాయిని పండించడం గిరిజనులు ఆపేసారన్నారు. ఒరిస్సా నుంచి పండిస్తున్న గంజాయిని అల్లూరు జిల్లా మీదుగా రవాణా చేస్తున్న నేపథ్యంలో వాటిని అరికట్టడానికి ప్రత్యేకమైన చెక్ పోస్టులు, డ్రోన్ నిఘా ద్వారా అరికడుతున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాల ద్వారా అన్ని వర్గాల ప్రజలను ముఖ్యంగా విద్యావేత్తలను వివిధ రకాలుగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. డిజిటల్ అరెస్ట్, కొరియర్ పార్సెల్స్ లో డ్రగ్స్ ఉన్నాయని అమాయకులను మోసం చేస్తున్నారని వీటిపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇటువంటి బెదిరింపులు ఎవరైనా ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930 నెంబర్ కి ఫోన్ చేస్తే వారు పోగొట్టుకున్న సొమ్ము రికవరీ చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, టౌన్ సీఐ గోవిందరావు, సీఐ అప్పన్న, రూరల్ ఎస్సై రాజారావు, నాతవరం ఎస్ఐ తారకేశ్వర రావు, టౌన్ ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ మైండ్ హిడ్మా హతం

- ఎన్ కౌంటర్ లో మరణించిన అగ్రనేత
- ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోలు మృతి






**మారేడుమిల్లి, నవంబర్ 18:** మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొంగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మూరియా తెగకు చెందిన వ్యక్తి . 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004 నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో హిడ్మాతో సహా ఆరుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

# 27 మంది మావోయిస్టులు అరెస్ట్

## విజయవాడలో కలకలం

## నేడు డీజీపీ ద్వారా వివరాల వెల్లడి



**విజయవాడ :** మావోయిస్టు అగ్రనేత మద్వి హిడ్మా ఎన్‌కౌంటర్ వేళ విజయవాడలో మావోయిస్టుల కలకలం రేగింది. కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బృందాల ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించారు. మావోయిస్టులు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ క్రమంలో విజయవాడ నగరంలో భారీగా 27మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. . కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో అక్టోపస్, గ్రే హౌండ్స్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి 27 మంది మావోలను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కృష్ణా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా ఎన్ కౌంటర్ అనంతరం కొత్త ఆటోనగర్‌లో 27 మందిని అదుపులోకి తీసుకున్నామని.. నేడు ఇది చాలా మేజర్ ఆపరేషన్ అని చెప్పుకొచ్చారు. దేవ్ జీ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు, అతనితో పాటు ఉన్న తొమ్మిది మంది ప్రొటెక్షన్ టీంను పట్టుకున్నామన్నారు. మిగతా వారు కూడా నక్సల్ ఆపరేషన్‌లో కీలకంగా ఉన్నట్లు చెప్పారు. డీజీపీ పర్యవేక్షణలో ఈ మొత్తం నడిచిందని తెలిపారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం డీజీపీ వెల్లడిస్తారని అన్నారు. వెపన్స్ కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచే వారంతా వివిధ మార్గాల్లో విజయవాడకు వచ్చినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో 21 మంది మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారన్నారు. రాష్ట్ర పోలీసుకు వచ్చిన సమాచారంతో ఈ ఆపరేషన్ మొత్తం సాగిందని తెలిపారు.హిడ్మా ఇక్కడ నుంచే వెళ్లారనేది ఇంకా స్పష్టత లేదని ఎస్పీ అన్నారు. వారందరినీ పూర్తిగా విచారణ చేశాక వివరాలు తెలుపుతామని.. పోలీసులకు ఉండ్గే ÷ర్ ఫోర్స్‌తో వారు ఎదురు తిరిగలేరన్నారు. ఐదు జిల్లాల్లో నేడు ఈ ఆపరేషన్ జరిగిందని.. కృష్ణా జిల్లా పరంగా తమ ఆపరేషన్ వివరాలు తెలియజేసినట్లు చెప్పారు. డేటా మొత్తం తీసుకుని, విచారణ ముగిశాక అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. ఇది ఇండస్ట్రియల్ ఏరియా అని.. లేబర్ చాలా మంది ఉంటారని తెలిపారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చే వాళ్ల లాగానే మావోయిస్టులు కూడా వచ్చారని.. తమకు సమాచారం వచ్చాక నిఘా పెట్టి నేడు పట్టుకున్నామని వెల్లడించారు. గన్నవరం, పెనమలూరు, కంకిపాడు పోలీసు టీంలు పాల్గొన్నాయన్నారు. మావోయిస్టులు ఏదో ప్రణాళికతోనే ఇక్కడ మకాం వేశారని.. అన్ని విషయాలు విచారణ అయ్యాక చెబుతామని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు.

# పోలీసుల అదుపులో దేవ్ జీ?

## లొంగిపోయినట్లు ప్రచారం

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ



**విజయవాడ :** మావోయిస్టుల అగ్ర నేత హిడ్మా ఎన్‌కౌంటర్ తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తూ పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మావోయిస్టు ఉద్యమంలో కీలక నేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసుల ఎదుట లొంగిపోయారని ఊహాగానాలు వస్తున్నాయి. ఇటీవలే ఆయన ఏపీ పోలీసుల ఎదుట లొంగిపోయారని ప్రచారం జరుగుతోంది. కానీ దీనిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. తిప్పిరి తిరుపతి విషయానికొస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల ఆయన స్వస్థలం. తిప్పిరి తిరుపతి దాదాపు 43 ఏండ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. దళిత కుటుంబంలో పుట్టిన ఆయన.. ఇంటర్ వరకు కోరుట్లలోనే చదివారు. 1978 ప్రాంతంలో రైతుకూలీ పోరాటాలు, విద్యార్థి సంఘాలు, రాడికల్ స్టూడెంట్ యూనియన్ పోరాటాల్లో పాల్గొని కూలీరేట్ల పెంపుదలలో భాగస్వాములయ్యారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం చేశారు. రాడికల్ స్టూడెంట్ యూనియన్ కోరుట్ల శాఖలో కీలకంగా ఉన్న ఆయన 1982లో ఆర్‌ఎస్‌యూ విద్యార్థులపై సాగిన మారణహోమంపై ఒగ్గుకథ రూపంలో ప్రచారం చేశారు. ఆరెస్సెస్, ఏబీవీపీ తిరుపతిపై పలుమార్లు దాడులకు దిగాయి. అప్పట్నుంచే పీపుల్స్‌వార్ కార్యక్రమాల ప్రాధాన్యం వివరించడంతో ఆయనపై నిర్బంధం పెరిగిపోయింది. పలుకేసులతో జైలుకు సైతం వెళ్లారు. గణపతి కార్యదర్శిగా పీపుల్స్‌వార్ పార్టీ తన ప్రస్తానాన్ని కొనసాగించిన క్రమంలో మల్లోజుల కోటేశ్వర్‌రావు, నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, పులి అంజన్న, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, నంబాల కేశవరావు, మాధవ్, తిప్పిరి తిరుపతి కీలక భూమిక పోషించారు. పీపుల్స్‌వార్‌లో దళ సభ్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన తిరుపతి, పార్టీలో అంచలంచెలుగా ఎదిగారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కార్యదర్శిగా, ఛత్తీస్‌గఢ్ స్టేట్ కమిటీ మెంబర్‌గా, దళ కమాండర్‌గా, జోనల్ కమిటీ మెంబర్‌గా, స్టేట్ కమిటీ మెంబర్‌గా, ప్లాటూన్ కమాండర్‌గా పనిచేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం కేంద్ర మావోయిస్టు పార్టీ మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నట్టు సమాచారం. 2010వ సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో 74 మంది జవాన్ల మృతికి కారణమైన ఘటనలో తిప్పిరి తిరుపతి కీలక పాత్ర పోషించారు. పీపుల్స్‌వార్, మరికొన్ని విప్లవ గ్రూపులు కలిసి 2004లో మావోయిస్టు పార్టీగా అవతరించాయి. పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న గణపతి అలియాస్ ముప్పాల లక్ష్మణ్‌రావును మావోయిస్టు కేంద్ర కమిటీ తొలి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వృద్దాప్యం నేపథ్యంలో గణపతి స్థానంలో నంబాల కేశవరావు కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన ఈ ఏడాది మేలో ఎదురుకాల్పుల్లో చనిపోయిన నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ కొత్త కార్యదర్శిగా మావోయిస్టు పార్టీ మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్న తిప్పిరి తిరుపతిని నియమించినట్టు ప్రకటించింది.మావోయిస్టుల కదలికలతో ఏపీలో హై అలర్ట్ కొనసాగుతోంది. అడవిలో నుంచి ఏపీకి వచ్చిన మావోయిస్టుల కోసం భద్రతాబలగాల గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే విజయవాడ పరిసర ప్రాంతాల్లో 31 మంది మావోయిస్టులను అరెస్టు చేసిన పోలీసులు.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా కొప్పవరంలో ఇద్దరు మావోయిస్టులను అరెస్టుచేశారు. అలాగే ఏలూరులో 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిలో చాలావరకు దేవ్‌జీ అనుచరులు ఉన్నట్లుగా తెలుస్తోంది.

# రైతుల ఖాతాల్లో రూ. 560 కోట్లు



**ఇప్పటి వరకు 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు**

**గత్తేడాదితో పోలిస్తే 30 శాతం అదనం**

**రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

**పెనమలూరు:** రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా 32,793 మంది రైతుల నుండి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి దాదాపు రూ. 560 కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేశామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదా రుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కానూరు సివిల్ సప్లైస్ భవన్ లో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులు మాపై ఉంచిన నమ్మకం, భరోసా తో నిజాయితీగా, పారదర్శకంగా ఇబ్బందులు లేకుండా కొనుగోళు చేస్తున్నామన్నారు. రైతులు ఆశించిన మేరకు క్షేత్ర స్థాయిలో దాదాపు 16,000 మంది సిబ్బంది ఇందుకు కృషి చేస్తూ జిల్లా స్థాయిలో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతరం కొనగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగా నేటి వరకు 32,793 మంది రైతుల నుండి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి రూ. 560 కోట్ల 40 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఇది గత సంవత్సరంతో పోల్చితే 30% అదనంగా పెరిగిందన్నారు. గత ఏడాది ఇదే రోజున 1,81,885 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహిస్తూ రైతాంగానికి కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కొంతమంది రైతులకి కొన్ని ప్రాంతాల్లో రైస్ మిల్లర్లకు లబ్ధి చేకూర్చేలా గత ప్రభుత్వాలు చేసిన నిర్వాహకాలు అందరికే తెలిసిందేనన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఇప్పటివరకు ధాన్యం అమ్మిన రైతుల సంఖ్య 36 శాతానికి పెరిగిందన్నారు. వీరిలో ఎక్కువగా చిన్న సన్నకారు రైతులు ఉన్నారని దాదాపు 6,600 మంది కౌలు రైతులు కూడా సద్వినియోగం చేసుకోగలిగారన్నారు. గత సంవత్సరం సుమారు రూ. 12 వేల కోట్ల దాకా ధాన్యం కొనుగోలు చేసినప్పుడు 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చెప్పిన మాట నెరవేర్చుతూ రైతుల ఖాతాల్లో నగదు చెల్లిస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. ఈసారి ఒక ఛాలెంజ్ గా రైతులకు నగదు చెల్లింపుల విషయాన్ని సవాల్ గా తీసుకుని 48 గంటలు కాస్తా 24 గంటలకే రైతుల ఖాతాలో నగదు జమ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటివరకు రూ. 560 కోట్ల 48 లక్షల మంది రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. దీనికొక ఉదాహరణగా గుంటూరు మండలంలోని పత్తిపాటి సుబ్బారావు అనే రైతు ఆయన ఖాతాలోకి రూ. 2 లక్షల 8 వేలను 6 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఏలూరు జిల్లా భీమడోలు లో నీలం త్రిమూర్తులు అనే రైతు ఖాతాలోకి 5 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. గోనె సంచుల సమస్య లేకుండా 6 కోట్ల 34 లక్షల గోతాలను రైతు సహాయ కేంద్రాల్లో రైతాంగానికి అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ డివైస్ ఏర్పాటు చేసి పూర్తి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో అల్పపీడన తుఫాన్ హెచ్చిరికల నేపథ్యంలో 50 వేల టార్పాలిన్ లు ప్రతి రైతు సహాయ కేంద్రాల్లో జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు సుమారు 19 వేల టార్పాలిన్ లు రైతు సహాయ కేంద్రాల్లో రైతాంగానికి ఉచితంగా అందించడం జరిగిందన్నారు. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ద్వారా రైతాంగానికి వాళ్ళు ధాన్యాన్ని ఎక్కడ, ఏ టైమ్ కు, ఏ రోజు, ఏ మిల్లుకి అమ్ముకోవాలనేది వాళ్ళే నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఈరోజు వరకు దాదాపు 500 మంది రైతులు ఈ వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు. 7337359375 ఈ నెంబర్ కి హాయ్ అని మెసేజ్ పెడితే ప్రాంతం, విస్తీర్ణం, పండిన ధాన్యం వివరాలన్నీ వాట్సాప్ మెసేజ్ లోనే ఆటోమేటిక్ గా వస్తుందన్నారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఒక షెడ్యూల్ అనేది ఈ ప్రక్రియ ద్వారా అందించగలుగుతున్నామన్నారు. అదే విధంగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కార్యాలయంలో 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఇబ్బందులు, సమస్యలు తెలియజేయవచ్చన్నారు. మొట్టమొదటిసారి చరిత్ర సృష్టించబోతున్నామని 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి కూటమి ప్రభుత్వం ఈ సీజన్ లో సిద్ధంగా ఉన్నామన్నారు. ఫైన్ వెరైటీ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ఫైన్ రకం మధ్యాహ్న భోజన పథకం కోసం, పాఠశాలలకు నాణ్యమైన బియ్యం అందించే విధంగా ఒక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు. పాత్రికేయుల సమావేశంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ ఎస్. ఢిల్లీ రావు ఉన్నారు.

# పదిరోజుల పాటు వైకుంఠ ఏకాదశి దర్శనాలు



తిరుమల : శ్రీవారి భక్తులకు శుభవార్త చెబుతూ తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది.. తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈసారి పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నట్లు టీటీడీ ప్రకటించింది. డిసెంబర్ 30వ తేదీ నుండి వచ్చే సంవత్సరం జనవరి 8వ తేదీ వరకు భక్తులకు ఈ ప్రత్యేక దర్శనావకాశం అందుబాటులో ఉండనుంది. టిటిడి బోర్డు సమావేశ వివరాలను ఛైర్మన్ బిఆర్ నాయుడు మీడియాకు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భక్తుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి సాధారణ భక్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు టీటీడీ స్పష్టం చేసింది. పది రోజుల కాలంలో 182 గంటల దర్శన సమయం ఉండగా.. అందులో 164 గంటలు సాధారణ భక్తులకే ప్రత్యేకంగా కేటాయిస్తున్నట్లు టీటీడీ తెలిపింది. మొదటి 3 రోజులు రూ.300, శ్రీవాణి దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.. వైకుంఠ దర్శనాల ప్రారంభయ్యే మూడు రోజులు రూ.300 దర్శనం, శ్రీవాణి దర్శనం రద్దు చేయబడ్డాయని.. జనవరి 2 నుండి టికెట్ కేటాయింపు ఉంటుందని ప్రకటించింది.. జనవరి 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రూ.300 దర్శన టికెట్లు 15,000 వేల చొప్పున విడుదల చేయనున్నారు.. శ్రీవాణి దర్శనాలకు సంబంధించిన టికెట్లు 1,000 చొప్పున అందుబాటులో ఉంచుతారు.. ఈ టికెట్లు సాధారణ పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా జారీ అవుతాయి. మొదటి మూడు రోజులకు ఈ–డిప్ సిస్టమ్ ద్వారా అంటే, డిసెంబర్ 30, 31 మరియు జనవరి 1వ తేదీల దర్శనాలకు అనుమతి ఇస్తారు.. ఈ–డిప్ ద్వారా టికెట్లు కేటాయింపు జరుగుతుంది. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు రిజిస్ట్రేన్ అవకాశం ఉంటుంది.. డిసెంబర్ 2న లాటరీ విధానంలో ఎంపికైన వారికి టోకెన్ల కేటాయిస్తారు.. టీటీడీ వెబ్‌సైట్‌తో పాటు.. మొబైల్ యాప్, వాట్సాప్ సిస్టమ్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, టోకెన్ కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. వైకుంఠ ద్వారా దర్శనం సందర్భంగా స్థానికులకు ప్రత్యేక కేటాయింపులు చేసింది టీటీడీ.. తిరుమల?తిరుపతి ప్రాంత భక్తులకు.. జనవరి 6, 7, 8 తేదీల్లో రోజుకి 5,000 టోకెన్లు కేటాయించ నున్నారు. ఈ ఏడాది వైకుంఠ దర్శనాల సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనం, ప్రత్యేక దర్శనం ఏడు రోజులపాటు రద్దు చేయబడింది. అత్యవసరంగా వచ్చే ప్రముఖులకు మాత్రమే దర్శనం కల్పించబడుతుంది అని టీటీడీ స్పష్టం చేసింది.. క్యూలైన్‌లో నేరుగా నిల్చుని వచ్చే భక్తులకు కూడా వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది. తిరుమలలో భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ అన్ని ఏర్పాట్లు ముమ్మరం చేసింది. కాగా, వైకుంఠ ద్వారా దర్శనానికి ప్రతీ ఏడాది భక్తులు తిరుమలకు పెద్ద సంఖ్యలు తరలివచ్చే విషయం విదితమే. ఇకపోతే పరకామణి కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని, ఎవ్వరినీ వదలరాదని బోర్డు కోరింది. తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక తీర్మానం చేశారు. పరకామణి చోరీ ఘటనపై మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లోక్ అదాలత్‌లో రాజీ వెనుక కుట్రదారులను తేల్చేలా విచారణ జరపాలని తీర్మానం చేశారు. గతంలో నమోదైన కేసు పరిధి పరిమితంగా ఉండటంతోపాటు, ఇటీవల కాలంలోనూ మరికొన్ని చోరీ ఘటనల దృష్ట్యా మరో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. అలాగే అమరావతిలో వేంకటేశ్వరాలయం శంకుస్థాపనలో సిఎం పాల్గొంటారని ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు.

# శబరిమలకు పోటెత్తిన అయ్యప్పలు

**దాదాపు రెండులక్షల మంది రాక**

**క్యూలైన్ల నిర్వహణలో బోర్డు విఫలం**



**తిరువనంతపురం :** మండల– మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర నేపథ్యంలో కేరళలోని శబరిమల అయ్యప్ప క్షేత్రానికి భక్తులు పోటెత్తుతున్నారు. తొలి రెండు రోజుల్లోనే దాదాపు రెండు లక్షల మందికి పైగా చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పంబ నుంచి సన్నిధానం మార్గంలోనూ విపరీతమైన రద్దీ నెలకొంది. చాలామంది బారికేడ్లను ఎక్కుతూ కనిపించారు. రద్దీ నియంత్రణ విషయంలో దేవస్థానం బోర్డు, ప్రభుత్వం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. భక్తుల రద్దీకి సరిపడా ఏర్పాట్లు చేయలేదని ఆలయ బోర్డు ట్రస్టు, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో దర్శనం కోసం భక్తులు గంటలతరబడి నిలబడాల్సి వచ్చింది. ఆలయ ప్రాంగణం, పంబ నుంచి నడక మార్గంలో ఇసుకేస్తే రాలనంత భక్తజనం ఉండటంతో.. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సిబ్బంది, పోలీసులకు రద్దీ నియంత్రణ తలకు మించిన భారంగా మారింది. దర్శనం చేసుకుని వచ్చే భక్తులకు ఆ మార్గంలో ట్రాక్టర్లు, జేసీబీల రాకపోకలతో ఇబ్బందులు తప్పలేదు. పోలీస్ బందోబస్తు అంతంతమాత్రంగానే ఉందని పలువురు భక్తులు ఆరోపించారు. కొండపై వెళ్లే దారిలో గంటలు తరబడి నిలబెట్టడం, సమస్యను వినే వారు లేకపోవడం, సరైన సమాచార వ్యవస్థ లేకపోవడం వంటి వైఫల్యాలు అడుగడుగునా ఉన్నాయి. రద్దీ నియంత్రణ కోసం నీలక్కల్, ఇతర ప్రదేశాల్లో భక్తులు ముందుకు కదలకుండా తాత్కాలికంగా ఆంక్షలు విధించారు. అయితే శబరిమలలో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని ఏడీజీపీ శ్రీజిత్ తెలిపారు. రద్దీ నియంత్రణ వ్యవస్థ త్వరలోనే పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందని చెప్పారు. సరైన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం, టీడీబీ విఫలమయ్యాయని కేరళ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ఆరోపించారు.



# సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

**పుట్టపర్తి :** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తికి ప్రముఖ సినీ నటి ఐశ్వర్యరాయ్, భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తరలివచ్చారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు హాజరయ్యారు. సాయి కుల్వంత్ హాల్‌లో బాబా మహా సమాధిని సినీ నటి ఐశ్వర్యరాయ్ దర్శించుకున్నారు. అటు, సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు హాజరయ్యేందుకు భారత మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కూడా పుట్టపర్తి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో సచిన్ టెండూల్కర్ తో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అంతకుముందు, సాయి కుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహా సమాధిని సచిన్ టెండూల్కర్ దర్శించుకున్నారు.

# నేడు రైతులకు నగదు బదిలీ

**కడపలో అన్నదాత సుఖీభవను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**

**సీఎం పర్యటన సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు**



**కడప :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం కడప జిల్లాలో పర్యటించనున్నారు. కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రిలో 'అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్' కార్యక్రమంలో పాల్గొననున్నారు. అక్కడే రైతుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. సిఎం పర్యటన సందర్భంగా ఎద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 1 గంటకు హెలికాప్టర్‌లో పెండ్లిమర్రికి చేరుకోనున్న సీఎం.. అనంతరం వెల్లటూరులోని మన గ్రోమోర్ ఎరువుల సెంటర్‌ను పరిశీలించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1.40 గంటలకు పెండ్లిమర్రిలో నిర్వహించే ప్రజావేదిక ప్రోగ్రాంలో చంద్రబాబు పాల్గొంటారు. బుధవారం నాడు సాయంత్రం 4.20 గంటలకు చిన్నదొరసారి ప్లలెలో రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి మాట్లాడనున్నారు. అలాగే, సాయంత్రం 5.15 గంటలకు వెల్లటూరులో పార్టీ స్థానిక నేతలతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 6.40 గంటలకు కడప ఎయిర్‌పోర్ట్ నుంచి సీఎం చంద్రబాబు విజయవాడకు తిరిగి పయనం కానున్నారు.

# 20న నితీశ్ ప్రమాణ స్వీకారం

**సీఎం చంద్రబాబుకు ఆహ్వానం**

**అమరావతి :** బిహార్ రాజధాని పాట్నాలో జరిగే సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అందుకు ముహూర్తం ఖరారు అయింది. సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఆహ్వానం అందింది. నవంబర్ 20వ తేదీన వీరు బిహార్ వెళ్లనున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆ రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సంబంధించిన వివరాలను బిహార్‌లోని పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా వివరించారు. 243 అసెంబ్లీ స్థానాలు ఉన్న బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా.. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల ఫలితాలను నవంబర్ 14వ తేదీన లెక్కించారు. ఈ ఎన్నికల్లో బిహార్ ఓటరు ఎన్డీయేకు వరుసగా మరోసారి పట్టం కట్టాడు. జేడీ (యూ) అధినేత నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అందుకోసం రాజధాని పాట్నాలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఈ సీఎం నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్టీల అధినేతలు, మిత్రపక్షాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు ఆయన కేబినెట్ సహచరులంతా హాజరువుతారని సమాచారం. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రముఖులు వస్తుండడంతో.. పాట్నాలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# విపక్షనేతగా ఉండడానికి తేజస్వి విముఖత

**పార్టీని నడపాల్సిందేనని లాలూ సూచన**

**పాట్నా:** బీహార్ ఎన్నికల్లో లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన ఆర్జేడీ ఘోర పరాజయం పాలైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్–ఆర్జేడీ కూటమిని ముందుండి నడిపించిన, సీఎం అభ్యర్థిగా ఉన్న తేజస్వీ యాదవ్ ఒకానొక దశలో ఓడిపోయే పరిస్థితి ఏర్పడింది, చివరకు స్వల్ప మెజారిటీతో గ్టటెక్కారు. 243 సీట్లు ఉన్న బీహార్ అసెంబ్లీలో ఆర్జేడీ కేవలం 25 సీట్లకు మాత్రమే పరిమితమైంది. మహాఘట్బంధన్ కూటమి కేవలం 35 సీట్లను మాత్రమే సాధించింది. మరోవైపు, ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుకుంది. నితీష్ కుమార్ సీఎంగా మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఇదిలా ఉంటే, ఈ ఘోర పరాజయం తర్వాత తేజస్వీ యాదవ్ ప్రతిపక్ష నాయకుడిగా ఉండటానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. అయితే, ఆయన తండ్రి లాలూ పట్టుబట్టడంతో ఈ పదవిని చేపట్టడానికి అంగీకరించారు. సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో తాను ఎమ్మెల్యేగానే కొనసాగుతానని, ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలు చేపట్టడానికి నిరాకరించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, లాలూ మాత్రం సభలో పార్టీని నడిపించాలని తేజస్వీని కోరారని చెప్పారు. ఆర్జేడీ ఓటమికి కూడా తేజస్వీ యాదవ్ తానే బాధ్యత తీసుకున్నాడు. ఈ ఎన్నికల్లో చాలా ప్రయత్నించానని, కానీ విఫలమయ్యానని అన్నారు. అయితే, సమావేశంలో సీనియర్ నాయకులు తేజస్వీ యాదవ్ వెంటే ఉన్నామని, అతడితోనే ఉంటామని చెప్పారు. తేజస్వీ యాదవ్ సన్నిహితుడు, ఆర్జేడీ ఎంపీ సంజయ్ యాదవ్ ఈ సమావేశంలో ఆయనను సమర్థించారు. ఇటీవల, లాలూ ఫ్యామిలీ డ్రామాలో సంజయ్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపించింది. లాలూ కుమార్తె రోహిణి ఆచార్య, ఇటీవల తన కుటుంబంతో సంబంధాలు తెంచుకున్నట్లు చెప్పింది. దీనికి సంజయ్ యాదవ్ రమీజ్ నేమత్ ఖాన్‌లు కారణమని వెల్లడించింది.

# చిన్న పిల్లల మిస్సింగ్ కేసులు

**దత్తత నిబంధనలు సరళీకరించాలని సుప్రీం సూచన**



**న్యూఢిల్లీ :** ఇటీవల పలు రాష్ట్రాల్లో చిన్నారుల మిస్సింగ్ పై మీడియాలో వార్తలు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో చిన్నారుల మిస్సింగ్‌పై న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ఎనిమిది నిమిషాలకొక చిన్నారి మిస్ అవుతున్నారనే వార్తలు వస్తున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న తెలిపారు. ఈ క్రమంలో దత్తత నిబంధనలు సరళీకృతం చేయాలని సూచించారు. పిల్లల దత్తత నిబంధనలు కఠినతరంగా ఉండటం వల్ల అక్రమ పద్ధతుల్లో దత్తత తీసుకుంటున్నారని వ్యాఖ్యానించారు నాగరత్న. చిన్నారుల మిస్సింగ్ అంశంపై జిల్లాకు ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని గత విచారణలో సూచించింది సుప్రీంకోర్టు. తెలంగాణలో అక్రమ దత్తత వ్యవహారంలో పలు కేసులు బయటకు వచ్చాయని న్యాయవాది గుర్తుచేశారు. ఈ విషయంపై అన్ని రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# భారత్‌కు తలనొప్పిగా బంగ్లా పరిణామాలు!

ఏదేశాన్ని తిన్నగా బతకనీయకుండా ఆటలాడడం అమెరికాకు అలవాటుగా మారింది. అన్ని దేశాలపైనా ఆంక్షలు విధించడం, మోయలేని సుంకాలు విధించడం, బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, 500 శాతం పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిం చారు. ప్రపంచ దేశాలన్నీ తన కనుసన్నల్లో ఉండాలన్న కోరిక అమెరికాలో బలంగా నాటుకుంటోంది. అందుకు అవసరమైన అన్ని కుయుక్తులు పన్నుతోంది. ఒక్కో దేశంలో వేలుపెడుతూ వాటిని కంట్రో ల్ చేస్తోంది. ఇజ్రాయిల్‌ను అడ్డం పెట్టుకుని పాలస్తీనాపై దాడికి తెగించింది. ఇరాన్, ఖతార్‌లపైనా విరుచుకు పడింది. అలాంటి అవకాశం లేని చోట్ల రాజకీయంగా వేలుపెట్టి అక్కడున్న పాలకులను మార్చేస్తోంది. ఒక్క భారత్‌లోనే అది సాధ్యం కావడం లేదు. చైనా లో అస్సలు సాధ్యం కాదు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడం, విభిన్న మతాలు, కులాల సమాహారం కావడంతో ఇక్కడ దాని పప్పులు ఉడకలేదు. ఇక్కడా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవలి వరుస ఆందోళనలు చూస్తుంటే సిఐఎ బాగా పని చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో పరోక్షంగా అమెరికా పాత్ర ఉంది. అలాగే పాక్‌ను మరోమారు దువ్వుతున్నారు. నేపాల్‌లో గొడవలు సృష్టించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు చుట్టుపక్కల దేశాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధిం చారు. వీసాల విషయంలో అనేక రకాల నిబంధలను పెట్టారు. బంగ్లాదేశ్‌నే తీసుకుంటే అక్కడా అలజడుల వెనక అమెరికా హస్తం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇతరదేశాల్లో వేలు పెట్టడం వల్ల తాము చాలా నష్టపోయామని అమెరికా ఇంటిలిజెన్స్ చీఫ్ తులసీగబ్బార్ ఆమధ్య అంగీకరించారు. అయినా వెనకటి గుణమేల మారు అన్న చందంగా అమెరికా పరిస్థితి ఉంది. బంగాదేశ్‌లనే తీసుకుంటే అక్కడ హసీనాను గద్దె దించడం, యూనస్‌ను గద్దెనెక్కించడం చకచకా జరిగి పోయాయి. ఇప్పుడు హసీనాకు ఉరిశిక్షను కూడా విధించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రసాయన ఆయుధాల పేరుతో ఇరాక్‌పై దాడిచేసి అక్కడ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె దింపింది. అలాగే సద్దాంను విచారణ పేరుతో బంధించి ఉరితీసే వరకు నిద్రపోలేదు. సరిగ్గా ఇప్పుడు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తీరు కూడా ఇరాక్‌ను పోలివుంది. హసీనా భారత్‌కు అనుకూలంగా ఉండడాన్ని అమెరికా జీర్ణించుకోవడం లేదని అర్థం అవుతోంది. అందుకే ఆమెను పదవీచ్యుతురాలిని చేశాక భారత్‌లో ఆశ్రయం పొందారు. ఇప్పుడు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని అక్కడి ట్రిబ్యునల్ నిర్ణయించింది. ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ హసీనా ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిందని ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్నవారిని కాల్చిపారేయమని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతాబలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించా రంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు ప్రకటించారు. తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. తీర్పు వెలువడగానే, యూనిస్ ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించమని డిమాండ్ చేయడం చూస్తూనే ఉన్నాం. ట్రిబ్యునల్ తీర్పు ఎలా రాబోతున్నదో ఊహకు అందనిదేమీ కాదు. సరిగ్గా యాభైయేళ్ళక్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించు కున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది. జియా వుర్ రహ్మాన్ భార్య ఖలీదాజియామీద అలుపెరగని, సాహసోపేత పోరాటాలు చేశారు. ఇద్దరు బేగంల మధ్య సాగిన ఆధిపత్య పోరాటంలో ముజబూర్ రహ్మాన్ కుమార్తె పైచేయి సాధించారు. ఖలీదా సహా బీఎన్పీ అధినాయకుల నిర్బంధాలు, ఆ పార్టీకి అండ గా ఉన్న జమాతే వంటి ఇస్లామిక్ ఛాందసశక్తులను అధికారి కంగానూ, అనధికారికగానూ హసీనా చీల్చిచెండాడారు. హసీనా పాలనలో బంగ్లాదేశ్ వేగంగా వృద్ధిచెందింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి, పేదరిక నిర్మూలనలోనూ మంచి పేరు తెచ్చుకుంది. తనకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమంపట్ల హసీనా నిర్దయగా వ్యవహరించారన్నదీ వాస్తవమే. ఆ తరువాత ఆమె దిగివచ్చినా, అప్పటికే పరిస్థితి చేజా రింది. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించు కున్న తరువాత నిజానికి చల్లారినా, స్వల్పకాలంలోనే తిరిగి రాజుకోవడం వెనుక జమాత్ ఇస్లామీ, బీఎన్పీ ఉండటంతో ఆమె కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని అంటారు. పాకిస్థాన్ ఒత్తిడి కారణంగా అమెరికా, దాని మిత్రదేశాలు కొన్ని ఆమెకు పూర్తి వ్యతిరేకంగా వ్యహరించాయి. ఆమె ఢిల్లీ పారిపోయి వచ్చిన తరువాత, బంగ్లాదేశ్‌లో అప్పటినుంచి ఇప్పటివరకూ సాగిన పరిణామాలన్నీ ఆమె పట్ల ఏయే శక్తులు ఏ లక్ష్యాల సాధనకోసం కత్తికట్టాయో తెలియచెబుతాయి. గృహనిర్బంధంలో ఉన్న ఖలీదా విదేశీ చికిత్సతో ఎన్నికలకు సిద్ధపడటం, వేలాదిమంది జమాత్ యోధులు జైళ్ళ నుంచి బయటకు రావడం, ముజబూర్ రహ్మాన్ విగ్రహాలను మాత్రమే కాదు, ఆయన ఆధ్వర్యంలో సాగిన విముక్తి పోరాటాన్ని సై తం చరిత్ర నుంచి చెరిపేసి, అప్పట్లో ఊచకోతకోసిన పాకిస్థాన్‌ను ఘనంగా ఊరేగించడం చూస్తూనే ఉన్నాం. ఓ రకంగా పాకిస్థాన్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిది. ఇలా భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌ను, బంగ్లాదేశ్‌ను ఎగదోయడం వెనక ఎవరున్నారన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే పలుమార్లు ఆమె అప్పగిం చాలని యూనిస్ ప్రభుత్వం కోరుతూ వచ్చింది. ఇప్పుడు ఉరిశిక్ష విధించారు. కనుక భారత్ మీద ఒత్తిడి పెంచేందుకు ఇప్పుడు మరో ఆయుధం చేతికి అందివచ్చింది. ఇదంతా పెద్దన్న ఆడిస్తున్న నాటకమని తెలుసుకోవడానికి పెద్దగా తెలివి తేటలు అక్కర్లేదు.



డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక

# ఏఐ బుడగ ఎప్పుడైనా పగిలిపోవచ్చు

**కంపెనీలు అప్రమత్తంగా ఉండాలి**
**కృత్రిమ మేధను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు**
**ప్రత్యామ్నాయాలను కూడా అన్వేషించాలి**
**గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్**



లండన్,నవంబర్18 : ఏఐని గుడ్డిగా నమ్మి మోసోవ ద్దని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ గురించి గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ హెచ్చరిక చేశారు. ఏఐ ఇచ్చే సమాధానాలను గుడ్డిగా నమ్మొద్దంటూ యూజర్లకు సూచించారు. అలాగే, ఏఐ కంపెనీలకూ కీలక సూచన చేశారు. ఏఐ పెట్టుబడుల బూమ్ ఏ దశలోనైనా పగిలి పోవచ్చని, అందుకు కంపెనీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆ ప్రభావానికి ఎవరూ అతీతు లు కాదని పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలో మౌలిక సదుపాయాలు, పరిశోధనలపై 5 బిలియన్ పౌండ్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. బీబీసీకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ప్రస్తుత ఏఐ మోడళ్లలో తప్పులు చేసే అవకాశం ఉందని, అందు వల్ల ఇతర టూల్స్‌తోనూ సమాచారాన్ని ధ్రువీకరించుకో వడం అవసరమని సుందర్ పిచాయ్ అభిప్రాయప డ్డారు. ఏఐపైనే ఆధారపడకుండా, విభిన్న మాధ్యమాల తో కూడిన సమాచార వ్యవస్థ ఉండటం ముఖ్యం అని పేర్కొన్నారు. 'ఆ కారణంగానే ప్రజలు గూగుల్ సెర్చ్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. కచ్చితమైన సమాచారాన్ని అందించేందుకు మేం చాలా కృషి చేస్తాం' అని ఆయన చెప్పారు. సృజనాత్మక రచన వంటి విషయాల్లో ఏఐ ఉపయోగకరమే అయినా.. ఏఐ చెప్పిందంతా నమ్మడం సరికాదని పిచాయ్ చెప్పారు. ఈ రంగంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతలో కూడా కొన్ని పొరపాట్లు తప్పవని ఆయన తెలిపారు. ఇటీవల గూగుల్ తన జెమినీ చాట్‌బాట్ ఆధారిత ఏఐ మోడ్‌ను సెర్చ్‌లో ప్రవేశపెట్టింది. వినియోగదారులకు నిపుణులతో మాట్లాడుతున్న అనుభవం ఇవ్వడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ప్రస్తుత ఏఐ పెట్టుబడుల వృద్ధి రోజురోజుకీ పెరిగిపోతున్నప్పటికీ, దానిలో అహేతుకత కూడా కనిపిస్తోందన్నారు. చిప్‌ల నుంచి యూట్యూబ్ డేటా వరకు, మోడళ్ల నుంచి ఫ్రాంటియర్ సైన్స్ వరకు అన్ని సాంకేతిక సెగ్మెంట్‌లను స్వయంగా కలిగి ఉండటం వల్లే ఏఐ మార్కెట్‌లో ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకునే స్థాయిలో గూగుల్ ఉందని పిచాయ్ అన్నారు. అలాగే యూకేలో తమ పెట్టుబడులు విస్తరిస్తున్నట్లు వెల్లడించారు.

# అగ్నిప్రమాదంలో అంబులెన్స్ దగ్ధం

**నవజాత శిశువు, ఓ వైద్యుడు సహా మొత్తం నలుగురు మృతి**



**గాంధీనగర్, నవంబర్ 18:** గుజరాత్ లో ఘోర ప్రమాదం సంభవించింది. అంబులెన్స్ లో మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో నవజాత శిశువు, ఓ వైద్యుడు సహా మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని అర్వల్లి జిల్లాలో గల మోడసా పట్టణ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అప్పుడే పుట్టిన శిశువు అనారోగ్యంతో బాధపడుతుండటంతో చిన్నారిని మోడసాలోని ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం అహ్మదాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 1 గంట ప్రాంతంలో మోడసా–ధన్సురా రహదారిపై అంబులెన్స్‌లో మంటలు చెలరేగాయి ఆ సమయంలో అంబులెన్స్‌లో శిశువు తండ్రి జిగ్నేష్ మోచి (38), అహ్మదాబాద్‌కు చెందిన వైద్యుడు శాంతిలాల్ రెంటియా (30), నర్సు భూరిబెన్ మనత్ (23) ఉన్నారు. ఈ ప్రమాదంలో వారు సజీవదహనమైనట్లు పోలీసులు వెల్లడించారు. అంబులెన్స్ డ్రైవర్, మరో ముగ్గురు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. వారు కాలిన గాయాలతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మోడీ మాటలు ఆకట్టుకున్నాయి


**మరోమారు మోడీకి శశిథరూర్ ప్రశంసలు**



**న్యూఢిల్లీ,నవంబర్18:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఇటీవల కాలంలో తరచు ప్రశంసిస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. మంగళవారంనాడు రామ్‌నాథ్ గోయెంకా ఆరవ స్మారకోపన్యాస కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆ కార్యక్రమానికి శశిథరూర్‌ను కూడా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రధాని పలు కీలక అంశాలను ప్రస్తావించడం, ముఖ్యంగా దేశాభివృద్ధి కోసం నిరంతర కృషి సాగించాలని పిలుపునివ్వడం తనను ఎంతగానో కదిలించిందని శశిథరూర్ తెలిపారు. తాను తీవ్ర జ్వరం, దగ్గుతో బాధపడుతున్నప్పటికీ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మోదీ ప్రసంగంలోని అంశాలను ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శశిథరూర్ ఒక పోస్ట్ పెట్టారు. దేశంగా ఆర్థికంగా బలపడటం, ఈ దిశగా ప్రపంచానికి భారత్ ఒక మోడల్ కావడం ప్రధాని తన ప్రసంగంలో ప్రసంగించారని చెప్పారు. భారత్ నిర్మాణాత్మక అభివృద్ధి గురించి మాట్లాడారని అన్నారు. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లోనే ఉంటానని అందరూ తనను అంటారని తన ప్రసంగంలో మోదీ చెప్పిన విషయాన్ని శశిథరూర్ గుర్తుచేస్తూ.. ప్రజా సమస్యల విషయంలో ప్రధాని ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారని ప్రశంసించారు.

# ఆత్మాహుతిని సమర్థిస్తూ సంచలన వీడియో

**బయటపడ్డ డాక్టర్ ఉమర్ నబికి చెందిన వీడియో**



**న్యూఢిల్లీ, నవంబరు 18:** ఢిల్లీ పేలుడు కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీకి చెందిన సంచలన వీడియో బయటకు వచ్చింది. పేలుడుకు ముందు అతడు సూసైడ్ బాంబింగ్ గురించి మాట్లాడాడు. అందులో అతడు ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ మాట్లాడాడు. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. 'ఆత్మాహుతి బాంబు దాడికి వ్యతిరేకంగా అనేక వాదనలు ఉన్నాయి. మరణంపై ఉన్న సహజ అంచనాలకు వ్యతిరేకంగా ఓ వ్యక్తి నిర్దిష్ట సమయంలో, నిర్దిష్ట ప్రదేశంలో కచ్చితంగా చనిపోతాడని భావించడాన్ని బలిదాన ఆపరేషన్ అంటారు' అంటూ ఉమర్ ఆ వీడియోలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వీడియో సంచలనం రేపుతోంది.

# రాజధాని ఢిల్లీలో మరోమారు బాంబు బెదిరింపులు

**న్యూఢిల్లీ, నవంబరు 18:** దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. రాజధానిలోని పలు కోర్టులు, పాఠశాలలే లక్ష్యంగా బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సాకేత్ కోర్టు, పాటియాలా హౌస్ కోర్టు, తీస్ హజారీ కోర్టు సహా ఇతర జిల్లా కోర్టులకు మంగళవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. అంతేకాదు నగరంలోని ద్వారకా, ప్రశాంత్ విహార్ ప్రాంతాల్లోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలలను లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. బృందాలుగా విడిపోయి కోర్టులు, పాఠశాలల ప్రాంగణాలకు చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టు ప్రాంగణాలతోపాటూ పాఠశాలలను ఖాళీ చేయించిన అధికారులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అంతేకాదు, నగరంలోని అన్ని జిల్లా కోర్టుల్లోని సిబ్బందిని అప్రమత్తం చేసి భద్రతా తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ బెదిరింపు మెయిల్‌పై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజధానిలో భారీ ఉగ్ర కుట్రకు ప్లాన్ అంటూ వార్తలు వస్తున్న వేళ బాంబు బెదిరింపులు కలకలం రేపాయి.

# సర్,ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరు

**ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో డిసెబర్‌లో ర్యాలీ**
**మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన నిర్ణయం**



**న్యూఢిల్లీ,నవంబర్18:** ఎస్ఐఆర్,ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో డిసెంబర్ ప్రథమార్ధంలో ర్యాలీ నిర్వహించాలని కూడా కాంగ్రెస్ నిర్ణయించింది. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ పక్రియ ప్రస్తుతం కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల ముసాయిదా జాబితాలో ఎలాంటి అవకతవకలు జరిగినా దానిని వెంటనే పార్టీ నేతలు సవాలు చేయాలని కాంగ్రెస్ కోరింది. మంగళవారంనాడిక్కడ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల పార్టీ నేతలు, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, ఎస్ఐఆర్ పూర్తి భిన్నమైన స్వభావం కలిగి ఉందని, గతంలో ఈ పక్రియ చేపట్టినప్పుడు తీసుకున్న సమయంతో పోల్చుకుంటే చాలా తక్కువ వ్యవధిలో పూర్తిచేయాలనే ఆరాటమే కనిపిస్తోందని మెజారిటీ నేతలు సమావేశంలో అభిప్రాయపడ్డారు. తగినంత మంది బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చినట్టు రాష్ట్రాల నేతలు పార్టీ అధిష్ఠానానికి వివరించారు. దీనిపై కేంద్ర నాయకులు స్పందిస్తూ, ముసాయిదా జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా ఎవరినైనా తొలగించినా, బోగస్ ఓటర్లను చేర్చినా వెంటనే అభ్యంతరాలు లేవనెత్తాలని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశర చేసింది. బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలను నమోదు చేయకపోవడం వల్లే ఓటర్ల జాబితా సరిగానే ఉందని, పార్టీలు ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల కమిషన్ ప్రకటించుకున్నట్టు పేర్కొంది. బిహార్ తరహాలో కాకుండా ఈసారి ముసాయిదా జాబితాలో ఎలాంటి అవకతవకలు కనిపించినా లీగల్ టీమ్‌ల సాయంతో అభ్యంతరాలు తెలియజేయాలని, ఫైనల్ లిస్ట్ తర్వాత కూడా అప్పీల్స్ చేయాలని పార్టీ కేంద్ర నాయకులు సూచనలు చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎస్ఐఆర్ ఎక్సర్‌సైజ్‌పై మానిటర్ చేసే మెకానిజం ఉన్నా చిన్న పార్టీలకు ఆ అవకాశం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ఏ ఒక్కరు ఓటు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఈసీపై ఉందని, దాన్ని పార్టీల మీద నెట్టేయకూడదని అన్నారు. బీజేపీ షాడోలో ఈసీ పనిచేయరాదని, ఓట్ల చోరీకి ఎస్ఐఆర్ పక్రియను ఆయుధంగా చేసుకోరాదని ఖర్గే అన్నారు. ఈ విషయంలో పార్టీ కార్యకర్తలు, బీఎల్ఏలు, జిల్లా, సిటీ, బ్లాక్ అధ్యక్షులు అప్రమత్తంగా ఉండాలని, నిజమైన ఓటర్లను తొలగించడం, బోగస్ ఓట్లను చేర్చేందుకు చేసే ఎలాంటి ప్రయత్నం జరిగినా వెంటనే బయటపెట్టాలని సూచించారు.

# నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల

- ▸▸ జిల్లాలో 2,42,480 మంది రైతులకు వర్తింపు
- ▸▸ జిల్లావ్యాప్తంగా రూ.158.4 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- ▸▸ జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి (మనసులో మాట) నవంబర్ 18 :** అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం కింద జిల్లావ్యాప్తంగా రూ.158.4 కోట్ల నిధులు 2,42,480 మంది రైతుల ఖాతాల్లో నేడు జమ కానున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. అనకాపల్లి నియోజకవర్గంలోని 22,300 లబ్ధిదారులకు రూ.14.6 కోట్లు, చోడవరం నియోజక వర్గంలోని 51,260 లబ్ధిదారులకు రూ. 33.5 కోట్లు, మాడుగుల నియోజకవర్గంలోని 45,340 లబ్ధిదారులకు రూ.29.7 కోట్లు, నర్సీపట్నం నియోజకవర్గంలోని 35,040 లబ్ధిదారులకు రూ. 23.1 కోట్లు, పాయకరావు పేట నియోజకవర్గంలోని 39,300 లబ్ధిదారులకు రూ. 25.6 కోట్లు, పెందుర్తి నియోజకవర్గంలోని 15,480 లబ్ధిదారులకు రూ.10.1 కోట్లు, యలమంచిలి నియోజకవర్గంలోని 33,760 లబ్ధిదారులకు రూ. 21.9 కోట్లు వెరసి జిల్లాలో మొత్తం 2,42,480 లబ్ధిదారులకు రూ. 158.4 కోట్లు 2వ విడత అన్నదాత సుఖీభవ, 21వ విడత కిసాన్ నిధులు విడుదల కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 19 న మధ్యాహ్నం 02.00 గంటలకు పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతుల సమక్షంలో ప నిధులు విడుదల చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు.

## కూటమి ప్రభుత్వం తోనే

# వికలాంగుల సంక్షేమం సాధ్యం

- ▸▸ ఐదేళ్లలో ఎన్టీఆర్ హస్పెటల్ 400 బెడ్స్ కు ప్రణాళిక
- ▸▸ అనకాపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి, నవంబర్ 18 (మనసు లో మాట):** వికలాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని అనకాపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి జిల్లా ఏరియా ఎన్టీఆర్ హాస్పిటల్ లో మంగళవారం సదరన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సదరన్ క్యాంపు ను మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సందర్శించారు. అనంతరం సదరన్ క్యాంప్ ఏర్పాట్ల పై హాస్పటల్ సూపరిండెంట్ తో సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పింఛన్ అర్హత ధ్రువీకరణ పత్రం కొసం దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు ప్రతిరోజు 30-40 మంది స్లాట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందులో ప్రధానంగా నేడు ప్రారంభమైన సదరన్ క్యాంపులో కంటి, ఎముక, మెంటల్ డిజేబులిటీ నిర్వహించడం జరుగుతుందన్నారు. పెండింగ్ లోఉన్న అప్లికేషన్లు అదేవిధంగా కొత్తవి, పాతవి రిజెక్ట్ ఏవైతే ఉన్నాయో అవన్నీ మళ్ళీ అప్లై చేసుకున్నా, ఇవన్నీ కూడా మూడు వారాల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి రావాల్సిన విధంగా ఏదైతే పెన్షన్ వస్తుందో వాటికి కావాల్సిన సంబంధిత ప్రభుత్వ ఎలిజిబిలిటీ సర్టిఫికెట్ వెంటనే ఇవ్వాలన్న ఆలోచనతో ఉందని, అందువల్లే వెంటనే సద్వినియోగ పరచుకోవాలని కోరారు. తదనంతరం జిల్లా ఎన్టీఆర్ హాస్పిటల్ ని వివిధ విభాగాలను సందర్శించిన ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యశాల జిల్లా హాస్పిటల్ గా ఆధునికరణ చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందులో భాగంగా మొదట్లో సిటీ స్కాన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నెఫ్రాలజీ గా ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్న సందర్భంగా డయాలసిస్ యూనిట్లు లలో ఐదు బెడ్లు అదనంగా మరో రెండు బెడ్లు, మరలా ఇప్పుడు మూడు బెడ్లు కు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అదే కాకుండా నెఫ్రాలజీ కి సంబంధించి వెయిటింగ్ లిస్ట్ ఎక్కువగా ఉండకుండా త్వరితగతిన వైద్యం అందించే విధంగా వేరే బ్లాక్ సమకూర్చాలన్న ఆలోచనతో ఉన్నామన్నారు. అలాగే సిఎస్ఆర్ గ్రాండ్ కింద నవఫర్ కంపెనీ ద్వారా 80 లక్షల రూపాయలతో మూడు ఆపరేషన్ థియేటర్ల ఆధునీకరణ చేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. నాచురల్ డెలివరీ లు ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ అవడం గొప్ప విషయంగా భావిస్తున్నా మన్నారు. అందుకు సహకరిస్తున్న డాక్టర్లు అందరికీ అభినందనలు తెలియజేశారు. సిఎస్ఎస్ గ్రాంట్ కింద, గైనిక్ సంబంధించి వచ్చిన పేషంట్ల కి వెయిటింగ్ హాలు ఉండాలన్న ఉద్దేశంతో 68 లక్షల రూపాయలకు సంస్థలతో మాట్లాడి కార్యరూపం దాల్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే సిఎస్ఆర్ గ్రాండ్ క్రింద సుమారు 58 లక్షల రూపాయలతో మార్చురీ ని త్వరలోనే ఆధునికరించడానికి ప్రయత్నాలు జరుగుతుందన్నారు. అల్టిమేట్ గా జిల్లా హాస్పిటల్ 400 బెడ్స్ ఆసుపత్రిగా ఈ ఐదు సంవత్సరాలలో రూపొందించాలని ప్రణాళికతోనే ముందుకు వెళు న్నామన్నారు. దీనికి సహకరిస్తున్నటువంటి డాక్టర్ల కు అదే విధంగా ఎన్టీఆర్ హాస్పిటల్ అడ్వైజరీ కమిటీ నిత్య పర్యవేక్షణలో ప్రత్యేకంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో ఉన్నందుకు అభినందనలు తెలియజేశారు.



# కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

## విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన గంటా



ఆనందపురం,(మనసులో మాట) నవంబర్ 18: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం కేజీబీవీ హైస్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినిలకు అందిస్తున్న భోజనం నాణ్యత గురించి ఆరా తీశారు. భోజన పదార్థాలను పరిశీలించడమే కాకుండా విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన పదార్థాలతో భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్ లో తరగతి గదులు.. డైనింగ్ హాల్.. ఇతర సదుపాయాలు చూశారు. స్థానిక నాయకుడు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ స్వచ్ఛందంగా హైస్కూల్ కు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నారని టీచర్లు ఎమ్మెల్యేకు తెలిపారు. హైస్కూల్ లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే అన్నారు.



## సౌదీ బస్సు ప్రమాదంపై

# షఫీ విచారం

**పెందుర్తి (మనసులోమాట) నవంబరు 18..** సౌదీ అరేబియాలోని మక్కాలో పవిత్ర స్థలాలను దర్శించుకుని, ప్రార్థనా మందిరాల్లో ప్రార్థనలు చేసి, మదీనాకు బయలుదేరిన హైదరాబాద్ పర్యాటకులు అనుకోకుండా ప్రమాదంలో అసువులు బాయడం అత్యంత విచారకరమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి షేక్ షఫీవల్లీ అన్నారు. పెందుర్తిలో ఆయన మాట్లాడుతూ పవిత్ర మక్కా దర్శనంలో ఇలాంటి దుర్ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్ కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 18 మంది సహా 45 మంది మృత్యువాత పడ్డారని ఆవేదన వెలిబుచ్చారు. బస్సులోనే వారంతా కన్నుమూసారని, మృతుల్లో చిన్నారులు, వృద్దులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. బాదిత కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని షఫీ విజ్ఞప్తి చేసారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

## అభ్యుదయ సైకిల్ ర్యాలీతో

# జిల్లా వ్యాప్తంగా భారీ అవగాహన

### డీఐజీ గోపినాథ్ జట్టి, ఐపీఎస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రజా చైతన్య కార్యక్రమం





**అనకాపల్లి రూరల్, నవంబర్ 18 (మనసులో మాట):** అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ వద్ద మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా మాదకద్రవ్యాల పై అవగాహన లో భాగంగా "అభ్యుదయ సైకిల్ ర్యాలీ"ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ప్రజలు విస్తృతంగా పాల్గొనగా, డ్రగ్స్ ప్రమాదాలపై విపులమైన అవగాహన కల్పించారు. డైట్ కాలేజ్ ఆదిత్య కాలేజ్ విద్యార్థులు ఆకట్టుకునే స్కిట్ ప్రదర్శించి ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి రూపం దాల్చుతోందని, గత దశాబ్దంలో డ్రగ్స్ వినియోగం 200% పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యాసంస్థలో డ్రగ్ అవగాహన వర్క్‌షాపులు తప్పనిసరి చేయాలని సూచించారు.

డీఐజీ గోపినాథ్ జట్టి, ఐపీఎస్ "అభ్యుదయ సైకిల్ యాత్ర ప్రజా ఉద్యమంగా మారింది" అని పేర్కొన్నారు. గత 4 నెలల్లో 20,000 కంటే ఎక్కువ యాంటీ-డ్రగ్స్ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అవగాహన ఇంకా పెరగాల్సి ఉందని తెలిపారు. గత ఏడాది 2,500 మంది అరెస్టు, 77 మందికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించబడిందని వివరించారు.

"ప్రతి ఇంటికి - ప్రతి వ్యక్తికి డ్రగ్ ఫ్రీ సందేశం చేరడమే మా లక్ష్యం" అని అన్నారు.

సమాజం, పౌరులు, కుటుంబాలు కలిసి పని చేస్తే డ్రగ్ మాఫియాను పూర్తిగా నిర్మూలించగలమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, మాట్లాడుతూ డ్రగ్స్ మాత్రమే కాదు, సోషియల్ మీడియా సహా ఏ అలవాటు అయినా అడిక్షన్‌గా మారకూడదని విద్యార్థులను హెచ్చరించారు. "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అని ఆమె పేర్కొన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా, డీఐజీ వినూత్న ఆలోచనతో ఈ యాత్ర ఐదు జిల్లాలలో ఒక నెలపాటు కొనసాగుతోందని తెలిపారు. గత 1.5 సంవత్సరాల్లో 3,500 స్కూళ్లు/గ్రామాల్లో "సంకల్పం" కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించామని చెప్పారు. డ్రగ్స్‌పై సమాచారం ఇవ్వడానికి 112 లేదా 1972 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. "సమాచార దాతల వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి" అని హామీ ఇచ్చారు. అభ్యుదయం సైకిల్ యాత్ర - (పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు).. సాగుతుందన్నారు. మాఫియా నుంచి యువతను రక్షించడం అందరి బాధ్యత" అని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ - రింగ్ రోడ్ - పెరుగు బజార్ - నాలుగు రోడ్లు - ఆర్టీసీ కాంప్లెక్స్ - నేషనల్ హైవే - నాగులాపల్లి జంక్షన్ - మునగపాక మండలం వరకు సాగింది.

ఉన్నతాధికారులు స్వయంగా ర్యాలీలో పాల్గొని విద్యార్థులు, యువతలో అపారమైన ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణీ, ఈ.శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు లక్ష్మీ, గఫూర్, ప్రేమ్ కుమార్, వెంకట నారాయణ, అశోక్ కుమార్, స్వామినాయుడు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల నుంచి భారీగా విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై డీడీఓ సమీక్ష





కోటవురట్ల(మనసులో మాట) నవంబర్ 17:కోటవురట్ల మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నర్సీపట్నం డీడీఓ నాగలక్ష్మి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువమంది వేతనదారులకు ఉపాధి కల్పించాలన్నారు. వచ్చే ఏడాది చేపట్టాల్సిన పనులను గుర్తించి గ్రామసభల ఆమోదం పొందాలన్నారు. ముఖ ఆధారిత హాజరు అమలు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వెలుగు ద్వారా డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రుణాలు, రికవరీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది కంటే ఎక్కువమంది వేతనదారులకు ఉపాధి కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి పంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# రామచందర్ కుటుంబీకులను పరామర్శించిన వైసిపి నాయకులు

**డుంబ్రిగుడ, నవంబర్ 18, మనసులో మాట):-** మండలంలోని గుంట గన్నెల పంచాయతీ లక్క గ్రామానికి చెందిన వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు కే రామచందర్ తాత లైకోన్ (102) మంగళవారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేగం చాణక్య తో పాటు సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే హరి,అపార్టీ మండల అధ్యక్షుడు పి పరశురాం తో పాటు పలువురు నాయకులు ఆ గ్రామము సందర్శించి వారి కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ భూతి ఇంచార్జి విజయ్, అరమ పంచాయతీ ఎంపీటీసీ తుమ్ నాథ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పి ఉన్నత పాఠశాలలో

# సాహిత్యక్రీడ - అష్టావధానం



**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 18::** పట్టణంలోని పూల్ బాగ్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం విద్యార్థులలో తెలుగు సాహిత్యం పట్ల ఆనక్తిని పెంపొందించేందుకు ప్రధానోపాధ్యాయులు ,బోధన, బోధనేతర, విద్యార్థి బృందం ఆధ్వర్యంలో పూలబాలతెలుగు భాషాసమితి సాహిత్యక్రీడ- అష్టావధానం నిర్వహించింది. శత అష్టావధాన సమ్రాట్,సాహితీ సార్వభౌమ .డా.కట్టమూరిచంద్రశేఖరమ్ అష్టావధానంతో అధ్యాపకులు ,విద్యార్థులలో ఆసక్తిని పెంచుతూ సభ అలరించారు. విశ్రాంత ఉపాధాయులు సరిపల్లి సోమేశ్వరరావు నిషిద్ధాక్షరి,నందివాడ చిన్నాదేవి సమస్యాపూరణం, పాఠశాల సోషల్ స్టడీస్ సహాయకురాలు శొంఠి విజయలక్ష్మి దత్తపది,పాఠశాల ఆంగ్లోపాధ్యాయులు దువ్వచిన్నారావు వర్ణన,విశ్రాంత ఆంధ్రోపాధ్యాయులు కొట్టు బ ా బ ా ం ా వ ు అప్రస్తుతప్రసంగం,పాఠశాల తెలుగు సహాయకులు దశగ్రంధాల స ు ( బ ఎ ్ ా ౣ ణ ్య ం వ్ర ా ణ వ ా ౕ న ం, పా ౕ శ ా ల భౌతికశాస్త్రంసహాయకులు సింహం భట్లలక్ష్మి వార కథనం,పాఠశాల గణితం సహాయకులు పిన్నింటి కృష్ణ సంఖ్యాగణనంలతో అవధానిచంద్రశేఖరమ్‌ను పలు ప్రశ్నలుసంధించి రసవత్తరమైన పద్యపఠనాలతో సమాధానాలు తెలుసుకున్నారు. పృచ్ఛకులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురామరాజు,సమితి సభ్యులు శాలువాలతో సన్మానించారు.

# మోనో గ్రాఫ్ పుస్తక పరిచయ సభ





**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 18:** గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా గురజాడ కేంద్ర గ్రంధాలయం లో సాయంత్రం కొంకేపూడి అనూరాధ రచించిన కావలిపాటి విజయలక్ష్మి మోనో గ్రాఫ్ పుస్తక పరిచయ సభ జరిగింది.ప్రముఖ రచయిత రత్నాల బాలకృష్ణ పుస్తక సమీక్ష చేస్తూ " మన జిల్లాకే చెంది, ఎంతో విలువైన సాహిత్యాన్ని సృష్టించిన విజయలక్ష్మి గురించి ఈనాటికీ పెద్దగా ప్రాచుర్యం లేకపోవడం బాధాకరం అన్నారు. అనూరాధ ఈ పుస్తకం రాయడానికి చేసిన కృషిని అభినందించారు.విజయనగరం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంకు జి వి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది నాలుగెస్సుల రాజు పాల్గొన్నారు. సీనియర్ రచయిత కె కె రఘునందన ఆత్మీయ వచనం పలికిన ఈ కార్యక్రమం పట్నాల ఈశ్వరరావు ఆహ్వానంతో ప్రారంభమయ్యి, దాసరి పద్మ వందన సమర్పణతో ముగిసింది. ఎంతో మంది రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## రాష్ట్ర స్థాయి త్కెక్వాండో పూమ్సే ఛాంపియన్షిప్లో బంగారు పతకం

**విజయనగరం: (మనసులో మాట) నవంబర్ 18:** విజయనగరం జిల్లా పోలీసుశాఖలోని ట్రాఫిక్ కానిస్టేబులుగా పని చేస్తూ, ఇటీవల కాకినాడలో జరిగిన 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర త్కెక్వాండో పూమ్సే- 2025 పోటీల్లో బి.ఎన్.ఎన్.మూర్తి బంగారు పతకం సాధించడంతోపాటు, త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మంగళవారం తెలిపారు.జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖ ట్రాఫిక్ పోలీసు స్టేషనులో కానిస్టేబులుగా పని చేస్తున్న బి.ఎస్.ఎన్. మూర్తి ఇటీవల కాకినాడలో జరిగిన 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర త్కెక్వాండో పూమ్సే -2025 పోటీల్లో విజయనగరం జిల్లా తరుపున పాల్గొన్నారన్నారు. ఈ పోటీలు నవంబర 14 నుండి 16 వరకు కాకినాడలో జరగగా, బి.ఎన్.ఎన్.మూర్తి బంగారు వతకం సాధించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు. స్పోర్ట్స్ రాణించాలంటే శారీరక ద ృఢత్వం ఎంతో ముఖ్యమని, ఆరోగ్యం కాపాడుకుంటూ రానున్న రోజులలో జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి జిల్లా పేరును, జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలిపాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయి త్కెక్వాండో పూమ్సే ఛాంపియన్షిప్లో బంగారు పతకం సాధించిన బి.ఎన్.ఎన్.మూర్తి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్న్నిపోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవగా, కానిస్టేబులు మూర్తిని జిల్లా ఎస్పీ అభినందించి, మూర్తి క్రీడా ప్రతిభను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్పీ సిఐ ఎవి లీలారావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత మూడు చక్రాల వాహనాలు

### అల్లూరి జిల్లా దివ్య లాంగ్ ల అధ్యక్షుడు వనగల వెంకటేశ్వర్లు వెల్లడించారు



**గూడెం/సీలేరు నవంబర్ 18:(మనసు లో మాట)..** దివ్యాంగులకు అల్లూరి జిల్లా అధ్యక్షుడు వనగల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నాం. llapdascas .ap.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని ఆయన అన్నారు ఇందుకు అర్హులైన వారు 70/నుండి దివ్య లాంగ్ తత్వాన్ని కల్గిన వారు అయిఉండాలి. వయసు 18 సంవత్సరాలు నిండిన ప్రతి స్త్రీ పురుషులు కనీస విద్యార్హత పదోతరగతి చదువుకున్న వారుగా ఉండాలి.డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలి. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు అలాగే చివరి తేదీ 25/11/2025. అల్లూరి సీతారామరాజు జిల్లా దివ్య లాంగ్ ల అధ్యక్షుడు వనగల వెంకటేశ్వర్లు ని సంప్రదించండి: ఫోన్ నెంబర్: 9492180392, సంప్రదించాలని కోరారు.

## నేడు జరిగేఅన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### అరకులోయ టిడిపి అధ్యక్షుడు మహాదేవ్



**అరకులోయ,నవంబర్ 18( మనసులోమాట):** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు బుధవారం జరిగే అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అరకులోయ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోకోయి మహదేవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ,పిఎం కిసాన్ పథకం కింద రైతులకు ప్రతి ఏటా 20వేల రూపాయలు సహాయం అందజేస్తుందని దీనిలో భాగంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత సహాయాన్ని బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నమన్నారు. అరకులోయ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి, విజయనగరం ఆర్టీసీ జోనల్ చైర్మన్ సియ్యారీ దొన్నుదొర అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, సర్పంచులు,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,పార్టీ అభిమానులు, గ్రామ కమిటీల అధ్యక్ష ఉపాధ్యక్ష కార్యదర్శులు,మహిళ మండల నాయకులు,యూనిట్ ఇన్చార్జులు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొని అన్నదాత సుఖీభవ..పీఎం కిసాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఫైజర్ సహకారంతో

## శంకర్ ఫౌండేషన్ మెగా కంటి వైద్య శిబిరం



**పెందుర్తి (మనసులోమాట) నవంబరు 18...** జివిఎంసీ 93వ వార్డు, నాయుడుతోట వద్ద గల శంకర్ పౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు, ప్రముఖ బహుళజాతి ఔషధ, బయోటెక్నాలజీ సంస్థ ఫైజర్ సహకారంతో పరవాడలో సమగ్ర ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించినట్లు శంకర్ పౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కే. బంగార్రాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్నిఫైజర్ సీనియర్ అధికారుల సమక్షంలో, ఫైజర్ యూనిట్ అధిపతి బి. మురళీధర్ శర్మ లాంఛనంగా ప్రారంభించగా, శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె. రాధాకృష్ణన్, డిజిఎం (పేషెంట్ కేర్) వి. రమేష్ కుమార్ పాల్గొన్నట్లు తెలియచేసారు. ఈ శిబిరానికి సమీప గ్రామాల నుండి భారీ స్పందన లభించిందని, సుమారుగా 500 మందికి పైగా రోగులను పరీక్షిం చి 350 మందికి కళ్ళద్దాలు మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ప్రధాన ఆసుపత్రిలో కంటి శస్త్రచికిత్సల కోసం 40 మంది రోగులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ కంటివైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రంలో ఫైజర్ సంస్థ తరుపున రవిచంద్ర కె. (క్వాలిటీ హెడ్), విజయ్ మహాజన్ (ప్రొడక్షన్ హెడ్), రాజేష్ రావూరి (ఫైనాన్స్ హెడ్), అరవింద్ జయరామన్ (ఈహెచ్ఎస్ హెడ్), పి. రమేష్ (బిజినెస్ ఎక్సలెన్స్ హెడ్), సత్జీత్ సింగ్ (టెక్నాలజీ హెడ్), డాక్టర్ ఈశ్వరరావు, ఎం.వి. రామరాజు (పబ్లిక్ అఫైర్స్) పాల్గొన్నారని, శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ అపూర్వ, డాక్టర్ పవన్ - రోగులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు అందచేశారని బంగార్రాజు వెల్లడించారు. ఈ శిబిరానికి క్యాంప్స్ సీనియర్ మేనేజర్ ఎన్. అప్పల రాజు నేతృత్వం వహించారని ఆయన చెప్పారు.

### పసివాళ్లు చనిపోతున్నా కనికరించిన ప్రభుత్వం కే జి హెచ్ ఎస్ టి సెల్ లకు

## బకాయిల చెల్లించడంలోనూ నిర్లక్ష్యమే

### గిరిజనులంటే నిర్లక్ష్యం అనేందుకు ఇదే సాక్ష్యం ఒక్కో రోగికి కేవలం రూ.18 కూడా చెల్లించడానికి మొండికేస్తున్న కూటమి ప్రభుత్వం కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించిన అనంతరం జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర వ్యాఖ్యలు...





**పెదబయలు నవంబర్17 మనసులో మాట :** గత రెండు రోజులుగా గిరిజన పసిబిడ్డలు ఊపిరాడక చనిపోతున్న నేపథ్యంలో కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న చిన్నారులను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ లిశ్రీమతి జల్లిపల్లి సుభద్ర లి పరామర్శించారు. అక్కడ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు అస్వస్థకు గురైన కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వి ద్యా ర్థు ల నూ పరామర్శించారు. అనంతరం ఆమె వీ ం డి య ా తో వ ా ట్లా డా ర ు. పసివాళ్లు మొగ్గల్లా రాలిపోతున్నా కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయితీ పరిధిలో ఐదుగురు పసివాళ్లు చనిపోతే ప్రభుత్వం ముగ్గురు మాత్రమే చనిపోయారని తప్పుడు నివేదిక ఇచ్చిందన్నారు. ఆదివాసి తల్లుల గర్భశోకం కూడా కూటమి ప్రభుత్వానికి కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. ఆదివాసీలు కదా వాళ్ళు చనిపోతే వచ్చిన నష్టం ఏమిటి అనే భావన కూటమి ప్రభుత్వ పెద్దల్లో ఉన్నట్టు ఈ ఘటన స్పష్టంగా తెలియజేస్తుందన్నారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు వెనువెంటనే స్పందించి యూనివర్సిటీ నుంచి శాస్త్రవేత్తలను తీసుకొచ్చి పరిశోధన చేసినటువంటి పరిస్థితులను మనం చూసామన్నారు. ఈరోజు ఐదుగురు చిన్నారులు చనిపోతే కనీసం జిల్లా వైద్యాధికారి కూడా గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని అంచనా వేయని నిర్లక్షస్పష్టంగా కనిపిస్తుందన్నారు.
ఎస్టీ సెల్ కు చెల్లించాల్సిన డబ్బుల్ని కూడా బకాయిలు పెట్టిందిలిగిరిజనుల కోసం కేజీహెచ్ లో ప్రత్యేకంగా కేటాయించిన ఎస్టీసెలకు కూడా ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. ఏ సమయంలో ఎవరు ఆసుపత్రికి వస్తారో తెలియని నేపథ్యంలో ముందుగా నిధులు హాస్పిటల్ ఖాతాలో ఉంచాల్సిన ప్రభుత్వం బకాయిలు పెట్టడం మరింత దారుణం అన్నారు. గిరిజనులు అంటే ఎంత చిన్నచూపు ఉందో ఒకసారి మనం ఆదివాసి బిడ్డలు ఆసుపత్రికి వస్తే వారికి చెల్లించే డబ్బులును లెక్క చూస్తే మనకు అందరికీ అర్థమవుతుందన్నారు. ఏ ఒక్కరికి సరైన వైద్యం అందించకపోగా... కనీసం అందించాల్సిన వైద్యం కోసం ఉంచాల్సిన డబ్బుల్ని కూడా బకాయిలు పెట్టడం వల్ల వైద్యులు గిరిజనులకు వైద్యం అందించడం లేకపోతున్నారన్నారు. ఎస్టీసెల్లో చేరిన వారంతా బయట నుంచి మందులు తెచ్చుకొని వైద్యులకు అందిస్తే అప్పుడే వారు వైద్యం అందిస్తున్నారని లిసుభద్ర లి తెలిపారు. ఇంతకన్నా దురదృష్టకరం ఇంకేముంటుంది అన్నారు. లికేవలం 18 రూపాయలు కూడా చెల్లించ లేరా? ఎస్టీ సెల్ కు ఏడాదికాలంగా బకాయిల పడ్డ విషయాన్ని 15 రోజుల క్రితం తాను గుర్తించి ఐటిడిఏ పిఓతో మాట్లాడితే ఆ విషయం నిజమేనని ఆమె ఒప్పుకున్నారని లిసుభద్ర లి అన్నారు. తమ పార్టీ ఒత్తిడితో ఇటీవల ఆరు నెలల బకాయిలు విడుదల చేశారని ఇంకా నాలుగు నెలల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్టీ సెల్ కి వచ్చే వారి వైద్యానికి ఎంత అవసరమైతే అంతా వెచ్చించేలా అనుమతులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఈ రోజు ఆ పరిస్థితి లేకపోవడం దురదృష్టకరమన్నారు. అదనంగా లేకపోగా బకాయిలు పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. వాస్తవానికి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, మన్యం పార్ పార్వతీపురం జిల్లా పార్వతీపురం ఐటిడిఎ ల నుంచి చెరొక రూ.1.50 లక్షల చొప్పున మొత్తం మూడు లక్షల రూపాయలు ఒక నెలకు ఎస్టీలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. అంటే ఉత్తరాంధ్రలో ఉన్న గిరిజనులు అందరికీ కలిపి నెలకు రూ. 3 లక్షల కూడా వెచ్చించేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయడం లేదన్నారు. ఈ లెక్కన ఏడాదికి రూ.33 లక్షలు రోజువారి చూసుకుంటే ఒక్కొక్క రోగికి కేవలం 18 రూపాయల 86 పైసలు మాత్రమే ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఇవి కూడా గిరిజనులపై వెచ్చించడం ఎందుకు అనే భావనతో ఎస్టీ సెల్ కు బకాయిలు పెడుతుందన్నారు. ఇది దురదృష్టకరమని ప్రభుత్వం మానవతా దృక్పథంతో ప్రవర్తించకుండా వ్యక్తులు వారి వల్ల వచ్చే ఆదాయ మార్గాల ఆధారంగా వైద్యం అందించే విధానాల్ని పాటిస్తుందని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. గిరిజనులు అమాయకులని వారికి వైద్యం అందించక పోయిన పర్వాలేదని దృక్పథంతో ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం నిజంగానే ఆదివాసీల పైన వారి ఆరోగ్య సంరక్షణ పైన శ్రద్ధ ఉండి ఉంటే ఎస్టీ సెల్ కు బకాయిలు ఉండకపోయేవని ఈ పసి మొగ్గలు ఇలా నేల రాలిపోయే పరిస్థితి వచ్చేది కాదన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన బాలింతల గర్భశోకం తగలకుండా పోదన్నారు. ప్రాణాలు పోతున్న సరే స్పందించలేని ప్రభుత్వం ఉంటే ఎందుకు... పోతే ఎందుకని లిసుభద్ర లి ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ చైర్పర్సన్ సుభద్ర తో పాటు మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీమతి గొడ్డేటి మాధవి కూడా పరామర్శించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మత్తును చిత్తు చేయండి




**విజయనగరం (మనలసులో మాట) నవంబర్ 18:** "నషా ముక్త భారత్ అభియాన్" కార్యక్రమము ప్రారంభించి అయిదు సంవత్సరములు పూర్తియిన నేపధ్యంలో దేశవ్యాప్తంగా జరిగిన కార్యక్రమములో భాగంగా మంగళవారం విజయనగరం మహిళ ప్రాంగణం, వి. టి. అగ్రహారం పభుత్వ ఐటీ.ఐ. కళాశాలలో మత్తుపదార్థాల అలవాటు మరియు అందువలన కలుగు దుష్పరిణామాలు మీద ర్యాలీ, మాదక ద్రవ్యల వ్యతిరేక పతిజ్ఞ మరియు అవగాహనా సదస్సు నిర్వ హించారు. యువత ఈ మత్తుపదార్థాల అలవాటుకు గురికాకుండా చూసుకోవాలని సూచనలు ఇవ్వడం జరిగియనదిచించారు. ఎక్కడ్కెనా మత్తుపదార్థాల వినియోగం అమ్మకం గురించి తెలిసినచోసమాచారం అందితే 1972 టోల్ ఫీ నెంబర్ కు తెలియజేయాలని ఈగల్ డిపార్ట్ మెంట్ ఇనసక్టర్ ధనుంజయ నాయుడు విద్యార్థులను కోరారు. యువతను లక్ష్యముంగా చేసుకొని ఈ మత్త పదార్థాల విక్రయం జరుగుచున్నాదని, ఈ విషయంలో యువత అపమత్తముంగా వుండాలని రూరల్ ఇనస్పక్టర్ లక్ష్మణ రావు హెచ్చరించారు. ప్రభుత్వ ఐ.టీ. ఐ. కళాశాలలో కూడా మత్తుప దార్థాల అలవాటు మరియు అందువలన కలుగు దుష్పరిణామాలు మీద పలు అవగాహనా సదస్సులు నిర్వహించడం జరుగుతున్నాదని పిన్సపాల్ టి.వి.గిరి తెలిపారు. విజయ నిర్మల, కౌన్సలర్, ఎ ముక్తి డ్రగ్ డి-ఎడీక్షన్ సెంటర్, సొసైటీ ఫర్ ఎడ్యలకేషన్ అండ్ ఎన్వరాన్ మెంట్ డెవలప్ మెంట్, మత్తుపదార్థాలకు అలవాటు పడిన వారికి వారి సంస్థ ద్వారా కౌన్సలింగ్ నిర్వహించి చికిత్స అందించడం జరుగుతున్నాదని తెలిపారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కె. కుమార్ స్వామి , సహాయ సంచాలకులు విభిన్నపతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవ ృద్ధుల సంక్షేమ శాఖ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డ్రగ్ డి-ఎడిక్షన్ సెంటర్ మానసిక వైద్యంలు దీప్ చంద్ ప్రభుత్వ ఐ.టి.ఐ., రాజాం వీన్సపాల్ భాస్కర రావు , విముక్తి డ్రగ్ డి-ఎడిక్షన్ సెంటర్, సిడ్ ఎన్. జి. ఒ., బాబా మెట్ట, సిబ్బంది, విద్యార్థులు సుమారు 300 మంది వరకు పాల్గొన్నారు.



## ఆదర్శ్ డిగ్రీ కాలేజీ వైద్యశిబిరానికి విశేష స్పందన

**పెందుర్తి (మనసులోమాట) నవంబరు 18:** జీవిఎంసీ 97వ వార్డు సుజాతనగర్ లో పెందుర్తి ఆదర్శ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంపు రెండో రోజు విజయవంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ ఎన్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదర్శ డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి. థియోఫిలస్ ప్రారంభించగా, జీవిఎంసీ శానిటరీ ఇన్స్పెక్టర్, సచివాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఆదర్శ ఎన్ఎస్ఎస్ పిఓ జీ.మంజుల, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, రాజ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్య నిరోధక ప్రతిజ్ఞ చేసారు. ఈ మెడికల్ క్యాంపులో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్స్ భాగ్యరాజు, జనరల్ అండ్ కార్డిక్, డాక్టర్ తులసి, జనరల్ అండ్ గైనిక్ కిరణ్ కుమార్, మెడికల్ క్యాంపు ఇన్చార్జ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ టెస్ట్ (సర్వేకల్ క్యాన్సర్), ఈసీజీ (2డి ఎకో టెస్ట్), ఆర్బీఎస్ (షుగర్ టెస్ట్), బిపీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసారు. అలాగే పుష్పగిరి కంటి హాస్పిటల్ వైద్యులు ఎంఎస్ఎల్ రాజు, ఆప్తమాలిక్ డి ఓ ఏ ద్వారా కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 150 మంది ఉచితంగా వైద్యసేవలందుకున్నారని ప్రిన్సిపల్ ఎన్ఈ ఫ్లోరా తెలియచేసారు. ఈ ప్రత్యేక ఉచిత వైద్య శిబిరానికి రెవ. అన్నారపు మత్తన్య అన్ని సౌకర్యాలు సమాకూర్చి జయప్రదం చేసారని, ఎన్ఏడి లేఅవుట్ కాలనీ పెద్దలు సహకరించారని తెలిపారు. అనంతరం నీరు వృధా చేయవద్దు విద్యుత్ వృధా చేయవద్దు వంటి నినాదాలతో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

### సచివాలయం... జిల్లా కలెక్టర్


## ఆకస్మిక తనిఖీ

### ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు



విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 18:: క్రమశిక్షణ విషయంలో ఎటువంటి రాజీ పడే ప్రసక్తే లేదని, సచివాలయ సిబ్బంది అందరూ సకాలంలో హాజరు కావాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. రామభద్రపురం సచివాలయంను మంగళవారం ఆయనఆకస్మికంగా తనిఖీ చేశారు.సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టి, సచివాలయం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు.కొంతమంది సిబ్బంది నిర్దేశిత సమయానికి హాజరు కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించిన కలెక్టర్ ఈ సందర్భంగా, సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టి నమోదు, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, వివిధ విభాగాల పనితీరు పై సమగ్రంగా తనిఖీ చేశారు. కొంతమంది సిబ్బంది నిర్దేశిత సమయానికి విధులకు హాజరు కాకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.సిబ్బంది క్రమశిక్షణపై రాజీపడే ప్రసక్తే లేదని విధులకు హాజరై మూవ్మెంట్ రిజిస్టర్లో నమోదు చేయకుండా బయటకు వెళ్లిన ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలందించడంలో ఎలాంటి అలసత్వం సహించబోదని ఆయన హెచ్చరించారు.సచివాలయ వ్యవస్థ ప్రజలకు అత్యంత సమీపంగా సేవలందించే వేదిక కాబట్టి, ప్రతి ఉద్యోగి సమయపాలన, బాధ్యత, క్రమశిక్షణతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## వైద్య సిబ్బందికి ఇక్విపు ప్రాజెక్టుపై శిక్షణ



**డుంబ్రిగుడ, నవంబర్ 18 (మనసులో మాట):-** అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఇక్విపు అనే ప్రాజెక్ట్ పై ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ ప్రోత్సాహంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రిన్సిపల్ ఇనిస్టిగేటర్ డాక్టర్.వై యస్ కుసుమ ఆధ్వర్యంలో డుంబ్రిగుడ వైద్య సిబ్బందికి శిక్షణ కల్పిస్తున్నట్లు పీహెచ్ సీ వైద్యాధికారి పి రాంబాబు తెలిపారు. దీనికి గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య బంధం వారి సహకారంతో జిల్లా వైద్య బృందం వారి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్. కిరణ్ కుమార్ గారు ఆధ్వర్యంలో విడతలవారీగా 12 సీపీహెచ్ సి సేవల పైన శిక్షణ తరగతలను నిర్వహిస్తున్నారన్నారు. కొంతమంది టి.ఓ.టీ లను తయారు చేసి వాళ్ళతో జిల్లా మొత్తం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ యొక్క సిబ్బందికు ఈ శిక్షణను అందిస్తున్నారన్నారు.ఇందులో భాగంగా హుకుంపేట, అరకు వ్యాలీ, చింతపల్లి, డుంబ్రిగుడ నాలుగు కేంద్రాలు వద్ద ఒక్కో బ్యాచ్ కి మూడు రోజులపాటు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జి వర్మ, కన్సల్టెంట్ దిలీప్ కుమార్,ఇక్విపు ప్రాజెక్టు సిబ్బంది,మెడికల్ ఆఫీసర్స్, సిహెచ్ఓలు ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## ఘనంగా వేగి గోపి కృష్ణ జన్మదిన వేడుకలు



**కశింకోట, నవంబర్ 18, మనసులో మాట..** కశింకోట మండల మాజీ ఉపాధ్యక్షులు టీడీపి నాయకులు వేగి గోపి కృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు మాజీ శాసనసభ్యులు, పీల గోవింద సత్యనారాయణ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళసురేంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య నాయుడు, మండలపార్టీ అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు పెదపాటి కళ్యాణి,పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ బాబర్ తదితరులు విచ్చేసి గోపి చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలోనూ, నిరంతరం పార్టీ కోసం కష్టపడి చేసిన వ్యక్తి వేగి గోపి అన్నారు. పార్టీని నమ్ముకొని కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి మంచి స్థానం ఉంటుందని గోపి భవిష్యత్తులో పార్టీలో ఉన్నత పదవులు చేపడతారని అన్నారు. గోపి మాట్లాడుతూ తన జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసన సభ్యులు డాక్టర్ పీలా శ్రీ కాంత్, మండల టీడీపి నాయకులు కాండ్రేగులు సతీష్, ఉల్లింగల రమేష్, నైనం శెట్టి రమణ రావు, తిర్రి చిరంజీవి, పలువురు అభిమానులు పాల్గొన్నారు.



## విద్యుత్తు లైనుకు మరమ్మతులు

చీడికాడ, నవంబర్ 18, (మనసులో మాట) మండలంలో చీడికాడ అప్పలరాజు పురం సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు విద్యుత్ లైన్ మరమ్మత్తు పనులు శుక్రవారం జరిగాయి అప్పల రాజుపురం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో కోణం పీటర్ లో కోణం మంచాల సిరిజాం గ్రామాలకు చీడికాడ సబ్ స్టేషన్ పరిధిలో చీడికాడ పీడర్ తురువోలు పీడర్ లో విద్యుత్తు లైనుకు మరమ్మతులు సిబ్బంది చేపట్టారు ఈ సందర్భంగా ఏఇ వెంకట్రావు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలకు విద్యుత్మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు విద్యుత్తు మరమ్మతు పనులు విద్యుత్ వైర్లకు ఇరుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు అలాగే వంగిన విద్యుత్ స్తంభాలను వైర్లను సరిచేయడం జరిగిందని ఏఇ వెంకటరావు తెలిపారు ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ భూషణం మండల లైన్మెన్ వరహాలు కాంట్రాక్టర్ సకల శేష గిరి లైన్మెన్లు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా గవరపాలెం లో మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం

### 400 మంది దంపతులచే సామూహిక పూజా కార్యాక్రమం



**అనకాపల్లి, నవంబర్ 18 (మనసు లో మాట):** అనకాపల్లి గవరపాలెం శ్రీ గౌరీ పంచాయతన దేవాలయం, కర్రి రమేష్ కళావేదిక ప్రాంగణం లో మంగళవారం కార్తీక మాస బహుళ త్రయోదశి, మాసశివరాత్రి పర్వదినాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి లచే 400 మంది దంపతులతో సామూహిక శ్రీ మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమం లలో అనకాపల్లి వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) దంపతులు, జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తి దంపతులు, గౌరీపంచాయతన ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మి నాయుడు, మళ్ల సూర్య ప్రకాష్ రావు, పెంటకోట సుబ్రమణ్యం, పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలి

- వైసిపి సూడిపల్లి కొండలరావు డిమాండ్.
- అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ శాఖ మౌనం ఎందుకు
- గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి



**హుకుంపేట నవంబర్ 18 (మనసులు మాట)** ఏజెన్సీ ప్రాంతాల్లో అమల్లో ఉన్న 1/70 చట్టాన్ని రెవెన్యూ శాఖ నిర్వీర్యం చేస్తోందని హుకుంపేట మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ఆరోపించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాల కోసం ప్రజలు పోరాడుతున్నప్పటికీ, రెవెన్యూ అధికారులు మాత్రం చట్టాన్ని అమలు చేయకుండా గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే రాజ్యాంగ హక్కులు ఉన్నా, రెవెన్యూ శాఖ వాటిని పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో గిరిజనేతరులకు సర్వే నంబర్లు మార్పులు చేసి, చీకటి ఒప్పందాలతో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. "1/70 చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు శాశ్వత నిర్మాణాలు చేయకూడదని స్పష్టం ఉన్నా, హుకుంపేట మండల కేంద్రంలో ఈ చట్టాన్ని అధికారులు నిర్లక్ష్యంగా ఉల్లంఘిస్తున్నారు" అని కొండలరావు అన్నారు. గిరిజనులు చిన్న జిరాక్స్ షాపులు పెట్టినా అధికారులు వెంటనే వచ్చి తొలగిస్తారని, కానీ గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై మాత్రం 'కుంటి సాకులు' చెప్పి తప్పించుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర కూడా ఇటీవల జరిగిన సర్వసభలో రెవెన్యూ శాఖ అక్రమాలకు తావు కాకుండా పని చేయాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాలను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను నిలిపివేసి, గిరిజన హక్కులను కాపాడాలని కోరుతూ, "లేదంటే ఎమ్మార్వో కార్యాలయాన్ని గిరిజనులతో కలిసి ముట్టడిస్తాం" అని ఆయన హెచ్చరించారు.

# 14 ఏళ్లుగా శిధిలాల పాలైన జిసిసి డిపోలు

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల్లో ఆగ్రహం





**హుకుంపేట నవంబర్ 18 (మనసులో మాట)..** ఆదివాసి ప్రాంతాల్లో ఒకప్పుడు కీలక పాత్ర పోషించిన గిరిజన సహకార కార్పొరేషన్ (జిసిసి) డిపోలు గత 14 ఏళ్లుగా మరమ్మతులేమి లేక శిధిలావస్థకు చేరిపోయాయి. హుకుంపేట మండలంలో 2011లో నాబార్డ్ నిధులతో నిర్మించిన అనేక డిపోలు ఇప్పుడు పాడుబడుతున్నాయి.

**మరమ్మతులకు గురవాల్సిన జిసిసి డిపోలు:**
బిరిసింగ్, సూకూరు, పట్టాం, డొంకిన వలస, రాప, బాకురు, మఠం, కుంతుర్లు, గూడ, మత్స్యపురం, తీగలవలస, సరసపాడు.

**మినీ జిసిసి డిపోలు:**
ములియాపుట్టు, డబ్బాగరువు, అండీభ, జీకె మండి, భీమవరం, రంగశిల.

**తొలగించవలసిన జిసిసి డిపోలు:**
హుకుంపేట, పెద్దగారువు, సంతారి, అడ్డుమాండ, జీ బొడ్డపుట్టు.

**డిపోలు లేకపోయినా తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు సాగుతున్న గ్రామాలు:**
కిముడుపుట్టు, చికుమద్దుల, బంగారం గురువు, లోచలపుట్టు, పాతకోట, రూడి, గెడ్డలపాడు, తాడిగిరి, మట్టుజోరు, కామయపేట, మజ్జివలస, గడుగుపల్లి, కొట్నాపల్లి, ఒల్డా.

మెజారిటీ డిపోల్లో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో అంధకారంలోనే పనులు సాగుతున్నాయి. ఇపాస్ మిషన్లు కూడా సరిగా పనిచేయక ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి.

జిసిసి డిపోల దయనీయ పరిస్థితి
హుకుంపేట మండల కేంద్రంలోని ప్రధాన జిసిసి డిపో పూర్తిగా శిథిలమై ప్రమాదకర స్థితిలో ఉంది. పైకప్పు కూలిపోవడం, గోడలపై మూడలు, వృక్షాలు పెరగడంతో భవనం అరణ్యంలా మారిపోయింది. ఇదే పరిస్థితి పెద్దగారువు డిపోలోనూ నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు అటవీ ఉత్పత్తులు, బెల్లం, ఉప్పు, కిరోసిన్, పామె ఆయిల్, కందిపప్పు, పంచదార, నూనెల పంపిణీతో చురుకుగా నడిచిన డిపోలు ఇప్పుడు ఖాళీ గదుల్లా మారిపోయాయి. చింతపండుల కొనుగోలు, కట్టలు నిల్వ, వస్త్రాల పంపిణీ లాంటి కార్యకలాపాలు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం జిసిసి కార్యకలాపాలు కేవలం డ్వాక్రా గ్రూపులకు బియ్యం పంపిణీ వరకే పరిమితమయ్యాయి.

**సేల్స్‌మెన్‌ల సమస్యలు – కనీస వేతనం కూడా లేదు**
డిపోల్లో పనిచేస్తున్న సేల్స్ మెన్లు అరకొర శాతం ఆధారంగా పని చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక క్వింటాల్‌కు ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 100 మాత్రమే ఇస్తుండగా, తెలంగాణలో – 160 కేరళ, మహారాష్ట్రం, మధ్యప్రదేశ్, తమిళనాడులో – 350 చెల్లిస్తున్నారని వారు చెబుతున్నారు. రాష్ట్రం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టమనేది వీరి వేదన.

**సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, సేల్స్ మెన్:**
"2009 నుంచి పనిచేస్తున్నా గౌరవ వేతనం లేదు. క్వింటాల్‌కు వస్తున్న కొద్దిపాటి మొత్తంతోనే డిపోలు నడుపుతున్నాం. సమస్యలు పరిష్కరించాలి" అని తెలిపారు.

**కిముడుపుట్టు గ్రామం సేల్స్ మెన్ పాడి పోతురాజు:**
"సొంత డిపోలు లేని గ్రామాల్లో అద్దె భవనాల్లోనే రేషన్ పంపిణీ చేస్తున్నాం. రెంటు కూడా డిపార్ట్‌మెంట్ చెల్లించకుండా మాకే భారమవుతోంది. వెంటనే కొత్త భవనాలు మంజూరు చేయాలి" అని కోరారు.

గోదాముల పునాది బలహీనమై ప్రమాదకర స్థితి
లీకేజీలు, పాడైపోయిన గోడలు, పెరిగిన చెట్లు, పునాదులు బలహీనపడటం వల్ల డిపోలు ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితి. ప్రజలు భవనాల పునర్నిర్మాణం, డిపోలను పునరుద్ధరించడం, గత వైభవం తీసుకురావడం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**అభిప్రాయం**
జిసిసి డిపోలు ఆదివాసి ప్రాంతాల ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా ఒకప్పుడు నిలిచాయి. కానీ అభివృద్ధి పేరుతో ఇవి పక్కన పెట్టి పెట్రోల్ బంకులు, వాణిజ్యపరమైన పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వడం పూర్తిగా తప్పు.
డిపోలను పునరుద్ధరించడం, సేల్స్ మెన్లకు న్యాయమైన వేతనం ఇవ్వడం, మళ్లీ అటవీ ఉత్పత్తుల కొనుగోలు ప్రారంభించడం మాత్రమే ఆదివాసి గ్రామాల అభివృద్ధికి నిజమైన దారి.
జిసిసి పునరుద్ధరణ అంటే కేవలం భవనాల మరమ్మతులు కాదు ఆదివాసుల జీవనోపాధి తిరిగి నిలబడడమే.

### గిరిజనుల పూర్వ ఆసరాలు – నిలువ కోసం

# ఆరబెట్టిన ఆహార ధాన్యాలు



**హుకుంపేట నవంబర్ 18 (మనసులో మాట)** నేటి కంప్యూటర్ యుగంలో గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు క్రమంగా అంతరించిపోతున్నా, ఏజెన్సీ ప్రాంతాల్లోని కొన్ని మూలల్లో మాత్రం ఆ పూర్వపు జీవన శైలికి చెందిన ఆనవాళ్లు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. హుకుంపేట మండలంలోని రాప పంచాయతీ డాలింపుట్టు గ్రామంలో గిరిజనులు పాటిస్తున్న పూర్వపు పంటల నిల్వ విధానం ఇందుకు నిదర్శనం. పండించిన పంటలను ఆరబెట్టి నిల్వ ఉంచే ఈ పద్ధతి గిరిజనులలో తరతరాలుగా వస్తోంది. విత్తనాల కోసం ప్రత్యేకంగా ధాన్యాలను ఎండబెట్టి రాబోయే సాగు సీజన్ వరకూ సంరక్షిస్తారు. ఆహార ధాన్యాలు, అటవీ ఉత్పత్తులను కాపాడుకునే వీరి జ్ఞానం, క్రమశిక్షణ, సంప్రదాయ జీవనశైలిని ప్రతిబింబిస్తుంది. వీరి ఇళ్ల ముందు ఆరబెట్టిన విత్తనాలు, పంటలు చూసి స్థానికులు ఆశ్చర్యంతో పాటు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "సంస్కృతి ఇంకా జాడలు కోల్పోలేదని తెలుస్తోంది" అని పలువురు అభిప్రాయపడ్డారు. గిరిజనుల ఈ పూర్వ ఆసరాలు, వ్యవసాయ పద్ధతులు, అటవీ పంటల నిల్వ సంప్రదాయాలు నేటి తరానికి మార్గదర్శకాలు. ఇలాంటి జీవన శైలిని కాపాడి, భవిష్యత్ తరాలకు అందించడం ఎంతో అవసరమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు




**పాయకరావుపేట నవంబర్ 18 మనసులో మాట..** పాయకరావుపేట శాఖ గ్రంథాలయంలో 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ ఇన్చార్జ్ అధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత,జానపద,భక్తి గీతాల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ నాయకుడు, జిల్లా గ్రంథాలయల సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ విచ్చేసి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి రత్నం,ఎస్ సీతారామయ్య,ఎన్ టి సీతారామమూర్తి, జగతా శ్రీధర్,వేముల వెంకటేశ్వరరావు, ఇంజరపు సూరి బాబు,ఇంజరపు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ లో అంకితభావంతో

# పనిచేసేవారికే ఎల్లప్పుడు గుర్తింపు

- ప్రభుత్వ విప్, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి
- టిడిపి ప్రధాన అనుబంధ కమిటీ ల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం



**అనకాపల్లి, నవంబర్ 18 (మనసు లో మాట):** అనకాపల్లి సత్యా లక్ష్మీ గ్రాండ్ కళ్యాణ మండప ప్రాంగణంలో మంగళవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రాక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో అనకాపల్లి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన అనుబంధ కమిటీ, గ్రామ క్లస్టర్ యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు , రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు , మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర,ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిసిఎంఎస్ చైర్మెన్ కోట్ని బాలాజీ , టీడీపీ యువనాయకులు డాక్టర్ పీలా శ్రీకాంత్ , అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము తదితరులు హజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గా కర్రీ వెంకట సన్యాసినాయుడు (బాబీ), ప్రధాన కార్యదర్శిగా నంభారీ శ్రీను, అన్ని అనుబంధ కమిటీలు, గ్రామ, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం చేశారు.అంతకుముందు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలార్పించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు వారు శుభాకాంక్షలు తెలియజేసారు.



### అంగన్వాడీ సేవల నాణ్యతపై

# రాజీ ప్రసక్తే లేదు

### జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 18::జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం బొబ్బిలి మండలం పారాది గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, సౌకర్యాలు, రికార్డు నిర్వహణపై ఆరా తీశారు.తనిఖీలో భాగంగా, మంగళవారం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో టమాట పప్పు వండవలసి ఉన్నప్పటికీ అది తయారు చేయకపోవడం గుర్తించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్లక్ష్యానికి బాధ్యురాల్కైన అంగన్వాడి వర్కర్ ను తక్షణ చర్యగా సస్పెండ్ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా, గత మూడు రోజులుగా అంగన్వాడి కేంద్రంలో హాజరు నమోదు చేయకపోవడం పట్ల కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంబంధిత సీడీపీఓ కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు.జిల్లాలో అంగన్వాడీ సేవల నాణ్యతపై ఎలాంటి రాజీ లేదని, పిల్లల ఆరోగ్యం మరియు పోషకాహారంపై నిర్లక్ష్యాన్ని అసలు సహించబోమని కలెక్టర్ గారు స్పష్టం చేశారు. ఈ సందరరేగా అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో కాసేపు సరదాగా గడిపి పిల్లలతో ముచ్చటించారు.

### విద్యార్థులు ఆధార్ క్యాంప్ లను

# సద్వినియోగం చేసుకోవాలి

### మండలవిద్యాశాఖాధికారి 2 రుత్తల నాగన్నదొర



**నక్కపల్లి (మనసులో మాట) నవంబరు18:** మండలంలో ప్రాథమిక , ఉన్నతపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమయొక్క ఆధార్ లో తేడాలుంటే తల్లిదండ్రుల సమక్షంలో ఆధార్ సెంటరుకి వెళ్ళి సరిచేయించుకోవాలని స్థానిక మండలవిద్యాశాఖాధికారి2 రుత్తల నాగన్నదొర అన్నారు. స్థానిక బాలురు మరియు గురుకుల పాఠశాల, గొడిచర్ల హైస్కూల్స్ లో విద్యార్థులకోసం ప్రత్యేకంగా సోమవారం నుండి ఆధార్ నమోదు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు.మంగళవారం ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో జరిగే ఆధార్ క్యాంప్ ను నాగన్నదొర పరిశీలించారు.మొత్తం నేటివరకు 70 మందికి ఆధార్ సవరణలు చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆధార్ డిజిటల్ అసిస్టెంట్ సీ.హెచ్.నవ్యదీప్తి పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు



**నక్కపల్లి నవంబర్ 18 మనసులో మాట..** విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి, గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి బాలాజీ అన్నారు. నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో మంగళవారము గ్రంథాలయాధికారి కే జనార్ధన్ ఆధ్వర్యంలో, 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని పాఠశాల ల విద్యార్థులకు పర్యావరణ- పరిరక్షణ, పరిసరాలు పరిశుభ్రత పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు బాలాజీ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీలపై ఆసక్తి చూపించడం ఆనందదాయకమని, చిత్రలేఖనము పోటీ వల్ల పిల్లల్లో సుజనాత్మకత పెరుగుతుందని బాలాజీ అన్నారు చిత్రలేఖనం పోటీల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-1 ప్రధానోపాధ్యాయులు బి. శివప్రసాద్, అలాగే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2 ప్రధానోపాధ్యాయులు పి నాగేశ్వరరావు, హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయురాలు షహనాజ్ పర్యవేక్షణలో చిత్రలేఖనం పోటీలు చేపట్టారు ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20న బహుమతులు అందజేస్తామని, గ్రంథాలయాధికారి జనార్ధన్ తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు 70 మంది హాజరయ్యారు.

## స్పీకర్ ఆదేశాల మేరకు నూకాలమ్మ ఆలయ పనుల పర్యవేక్షణ



**నర్సీపట్నం ,నవంబర్ 18 (మనసులో మాట)..** స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు నర్సీపట్నం నూకాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులను మంగళవారం ఆలయ కమిటీ ఛైర్మన్ కొరుప్రోలు శ్రీనివాస్, కమిటీ సభ్యులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను పర్యవేక్షించిన ఆయన, మేస్త్రీలకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కొరుప్రోలు శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ గతంలో 2019లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ఆలయ శంకుస్థాపన జరిగిందని, ఆ సమయంలో అయ్యన్నపాత్రుడు కుటుంబం అమ్మవారి ఆలయానికి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారని గుర్తు చేశారు. అయితే గత ప్రభుత్వం హయాంలో ఆలయ నిర్మాణం అస్తవ్యస్తంగా జరిగిందని, నాణ్యత లేని సిమెంట్, ఇటుకలతో వాస్తు లేకుండా నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా గతంలో పనులు జరిగాయని విమర్శించారు. సీఎంఆర్ సంస్థ వారు ఇచ్చిన 10 లక్షల రూపాయలకు లెక్క పత్రం లేకుండా గత ప్రభుత్వం పాలకులు నిధులు కాజేశారని ఆరోపించారు. ప్రస్తుతం స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవతో మరల వారి కుటుంబ సభ్యులు 10 లక్షల రూపాయలు విరాళం అందజేసి 40 లక్షల రూపాయలు దేవదాయ శాఖ వారి నుండి నిధులు సమకూర్చారు అని తెలిపారు. స్పీకర్ ఆదేశాల మేరకు కొత్త కమిటీ పర్యవేక్షణలో ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా, పటిష్టంగా ఆలయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. అమ్మవారి రాబోయే కొత్త అమావాస్య పండుగ నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



అనకాపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు గా

## చందక నర్సింగరావు

# నియామకం

**అనకాపల్లి, నవంబర్ 18 (మనసులో మాట):** అనకాపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు గా సుందరయ్యపేటకు చెందిన చందక నర్సింగరావు (నర్సింగ్) నియమితులయ్యారు. నర్సింగ్ నియామకం పట్ల పలువురు తెలుగుదేశం పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా తనను మండల తెలుగు యువత అధ్యక్షులు గా నియమించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజవర్గం టిడిపి ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, యువ నాయకులు డాక్టర్ పీలా శ్రీకాంత్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, అనకాపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి బాబి లకు నర్సింగ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### అల్లూరి జిల్లాలో
### ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కు
### బాధ్యులైన ఉద్యోగులపై

# చర్యలు ఏవి

### - ప్రజాసంకల్ప వేదిక

**చింతపల్లి.నవంబర్.18.(మనసులో మాట)..** అల్లూరి సీతారామరాజు జిల్లా గల ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థులుకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల ప్రాణాలతో .చలగాటం ఆడుచున్న ఉద్యోగులపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ప్రజా సంకల్ప వేదిక అల్లూరి జిల్లా ఇన్చార్జ్ ఉల్లి తలుపులు,ఆర్టిఐ. అడ్వైజర్ రాము, జిల్లా అధ్యక్షులు . అప్పన బాబు, జిల్లా హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ రవి ప్రసాద్, జిల్లా హ్యూమన్ రైట్స్ జనరల్ సెక్రెటరీ సోమరాజు, చంటి బాబు, బాలకృష్ణ, డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల జెర్రెల రాజేంద్రపాలెం ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగిన విద్యార్థులు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో వైద్య సేవలు అందించి ప్రాణాపాయం లేకుండా ఆరోగ్య సిబ్బంది కాపాడారని వారి సేవలు మరువ రానివ్వన్నారు ఆశ్రమ పాఠశాలలో ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేక పోవడం నిర్వాహకులు మెనూ పాటించకుండా ఇష్ట రాజ్యాంగా భోజనాలు పెడుతూ ప్రభుత్వ ఆశయాన్ని తోట్లు పొడుస్తున్నారని పర్యవేక్షణ లేకపోవడమే నిదర్శనం అన్నారు ఇంత జరిగినప్పట్టికి జిల్లా యంత్రాంగం స్పందించక పోవడంతో గిరిజన విద్యార్థులపై ఎంత శ్రద్ధ ఉందో తెలుస్తుందన్నారు. జరిగిన సంఘటనల పై ఎవరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారో సమాదానం చెప్పాలన్నారు.

### మళ్ళ సురేంద్ర ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎన్ఆర్ఐ సంతోష్



**అనకాపల్లి, నవంబర్ 18 (మనసులో మాట):** అనకాపల్లి పట్టణంలోని సురేంద్ర స్వగృహం లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ని మర్యాద పూర్వకంగా దుబాయ్ టిడిపి గవర (ఎన్ఆర్ఐ)సోషల్ మీడియా కన్వీనర్ రాపేటి సంతోష్ కలిసారు. అయన వెంట నర్సీపట్నం నియోజకవర్గం బీసీ యువనాయకుడు ఆదాపురెడ్డి రాజేష్ ఉన్నారు. ఈ సందర్భంగా మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం తెలిసేలా కృషి చేసిన రాపేటి సంతోష్ ను మళ్ళ సురేంద్ర అభినందించారు.

### ఆగి ఉన్న టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



**హుకుంపేట నవంబర్ 18 (మనుసులో మాట )..** మండలంలోని టిటింగ్ వలస వద్ద ఆగి ఉన్న టిప్పర్ లారీ బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన హుకుంపేట మండలంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగశీల పంచాయతీ సిమిలిగూడ గ్రామానికి చెందిన చొంపి అప్పలస్వామి (45) మంగళవారం సాయంత్రం సిమిలిగూడ నుంచి హుకుంపేట వైపు వెళుతుండగా, టిటింగ్ వలస వద్ద రోడ్డుపక్కన నిలిపి ఉంచిన టిప్పర్ లారీ బైక్తో ఢీకొన్నారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది.అప్పలస్వామి హుకుంపేటలోని సిపిఎం కాలనీలో కుటుంబంతో నివాసముండి, టిడిపి కార్యకర్తగా పనిచేస్తూ ఉండేవారు. ఆయన ఆకస్మిక మరణంతో టిడిపి శ్రేణులు మరియు కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# క్వారీ తవ్వకాలు నిలిపివేయండి

## గ్రామ ప్రజల తిరుగుబాటు



**పరవాడ నవంబర్ 18,(మనసులో మాట)** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం క్వారీ తవ్వకాలు వద్దే వద్దు ప్రజల ముక్తకంఠంతో ప్రజాభిప్రాయ సేకరణలో తిరస్కరించారు పరవాడ మండలంలో దేశ పాత్రని పాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమం శ్రీ లక్ష్మీ నరసింహ మినరల్ క్వారీ తవ్వకాలకు 9. 709 హెక్టార్లు స్టోన్, గ్రావెల్ మైనింగ్ నిమిత్తం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ క్వారీ తవ్వకాల వలన ఈ ప్రాంతం తీవ్రమైన కాలుష్యంలో నెట్ట వేయబడుతుందని అన్నారు. ఈ క్వారీ తవ్వకాల వలన భూగర్భ జలాల నాశనం అయ్యే ప్రమాదం ఉందని పచ్చని పర్యావరణం నాశనం అవుతుందని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే తవ్వకాలు చేపట్టవద్దని డిమాండ్ చేశారు. ఇప్పటికే మంచినీటికి మంచి గాలికి మంచి నేలకి ఈ ప్రాంత ప్రజలు కష్టాలు అనిపిస్తున్నారని అన్నారు. హిందూజా బొగ్గు లారీలు కాలుష్యం, ఎన్ టి పి సి ధూళి కాలుష్యం, ఫార్మా వాయు కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారని విలువైన వృక్షాలు వివిధ జాతుల వనమూలికలు కలిగిన అటవీ ప్రాంతం నాశనం అవుతుందని ఈ ప్రాంత పర్యావరణం నాశనం అవుతుందని జీవన ప్రమాణాలు నాశనం అవుతాయని గనికి పది సంవత్సరాలు పాటు అనుమతిస్తే ఈ ప్రాంత ప్రజల నాశనం అవుతారని అన్నారు. వెంటనే ప్రభుత్వం ఈ క్వారీ తవ్వకాలకు అనుమతి ఇవ్వద్దని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వివి రమణ, ఐద్వా జిల్లా పి మాణిక్యం, సిపిఎం నాయకులు పిడి నాయుడు, గ్రామస్తులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కాలుష్య కుంపటి పెట్టొద్దని ప్రశాంతమైన జీవనం ఇప్పటికే గడపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తవ్వకాలకు అనుమతి ఇవ్వద్దని స్నేహం పూరి కాలనీ ప్రజలు వేడుకున్నారు. అనంతరం సమస్యలతో కూడిన మెమొరాండం ఆర్డీవో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ ఈ కి అందజేశారు.

### శాఖాగ్రంధాలయంలో విద్యార్థులకు

# చిత్ర లేఖనం, డిబేట్, పద్యాల పోటీలు

**అనకాపల్లి, నవంబర్ 18 ( మనసులో మాట):** అనకాపల్లి శాఖవీది లోని శాఖాగ్రంధాలయం లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శ్రీ కళావేదిక సాంస్కృతిక సంస్థ అధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, డిబేట్, పద్యాల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో శాఖాగ్రంధాలయాధికారి కె. శ్రీనివాసరావు, సిద్దార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం , సాయి శక్తి టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ ఏ.రాజశేఖర్, శ్రీ కళావేదిక సంస్థ జిల్లా అధ్యక్షులు జి.ఎల్.ఎన్. శాస్త్రి, సాయి శక్తి స్కూల్ ఉపాధ్యా యులు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



### రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీవో

# హెచ్ఎం, వార్డెన్ పై పీఓ ఆగ్రహం





కొయ్యూరు నవంబర్ 18 (మనసులో మాట): అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వసతి గృహంలో వంటశాలను పరిశీలించారు. వంటనూనె ఇతర సామాగ్రిని పరిశీలించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు ఉండడంతో వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజన్ కావడం వల్ల పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో హెచ్ఎం, వార్డెన్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విద్యార్థినిలను కలిసి ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు

# నర్సీపట్నం గ్రంధాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**నర్సీపట్నం, నవంబర్ 18 (మనసులో మాట)** నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంధాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర అన్న అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ఇంటర్మీడియట్ కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాలకు చెందిన అధ్యాపకులు కూడా పాల్గన్నారు. ఈ కార్యక్రమాన్ని విశ్రాంత వ్యాయామ ఉ పాధ్యాయుడు పి.ప్రభాకర్ పర్యవేక్షించారు. ఈ నెల 19న జరగనున్న రంగవల్లి పోటీ కార్యక్రమానికి విద్యార్థినిలు హాజరు కావాలని గ్రంధాలయాధికారి దమయంతి తెలిపారు.



# సైబర్ నేరాల పై విద్యార్థులకు అవగాహన



అరకులోయ,నవంబర్ 18 (మనసులోమాట): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం కొత్తభల్లుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమగిరి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భముగా విద్యార్థులతో సిఐ హిమగిరి మాట్లాడుతూ సైబర్ నేరాలకు విద్యార్థులు ఎవరు మొగ్గుచూపి మోసపోవద్దని సైబర్ నెరగాళ్లు అనేక లింకులు వాట్సాప్ మెసేజ్ లు, టెస్ట్ మెసేజ్ లు ఇలా అనేక రకాలుగా మీ ఫోన్ లో మెసేజ్ లు పంపిస్తుంటారని అలాంటి వాటిని చాలా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అలాంటి లింకులపై క్లిక్ చేయవద్దని సైబర్ నేరాల గురించి మీ తల్లిదండ్రులకు మరియు మీ బంధువులకు స్నేహితులకు కూడా తెలియజేయలన్నారు. అలాగే విద్యార్థులు ఎవరు ర్యాగింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోకూడదని గంజాయి వంటి మారకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనను ఏర్పరచుకొని ఆ లక్ష్యసాధనకు అనుగుణంగా నడుచుకోవాల న్నారు. అదేవిధంగా మారకద్రవ్యానికి దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడుచుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అంతేకాకుండా నాటుసారా గంజాయి వంటి చెడు వ్యాసనా లకు దూరంగా ఉండాలని మీ తల్లిదండ్రులకు అలాగే మీ గ్రామస్తులకు కూడా తెలియజేయాలని ముఖ్యంగా విద్యార్థులు చెడు మార్గాలకు దూరంగా ఉండి చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అలాగే మీకు ఏ సమస్య ఉన్న స్థానిక పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని సీఐ హిమగిరి తెలియజేశారు. అరకులోయ ఎస్ఐ జి గోపాలరావు మాట్లాడుతూ అరకులోయ మండల పరిధిలో ప్రత్యేక పోలీస్ టీంతో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ మంచిమార్గంలోనడుచుకోవాలిన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు బోధ నేతరా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నూకాంబిక అమ్మవారి ని దర్శించుకున్న

# ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి

**అనకాపల్లి, నవంబర్ 18 (మనసులో మాట):** ఉత్తరాంధ్ర లో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ, ప్రభుత్వ విఫ్ వేపాడ చిరంజీవి దర్శించికున్నారు. ముందుగా ఆలయ మర్యాద లతో ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్సీ చిరంజీవి కి స్వాగతం పలికి సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.
ఈ కార్యక్రమం లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు,రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, ఆలయ ధర్మకర్తలు మారిశెట్టి శంకర్రావు,సూరే సతీష్, భానుచంద్ర తదితరులు పాల్గొన్నారు.





### 20 లక్షలతో మిర్యాలకాలనీ లో

# సిసి రోడ్డు పనులు ప్రారంభం

**అనకాపల్లి, నవంబర్ 18 (మనసు లో మాట):** అనకాపల్లి మిర్యాల కాలనీ లో 20 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్ల పనులు మంగళవారం ప్రారంభించడం జరిగింది. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు ఎపీయుఎఫ్ఐడి కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ ల కృషి ఫలితంగా జీవీఎంసీ నిధులతో సిమెంట్ రోడ్డు పనులు శరవేగంగా చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల అవసరాలను గుర్తించి సిసి రోడ్డు పనులు చేపట్టినందుకు మిర్యాల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నాణ్యత ప్రమాణాలతో జరిగేటట్టు ఈ కాలనీ రోడ్డు పనులు ను కూటమి నాయకులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో 83, 82 డివిజన్ ల టిడిపి ఇంచార్జిలు బోద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్, యాంర్ర రామకృష్ణ ,కొణతాల గణేష్,వెల్లంకి వాసు, ఎస్.భానుచందర్(అఖి), ఆకుల నానాజీ, కొణతాల వాసు,షేక్ రియాజ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 25 మంది విద్యార్థినులు డిస్చార్జ్

### ఇంకా 23 మంది విద్యార్థినిలకు హాస్పిటల్ లో చికిత్స
### ఏటిడబ్ల్యుఓ క్రాంతి కుమార్ వెల్లడి



**కొయ్యూరు (మనసులో మాట) నవంబర్ 18 :** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం లోని బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వారిలో ఈరోజు 25 మంది విద్యార్థినులు డిస్చార్జ్ అయినట్లు ఏటీడబ్ల్యుఓ క్రాంతి కుమార్ తెలిపారు. ఇంకా హాస్పిటల్ లో 23 మంది విద్యార్థినిలు హాస్పిటల్ లో ఉన్నట్లు చెప్పారు. ఎటువంటి ప్రమాదం ఏమీ లేదని వారికి మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. అయితే పిల్లలు తిన్న ఆహారం వల్లనే ఫుడ్ పాయిజన్ అయింది అని ఖచ్చితంగా చెప్పలేమని, వాటర్ వల్ల కూడా ఇలా జరిగిఉండొచ్చని, పాఠశాలలో ఉన్న నీటిని టెస్టింగ్ కి పంపించడం జరిగిందని మెడికల్ ఆఫీసర్ స్నేహలత చెప్పారు.

### మండల కేంద్రంలో బాలికల బీసీ హాస్టల్ నిర్మాణం కొరకు

# భూమి పూజ



**నవంబర్ 18 (మనసులో మాట ) ..** జి మాడుగుల మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం బాలికల బిసి వసతి గృహానికి భూమి పూజ స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు సమక్షంలో నిర్వహించారు. ఈ ప్రభుత్వ పాఠశాలలో సుమారుగా 208 మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ వసతి గృహం ఏర్పాటు చేయడం వల్ల పాఠశాలకు దూరం నుండి వచ్చే విద్యార్థులకు తల్లిదండ్రులకు భారం తగ్గించే విధంగా ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ నాగరాజు తెలిపారు. ఈ వసతి గృహం ఏర్పాటు చేయటం వల్ల వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో అడ్మిషన్ చేయవచ్చునాని ఆయన తెలిపారు. వసతి గృహం ఏర్పాటు చేయడానికి పాఠశాల చైర్మన్ లకే రామకృష్ణ చొరవ చూపించి అధికారులకు పలుమార్లు వినతులు తెలియజేయడం వలన వసతిగృహం పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా జి మాడుగుల పోలీస్ శాఖ ఎస్సై షణ్ముఖరావు, సర్పంచ్. కిముడు రాంబాబు ఎంపీటీసీ మత్స్యరాస విజయ కుమారి, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకట గంగరాజు, మత్స్యరాస రామరాజు, టిడిపి పంచాయతీ ప్రెసిడెంట్ కెవిఎస్ఎస్ వరప్రసాద్, మత్స్యరాస నారాయణరాజు, గణేష్ మాస్టర్, పీసా కమిటీ బోనంగి సూరి పడల్, కిముడు మణికంఠ ,అడప బాబురావు, , పాఠశాల టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరానికి జలసంచాయ్ అవార్డు

- మునిసిపల్ కార్పొరేషన్ల విభాగంలో నాల్గవ స్థానం
- ఢిల్లీలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు-2024 లో జల్ సంచాయ్-జన్ భాగీదారీ విభాగం కింద రాజమహేంద్రవరం నగరం జాతీయ స్థాయిలో నాల్గవ ర్యాంకును సొంతం చేసుకుంది. ఈ మేరకు న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో మంగళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ చేతుల మీదుగా నగర కమిషనర్ రాహుల్ మీనా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జల సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వంగా ఉందని కమిషనర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మొత్తం 13,298 నీటి సంరక్షణ పనులు పూర్తి చేసి ఈ ఘనతను సాధించినట్లు వెల్లడించారు. ఈ క్యాటగిరీ కింద లభించిన అవార్డుకు రూ.2 కోట్ల నగదు పురస్కారం లభిస్తుందన్నారు. నగర పాలక సంస్థ చరిత్రలో ఈ పురస్కారం ఓ కీలక మైలురాయి అని.. ఈ అవార్డు రానున్న రోజుల్లో చేపట్టే పనులకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ ఘనత సాధించడంలో ముఖ్యంగా నగర పాలక ఇంజనీరింగ్, ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, భూగర్భజలాల పెంపు అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఈ విజయం సాధ్యమైందని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో ఈఈ ఎంవీకే మాధవి, ఏఈ వీ వెంకటేష్ పాల్గొన్నారు.

# మారేడుమిల్లిలో కాల్పుల కలకలం

- మారేడుమిల్లిలో కాల్పుల కలకలం
- భయంతో వణికిన 'తూర్పు' మన్యం
- మంగళవారం తెల్లవారు జామున ఎదురు కాల్పులు
- మావోయిస్టుల అగ్రనేత హిడ్మా సహా ఆరుగురు మృతి
- వివరాలు వెల్లడించిన ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేష్ చంద్ర







**మారేడుమిల్లి (మనసులో మాట), నవంబరు 18:** అప్పుడప్పుడే తెల్లారుతున్న 'తూర్పు' మన్యం ప్రాంతంలో ప్రశాంతతను చీల్చుకుంటూ ఒక్కసారిగా తుపాకీ కాల్పులతో మన్యం దద్దరిల్లింది. మన్యం వాసుల్లో భయాందోళనలు చోటు చేసుకున్నాయి. దేశ వ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్రం ఉక్కుపాదం మోపుతున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఛత్తీస్ ఘడ్, ఒడిశా సరిహద్దుల్లో తలదాచుకున్న మావోయిస్టు అగ్రనేతలు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు ఏజెన్సీ రంపచోడవరం నియోజకవర్గం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో తలదాచుకున్నారు. ఈ విషయాన్ని పోలీసులు పసిగట్టడంతో మావోయిస్టుల కోసం జల్లెడ పట్టారు. ఈ క్రమంలోనే మారేడుమిల్లి అడవుల్లో మంగళవారం తెల్లవారు జామున 6 గంటలకు భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. టైగర్ జోన్‌లో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా, అతని భార్య మరో నలుగురు మృత్యువాత పడినట్టుగా తెలుస్తోంది. అయితే ఈ కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. హిడ్మా కదలికలపై ఇంటెలిజెన్స్ అలర్ట్ అటవీ ప్రాంతాల్లో అగ్రనేతలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం లభించడంతో భద్రతా దళాలు ముందస్తు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం కూంబింగ్ పార్టీలకు మావోయిస్టు బృందం ఎదురుపడటంతో ఘర్షణ తీవ్రత పెరిగింది.

**ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ స్పష్టీకరణ..**

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. మంగళవారం ఉదయం 6.30 నుంచి 7 గంటల మధ్య భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య తీవ్ర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయని ఆయన వివరించారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌తో కలిసి జరిగిన మీడియా సమావేశంలో ఎన్‌కౌంటర్ వివరాలను వెల్లడించారు. రెండు రోజులుగా ఇంటెలిజెన్స్ సమాచారాన్ని ఆధారంగా తీసుకుని విస్తృత స్థాయిలో గాలింపు చర్యలను చేపట్టామని ఏడీజీ తెలిపారు. ప్రస్తుతం కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోందని, కాల్పుల ప్రాంతం నుంచి మావోయిస్టుల వద్ద ఉన్న పలు రకాల ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

**ఎవరీ హిడ్మా.?**

సుక్మా జిల్లా పూవర్తి ప్రాంతంలో జన్మించిన హిడ్మా 17 ఏళ్ల వయసులోనే దళ సభ్యుడిగా చేరాడు. గోండి, తెలుగు, కోయ, హిందీ, బెంగాలీ భాషలపై మంచి పట్టు ఉండటంతో మావోయిస్టు కమిటీలలో వేగంగా ఎదిగాడు. హింసాత్మక దాడులలో ముందుండటం వల్ల పార్టీలో అతడికి ప్రత్యేక స్థానం ఏర్పడింది. నెంబర్ వన్ బెటాలియన్ ఆదేశాలు పూర్తిగా హిడ్మా ఆధీనంలో ఉండేవి. ఈ బెటాలియన్ దాడుల వేగం, దారుణం కారణంగా చత్తీస్‌ఘడ్ అడవుల్లో భయపెట్టే శక్తిగా మారింది. చింతల్నార్ ఘటనలో 75 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రాణాలు కోల్పోవడానికి హిడ్మా ప్రణాళికే కారణం. 2017 బూర్కపాల్ ఎటాక్ లో కూడా అతడి పాత్ర ఉందని అప్పట్లో మావోయిస్టు నేతలే ప్రకటించారు. శత్రు బలగాల పై భారీ బృందాలను ఒకేసారి దాడికి దింపడం హిడ్మా ప్రత్యేకత. అతడు టార్గెట్ పెట్టాక తప్పించుకోవడం కష్టం అనే అభిప్రాయం మావోయిస్టు వర్గాల్లో బలంగా ఉండేది. చత్తీస్‌ఘడ్‌లో గత ఇరవై ఏళ్లలో జరిగిన అతి పెద్ద హింసాకాండల్లో హిడ్మా పాత్ర ప్రముఖమైంది. అందుకే పోలీసుల హిట్ లిస్టులో హిడ్మా ఉంటూ వచ్చాడు. ఇందులో భాగంగానే హిడ్మాపై ప్రభుత్వం ఏకంగా కోటి రూపాయల రివార్డ్‌ను ప్రకటించింది. అదే విధంగా అతని భార్యపై రూ. 50 లక్షల రివార్డు ఉంది. హిడ్మా కదలికలు చాలా గోప్యంగా ఉండేవి. అసలు హిడ్మా ఎలా ఉంటాడో తెలియకుండా అతని ఫొటోలు కూడా బయటకు రాకుండా వ్యవహరించేవాడు. అలాంటి వ్యక్తిని కేంద్ర కమిటీలోకి తీసుకోవడంపై మావోయిస్టు వర్గాల్లో పెద్ద చర్చ జరిగింది. సిద్ధాంత పరంగా కాకుండా హింసాత్మక దాడుల ద్వారా ఎదిగిన వ్యక్తికి పెద్ద బాధ్యతలు ఇవ్వడం సరైనదా అనే ప్రశ్నలు అప్పట్లో వచ్చాయి. ఇన్ఫార్మర్ల పేరుతో జరిగిన అమానుష హత్యల్లో హిడ్మా పాల్గొన్నాడనే ఆరోపణలు పలుసార్లు వినిపించాయి. రాత్రింబవళ్లు ఓ దళం హిడ్మాకు కాపలా కాసేదని సమాచారం. ఇదిలా ఉంటే హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మరణించాడంటూ గతంలోనూ పలుసార్లు వార్తలు వచ్చాయి. అయితే ఆ తర్వాత అవి తప్పుడు వార్తలని తేలింది. అంతేకాకుండా చాలాసార్లు ఎన్‌కౌంటర్ల నుంచి హిడ్మా తప్పించుకున్నాడు. కాగా తాజాగా హిడ్మా మృతదేహానికి సంబంధించిన ఫొటోలు బయటకు రావడం, అధికారులు సైతం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడంతో హిడ్మా మరణించిన విషయం స్పష్టమవుతోంది.

## లోకేష్ పర్యటన మళ్ళీ వాయిదా

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** మంత్రి నారా లోకేష్ తూర్పు గోదావరి జిల్లా పర్యటన మరోసారి వాయిదా పడింది. ఈ నెల 20న రాజమహేంద్రవరం సిటీలో జరగాల్సిన ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు నగర టీడీపీ కార్యాలయానికి మంత్రి నారా లోకేష్ కార్యాలయం నుంచి సమాచారం వచ్చింది. ఈ నెల 20న నితీష్‌కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో కలిసి నారా లోకేష్ కూడా సదరు కార్యక్రమానికి హాజరవుతున్నారు. అందు వల్ల ఈ నెల 20న నారా లోకేష్ రాజమహేంద్రవరం పర్యటన రద్దు కావడం జరిగింది. ఆయన పర్యటన మళ్లీ ఎప్పుడు అనేది తెలియచేయడం జరుగుతుందని నగర టీడీపీ కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఇప్పటికి రెండు సార్లు లోకేష్ పర్యటన వాయిదా పడింది.

## మావోయిస్టులను అరెస్టు చేసిన ఏలూరు పోలీసులు



**ఏలూరు (మనసులో మాట) నవంబరు 18 :** ఏలూరు నగరంలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ సారధ్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు, గ్రేహౌండ్స్ బలగాలు, కార్డన్ సెర్చ్ నిర్వహించారు,అందులో భాగంగానే మంగళవారం ఏలూరు గ్రీన్ సిటీలో ఒక ఇంటిని చుట్టుముట్టారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ నేరుగా ఈ ఆపరేషన్ లో పాల్గొన్నారు. ఈ కార్డెన్ సెర్చ్ లో భాగంగా కేంద్ర మావోయిస్టు అనుచర బృందంగా అనుమానిస్తున్న 15 మందిని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ బృందం అదుపులోకి తీసుకుంది. ఈ బృందానికి జిల్లా ఎస్పీ నేతృత్వం వహించగా ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ సారధి వహించారు. ఈ 15 మందిలో ఐదుగురు మహిళలు ఉండగా పదిమంది పురుషులు ఉన్నారు. ప్రస్తుతం వీరిని ఏలూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే వీరు సంఘ విద్రోహ చర్యలకు పాల్పడేందుకు ఏలూరు నగరానికి వచ్చారా తల దాచుకునేందుకు వచ్చారా అన్న అంశంపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. అయితే అదుపులోకి తీసుకున్న 15 మంది వద్ద 15 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది పూర్తి వివరాలు విచారణ అనంతరం పోలీసులు వెల్లడించనున్నారు.

# నేడు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

- జిల్లా వ్యాప్తంగా అర్హులైన 1,14,991 మంది రైతులకు మొత్తం రూ.7,699.9 లక్షల నిధులు జమ
- నిడదవోలులో జిల్లా స్థాయి కార్యక్రమం, ఆర్ఎస్ కే స్థాయి వరకు ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** రైతుల ఖాతాల్లోకి ఈ ఏడాది అన్నదాత సుఖీభవ-2వ విడత గా రూ.5749.55 లక్షలు, పీఎం-కిసాన్ 21వ విడత క్రింద రూ.1950.34 లక్షలు ఆర్థిక సహాయాన్ని నేరుగా జమ చేయనున్న నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అర్హులైన 1,14,991 మంది రైతులకు మొత్తం రూ.7,699.90 లక్షల నిధులు జమ కానున్నాయని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా నేడు (బుధవారం) జరగనున్న పీఎం - కిసాన్ 21వ విడత, అన్నదాత సుఖీభవ 2వ విడత నిధుల పంపిణీ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు. జిల్లాలో మొత్తం 1,14,991 మంది రైతులకు రూ.77 కోట్లు నేరుగా ప్రభుత్వం నుండి జమ కానున్నాయి. ఇందులో ఏడీఎస్పీ ద్వారా రూ.57.5 కోట్లు, పీఎం-కిసాన్ ద్వారా రూ.19.5 కోట్లు విడుదల కానున్నాయని చెప్పారు. దేశ వ్యాప్త కార్యక్రమాన్ని బుధవారం ప్రధాన మంత్రి కోయంబత్తూర్ నుండి మధ్యాహ్నం 1 నుండి 4 గంటల మధ్య ప్రారంభించగా, రాష్ట్ర ముఖ్యమంత్రి కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం - చినదాసరపల్లి గ్రామంలో పాల్గొని లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్నారని వివరించారు. జిల్లా స్థాయిలో నిడదవోలు పట్టణంలో జిల్లా మంత్రి కందుల దుర్గేష్, ఇతర ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ స్థాయిలో, అలాగే ఆర్ఎస్కే స్థాయి కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇచ్చి, సమన్వయంతో నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి రైతు సేవా కేంద్రం వరకు ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుందన్నారు. రైతులకు భరోసా, వ్యవసాయ పునరుద్ధరణ, పంటల సంరక్షణకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని ఆమె స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మండలాల్లో, జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలానికి సంబంధించిన లబ్ధిదారుల వివరాలు, వారికి జమ కానున్న మొత్తం నిధుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. ప్రతి రైతు ఖాతాలో పారదర్శకంగా, నేరుగా నగదు బదిలీ పద్ధతిలో నిధులు జమ కాబోతున్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.



## నన్నయలో నూతన భవనాలను పరిశీలించిన కలెక్టర్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాలను తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ పరిశీలించారు. మంగళవారం యూనివర్సిటీకి విచ్చేసిన కలెక్టర్ కు వీసీ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కళా, సంస్కృతి విభాగంలో అవార్డు తీసుకున్న వీసీ ప్రసన్నశ్రీ కి కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా నిర్మించిన యూనివర్సిటీ కాలేజ్ ఇంజనీరింగ్ భవనం, ఎగ్జామినేషన్స్ భవనం, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ భవనాలను పరిశీలించారు. దీనికి సంబంధించిన వివరాలు వీసీ ప్రసన్నశ్రీ తెలియజేస్తూ యూనివర్సిటీ నిధులతో నిర్మించిన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. రూ. 20.05 కోట్లతో యూనివర్సిటీ కాలేజ్ ఇంజనీరింగ్ భవనం, రూ. 8.25 కోట్లుతో ఎగ్జామినేషన్స్ భవనం, రూ. 5.5 కోట్లతో స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనం, రూ.11.10 కోట్లుతో బాయ్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, విశ్వ విద్యాలయ అధికారులు, యూనివర్సిటీ ఇంజనీర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బాగా చదువుతున్నారా?

## పాఠాలు అర్థం అవుతున్నాయా?

- స్కూలులో ఏమైనా సమస్యలు ఉన్నాయా?
- మధ్యాహ్న భోజనం ఎలా ఉంటోంది?
- నగరంలోని జమున నగర పాలక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** హాయ్.. స్టూడెంట్స్.. ఎలా ఉన్నారు?..బాగా చదువుతున్నారా?..పాఠాలు అర్థం అవుతున్నాయా..అంటూ పాఠశాల తనిఖీ అధికారి పాత్ర పోషించారు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు). మంగళవారం స్థానిక 45వ డివిజన్ ఇందిరా నగర్‌లోని జమున నగర పాలక ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్థానిక నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తీసుకువచ్చిన మధ్యాహ్న బోజనం నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. అలాగే విద్యార్థుల కోసం సదరు పాఠశాలలో గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించి మంచి నీరు వస్తున్న తీరును చూశారు. నాలుగు సెక్షన్లలో ఉన్న 10వ తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తమ తరగతికి రాగానే విద్యార్థులు ఎంతో సంతోషంగా 'హాయ్ సార్..నమస్తే సార్' అంటూ ఎంతో ఆప్యాయంగా గౌరవంగా ఎమ్మెల్యేను పలకరించారు. ఎమ్మెల్యే కూడా ఒక ఉపాధ్యాయుడి మాదిరిగా, పాఠశాల తనిఖీ అధికారిగా విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు పాఠాలు సక్రమంగా చెబుతున్నారా లేదా, పాఠశాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా తదితర అంశాలపై విద్యార్థులను అడిగి వారి నుంచి వచ్చిన సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ ఎవరైనా ఆకతాయిలు ఏడిస్తున్నారా అని విద్యార్థినులను అడిగి.. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించి ధైర్యం చెప్పారు. ఎటువంటి అసౌకర్యానికి గురైనా తమ దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని విద్యార్థులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయం చైర్మన్ కొయ్యల రమణ, నగర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మొకమాటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## టీటీడీ పాలకమండలి అత్యవసర సమావేశం

### పాల్గొన్న జ్యోతుల నెహ్రూ




**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 18..** టీటీడీ ట్రస్ట్ బోర్డు అత్యవసర సమావేశం జరిగింది. ఈ అత్యవసర సమావేశానికి టీటీడీ బోర్డు చైర్మన్ బి.ఆర్ నాయుడు అధ్యక్షత వహించగా టీటీడీ పాలకమండలి సభ్యుడు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పాలక మండల సభ్యులు పాల్గొని పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా వైకుంఠ ద్వార దర్శనం వంటి ముఖ్యమైన పరిపాలనా మరియు అభివృద్ధి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశం తిరుమల అన్నమయ్య భవన్‌లో జరిగింది.

**ప్రధాన నిర్ణయాలు:** వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం అన్నమయ్య భవన్ లో బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన పచేజి కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఎక్కడ రాజీ లేకుండా స్వామివారి ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యితో సహా అన్ని వస్తువులు నాణ్యమైనవి కొనుగోలు చేయాలని వీటికి సంబంధించిన టెండర్ జాతీయ స్థాయి టెండర్ దారులను పిలవాలని అన్నారు.



# భరత్‌కు అగ్నిపరీక్ష



- ▸▸ ముప్పేట దాడి నుంచి సమర్థవంతంగా ఎదుర్కొంటారా?..
- ▸▸ సొంత పార్టీ నేతలు సైతం అధికార పార్టీతో చేతులు కలిపి..
- ▸▸ బాల్య స్నేహితులు తిరుగుబాటు చేస్తుంటే..
- ▸▸ నిందారోపణలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే..
- ▸▸ భరత్ రాజకీయ భవిష్యత్తు ఎటువైపు..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** అందరూ ఒకటై.. తానొకడై.. చిన్ననాటి స్నేహితులు సైతం ఎదురు తిరిగి రాళ్ళు విసురుతుంటే..ప్రతిపక్షం, స్వపక్షం బలమైన ఆయుధాలతో ముప్పేట దాడికి దిగుతుంటే..ఒక మనిషి ఒకే ఒక మనిషి ఎదుర్కొనేది ఎలా??

రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్..అధికారంలో ఉండగా చక్రం తిప్పారు. నేనే రాజు..నేనే బంటు..సమస్తం నేనే అన్నట్టు వ్యవహరించారు. ప్రతిపక్ష నేతలను, వైసీపీ సీనియర్ నేతలను సైతం తన అధికార దర్పంతో శాసించారు. అధికారం శాశ్వతం కాదని తెలుసు. బళ్ళు ఓడలవుతాయి. ఓడలు బళ్ళవుతాయనీ తెలుసు. అయినా తనకు నచ్చని వాళ్ళను దూరం పెట్టి, నచ్చిన వాళ్ళను అందలం ఎక్కించి..ఎవరి మాటా వినకుండా అన్నీ తానై వ్యవహరించి ఇదే రాజకీయం అన్నట్టు వ్యవహరించిన భరత్..మాజీ ఎంపీ భరత్, వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి, నగర పార్టీ అధ్యక్షుడు భరత్..ప్రస్తుతం అగ్ని పరీక్ష ఎదుర్కొంటున్నారు. ఒకవైపు అధికార టీడీపీ, మరోవైపు వైసీపీ నేతలు. ఈ రెండింటికీ మించి తన చిన్ననాటి స్నేహితులు తిరుగుబాటు. ఇలా ముప్పేట దాడి భరత్ పై చాలా వ్యూహాత్మకంగా కొనసాగుతోంది. మిత్రులు ఎదురు తిరుగుతారని భరత్ బహుశా ఊహించి ఉండరు. ఒకవేళ ఎదురు తిరిగినా లోగుట్టు బయట పెడతారని భావించి ఉండరు. అలా ముందే అనుకుని ఉంటే..చాలా జాగ్రత్తపడేవారని అంటున్నారు. తన బాల్య స్నేహితులు ఇన్నమూరి ప్రదీప్, పీ రామశర్మ.. వీరిద్దరూ భరత్ వ్యవహారాలను ఒకటొకటిగా బయట పెడుతూ.. చాలా ఇంకా చెప్పమంటావా.. బహిరంగంగా వచ్చినా సిద్ధమే అని సవాల్ విసరడాన్ని భరత్ జీర్ణించుకోలేకపోతున్నారు. వీరు ఇంతలా మాట్లాడటం వెనుక తన రాజకీయ బద్ధ శత్రువు, టీడీపీ సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఉన్నారనేది బహిరంగ రహస్యం.

ఇక్కడ రామశర్మ, ప్రదీప్ వెనుక ఎవరు ఉన్నారు?, ఏమి చెప్పిస్తున్నారు?..అనేది పక్కన పెడితే.. భరత్ వీరి అభియోగాలను ఖండించకపోవడం గమనార్హం. అధికారంలో ఉన్నప్పుడు రామశర్మ ఎంపీ భరత్ ఆర్థిక వ్యవహారాలు, అంతరంగ వ్యవహారాలూ చూసేవాడనే విషయం అందరికీ తెలిసిందే. ఏ పని చేయాలన్నా, ఎంత ఖర్చు చేయాలన్నా రామశర్మే అన్నీ చూసుకునే వాడని చెబుతున్నారు. ఈ విషయం వైఎస్సార్ సీపీ శ్రేణులకు బహు బాగా తెలుసు. అటువంటి బాల్య స్నేహితుడు కష్టాల్లో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే మిత్రుడిగా భరత్ పట్టించుకోవాలి కదా అని వైసీపీ శ్రేణులే అంటున్నారు. అంతా బాగున్నప్పుడు ఒకలా, బాగులేనప్పుడు ఒకలా వ్యవహరించడం రాజకీయ నేతలకు తగదంటున్నారు బాల్య స్నేహితుడు కాబట్టి అధికారంలో ఉన్నప్పుడు రామశర్మకు చందా సత్రం చైర్మన్ హోదా కల్పించారని, అదే భరత్ చీకటి బాగోతాలా గుట్టు విప్పినప్పుడు..పనికిమాలిన వ్యక్తి, ఛీటర్ అయిపోయాడా రామశర్మ అని ప్రశ్నిస్తున్నారు. కష్టమైనా సుఖమైనా మిత్రుడంటే మిత్రుడే..ఆ మిత్ర ధర్మాన్ని భరత్ విస్మరించడం వల్లనే..రామశర్మ అజ్ఞాతంలో నుంచి బయటకు వచ్చి..'ఇదిగో భరత్ అవినీతి చిట్టా' అని మీడియా ముందు వెళ్ళగక్కాడని ప్రత్యర్థులు చెబుతున్నారు. వృద్ధులైన రామశర్మ తల్లితండ్రులను వేధిస్తుంటే ఏ కొడుకు మాత్రం చేతులు ముడుచుకుని కూర్చుంటాడు?.. తన శక్తికొద్దీ తిరుగుబాటు చేస్తాడు. తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకోలేని కొడుకు కొడుకే కాదు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఏదో ఒక సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ భరత్ ను ఉద్దేశించి.. "నాకు కొడుకు.. నీకు ఇద్దరూ ఆడపిల్లలే.." అన్నప్పుడు భరత్ లో ఆగ్రహం, ఆవేశం కట్టలు తెంచుకుంది. అదీ తండ్రి ఆవేదన, రోషం. అదే రీతిలో ఇక్కడ రామశర్మ కూ వచ్చింది. కనీసం మిత్ర ధర్మాన్ని కాకపోయినా మానవత్వంతో, ప్రజా ప్రతినిధిగా..పెద్ద మనిషిగా జోక్యం చేసుకుని రామశర్మ తల్లిదండ్రులను వేధించే వారిని మందలిస్తే అప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదేమో. టీడీపీ నేతలు భరత్ పై ఎన్ని ఆరోపణలు, అభియోగాలు మోపినా ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఇదొక రాజకీయ వ్యూహమనే అందరూ భావించారు. అదే భరత్ బాల్య స్నేహితుడు రామశర్మ మీడియా ముందుకు వచ్చి 'భరత్ కు ఎంతో చేశాను. భరత్ చీకటి వ్యాపారాలలో నేనూ భాగస్వామినే. అతని వల్ల ఆర్థికంగా చితికిపోయాను. అప్పుల్లో పడిపోయాను. భరత్ కు ఎప్పుడెప్పుడు ఎంతెంత ఇచ్చిందీ గణాంకాలతో సహా చెబుతుంటే' ప్రజలు విస్మయానికి గురయ్యారు. మీడియా సైతం అవాక్కయింది. తనకు, తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని కన్నీటిని ఆపుకొంటూ, కళ్ళను తుడుచుకుంటూ రామశర్మ చెప్పినప్పుడు అతనిలో నిజాయితీ కనిపించింది. రామశర్మ ప్రెస్ ముందుకు వచ్చేలా ఏర్పాట్లు ఎవరు చేశారనేది ఇక్కడ అప్రస్తుతం. కాకపోతే భరత్ కు అదే అవసరం. ఎక్కడో అజ్ఞాతంలో ఉన్న వ్యక్తిని వెతికిపట్టుకు వచ్చి రెడ్ కార్పెట్ వేసి..రామశర్మ తో తనపై బురద జల్లించారని భరత్ ఆరోపణ. అంతే కానీ..రామశర్మ తనకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని డైరెక్ట్ గా చెప్పడం లేదు. "ఇస్తే ఆధారాలు చూపమని" మాత్రమే అంటున్నారు. రహస్యంగా అదీ అక్రమ డబ్బు..వీటికి వీడియోలు, రాతకోతలు ఎక్కడుంటాయనేది ప్రత్యర్థుల ప్రశ్న. ఏదో అనాలని అనడం తప్పిస్తే.. మరొకటి కాదంటున్నారు. నిజంగానే రామశర్మ చెప్పినవి సుద్ధ అబద్ధాలే అయితే.. ప్రెస్ ముందు భరత్ నోరువిప్పి క్లారిటీ ఇవ్వాలి కదా. టీడీపీ నేతలు లిక్కర్ సిండికేట్ తో మాట్లాడిన బేరసారాల ఆడియో లీకయినప్పుడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి..అంత మోసం.. ఇంత మోసం జరిగిందని గుండెలు బాదుకున్న భరత్.. పోలీసులకు ఫిర్యాదు చేసిన భరత్.. మరి బాల్యమిత్రుడు రామశర్మ అన్నేసి ఆరోపణలు చేసినప్పుడు.. ఆగమేఘాలపైథ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఖండించాలి కదా అని వైసీపీ శ్రేణులే వ్యాఖ్యానించడం గమనార్హం. మరి ఎందుకు అటువంటి ఏర్పాట్లు చేయలేదు.. పైపెచ్చు.. బాల్య మిత్రుడు రామశర్మ ఒక్కసారిగా 'పనికిమాలిన వ్యక్తి' అయిపోయాడా?, ఛీటర్ అయిపోయాడా?,..అలా అవడానికి కారణం ఎవరు?..ఇప్పుడు నగరంలో ఇవే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

మరో వైపు భరత్ బాల్య మిత్రుడు యిన్నమూరి ప్రదీప్. ఈయననూ రామశర్మే బలవంతంగా వైఎస్సార్ సీపీలో చేర్పించారట. ఈ విషయాన్ని రామశర్మ చెప్పారు. ప్రదీప్ పలు సార్లు మీడియాకు తెలిపారు. పార్టీలో చేరకపోతే వ్యాపారాలకు ఇబ్బంది కలుగుతుందని భరత్ బెదిరించడం..ఆ విషయాన్ని రామశర్మ ప్రదీప్ కు తెలిపి మొత్తంపై పార్టీలో చేర్పించారు. యువతా హరితా కార్యక్రమాల ఖర్చు, సెలబ్రిటీలకు అయిన ఖర్చంతా తానే పెట్టినట్టు ప్రదీప్ చెబుతున్నారు. ప్రతిఫలంగా శ్రీ ఉమా మార్కండేయ స్వామి పాలకవర్గం చైర్మన్ పదవిలో దీపూని నియమించారట. సరే ఆ పదవిలో ఎంత కాలం ఉన్నారో తెలియదు కానీ..ఎంపీగా భరత్ ఉన్న సమయంలోనే దీపు టీడీపీ ఆదిరెడ్డి వర్గంలో చేరిపోయారు. భరత్ తో రాజీ పడలేక బయటకు వచ్చానని దీపు మీడియా ముందు చెప్పారు. అంతేనా..భరత్ లొసుగులు అన్నీ ఇన్నీ కావంటూ సమయం, సందర్భం వచ్చినప్పుడు చెబుతూనే వచ్చారు. రెండు రోజుల క్రితం ప్రెస్ క్లబ్ లో కూడా భరత్ పై అనేక ఆరోపణలు చేశారు.

**డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే కూడా..**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సందర్భాలలో ఎంపీ భరత్ వెంట కనిపించిన డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి. ప్రస్తుతం ఈయన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు. రామశర్మ ఆరోపణల అనంతరం.. టీకే మీడియాతో మాట్లాడుతూ రామశర్మ చేసిన ఆరోపణలలో వాస్తవం లేకుంటే దేవుని సమక్షంలో తన ఇద్దరి పిల్లలపై ప్రమాణం చేసి చెప్పగలరా అని ప్రశ్నించారు. అలా చేస్తేనే ప్రజలు నమ్ముతారని తెగేసి చెప్పారు. ఇదే సమయంలో భరత్ - రామశర్మల స్నేహం గురించి ప్రస్తావించారు. చాలా ధైర్యంగా రామశర్మ ఎన్నో విషయాలను మీడియా ఎదుట చెప్పడాన్ని టీకే విశ్వేశ్వర రెడ్డి అభినందించారు.

**ప్రవీణ్ మీడియా ముందుకు వస్తారా?..**


పేపర్ మిల్లు కార్మిక నేత ప్రవీణ్ చౌదరి కూడా త్వరలోనే మీడియా ముందుకు వచ్చి భరత్ అవినీతి గురించి చెప్పే అవకాశాలు ఉన్నాయని టీడీపీ నేతలు ఇప్పటికే ప్రెస్ కు తెలిపారు. పేపర్ మిల్లు కార్మికుల 'పరంపర' సొమ్ము కోటీ యాభై లక్షలు మూడు దఫాలుగా ప్రవీణ్ తన ద్వారా భరత్ కు పంపాడని రామశర్మ చెబుతున్నారు. పేపర్ మిల్లులో జరిగిన అనేక అవకతవకలు జరిగాయని, ప్రవీణ్ చౌదరి వల్ల తాము ఆర్థికంగా నష్టపోయామని తరచూ మిల్లు కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం విదితమే. ప్రవీణ్ చౌదరి వచ్చి ఏమి చెబుతారనేది ప్రస్తుతం నగరంలో ఆసక్తికరంగా మారింది. కొసమెరుపు ఏమిటంటే..ఈ ప్రవీణ్ చౌదరిని వైసీపీలో చేర్పించింది కూడా రామశర్మే. వీరు కాకుండా మరో నలుగురైదుగురు భరత్ అవినీతి సామ్రాజ్యం గురించి బట్టబయలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని మొన్న విలేకరుల సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు సూచనప్రాయంగా వెల్లడించారు. ఇంత జరుగుతున్నా..ఈ విషయంలో జనసేన, బీజేపీ స్పందించకపోవడం గమనార్హం. వీరు సరే..వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కానీ, స్థానికంగా ఉన్న ఆ పార్టీ నాయకులు కానీ పెదవి విప్పకపోవడం దారుణమే. అధికారంలో ఉన్నప్పుడు కుర్చీల కోసం భరత్ వెంట చెమటలు కక్కేలా పరుగులు పెట్టిన నాయకులు..నేడెక్కడ?. మాట్లాడరేం.



## నేడు వాడపల్లి వెంకన్న ఆలయ హుండీ లెక్కింపు

**ఆత్రేయపురం( మనసులో మాట) నవంబరు 18..** కోనసీమ తిరుమల గా పేరుపొందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు, ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు. మంగళవారం ఆలయంలో జరిగే నిత్య కళ్యాణం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణాలు,అష్టోత్తర పూజలు, జరిపించుకున్నారు. ఆలయానికి వచ్చే వృద్ధులు, వికలాంగులకు, కొత్తవంతెన నుండి ఆలయ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

## ఢిల్లీకి పయనమైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** ప్రత్యేక్- నైన్ ఈస్ మైన్ సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ఇంక్లూజివ్ - యునైటెడ్ నేషన్స్ ప్రోగ్రామ్ లో పాల్గొనడానికి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఢిల్లీ వెళుతున్నారు. పారా, ఆంధ్రప్రదేశ్ తరపున రాష్ట్ర సమన్వయ కర్త టీ మార్టిన్ సుధాకర్ సారథ్యంలో ఈ విద్యార్థులు ఢిల్లీ బయలుదేరారు. స్థానిక జాంపేట లూథరన్ ఎయిడెడ్ హైస్కూల్ నుండి 10వ తరగతి విద్యార్థి మొహమ్మద్ అర్షద్, కొత్తపేట మండలం పలివెల జడ్పీ హైస్కూల్ నుండి 9వ తరగతి విద్యార్థి పాకా అక్షయ్ ఢిల్లీ వెళ్తున్నారు. నేడు, రేపు (19, 20 తేదీలలో) నిర్వహించే ఈ కార్యక్రమంలో 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 150 మంది పిల్లలు తమ 2030 తర్వాత "సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాల" (ఇంక్లూజివ్ డెవలప్మెంట్ గోల్స్) యొక్క మొదటి ముసాయిదాను యు.ఎన్ అధిపతులు, రాయబారులు, మహిళా శిశు సంక్షేమ మంత్రికి అందజేస్తారు.

### దళిత బహుజన, గిరిజనుల

## ఐక్య పోరాటంతోనే మోదీకి బుద్ధిచెబుదాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు
- సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం కొరకు సీపీఐ నిరసన ప్రదర్శన




**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** దళిత బహుజన గిరిజనులు అందరూ మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేయాలని, అప్పుడే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పగలమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సామాజిక న్యాయం ఆత్మగౌరవం జన గణనలో కుల గణన చేపట్టాలని. కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు జనగణలో కులగణన చేపట్టాలని, సామాజిక న్యాయం ఆత్మగౌరవం తదితర అంశాలపై దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతోందని అన్నారు. కేంద్రంలోకి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి గత 11 ఏళ్ళ కాలంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు మితిమీరి పోయాయని మధు అన్నారు.

దేశంలో మతోన్మాద పాలన సాగుతోంది అన్నారు. అణిచివేత, అంటరానితనం, కుల మత వివక్షత హింస పెట్రేగిపోతోందని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్ కనుసన్నలలో భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన కొనసాగుతోందని ఆయన చెప్పారు. రాజ్యాంగం, మానవ హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని మోదీ ప్రభుత్వం పాతర వేసిందని విమర్శించారు. మన రాష్ట్రంలో దాదాపు 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గత స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థలకు చెందిన పదవులు బీసీలు కోల్పోయారని మధు అన్నారు. తెలంగాణలో ప్రభుత్వ జనాభా లెక్కల సందర్భంగా కులగణను చేపట్టి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించిందని మధు తెలిపారు. అదే విధంగా మన రాష్ట్రంలో కూడా జనగణలో కులగణను చేపట్టి కులాల ప్రతిపాదికన బీసీలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని మధు కోరారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య హక్కులను హరించే దుష్టశక్తులను తిప్పికొట్టేందుకు దళితులు, గిరిజనులు, బహుజనులు, మైనార్టీలు ఐక్యమై పోరాటానికి సిద్ధం కావాలని మధు పిలుపునిచ్చారు. అనంతరం రాజమండ్రి సబ్ కలెక్టర్ ఆఫీస్ నుండి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, జట్ల సంఘం అధ్యక్షుడు కే రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వీ కొండలరావు, సహాయ కార్యదర్శి పీ లావణ్య, జట్ల లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ త్రిమూర్తులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ సునీల్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పీ కొండావతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వర రావు, జట్ల సంఘం అధికార బాడీ నల్ల రామా రావు, దేవుడు బాబు, కాళ్ళ అప్పలనాయుడు, రెడ్డి వెంకట్రావు, పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు టీ నాగేశ్వరరావు, పార్టీ జిల్లా సమితి సభ్యులు కాకి శారద, పోలమ్మ తదితరులు నాయకత్వం వహించారు.

## పచ్చదనం పరిశుభ్రత పై అవగాహన కలిగి ఉండాలి

### శిక్షణ తరగతుల్లో డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణి రావు ఉద్ఘాటన




**కాజులూరు (మనసులో మాట) నవంబరు 18..** ఆధునిక సమాజంలో అభివృద్ధి దిశగా సాగేందుకు పచ్చదనం మరియు పరిశుభ్రత అత్యంత ముఖ్యమైన అంశాలుగా నిలుస్తాయని డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణిరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కాజులూరు మండల పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచులకు ఉప సర్పంచ్లు పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పచ్చదనం పరిశుభ్రత పై శిక్షణ తరగతులు నిర్వహించారు .ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణి రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఆరోగ్యవంతమైన జీవన విధానం, పర్యావరణ పరిరక్షణఇవి అన్నీ పరిశుభ్ర వాతావరణం, హరిత వైభవం పెంపుతోనే సాధ్యమవుతాయన్నారు. పర్యావరణ సంరక్షణ, పచ్చదనం, పరిశుభ్రత ప్రాధాన్యాన్ని ప్రతిపాదిస్తూ కీలక సూచనలు చేశారు.

శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తూ ఆయన మాట్లాడుతూ,గ్రామీణాభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు కాదని శుభ్రమైన వాతావరణం, పచ్చదనం పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణ కూడా అంతే ముఖ్యం అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పర్యావరణ హిత కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.పచ్చదనం పెంపుసమాజ బాధ్యతని పచ్చదనాన్ని కేవలం ఒక కార్యక్రమం కాకుండా, ప్రతి కుటుంబం తన బాధ్యతగా స్వీకరించాల్సిన అవసరముందని వివరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక చెట్టు నాటడం, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కమ్యూనిటీ హాల్‌ల వద్ద హరితావరణం ఏర్పాటు చేయడం వంటి చర్యలు గ్రామ సుందరీకరణకు దోహదం చేస్తాయని చెప్పారు.పరిశుభ్రతుఆరోగ్యానికి నాందనీ పరిశుభ్రత లేకుండా అభివృద్ధి అసాధ్యమని ఆయన హెచ్చరించారు.





## మత్తుకు దూరంగా ఉండండి

### - నషా ముక్త్ భారత్ ప్రోగ్రామ్ లో వీసీ ప్రసన్నశ్రీ -

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలిపారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా వృద్ధులు వికలాంగులు ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నష ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఐదు సంవత్సరముల పూర్తయిన సందర్భంగా వార్షిక ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ హాజరై జండా ఊపి అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. విశ్వ విద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించిన తర్వాత కేంద్ర పరిపాలన భవనం ప్రాంగణంలో నషా ముక్త్ భారత అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య ప్రసన్న శ్రీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. డ్రగ్స్ అలవాటుగా మారితే వారి జీవితాలు నాశనం అవుతాయన్నారు. మత్తుకు దూరంగా జీవిస్తూ ఉన్నత లక్ష్యాలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అడిషనల్ ఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ మాదకద్రవ్యా రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని, విద్యార్థులను చైతన్యవంతుల్ని చేసేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా. ఎన్ ఉదయభాస్కర్, పీసీసీ డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ డాక్టర్ సుందర్ రాజు, డీఎస్పీ, సీఐ, పోలీసు సిబ్బంది, వికలాంగులు టీజీ అండ్ సీనియర్ సిటిజన్ల సంక్షేమ సిబ్బంది, ఈగల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ ఎన్నికలు



**రామచంద్రపురం(మనసులో మాట)నవంబరు18** ఏపీ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షునిగా చిక్కాల సూర్యారావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సోసియేషన్ మండపేట తాలూకా అధ్యక్షులు జిత్తుగ మల్లికార్జునుడు, సహాయ అధికారిగా కార్యదర్శి ఆర్ మోహన్, అబ్జర్వర్‌గాజీ సుందర్‌రావులు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా చిక్కాల సూర్యరావు, సహాధ్యక్షులుగావీ గౌరీశ్వరరవు, ఉపాధ్యాక్షులుగా ఏ సద్గురు మూర్తి, ఇమాన్ షరీఫ్, పీ రాజారావు, డాక్టర్ ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు, మహిళా ఉపాధ్యాక్షులుగా పీఎస్ వరలక్ష్మి, కార్యదర్శిగా నయనాల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పీ సత్యనారాయణ, మహిళా జాయింట్ సెక్రటరీగా వీ రోజామణి, కోశాధికారిగా ఎం కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎంవీ సుబ్రహ్మణ్యంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా హడహక్ కమిటీ చైర్మన్ మాదవరపు వెంకటేశ్వర్లు అభినందించారు.



## మెడికల్ కాలేజీల ప్రవేటీకరణ నిర్ణయాన్ని ఖండించండి

### నేడు వివిఎస్ఎం కళాశాల వద్ద కోటి సంతకాల కార్యక్రమం

### వైఎస్ఆర్‌సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

**రామచంద్రపురం(మనసులో మాట) నవంబరు 18..** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరచాలన్న చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఆపార్టీ జిల్లా యువజన విభాగం అద్యక్షులు పిల్లి సూర్యప్రకాశ్ పిలుపు నిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పార్టీ విద్యార్థి విభాగాల నేతత్వంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని పట్టణంలోని వివిఎస్ఎం కళాశాల వద్ద నేడు నిర్వహిస్తున్నట్లు సూర్యప్రకాశ్ తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మూలంగా రాష్ట్రంలోని వైద్య విద్యను అభ్యసించాలనే విద్యార్దులు భవిష్యత్ అగమ్యగోచరంగా ఉంటుందని, దీనిని ప్రతీ ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. గవర్నర్‌కు అందించే కోటి సంతకాల కార్యక్రమంలో ప్రతీ విద్యార్ధి భాగస్వాములు కావాలని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రవేటు పరం కాకుండా చేసే కుట్రలను నిలుపుదల చేసేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కోటి సంతకాల కార్యక్రమంలో ముఖ్యంగా విద్యార్ధులు, వారి తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు

## రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ పోటీలకు సంపర జడ్పీ పాఠశాల విద్యార్థి



పెదపూడి, (మనసులో మాట) నవంబర్ 18 పెదపూడి మండలం సంపర జడ్పీ పాఠశాల 10వ తరగతి విద్యార్థి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన లాంగ్ జంప్ పోటీలలో జడ్పీ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి సిరిశెట్టి సూర్యనారాయణ ద్వితీయ స్థానాన్ని సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జనసేన అధ్యక్షులు నాగిరెడ్డి వీరాస్వామి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత అద్దంకి ముక్తేశ్వరరావు, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారుడు సూర్యనారాయణ ను అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయాన్ని సాధించి, జాతీయ స్థాయి పోటీలకు సూర్యనారాయణ ఎంపిక కావాలని గ్రామస్తులు కోరారు.

## పందలపాక శ్రీ పార్వతి సోమేశ్వర స్వామి వారి ఆలయంలో లక్షపత్రి పూజ

### పాల్గొన్న మాజీ శాసనసభ్యుడు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు



అనపర్తి ( మనసులో మాట) నవంబరు 18: పందలపాక సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో కొలువై ఉన్న శ్రీ పార్వతి సోమేశ్వర స్వామి ఆలయంలో పడాల అబ్బుల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన, లక్షపత్రి పూజలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో సత్తి హరిప్రసాద్ రెడ్డి, పోతుల వర ప్రసాద్ రెడ్డి (బుజ్జి), డాక్టర్ కిలపర్తి సత్యనారాయణ, బొడ్డు ముత్యాల రావు, కర్రి గీత సతీష్ కుమార్, మచ్చా పాప, గండి వాసు, గొర్లపల్లి మల్లేష్, వంక శ్రీను, గొలుగూరి సత్యనారాయణ రెడ్డి (పెద్ద అబ్బు), పడాల కృష్ణరెడ్డి, పాలచర్ల అబ్బు, కర్రి ఇష్రారెడ్డి, గొలుగూరి రమణా రెడ్డి, ధరణికోట ఏసు, రొంగల వెంకటేశ్వరరావు, పడాల అయ్యప్ప రెడ్డి, తమలంపూడి వెంకటరెడ్డి, తమలంపూడి దుర్గారెడ్డి, సత్తిరాజు రెడ్డి, పడాల వీర్రాఘవ రెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, కోసూరి శ్రీను (కొండ), కోసూరి దివాకర్, కోసూరి గణేష్, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహా రుద్ర హోమం

## - భక్తి శ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** శ్రీ వివేకానంద సనాతన ధర్మ ప్రచార సమితి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహిస్తున్న మాస శివరాత్రి లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన కార్యక్రమంలో భాగంగా కార్తీక బహుళ చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం మహారుద్ర హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గోదావరి గట్టు లాంచీలరేవు ఎదురుగా శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి భవనంలో బ్రహ్మశ్రీ తొయ్యేటి సీతారామశర్మ దంపతులు, పురోహితుడు మార్కండేయ స్వామి ఘాట్ కు వెళ్లి గోదావరి మాతకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. ఉదయం 9నుండి రాత్రి 7 గంటల వరకు గణపతి పూజ, గోపూజ, గోదావరి నది పూజ, మహాన్యాసము, మహా రుద్రాభిషేకము, సూర్య నమస్కారాలు, చండీ పారాయణ, శివ దశ సహస్ర నామ పారాయణ, విష్ణు సహస్ర పారాయణం, లింగార్చన, సుందరకాండ పారాయణ, నవగ్రహ ఆరాధన, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి అర్చన నిర్వహించారు. సాయంత్రం నందీశ్వర పూజ, లక్ష బిల్వార్చన,లక్ష కుంకుమార్చన మహారుద్ర హోమం పూర్ణాహుతి జరిగింది.

అనంతరం శ్రీ పార్వతీశ్వర కల్యాణం, నీరాజన మంత్రపుష్పాలు, వేదాశీర్వచనము, తీర్థ ప్రసాద వితరణ చేసినట్లు కాకి వారి భవనం వంశపారంపర్య ధర్మకర్తలు కాకి నాగేశ్వరరావు అండ్ బ్రదర్స్ తెలిపారు.

# గో ఆధారిత ప్రకృతి వ్యవసాయానికే భవిష్యత్

## - ఎమ్మెల్యే సత్యానందరావు -



**ఆత్రేయపురం (మనసులో మాట) నవంబర్ 18..** ఆరోగ్యకరమైన ఆహారం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం, మంగళవారం అంకంపాలెంలో గ్రామ వికాస్ ఆంధ్రప్రదేశ్, వ్యవసాయ శాఖ, ప్రకృతి రైతు కుదప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సదస్సులో , కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ శావల దేవదత్తు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, మాజీ ఎంపీపీ పిఎస్ రాజు, పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముందుగా రైతులు ఏర్పాటు చేసిన గో ఆధారిత సేంద్రీయ ఉత్పత్తుల స్టాల్లను పరిశీలించారు. గో ఆధారిత ఉత్పత్తులతోనే పంటలు పండిస్తున్నామని, మంచి రాబడి వస్తోందని రైతులు తెలిపారు. సేంద్రీయ పంటలే ఆరోగ్యానికి పునాది,దేశంలో ధాన్యం కొరత లేకపోయినా, రసాయన ఎరువులు అధికంగా వాడిన ఆహారం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా క్యాన్సర్ ముప్పు ఎక్కువవుతోందని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయం, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి అవసరమైందని అన్నారు. మన ఆరోగ్యం మన ఆహారంపై ఆధారపడింది. మంచి ఆహారం అందించడం రైతుల చేతుల్లోనే ఉందని, సేంద్రియ వ్యవసాయానికి,దేశవ్యాప్తంగా గో ఆధారిత వ్యవసాయం చర్చనీయాంశమైందని, సీఎం నారా చంద్రబాబు నాయుడు సేంద్రీయ వ్యవసాయానికి విస్తృతంగా ప్రోత్సాహం అందించే చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వమే ప్రత్యేకంగా ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని వివరించారు. నియోజకవర్గంలో విస్తరణ చర్యలు రైతులకు అవగాహన కల్పించేందుకు నాలుగు మండలాల్లో ఇలాంటి సదస్సులను నిర్వహించే యోచన ఉందని చెప్పారు. కుదప కృష్ణమూర్తిని నియోజకవర్గ స్థాయి కమిటీ చైర్మన్‌గా నియమించి, ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రావులపాలెం, కొత్తపేటల్లో గో ఆధారిత సేంద్రీయ ఉత్పత్తుల రిటైల్ దుకాణాలు ప్రారంభించే దిశగా చర్యలు చేపడతామని వెల్లడించారు.వరి, అరటి రైతులు ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టాలని సూచించారు. ఇప్పటికే కొందరు రైతులు కోకో, పామాయిల్, ఉద్యాన పంటల సాగు వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, ప్రకృతి వ్యవసాయ సలహాదారులు బొప్పన సీతారామదాసు, ఏపీసీఎన్ఎఫ్ కొత్తపల్లి శ్రీనివాస్, బొర్రా తాతారావు, జె. ఎలియాజరు, కృశివల కోకోనట్ ఫార్మ్ ప్రొడ్యూసర్ కంపెనీఅడ్డాల గోపాలకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# దళిత, గిరిజన, మైనార్టీలపై జరిగే దాడులను ఖండించండి




**కాకినాడ(మనసులో మాట), నవంబర్18:** దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరం కోసం మంగళ వారం దేశవ్యాప్తంగా ఆందోళన చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా కాకినాడ సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాకు సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కామిరెడ్డి బోడకొండ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారం చేపట్టిన నుండి గత 11 సంవత్సరాల కాలంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు మితిమీరిపోతున్నాయని, దేశంలో మతోన్మాద పాలన సాగుతుందని, అణిచివేత, అంటరానితనం, కులమత వివక్ష హింస పెట్రేగిపోతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ సంఘపరివార్ కనిసన్నాల్లో భారత రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారని, రాజ్యాంగం కల్పించిన మానవహక్కులు సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వానికి పాత్ర వేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏటిసీయూసి నేత తోకల ప్రసాద్ మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 నివేదిక ప్రకారం షెడ్యూల్ కులాలు (ఎస్సీ) వారిపై జరిగిన నేరాలకు 57, 789 కేసులు, షెడ్యూల్ తెగల (ఎస్టీ) వారిపై జరిగిన నేరాలకు 12960 కేసులు నమోదయ్యాయని, మహిళలపై 4.48 లక్షల నేరాలు నమోదవడం విచారకరమని ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యకు హక్కులను హరించే దుష్టశక్తులను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, లౌకిక వ్యవస్థను కాపాడేందుకు మనమంతా నడుం కట్టాలని ఆయన అన్నారు. మన రాష్ట్రంలో దాదాపు 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గత స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థలకు చెందిన పదవులు బీసీలు కోల్పోయారని, తెలంగాణలో ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కుల గణన చేపట్ట నందుకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ,బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయిస్తూ లెక్కల కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించిందని, అదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్లో కూడా జన గణనల్లో కుల గణన చేపట్టాలనీ డిమాండ్ చేశారు. కులాల ప్రతిపాదికన బీసీలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని సిపిఐగా డిమాండ్ చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్ల సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ భవాని, కెవి రామయ్య, ఎన్ అనిల్ కుమార్, బాలకృష్ణ, ఏసు పాదం, అర్జున్ రావు, మడగల రమణ, సూరిబాబు, బర్ల లక్ష్మీనారాయణ, నమ్మి సత్యనారాయణ, అడపా చిట్టిబాబు పాల్గొన్నారు.

# జ్ఞాన సముపార్జనకే గ్రంథాలయాలు

## వ్యాసరచన - చిత్రలేఖనం - వక్తృత్వ పోటీలు

## యువత అభివృద్ధికి శక్తివంతమైన వేదిక గ్రంథాలయాలు



**కాజులూరు (మనసులో మాట) నవంబర్ 18..** సమాజం అభివృద్ధి చెందడానికి ప్రజల్లో జ్ఞానం, చైతన్యం, సృజనాత్మకత పెరగాలనీ ఈ లక్ష్యాన్ని నెరవేర్చే ప్రధాన వనరులు గ్రంథాలయాలు. ఇవి కేవలం పుస్తకాల నిల్వశాలలు మాత్రమే కాదుబీ లోకజ్ఞానానికి ద్వారాలు, వ్యక్తిత్వ నిర్మాణానికి శాలలు. ఆధునిక కాలంలో గ్రంథాలయాలను జీవంతో నింపేందుకు, పాఠకులను ఆకర్షించేందుకు మరియు యువత ప్రతిభను వెలికితీసేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు వంటి కార్యక్రమాల నిర్వహణ అత్యంత అవసరం అని కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం చింత నారాయణమూర్తి అన్నారు.మంగళవారం మండల కేంద్రమైన కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 58వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం నారాయణమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులు, ఉద్యోగులు, పరిశోధకులు, సర్వ సాధారణ పౌరులు అందరూ ఉపయోగించే వేదికలనీ ఇక్కడ లభించే పుస్తకాలు,పత్రికలు , విజ్ఞాన సర్వస్వాలనీ డిజిటల్ వనరులు వ్యక్తికి విస్తృత దృక్పథాన్ని, విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని, చదువుపై మక్కువను పెంచుతాయన్నారు. వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానపిపాస పెరుగుతుందనీ సమాజ సమస్యలపై అవగాహన ఏర్పడుతుందనీ తమ భావాలను సూటిగా, స్పష్టంగా వ్యక్తపరిచే నైపుణ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రంథాలయాలు ఇలాంటి పోటీలు నిర్వహిస్తే పుస్తక పఠనానికి ప్రోత్సాహం లభిస్తుందనీ యువతలో పరిశోధనా తత్వం, సృజనాత్మక ఆలోచన పెరుగుతుందన్నారు.



## ఈ నెల 21న సాగర తీరాన 50వ మహా కుంభాభిషేకం

కాకినాడ(మనసులో మాట), నవంబర్18: ఈ నెల 21వ తేదీన కాకినాడ సాగర తీరాన లోకకళ్యాణార్థ నిమిత్తం శ్రీశ్రీశ్రీ మంగళాంబిక సమేత శ్రీ ఆది కుంభేశ్వర స్వామి వారి ఆలయం వద్ద 50వ మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు భారత యజ్ఞ పీఠం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కుంభాభిషేకంనకు సంబంధించి కరపత్రికను మంగళవారం సాగర తీరాన ఉన్న ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యజ్ఞ కమిటీ సభ్యులు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం పకృతి ప్రమాదాలు నుంచి దేశానికి ఉపశమనం కలిగించే నిమిత్తం ఈ మహా కుంభాభిషేకంను ఈ సందర్భంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 21 ఉదయం గోపూజతో ప్రారంభమై కోటి 8 లక్ష శివలింగాలకు మహా కుంభాభిషేకం అలాగే పాదరసలింగానికి మహా కుంభాభిషేకం నిర్వహించి సాయంత్రం నాలుగు గంటలకు 101 కన్నెలచే అభిషేక ద్రవ్యాలతో సాగరంలో నిమజ్జనం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించే కుంభాభిషేక కార్యక్రమానికి భక్తులు అందరూ హాజరవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. ఆలయ అభివృద్ధి నిమిత్తం శాశ్వ శాశ్వత కోటీ ఎనిమిది లక్షల శివలింగంలు ఏర్పాటు నిమిత్తం 10 లక్షలు రూపాయలు నగదును ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యుడు తోట పుండరీకాక్షులు (బాబి) ప్రకటించారు. అలాగే ఈ ఆలయం ఎంతో విశిష్టత కలిగి ఉందని ఈ ఆలయ అభివృద్ధికి విరాళాలు ఇవ్వాలని భక్తులను కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శన ఏర్పాట్ల సదుపాయాలను కల్పిస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిట్నీడి శ్రీనివాస్ బోగిరెడ్డి తాతారావు, గంగిరెడ్డి అరుణ, బూర్ల సత్యనారాయణమ్మ (మాత), నామన ప్రసన్న, సలాది శ్రీనివాసరావు, ఆరుముగం నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురంలో ఘనంగా యూనిటీ మార్చ్

### వాక్ ఫర్ యూనిటీ ప్రారంభించిన కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం(మనసులో మాట) నవంబరు 18..** యువతలో ఐక్యత భావం, దేశ సమైక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో రామచంద్రపురంలో ఐక్యత మార్చ్ (యూనిటీ మార్చ్) ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, జెనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్ర శేఖర్, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, బీజేపీ అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ కర్రి చిట్టి బాబు, మోడరన్ విద్యాసంస్థల అధినేత జి వి రావులు, పెద్ద ఎత్తున కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక మోడరన్ విద్యాసంస్థల నుంచి ప్రారంభించిన యూనిటీ మార్చ్ మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వాసంశెట్టి సత్యం జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా యూనిటీ మార్చ్‌ను దేశవ్యాప్తంగా భారత ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. దేశానికి సర్ధార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ఐక్యతా భావం, దేశ సమైక్యతను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. తొలుత సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి, నివాళులు అర్పించారు. ఉక్కు మనిషిగా ప్రసిద్ధి పొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అమూల్యమైన సేవలు అందించారని కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశాన్ని ఐక్యమత్యం చేయడం ద్వారా అఖండ భారత్ గా నిర్మించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ టిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, దిగుమర్తి వీరబాబు, కొట్టివాడ హరిబాబు, అడబాల సత్యనారాయణ, సలాది శేఖర్, గాడాల కళ్యాణ్, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్, రాఘవేంద్రరావు, ఆకేటి శ్రీకృష్ణ, బుల్లబ్బులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల వల్ల విద్యార్థులకు ఏకాగ్రత మెరుగుపడతాయి




**ఆత్రేయపురం (మనసులో మాట )నవంబర్ 18..** ఆత్రేయపురం గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 5వ రోజు కార్యక్రమంలో సీనియర్స్, జూనియర్స్ విభాగంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో రాజధాని అమరావతి అనే అంశంపై, జూనియర్స్ విభాగంలో దేశనాయకులు అంశంపై పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, చిప్పాడ సత్యనారాయణ, గ్రంధాలయాఅధికారి టి.నమశ్శివాయ పర్యవేక్షనలో జరిపించారు. అనంతరం మాట్లాడుతూ గ్రంధాలయాలు వల్ల విద్యార్థులకు ఏకాగ్రత పెంపొందించేందుకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం తనిఖీ చేసిన సివిల్ సప్లై డైరెక్టర్

**ముమ్మిడివరం (మనసులో మాట ) నవంబరు 18:** ముమ్మిడివరం లోని బియ్యం దుకాణం లో రేషన్ బియ్యం ఉన్నట్టు సోమవారం రాత్రి సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి అనుమానం వ్యక్తం చేయడం తో షాపు యజమాని కి, ఆమె కు మధ్య వాగ్వి వాదం చేసుకున్నట్టు సమాచారం.దుకాణం రోడ్డు చెంతనే ఉండడం అక్కడ మాటా మాటా పెరగడం తో ట్రాఫిక్ కి అంతరాయం కలిగింది. దీంతో ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దుకాణం లో రేషన్ బియ్యం లేవని సివిల్ సప్లై అధికారులు లేకుండా షాపులను ఎలా తనిఖీ చేస్తారని వ్యాపారాలు సివిల్ సప్లై డైరెక్టర్ ను నిలదీశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎన్. భారతి ని అమలాపురం నుండి రప్పించి మరోసారి దుకాణం గోదామును పరిశీలించి దుకాణం లో సివిల్ సప్లై బియ్యం లేనట్టు ఆమె నిర్ధారణ చేయడం తో సివిల్ సప్లై డైరెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# కోనసీమ జిల్లా ఐదు నియోజకవర్గాలకే పరిమితమా!






- ▸▸ ఆంధ్రాలో అతి చిన్న జిల్లా గా కోనసీమ
- ▸▸ కోనసీమ నుండి మండపేట తూర్పు గోదావరి జిల్లాలో కలవనుంది!
- ▸▸ మరి రామచంద్రపురం మాటేమిటో!

**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 18:** వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన జరిగింది. ఈ పునర్విభజనతో ఏర్పడ్డ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పుడు మరిన్ని మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ముందు నుంచి మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో కొంత భాగాన్ని తూర్పుగోదావరి జిల్లాలోను, కాకినాడ జిల్లాలోనూ కలపాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. తాజాగా మండపేట ను తూర్పు గోదావరి జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది. దీంతో రామచంద్రపురం నియోజకవర్గం ను కాకినాడ జిల్లాల్లో కలిపాలన్న డిమాండ్ ఊపందుకుంది.. దీనికనుగుణంగా కూటమి ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోండగా మొత్తం మీద అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మార్పులు ఖాయమనే సంకేతాలు గట్టిగానే ఉన్నాయి.

**ఎందుకీ పరిస్థితి:**

మండటపేట నియోజకవర్గంలో పలు ప్రాంతాలన్నీ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురానికి అత్యంత దూరం. అయితే ఇక్కడ ప్రాంత ప్రజలు తమకు అత్యంత సమీపంలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి కలపాలన్న డిమాండ్ మొదటి నుంచి వినిపిస్తున్నారు. ఈ తరహా డిమాండ్ ముఖ్యంగా మండపేట నియోజకవర్గంలోని కేశవరం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా వినిస్తోంది. ఆలమూరు మండల పరిధిలోకి వచ్చే బడుగువాని లంక ప్రాంతంలో కూడా ఈతరహా డిమాండ్ వినిపించింది.. ఇది కొత్తపేట నియోజకవర్గ పరిధిలోనిది గనుక ఆ అవకాశం లేదనే చెప్పాలి.

అయితే ఇటు రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పలు ప్రాంతాలన్నీ కాకినాడకు అత్యంత సమీపం.. ఈ ప్రాంతాలనుంచి కాకినాడ వెళ్లాలంటే కేవలం 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం మాత్రమే. అయితే వీరంతా కూడా కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం రావాలంటే గౌతమీ నదీపాయ దాటి రావాలి. లేదా పుదుచ్చేరి యానాం నుంచి అమలాపురం రావాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పక్కజిల్లాలకు అత్యంత సమీపంలోని ప్రజలంతా ఈ డిమాండ్ ని జిల్లాల పునర్విభజన నాటి నుంచి వినిపిస్తున్నారు.. ఇటువంటి ఇబ్బందుల ఉన్నందున ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోకి వచ్చే తాళ్ల రేవు మండలాన్ని కాకినాడ జిల్లాలోకి చేర్చారు. మూడు జిల్లాల్లో కేవలం ఈ ప్రాంతం మాత్రమే నియోజకవర్గంతో సంబంధం లేకుండా పక్క జిల్లాలోకి మార్చారు అధికారులు.

**ప్రజాప్రతినిధులు సైతం మొగ్గు చూపుతున్నారా:**

జిల్లాల పునర్విభజనలో కోనసీమ జిల్లాను అమలాపురం పార్లమెంటు పరిధినే జిల్లాగా నిర్ధారించిన పరిస్థితి ఉంది. అమలాపురం పార్లమెంట్ సెగ్మెంట్లో ఏడు నియోజకవర్గాలున్నాయి. అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, రామచంద్రపురం, మండపేట.. ప్రస్తుతం రామచంద్రపురం కాకినాడ జిల్లాలో కలిపేందుకు ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోన్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పూర్తి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తున్నవారికి తన సంఘీభావం కూడా తెలిపారని మెజారిటీ ప్రజల అభిప్రాయం గౌరవించే విధంగా తాను మీకు అండగా ఉంటానని అనే సంకేతం ఇచ్చారని సమాచారం. ఇదిలా ఉంటే మండపేట నియోజకవర్గాన్ని కూడా తూర్పుగోదావరి జిల్లాలోకి మార్చేందుకు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సానుకూలంగానే ఉండి అటువంటి ప్రయత్నం కూడా చేసి విజయం సాధించారనే చెప్పాలి. అక్కడి ప్రజలకు త్వరలోనే ఈసమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చి ప్రభుత్వం ఈ విషయం పై సానుకూల ప్రకటన చేసేలా చేయడం లో విజయం సాధించారనడంలో అతిశయం లేదు.

**కోనసీమ ఐదు నియోజకవర్గాలకే పరిమితం కానుందా:**

కూటమి ప్రభుత్వం కొలువతీరాక జిల్లాల పునర్విభజనలో జరిగిన లోపాలన్నింటిని సవరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.. ఇందులోభాగంగా ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ సంఘం ఇప్పటికే పలువురి నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనల్ని సేకరించింది. త్వరలోనే గత లోటుపాట్లను సవరించడంతోపాటు మరికొన్ని జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. ఇదే జరిగితే కోనసీమ ప్రాంతం చిక్కిపోయే పరిస్థితి తప్పదు.. అంటే కోనసీమ జిల్లా ఇకపై అయిదు నియోజకవర్గాలకే పరిమితం కానుంది.. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలు పక్క జిల్లాల్లో కలిసిపోయే పరిస్థితి కారణం నియోజకవర్గాల పునర్విభజన జరిగితేనే కానీ కొన్ని ప్రాంతాలు పక్క జిల్లాల్లోకి కలిపే అవకాశం లేదు. అందుకే కోనసీమ జిల్లాను అయిదు నియోజకవర్గాలకే పరిమితం చేసి పార్లమెంటు పరిధిని మాత్రం కదిపే అవకాశం లేనందున దాన్ని అలానే కొనసాగిస్తారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.



# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

- వారంతా ఒక పాఠశాలలో కలిసి చదువుకున్నారు
- ఇప్పుడు వారంతా వివిధ వృత్తులు ఉద్యోగాలు పనులతో బిజీగా మారిపోయారు

**అనపర్తి, ( మనసులో మాట) నవంబరు 18:** చాలా కాలం తర్వాత ఆ పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి దుప్పలపూడి లోని నేషనల్ వెంకయ్య తోట వేదికైంది. అనపర్తి శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ బాలల ఉన్నత పాఠశాల 2001-02 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ప్రకృతి ఒడిలో ఆత్మీయంగా కలిసేందుకు కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అనపర్తి శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2001-02 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు 23 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంతో అందరూ ఒక చోట కలుసుకొని ఎరా... ఒరేయ్... పలకరింపులు... ఆత్మీయ ఆలింగనాలు... ఒకటే సందడి... వారంతా పాఠశాల రోజుల్లో జరిగిన తమ, తమ అనుభూతులు, అనుభవాలు నెమరు వేసుకున్నారు. మళ్లీ త్వరలోనే మరోసారి కలుద్దాం అంటూ బరువెక్కిన హృదయాలతో ఒకరికొకరు వీడ్కోలు పలికారు.

# 50 ఏళ్ల చరిత్ర కలిగిన సిద్ధా వారి వన సమారాధన



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 18 :** గోకవరం మండలం కృష్ణుని పాలెం పంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామం శివారులో ఉన్న సిద్ధ వారి తోటలో మంగళవారం ఘనంగా కార్తీక వన సమారాధన (అన్న సంతర్పణ) నిర్వహించారు. కృష్ణుని పాలెం గ్రామానికి చెందిన సిద్ధ చంటి కామరాజు (బేబీ) దంపతులు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితులు బాలు ఆధ్వర్యంలో ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి, పచ్చని ప్రకృతిలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో వన సమారాధన నిర్వహించారు. సిద్ధా వారి వన సమారాధనకు 50 ఏళ్ల చరిత్ర కలిగి ఉన్న నేపథ్యంలో కృష్ణుని పాలెం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అత్యధికంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులైన సిద్ధ రామన్న దొర నారాయణమ్మ దంపతులు ఈ కార్యక్రమాన్ని 50 సంవత్సరాల క్రితం ప్రారంభించడం జరిగిందని, అప్పటినుండి ఇప్పటివరకు వారసులగా తాము కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్తీక మాసంలో నిర్వహించే ఈ కార్యక్రమం మానసికంగా ఎంతో ఆనందం కలుగజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, శివ మాల ధరించిన స్వాములు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు.

## గర్భిణీలకు కంబాల సౌజన్యంతో
# పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 18 :** విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు చేపట్టిన ప్రజా సేవ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. అందులో ముఖ్యంగా గర్భిణీలకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ కార్యక్రమం ఒకటి. సుమారుగా రెండేళ్ల నుంచి గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో చికిత్స కోసం వచ్చే గర్భిణీలకు ప్రతి మంగళవారం పండ్లు, పాలు, రొట్టెలను కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారి సిబ్బంది అందజేస్తున్నారు. తన సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటాయని, తన వద్దకు కష్టం అని వచ్చిన వారికి లేదు అనకుండా సహాయం చేసి తిరిగి పంపిస్తున్నానని కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సిబ్బంది వీరబాబు, బాబీ, తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి జడ్పిటిసి
# సామ్యూల్ సాగర్ ఆర్థిక సహాయం



**తాళ్ళరేవు (మనసులో మాట), నవంబరు 18:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలిమడం విరిగి ఆపరేషన్ జరిగి ఉపాధి కోల్పోయిన తాపీమేస్త్రి కనకాల మణికంఠ దంపతులను తాళ్ళరేవు జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మంగళవారం పరామర్శించారు. కోరంగి పంచాయతీ పాత కోరంగి గ్రామంలో క్షతగాత్రుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థిని అయిన ఆయన భార్య మోచేయి విరిగింది. దీంతో కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం బస్తా, రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, చిట్టూరి చలపతి పాతకోరంగి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## మామిడాడ వద్ద..
# రోడ్డు ప్రమాదం
### బస్సు డీకొని వ్యక్తి మృతి

**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 18..** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మామిడాడ గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం సంభవించింది.ఈ ప్రమాదం లో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదిత్య యూనివర్సిటీ కి చెందిన బస్సు అతివేగంగా వచ్చి బైక్ పై వస్తున్న సాయి అనే వ్యక్తిని బలంగా డికోట్టడంతో తీవ్రంగా గాయపడిన సాయి అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది.మృతుడు సాయి ఇటుకుల బట్టిలో పనిచేస్తుంటాడు. సాయికి భార్య, ఒక అబ్బాయి ఉన్నారు. సంఘటన ప్రదేశానికి చేరుకొన్న జగ్గంపేట ఎస్.ఐ రఘునాథరావు జరిగిన ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైభవంగా సి పైడితల్లి అమ్మవారి సారె సమర్పణ



**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 18:** పిఠాపురం రామ థియేటర్ సెంటర్ లో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయంలో మంగళవారం సారె సమర్పణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. మహిళలు తమ ఇళ్ల నుండి స్వీట్లను బిందులతో తీసుకువచ్చి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగలాట నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పైడితల్లి అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు పైడితల్లి అమ్మవారికి సారే సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పిఠాపురం పట్టణంలో భక్తిశ్రద్ధలను చాటింది. అలాగే నూతన ఆలయానికి ఒక శుభారంభాన్ని ఇచ్చింది.



# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు







**ఏలూరు, నవంబరు 18(మనసులో మాట)..** స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి మాసోత్సవాలు సందర్భంగా 500 మంది యువత, విద్యార్థులతో ఇండోర్ స్టేడియం గ్రౌండు నుండి ఫైర్ స్టేషన్ వరకు ఘనంగా సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్ ర్యాలీని జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా జాయింటు కలెక్టరు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఒకరిని, ప్రజలంతా జాతీయ ఐక్యతా భావంతో మెలగాలని అన్నారు. అక్టోబరు 31 నుంచి నవంబరు 25 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలో భాగంగా జిల్లా అంతటా అనేక కార్యక్రమాలు జరుగుచున్నాయని అన్నారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే విధంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాలలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని, డ్రగ్స్, మత్తుపదార్థాలు ఎక్కడయినా అమ్మినా, సేవించినా, ప్రోత్సహించినా సంబంధిత అధికార్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా ఏలూరును నిలుపుతామని, ప్రతి ఒక్కరూ కృషిచెయ్యాలని కోరారు. విద్యార్థులు విద్యను అభ్యసించే సమయంలో డ్రగ్స్ కు బానిసలు కాకుండా భవిష్యత్తును బంగారుబాటగా మలచుకోవాలని, దేశభవిషత్తు మీచేతుల్లోనే ఉందని గుర్తు పెట్టుకోవాలని అన్నారు.

జిల్లా ఏఎస్పీ నక్కా సూర్యచంద్ర రావు మాట్లాడుతూ దౌత్య నైపుణ్యం తో 565 సంస్థానాలు అన్నింటిని మన జాతీయ జెండా కిందకు చేర్చిన గొప్ప యోధుడు అన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలోను మంచి సేవలు అందించారని, దేశ స్వాతంత్రం తర్వాత ఉప ప్రధానిగా, కేంద్ర హోం శాఖ మంత్రిగా చేసిన సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన 182 అడుగుల విగ్రహాన్ని గుజరాత్ రాష్ట్రంలో ఏర్పాటు చేశారని అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కు సర్దార్, ఉక్కుమనిషి అని రెండు బిరుదులు ఉన్నాయని, నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడలు యువజన సంక్షేమ, మైభారత్ యువజన అధికారి సుంకర రాము, జెడ్పీ సిఈవో యం.శ్రీహరి, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, సెట్ వేల్ సిఇవో కె.యస్.ప్రభాకర రావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డా.జి.గిరిబాబు, పట్టణ ప్రముఖులు, యన్ సిసి, సేవా సంస్థల విద్యార్థులు, యువత, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్‌పై ఇన్‌చార్జ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 18:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నా క్యాంటీన్‌లలో పేదలకు అందించే భోజనం నాణ్యత ఎల్లప్పుడూ ఉత్తమంగా ఉండేలా చూడాలని కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి షాన్మోహన్ సగిలి సూచనల మేరకు ఇన్‌చార్జ్ కమిషనర్ కె.టి. సుధాకర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఉదయం కాకినాడ సంత చెరువు వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను సందర్శించిన ఆయన, అక్కడి సిబ్బందికి మెనూను కచ్చితంగా పాటించడం, భోజనం శుచిగా, రుచిగా అందించడం, సమయపాలన తప్పనిసరిగా పాటించడం వంటి సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అతి తక్కువ ధరకే అన్నా క్యాంటీన్‌ల ద్వారా ఆహారాన్ని అందిస్తోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్నా క్యాంటీన్‌లలో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. అనంతరం క్యాంటీన్‌లో అల్పాహారం చేస్తున్న ప్రజలతో మాట్లాడి రుచి, నాణ్యత, సేవలపై వారి అభిప్రాయాలు, సూచనలు సేకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ సంకల్పంపై ప్రత్యేక శిక్షణ శిబిరాలు



**పెద్దాపురం, (మనసులో మాట)** అక్టోబర్ 18బీ పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట, పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయాల్లో క్లీన్ అండ్ గ్రీన్ స్వచ్ఛ సంకల్పంపై సర్పంచులు, ఉప సర్పంచ్లు, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనీ వెంకటేష్ క్లీన్ అండ్ గ్రీన్ థీమ్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ప్రజల ఆరోగ్య భద్రత, పరిసరాల పరిశుభ్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని ఎంపీడీవో సూర్యనారాయణ కోరారు. సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ శిబిరాన్ని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ప్రారంభించారు. ఎంపీడీవో హిమామహేశ్వరి అధ్యక్షతన మాస్టర్ ట్రైనీలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, భైరవమూర్తి గ్రామీణ పరిశుభ్రత, క్లీన్ అండ్ గ్రీన్, స్వచ్ఛత విశిష్టతపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సత్తిబాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



నేడు పీఎం కిసాన్ నిధులు రైతు ఖాతాలకు

# 90.59 కోట్ల నిధులు జమ

### జేసి టీ నిశాంతి

**అమలాపురం (మనసులో మాట) నవంబరు18:** డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా అర్హులైన 1,34,439 మంది రైతులకు 90.59 కోట్ల నిధులు నేడు వారి ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ సిక్స్ కార్యక్రమం కింద అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000/- ఆర్థిక సహాయం ప్రకటించిందన్నారు. సాగు భూమిని సమిష్టిగా కలిగి ఉన్న భూస్వామి రైతు కుటుంబాలకు సంవత్సరానికి రూ. 20,000/- ప్రయోజనం అందించబడుతుంది, ఇందులో ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ. 6,000/- ప్రయోజనం కూడా ఉందన్నారు. జిల్లాలో రెండవ విడతలో మొత్తం లబ్ధిదారులు 1,34,439 మంది అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రైతు కుటుంబాలు, వీరికి రూ.90.59 కోట్ల ఆర్థిక ప్రయోజనం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నేడు మధ్యాహ్నం 1.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు %ూ=% జిల్లాలోని కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

ఈ జాతీయ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మధ్యాహ్నం 1.00 గంటలకు తమిళనాడులోని కోయంబత్తూరులో ప్రారంభిస్తారని జిల్లాలోని అన్ని నియోజకవర్గ స్థాయిలో, అలాగే RSK స్థాయి కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇచ్చి, సమన్వయంతో నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందనీ జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి రైతు సేవా కేంద్రం వరకు ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుందన్నారు. నియోజవర్గాల వారీగా ఈ క్రింది ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జెసి తెలిపారు.

1. ముమ్మిడివరం నియోజకవర్గం:
ఎంపీడీఓ కార్యాలయం, ఐ.పోలవరం
2. పి.గన్నవరం నియోజకవర్గం:
ఎంపీడీఓ కార్యాలయం, అయినవిల్లి.
3. మండపేట నియోజకవర్గం:
కంటిపూడి సీతారత్నం కల్యాణ మండపం, రాయవరం
4. రామచంద్రపురం నియోజకవర్గం:
ఎంపీడీఓ కార్యాలయం, కె.గంగవరం.
5. రాజోలు నియోజకవర్గం:
కరవాక గ్రామం, మామిడికుదురు మండలం.
6. కొత్తపేట నియోజకవర్గం:
ఎంపీడీఓ కార్యాలయం, కొత్తపేట
7. అమలాపురం నియోజకవర్గం:
శ్రీ పల్లా వెంకటరావు కొబ్బరి సంఘం, ఎర్ర వంతెన దగ్గర, RDO కార్యాలయం పక్కన. అమలాపురం.

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ పై

# వైసీపీ నిరసన



**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 18..** వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ కార్యక్రమం అనే పేరుతో కోటి సంతకాలు సేకరణ కపిలేశ్వరపురం మండలంలోని గ్రామాల్లో జరిగింది అందులో భాగంగా మంగళ వారం మండల కేంద్రం కపిలేశ్వరపురం గ్రామంలో గల వై ఎస్ ఆర్ విగ్రహం వద్ద వై సి పి శ్రేణులు ఆధ్వర్యంలో ప్రజలు నుండి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వలన వైద్య విద్య, వైద్యం సామాన్యులకు పెను భారం అవుతుందని జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల వైసీపీ అధ్యక్షుడు గూటం సత్య నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలి అనే సంకల్పం తో మాజీ సీఎం జగన్ 17కాలేజీలు నిర్మాణం చేపడితే , వివిధ దశలులో నిర్మాణం లో ఉన్న భవనాలను ఎన్ డి ఎ కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చెయ్యకుండా ప్రైవేటీకరణ చెయ్యడం ప్రజా వ్యతిరేక చర్యగా జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల వైసీపీ అధ్యక్షుడు గూటం సత్య నారాయణ లు అభివర్ణించారు. ఎన్ డి ఎ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ విరమించుకోవాలని లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెపుతారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన అధిక సంఖ్యలో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభితం ద్రాక్షారామం..

## అంగరంగ వైభవంగా 61 వ కార్తిక దీపారాధన మహోత్సవం

## భక్తి మనోరంజన కార్యక్రమాల సమాహారం - ద్రాక్షారామ కార్తీక దీపారాధన మహోత్సవం





**రామచంద్రపురం(మనసులో మాట) నవంబరు 18..** ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో కొలువైయున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి కార్తీక దీపారాధన మహోత్సవం మంగళవరాం అంగరంగ వైభవంగా జరిగింది. దీంతో ద్రాక్షారామం ఆద్మాత్మికతను సంతరించుకుంది. కార్తీక మాసం చివర మంగళవారం కావటంతో 61వ ప్రసన్నాంజనేయస్వామివారి కార్తీక దీపారాధన మహోత్సవం తిలకిచేందుకు అధిక సంఖ్యలో భక్తులు ద్రాక్షారామకు చేరుకున్నారు. బాలభక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏలూరి ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులంతా కలసి అంగరంగ వైభవంగా కార్తీక దీపారాధన కార్యక్రమాలు నిర్వహించేవారు. అనంతర కాలంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజంగా మార్పు చెంది కాలక్రమేణా దినదిన ప్రవర్ధమానమై ఆధునిక పోకడలను వంటబట్టించుకుని నేటి తరానికి అనువుగా పాతతరం రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, బాలనాగమ్మ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూనే, కొత్తతరానికి సినీ సంగీత విభావరి, డిజిటల్ భక్తి గీతాల ఆడియో తదితర కార్యక్రమాలతో నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా పేరున్న దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వంటి గాయకుల నుంచి వర్ధమాన సినీ గాయకులు, కోటి వంటి సినీ సంగీత దర్శకులు తదితరులను తీసుకుని వచ్చి కార్యక్రమాలను చేస్తూ అలరించారు. బాలభక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏలూరి ప్రసాదరావు 30 సంవత్సరాల పాటు అధ్యక్షుడిగా సేవలందించిన అనంతరం కర్రి భీమరాజు, వనుము సత్యం, కొమ్మిశెట్టి జనార్ధనరావు, కొమ్మిశెట్టి మామాజీ, దామిశెట్టి గంగాపురుషోత్తం, నున్న రామచంద్రరావులు అధ్యక్షులుగా సేవలందించారు. చివరిగా నున్న రామచంద్రరావు మృతి తరువాత కొందరు కమిటీగా ఏర్పడి కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు. గత ఏడాది బోనం శ్రీనివాసరావును అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఏలూరి ప్రసాదరావు తరువాత సుదీర్ఘ కాలం 20 సంవత్సరాల పాటు అధ్యక్షుడిగా సేవలందించిన దామిశెట్టి గంగాపురుషోత్తం కార్తీక దీపారాధన కార్యక్రమాలను మరింతగా విస్తరించారు. 1972, 1974, 2018 నుంచి 2024 వరకు ఆలయ ప్రాంగణంలో బాలభక్త సమాజం వారు స్వామివారి సప్తాహం కార్యక్రమాలను నిర్వహించారు. 1970 సంవత్సరం నుంచీ పెద్దిరెడ్డి సూరిబాబు తన స్వంత ఖర్చులతో బాణా సంచా కాలుస్తూ కార్తీక దీపారాధన కార్యక్రమానికి వన్నె తెస్తున్నారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాలుస్తూ అందరినీ సంభ్రమాశ్చరాలలో తేలుస్తున్నారు. అనేక మంది సాంస్కృతిక కార్యక్రమాల కంటే బాణాసంచా కాల్పు చూడడానికి ప్రత్యేకించి ప్రజలు వస్తారంటే అతిశయోక్తి కాదు. బాలభక్త సమాజం వ్యవస్థాపక సభ్యులైన బాలల్లో ఒకరైన అయినవిల్లి సత్యనారాయణ(అబ్బు) వాఖ్యానం బాణాసంచా కాల్పు తిలకించేవారిలో మరింత ఉత్సుకతను నింపేది. ఆహా సూరిబాబు, ఓహో సూరిబాబు అంటూ ఆయన వేసే కేకలు ఆయన చనిపోయినా నేటికీ ఇక్కడ నిర్వహించే మందు కాలుపు హోరులో కలసి విన్పిస్తున్నట్టుగా అనుభూతి నేటికీ కలుగుతుంటుంది. పెద్దిరెడ్డి సూరిబాబు మృతితో ఆయన అల్లుడు దవులూరి శ్రీను బాణాసంచాను నిర్వహిస్తున్నారు. ఇంటికో పువ్వు ఈశ్వరుడికో మాల అన్నట్లు ఎందరో ప్రత్యక్ష, గుప్త దాతల సహకారంతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ప్రతి ఏటా కార్తిక మాసం చివరి మంగళవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్తిక దీపారాధన మహోత్సవాలు 61 వ సంవత్సరం పురస్కరించుకుని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం జుత్తిక చిన్న బ్రహ్మత్వంలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకుని విశేష లక్ష తులసీ పూజ ప్రారంభించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మద్యాహ్నం రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవాన్ని ప్రారంభించగా గ్రామంలో స్వామివారి నగరోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అఖండ జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు. వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. శుభమ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి ఆహూతులను ఉర్రూతలూగించింది. దివంగత పెద్దిరెడ్డి సూరిబాబు అల్లుడు దవులూరి శ్రీను చే కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా మందు కాలుపులతో చిన్నారులు కేరింతలు కొట్టారు. అర్ధరాత్రి ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం, నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

# కుల రాజకీయాలు తగునా మంత్రి గారూ..

▸▸ పదవిని కాపాడు కోసం కులాన్ని తాకట్టు పెట్టడమా!

▸▸ కార్మిక మంత్రి సుభాష్ పై ఫైర్ అయ్యిన వైసీపీ సీఈసీ సభ్యుడు పితాని బాలకృష్ణ



**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 18:** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కొంకాపల్లిలో ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తిక వన సమారాధన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ సంఘ పెద్దలను దూషించి విమర్శలు చేయడాన్ని వైసీపీ సీ ఈ సీ సభ్యుడు పితాని బాలకృష్ణ ఖండించారు. బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మీరు గొప్పలు చెప్పుకోవడానికి నిర్వహించిన వన భోజనాలు తప్ప అమలాపురంలో నిర్వహించిన సమావేశానికి స్థానికంగా ఉన్న శెట్టిబలిజలు ఎవరు వచ్చారో చెప్పాలని నిలదీశారు. తన మంత్రి పదవి పోతుందన్న భయంతో బల ప్రదర్శన చేశారని దూర ప్రాంతాల నుండి బస్సుల మీద తరలించడం సిగ్గు చేటున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి ఎంతమంది శెట్టిబలిజ లు వచ్చారో అందరికీ తెలుసునని బాలకృష్ణ అన్నారు. మంత్రి సుభాష్ హుందాగా మాట్లాడడం నేర్చుకోవాలని వైసిపి నేత పితాని హితవు పలికారు. సంఘ పెద్దలపై విమర్శలు చేయడం ద్వారా తన పదవిని కాపాడు కోవాలనే మంత్రి తాపత్రయం అని ఆయన విమర్శించారు. నిస్వార్థంగా సంఘ ప్రగతికి కృషి చేయడం మానుకొని, తానే ఈ కులంలో యుగ పురుషుడిగా గొప్పలు చెప్పుకోవడం చూస్తుంటే ప్రజలలో నవ్వులు పాలు అవ్వడం తప్పదని హెచ్చరించారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ స్థాపించానని ఎస్ ఏ ఎఫ్ రిజిస్ట్రేషన్ చేయించానని చెప్పటం సరికాదని సంఘానికి గతంలో కోటి రూపాయలు డిపాజిట్ చేస్తానన్న మంత్రి ఎందుకు ఇప్పటివరకూ చేయలేదని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలు గడచినా ఎందుకు డబ్బు డిపాజిట్ చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో నష్ట పోయానని చెప్పడం సరికాదని అన్నారు. శెట్టిబలిజ కులస్తులు నిన్ను డబ్బులు ఇవ్వమని అడిగారా అని నిలదీశారు. 16వ తారీకు డిపాజిట్ చేస్తానని చెప్పిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. నువ్వు ఇస్తానాన్న మాటకు కట్టుబడి ఉండాలని హితవు పలికారు. శెట్టిబలిజ కులస్తులు, యువత గాని నిన్ను డబ్బు ఇవ్వమని అడిగారా అని నిలదీశారు. నేను కులాన్ని ఉద్ధరిస్తాను అని కులానికి.. యువతకు ఏదో చేసేస్తానని మాయ మాటలు వద్దని హితవు పలికారు. నిబద్ధత.. వుంటే సంఘానికి ఇస్తానన్న డబ్బు వెంటనే ఎస్ ఏ ఎఫ్ పేరు మీద డిపాజిట్ చెయ్యాలి లేదనుకుంటే కులానికి క్షమాపణ చెప్పి నేను అప్పుల పాలు అయిపోయాను నేను ఇవ్వలేను అని ప్రకటించాలని అన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి కులాన్ని.. కులంలో ఉన్న యువతని మోసం చేయొద్దని పితాని బాలకృష్ణ ఘాటుగా విమర్శలు చేశారు. మంత్రి పదవి కాపాడుకోవడం కోసమే బల ప్రదర్శన చేయాలని ప్రయత్నించి భంగపడ్డారని, చీప్ ట్రిక్స్ మానుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసం గల శెట్టి బలిజ కులం నిన్నుయాచించే స్థితిలో లేదని, నువ్వు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడమని ఆయన అన్నారు. అనవసర వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఎంతో మంది గొప్ప నేతలను చూసామని నువ్వు అందరికంటే చివరి వరుసలో ఉన్నావని అన్నారు నిన్ను నీ పార్టీలో ఒక్క ఎమ్మెల్యే గాని, మీ పార్టీ పెద్దలు గాని జిల్లాలో గౌరవించే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. మతిభ్రమించి మాట్లాడుతున్న తీరు చూస్తే అందరూ సిగ్గుపడుతున్నారని, మానుకోవాలని మంత్రివర్గంలో ఇప్పటివరకు కులానికి ఏం చేశారో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. అవినీతిలో కూరుకుపోయి, జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్రంలో దిగజారిన పరువును కాపాడుకునేందుకు మంత్రి సుభాష్ పడుతున్న తాపత్రయం అందరికీ నవ్వు తెప్పిస్తోందని బాల కృష్ణ అన్నారు. ఇకనైనా ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని అనవసర వివాదాలు లేపొద్దని అన్నారు. అలా చేస్తే దానికి బదులుగా సమాధానం ఇస్తామని వైసిపి నేత పితాని బాలకృష్ణ హెచ్చరించారు.

# చేతివృత్తులు ఆధారంగా అభివృద్ధి సాధించాలి - ఎస్ నీలోఫర్




**పల్నాడు, నవంబర్ 18,(మనసులో మాట)..** నిరుద్యోగులుగా ఉన్నటువంటి యువతీ యువకులు చేతివృత్తులు ఆధారంగా అభివృద్ధిని సాధించవచ్చు నని ఆర్ శె టి పల్నాడు జిల్లా డైరెక్టర్ ఎస్ నీలోఫర్ అన్నారు. మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలో బరంపేట లో ఉన్న షాది ఖానా సమావేశమందిరం లో యువతకు ఉపాధి ఉద్యోగ నైపుణ్యాభివృద్ధి పై అవగాహన సదస్సుజరిగింది ఈ కార్యక్రమానికి డిబిఆర్సి పల్నాడు, గుంటూరు జిల్లాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతవహించారు నీలోఫర్ మాట్లాడుతూ నిరుద్యోగులు గా ఉన్న యువకులు కంప్యూటర్ నెట్ వర్కింగ్ డెస్క్ టాప్ పబ్లిషింగ్ ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ సెల్ఫోన్ రిపేర్ హౌస్ వైరింగ్ 20 రకాల చేతువృత్తులు ఆధారంగా ఆదాయం పొందటానికి అవకాశం ఉందని ఈ 20 రకాల కోర్సులను యూనియన్ బ్యాంక్ ద్వారా కోర్సును బట్టి 30 రోజులు 45 రోజులు 15 రోజులు పది రోజులు కోర్సులకు ప్రభుత్వం తరఫున భోజనం ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఆధారంగా బ్యాంకు రుణాలను పొందటానికి అవకాశాలు ఉన్నాయి దీనిని సద్వినియోగం చేసుకోవాలని నీలోఫర్ అన్నారు. పల్నాడు జిల్లా మెప్మా డిపిఎం వీరస్వామి మాట్లాడుతూ యువకులు చదువుకొని ఖాళీగా ఉండకుండా జాబ్ మేళా ఈనెల 25 తేదీన నరసరావుపేట లో ఏర్పాటు చేయటం జరుగుతుందని ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు మీరు మీ సర్టిఫికెట్లు ఆధారంగా ఇంటర్వ్యూకి రావాలని తద్వారా వివిధ రకాల కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందటానికి వీలుంటుందని వారు యువతీ యువకులకు అవగాహన కల్పించారు. పల్నాడు జిల్లా డిఆర్డిఏ ఏపీఎం భరత్ మాట్లాడుతూ చదువుకున్నవారు మధ్యలో చదువు ఆపి వివాహం చేసుకున్న మహిళలు డీఆర్డీఏ ద్వారా ఉన్నతి పథకం ద్వారా చిరు వ్యాపారాలు చేసుకోవడానికి వడ్డీ లేని రుణాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని మీరందరూ చిరు వ్యాపారాలు చేసుకునే దిశగా ఆలోచనని పెంపొందింప చేసుకోవాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్స్ తోకల సాంబయ్య , గడ్డి పర్తి కోటిరత్నం పల్నాడు జిల్లా లో వివిధ ప్రాంతాల నుండి యువతీ యువకులు నిరుద్యోగులు పాల్గొన్నారు.




# ఇంటి పన్నుల చెల్లింపులో ప్రజాప్రతినిధుల సహకారం అవసరం

## గ్రామ అభివృద్ధికి సహకరించండి - మండల అభివృద్ధి అధికారి సెలెట్ రాజ్

**గొల్లప్రోలు (మనసులో మాట) నవంబరు 18:** గొల్లప్రోలు మండల పరిధి వన్నెపూడి గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లపై అవగాహన కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి సెలెట్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు. మండల అభివృద్ధి అధికారి సెలెట్ రాజ్ మాట్లాడుతూ...ప్రజలకు పన్నుల ప్రాముఖ్యతను తెలియజేయడంలో ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని సూచించారు.గ్రామ అభివృద్ధిలో ఇంటి పన్నుల కీలక పాత్ర అని రాజకీయ పార్టీ నాయకులకు వివరించారు. గ్రామ ప్రజలు తమ పన్నులను సమయానికి చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమలో నిర్వహించిన జాబ్ మేళాలో 36 మంది ఎంపిక : జేసీ టీ నిషాంతి



**అమలాపురం( మనసులు మాట) నవంబరు 18:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందించే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ప్రైవేట్ రంగ సంస్థలతో అనుసంధానాన్ని మరింతగా బలోపేతం చేస్తున్నదని ఈ క్రమంలో ప్రసిద్ధ ఆభరణాల సంస్థ జోయాలూకాస్ జ్యువెలరీ కోసం జిల్లా కలెక్టరేట్ వికాస కార్యాలయంలో మంగళవారం భారీ స్థాయి ఉద్యోగ మేళా నిర్వహించబడిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. మొత్తం 267 మంది అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరవ్వగా, వారిలో 36 మంది అభ్యర్థులు ఎంపికయ్యారన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి యువత అధిక సంఖ్యలో ఇంటర్వ్యూలలో ఉత్సాహంగా పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాలు, అవకాశాలు, మార్గదర్శకతను ఒకే వేదికపై అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం చురుకైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, మార్గదర్శక శిబిరాలు, ఉద్యోగ మేళాల ద్వారా ఇప్పటికే అనేక మంది యువత ఉపాధి పొందుతున్నట్లు వివరించారు. త్వరలో మరిన్ని ప్రముఖ ప్రైవేట్ సంస్థలను జిల్లాలో జరిగే జాబ్ మేళాలకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. వికాస శాఖ చేసిన కృషిని ఆమె అభినందిస్తూ, నిరుద్యోగ యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్థిరమైన ఉపాధిని సంపాదించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె మాధవి వికాస సంచాలకులు కె. లచ్చా రావు, జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్, హెచ్ఆర్ బృందం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# వైసీపీ కోటి సంతకాల సేకరణ

### తోట రాంజీ



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 18 :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాంజీ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన గోకవరం, రంపయర్రంపాలెం గ్రామంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసిస్తూ కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట రాంజీ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామలలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట రాంజీ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల ప్రజానీకానికి వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేసే ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటుకరణను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. సంక్షేమ రంగాల బాధ్యత ప్రభుత్వలదే అన్నారు. పేదలకు వైద్యాన్ని వైద్య విద్యను దూరం చేసే విధానాలను మానుకోవాలని హెచ్చరించారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, పాటి రాంబాబు, నారాలశెట్టి శివ, తోట్ట సత్యనారాయణ, దాకారపు ధర్మరాజు, అంబటి అబ్రహం, అబ్బులు, నున్నం రాంబాబు, కర్రి సూరారెడ్డి, రాజా, మడికి మైనరబాబు, బిజ్జి రాజు, పాటి అప్పలరాజు, పాటి వెంకటరావు, జలెం రాము, బాడితబోయిన చిన్న, బొర్రా శేఖర్, నందూరి బుజ్జి, వీర్ల వెంకటేశ్వరరావు, అచ్చిబాబు, శివాజీ, అర్జునరావు, నాగేశ్వరరావు, షేక్ వల్లి, శ్రీను, రత్నరాజు, శుభకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# గీతాలాపనతో దేశభక్తిని చాటిన చిన్నారులు

**పిఠాపురం, ( మనసులో మాట), నవంబరు 18:** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పిఠాపురం శాఖ గ్రంథాలయంలో దేశభక్తి గీతాలు పోటీలు ఉత్సాహంగా జరిగాయి.పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. దేశభక్తి గేయాలను ఆలపించి ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆర్ ఆర్ బి హెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సంస్కృత అధ్యాపకులు బి.రామచంద్రరావు ప్రముఖ సంగీత ఉపాధ్యాయులు డాక్టర్ ఎస్ చక్రవర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. దేశం పట్ల ప్రేమ,విధేయత లు కలిగి ఉండాలన్నారు. దేశం కోసం పాటుపడే విధంగా ఉండాలన్నారు.అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంలో పుట్టినందుకు గర్వపడాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్ వెంకట రాము, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల దేశభక్తి గీతాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీలు నిర్వహణ విద్యార్థుల్లో దేశభక్తిని జాతీయ స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడింది.

# నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహణ



**జగ్గంపేట (మనసులోమాట) నవంబర్ 18..** జగంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు హాజరై పేదలకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే డొక్కా సీతమ్మను పవన్ కళ్యాణ్ ఆదర్శంగా తీసుకుంటే నియోజకవర్గ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పవన్ కళ్యాణ్ ను స్ఫూర్తిగా తీసుకుని తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు.ఈరోజు డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు,కురుమల్లనాగేశ్వరావు,సత్తి సోమరాజు,గంధం శ్రీను, అంకం ఓంకృష్ణ, మెడిబోయిన గంగ,జీవీ నాయుడు,బలిరెడ్డి గణేష్,కృష్ణాపురం వెంకటరమణ,కుంచె రాజు, పుర్రె గంగబాబు, గోకూడ పండు,స్వామి, డ్రిల్ల్ మాస్టారు,బొందల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# హెల్పింగ్ యూత్ సభ్యులు ఆర్థిక చేయూత




**ఏలేశ్వరం( మనసులో మాట )నవంబర్ 18..** ఏలేశ్వరం దిబ్బలపాలెం చెందిన పంతం సత్యనారాయణ అనే వృద్ధునికి హెల్పింగ్ యూత్ సభ్యులు మంగళవారం ఆర్థిక చేయుత అందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ యూత్ సభ్యులు మద్దుల స్వరూప్ ఎస్ కే అలీషా మీడియాతో మాట్లాడుతూ పంతం సత్యనారాయణ ఆయన తల్లి చాలా కాలం నుంచి అనారోగ్యానికి గురై చాలా దీన స్థితిలో ఉండడం తెలుసుకుని హెల్పింగ్ యూత్ ద్వారా రైస్ కూరగాయలు పండ్లు 1000 రూపాయల నగదు అందజేయడం జరిగిందని వారన్నారు.అంతేకాకుండా ప్రభుత్వం పింఛను గాని రేషన్ గాని రావడం లేదని దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి సత్యనారాయణకు ఆర్థిక సహాయం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హెల్పింగ్ యూత్ సభ్యులు రామ్ లాల్ ఎస్కే అలీ మద్దుల స్వరూప్ పర్వత శివఎస్కే అలీషా లు పాల్గొన్నారు.




# నిర్లక్ష్యం తో తప్పదు ముప్పు

## మళ్లీ యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

### యథావిధిగా అమ్మకాలు, దృష్టి సారించని కమిషనర్ - షాపుల వద్ద మళ్లీ మామూలే, అనారోగ్యమన్నా మారని తీరు



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 18:** ప్లాస్టిక్ పై ప్రభుత్వ యంత్రాంగం చేసిన పోరాటం పట్టు వది లేసింది. ఎందుకనో అలసత్వంలోకి జారుకొంది. గత కొంత కాలం గా వ్యర్థాలు ప్లాస్టిక్ వాడకం ఎక్కువ ఐయింది. కలెక్టర్ జోక్యం స్వయంగా తనిఖీలకు వెళ్లిన రోజులున్నాయి. కాకినాడ నగరం లో సింగిల్ యూ జ్ ప్లాస్టిక్ వాడకంపై ఉన్న నిషేధాన్ని నాటి కలెక్టర్ పక్కాగా అమలు చేశారు. తరువాత మండలాలు, గ్రామాలకు విస్తరింపజేస్తామని చెప్పుకొచ్చారు. చిన్న దుకా ణాల నుంచి పెద్ద సముదాయాల వరకూ ఎక్కడా నిషేదిత ప్లాస్టిక్ కనబడకుండా ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్క కాకినాడ కార్పొరేషన్ పరిధిలోనే రోజూ50కి పైగా కేసులు రాసి జరిమానాలు వసూలు చేయడం జరిగేది ఏడాదిలో ఏకంగా రూ.10 లక్షల వరకూ జరిమానాలు వసూలు చేశారు. అయితే ఆ ఉన్నతాధికారులు బదిలీపై వెళ్లడంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్కి మళ్లీ రెక్కలొచ్చేశాయి. దుకా ణదారులు జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు.

**ప్లాస్టిక్ను మరిచారా?**

కలెక్టర్ గా సగలి శాన్మోహన్, కార్పొరేషన్ కమిషనర్ సుధాకర్ ఉన్నారు వాళ్లు వచ్చీ రావడంతోనే క్షేత్రస్థాయి పరిశీలనలు చేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ ప్లాస్టిక్పై మాత్రం ఇప్పటి వరకూ దృష్టి సారించనట్టే కనబడుతోంది. దీంతో కిందిస్థాయి ఉద్యోగులు చతికిలపడ్డారు. కానీ జరిమానాల పేరుతో వసూళ్లు మాత్రం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాస్టిక్ నిషేధం పై యుద్ధం చేసే రోజుల్లో దుకాణదారులు పాలిథీన్ చేతి కవరు ఇవ్వడానికి తలపటాయించే వాళ్లు. కానీ ఇప్పుడు మళ్లీ పాత రోజులు వచ్చేశాయి. సింగిల్ యూ జ్ ప్లాస్టిక్ ఎక్కడపడితే అక్కడ కనబడుతోంది. కాకినాడ పెద్ద మార్కెట్లో వందలాది దుకాణాలు ఉన్నాయి. ఈ మార్కెట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తుంది దీంతో కార్పొరేషన్ అధికారులు 2 టన్నుల నిషేధిక ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు. ఇప్పుడు మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. ఇందుకు కారణం కేవలం అధికారులు నిర్లక్షమనే ప్రజలు అంటున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని వినియోగించడం వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్కు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృ తులు, రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు. హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం... ఇలా రకరకాల రుగ్మతల బారిన పడతారని సర్వేలు చెవిలో పోరు పెడుతూనే ఉన్నాయి. జిల్లాలో రోజుకు సగటున 50 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి.. వాటిలో కనీసం 10టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయనేది చేదు నిజం. వీటిలో అధిక శాతం సింగిల్ యూజ్ (ఒకసారి వాడి పారేసేవి), పాలిథీన్, ఆహార పదార్థాల ప్యాకిం గ్ కవర్లు ఉంటున్నాయనే విషయం డ్రెయి నేజీలు చూస్తే స్పష్టమవుతుంది. ఈ తరహా వాటిపై నిషేధం ఉంది. దీని అమలులో కొరవ డిన చిత్తశుద్ధి ఉన్నతాధికారుల చొరవతో కొరడా ఝుళిపించింది. మళ్లీ ఇప్పుడు చల్లారిపోయింది. దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు. కవర్లు ఉంటున్నాయి. అసలు అవి విక్రయించే దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది. ఆయా దుకాణాలపై అధికారు లు దాడులు ఎందుకు చేయరనేది ప్రశ్నార్థకరమే.

## కుమారుని పార్థివ శరీరాన్ని

# కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేసిన తల్లి

### పార్థివ శరీర దానం వైద్య విద్యార్థుల శిక్షణకు - వెలకట్టలేని కానుక - కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు

**అమలాపురం (మనసులో మాట) నవంబరు 18:** విధిరాతను ఎవరు తప్పించలేరనేది నగ్న సత్యం తన తల్లి మరణాంతరం తన పార్థివ దేహాన్ని కిమ్స్ వైద్య కళాశాలకు ఇవ్వాలని తన కొడుకుతో ఆ తల్లి చెప్పిన మాటలు అయితే 45 సంవత్సరాల వయసుగల తన కుమారుడే మరణించడంతో అదే కిమ్స్ వైద్య కళాశాలకు తన కొడుకు పార్థివ దేహాన్ని ఇచ్చిన తల్లి. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం అయినవిల్లి లంక కు చెందిన 80 సంవత్సరాల వయస్సు గల చిట్టూరి సీతా రత్నం తన మరణానంతరం తన పార్థివ శరీరాన్ని కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేయమని తన కుమారుని కోరారు. దురదృష్ట వశాత్తూ ఆమె 45 సంవత్సరాల కొడుకు చిట్టూరి అచ్యుత రామన్న చౌదరి (గోపి) నవంబర్ 5 వ తేదీన మరణించారు. ఆ తల్లి తన కుమారుని పార్థివ శరీరాన్ని కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేశారు. “జీవితకాలంలో వైద్యులు నా కొడుకుకు సేవ చేశారు. మరణానంతరం అతను వైద్య విద్యకు సేవ చేయాలి. అది అతని ఆత్మకు శాంతిని అందిస్తుంది,” అని ఆమె చెప్పిన మాటలు



శ్రీమతి చిట్టూరి సీతారత్నం గారు (తల్లి)

కిమ్స్ డీన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న బంధువులు

వినువారిని కదిలించాయి. “భవిష్యత్ వైద్యులకు అవసరమైన అనుభవాన్ని ఇవ్వడం, వారికి మానవ శరీర నిర్మాణంపై నిజమైన అవగాహన కల్పించడయిఅది ఆమె దృష్టిలో అతని జీవితానికి ఇచ్చే అత్యుత్తమ అర్థం. మరణం తర్వాత కూడా సమాజానికి ఉపయోగపడే పార్థివ శరీర దానం ద్వారా ఆమె ఒక శాశ్వత సేవకు రూపం ఇచ్చారు” అని కిమ్స్ అనాటమీ విభాగాధిపతి డా. బి. నారాయణ రావు అన్నారు .

ఆ గొప్ప తల్లి చూపిన అపారమైన మానవతా భావాన్ని కిమ్స్ మెడికల్ కాలేజ్ డీన్ భావోద్వేగంతో ప్రశంసించారు. “ఇలాంటి తల్లులు సమాజానికి మార్గదర్శకులు. ఆమె చేసిన శరీరదానం భవిష్యత్ తరాల వైద్యులకు వెలకట్టలేని కానుక,” అని ఆయన అన్నారు. ఈ నిర్ణయం మరెందరికో శరీరదానం అనే మహత్తర సేవ వైపు ప్రేరణగా నిలుస్తుందని కూడా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె సేవలను గుర్తిస్తూ ఆమె బంధువులు కోడూరి లక్ష్మణ రావు మరియు చిట్టూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (చౌదరి) లకు ప్రశంసా పత్రము అందచేశారు.

మానవతా మాధుర్యంతో మెరిసే ఆ తల్లి చేసిన త్యాగం, సమాజానికి చూపిన ప్రేమ, భవిష్యత్తు వైద్యుల శిక్షణ కోసం ఆమె చేసిన ఈ అమూల్యమైన సహకారంయఅనిర్వచనీయమని, అత్యంత మహత్తరమైనదని కిమ్స్ చైర్మన్ కె.వి.వి.సత్యనారాయణ రాజు ఎం.డి. రవి కిరణ్ వర్మ ప్రశంసించారు.

# పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి


### ఇంచార్జ్ కమిషనర్ సుధాకర్ వెల్లడి



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 18:** కాకినాడ నగరంలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ జాబితా కార్యక్రమాలను సజావుగా నిర్వహించడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల పూర్తి సహకారం అవసరమని నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ మరియు నగర ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేటీ సుధాకర్ అన్నారు.మంగళవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన అర్బన్ తహసిల్దార్ జితేంద్ర తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటర్ జాబితా సవరణ, ఫారమ్-6, 7, 8 పరిష్కారం, కొత్త ఓటర్ల నమోదు, పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలపై వివరాలు అందించారు. రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి అవసరమైన వివరాలను త్వరితగతిన సమర్పించాలని కోరారు.సమావేశంలో కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వివిఎస్ కృష్ణకుమారి, ఇంచార్జ్ ఏఎస్డబ్ల్యూఓ కే. రాధ, డిసిపి కె.వి. కృష్ణారావు, ఏసీపీ ఎ. శ్రీధర్ మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తుమ్మల రమేష్ (టిడిపి), రావూరి వెంకటేశ్వరరావు (వైస్ఆర్‌సిపి), ఈవీవీ సత్యన్నారాయణ (జనసేన), సబ్బారపు అప్పారావు (బిఎస్పి), పి. శ్రీనివాసు (ఐఎన్సీ), తోకల వరదరాజు నంబి (ఆప్) పాల్గొన్నారు.

# నాయకురాలికి అరుదైన గౌరవం

### చల్లా లక్ష్మి కి జనసేన కార్యకర్తల సత్కారం



**పిఠాపురం, (మనసులో మాట నవంబరు) 18..** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబడతానని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మీ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు చల్లా లక్ష్మి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ తనకు అప్పగించిన ఈ పదవి వల్ల బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పిఠాపురం శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం సహకారంతో కాపు కుల అభ్యున్నతికి పాటుపడతానన్నారు. కాపులు పురోగతి కోసం ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బాలిపల్లి రాంబాబు,కొత్తపల్లి వీర వెంకట సత్యనారాయణ (బుజ్జి), రెడ్డెం జనార్ధన్, జ్యోతుల సతీష్, జవ్వాది జోగేశ్వరరావు, కర్రెడ్ల పద్మరాజు, కుంపట్ల చల్లారావు, కర్రీ దుర్గాప్రసాద్, మఠం లోవరాజు, వుటా రామకృష్ణ, అరిగెల ప్రసాదు, దంగేటి ఆదినారాయణ, పాలిక ప్రవీణ్ కుమార్, వేల్పుల చక్రధర్ రావు బండి రవి,దొడ్డి కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.




### విద్య, పరిశోధనలో ప్రభుత్వ కళాశాల

# అభివృద్ధి ప్రశంసనీయం

- స్టార్టప్స్ నుంచి నానోటెక్ వరకు.. గవర్నమెంట్ కాలేజ్ పురోగతిని అభినందనీయం
- రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలో భాగంగా గవర్నమెంట్ కాలేజ్‌లో అకడమిక్ పురోగతిపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం స్థానిక ప్రభుత్వ కళాశాల (ఆటానమస్)ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కళాశాల అకడమిక్ ప్రగతి, పరిశోధనా వాతావరణం, విద్యార్థుల వినూత్న ఆలోచనలకు అనుకూలంగా ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను సమీక్షించి, కళాశాల చేస్తున్న కృషిని ప్రశంసించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ప్రారంభ ద్వారం, ఇంక్యూబేషన్, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్షిప్ బ్లాక్‌ను సందర్శించి విద్యార్థులు అభివృద్ధి చేసిన ప్రాజెక్టులు, స్టార్టప్ ఆలోచనలు, ఇన్నోవేటివ్ నమూనాలను పరిశీలించారు. అనంతరం అరకు కాఫీ హబ్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రాసెసింగ్, బ్రూయింగ్ విధానాలను ఆరా తీసి ప్రశంసించారు. స్కానర్ ద్వారా చెల్లింపు చేశారు. అటు తరువాత డాక్టర్ సీవీ రామన్ అంతర్జాతీయ పరిశోధన కేంద్రం, నానోటెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబ్‌లను పరిశీలించి జరుగుతున్న ప్రయోగాలు, పరిశోధన కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపస్‌లోని లైబ్రరీని సందర్శించిన కలెక్టర్ మార్క్స్, డార్విన్, న్యూటన్ పుస్తకాలు సేకరణలు ఆనందాన్ని, ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఇక్కడ సమయం గడపడం చాలా సంతోషంగా ఉందని అక్కడ సందర్శకుల పుస్తకం లో కలెక్టర్ తన అభిప్రాయాన్ని రాశారు. సంరక్షించబడి ఉన్న పాత, విలువైన పుస్తకాలను దగ్గరగా పరిశీలించి, వాటిని మరింత ప్రమాణాలతో పరిరక్షిస్తున్న విధానాన్ని అభినందించారు. విద్యార్థుల అధ్యయనం, పరిశోధన, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తూ కళాశాల చేస్తున్న ప్రయత్నాలు అత్యంత ప్రశంసనీయం అన్నారు. కలెక్టర్ వెంట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు, ఎన్ఆర్సీ కో ఆర్డినేటర్ డాక్టర్ సంజీవ్, ఎన్.సి.సి కోఆర్డినేటర్ డాక్టర్ యూసుఫ్ బాషా, ఇక్వా కోఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వరి, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ రవితేజ , పీఆర్వో డాక్టర్ జల్ల సురేష్, అన్ని విభాగాల హెడ్ లు, ఇతర కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వన సమారాధనలు



**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 18..** పవిత్ర కార్తీక మాసం ఇక రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో మండలం లోని ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రాలు భక్తులతో కిట కిట లాడాయి. కార్తీక వన సమారాధన కార్యక్రమంలు కపిలేశ్వరపురం మండలంలోని అంగర గ్రామంలో విరివిగా జరిగాయి. అంగర గ్రామంలో కొలువైన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద, వెదురుమూడి కాలువ గట్టు పై గల విజయనగరం ఆర్ టి సీ జోన్ పూర్వపు ఛైర్మెన్, మాజీ ఎంపీపీ నెక్కంటి బాలకృష్ణ పంట పొలం గట్టు చావిడి వద్ద మంగళవారం కార్తీక వన భోజనాల ఏర్పాట్లు చేశారు. నెక్కంటి బాలకృష్ణ నిర్వహించిన కార్తీక మాస వాన సమారాధనకు ఆయన కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు,అభిమానులు, అయ్యప్ప మాలధారులు,అధిక సంఖ్యలో తరలి వచ్చి అన్నసమారాధన లో పాల్గొన్నారు. ముందుగా మహిళలు జమ్మి చెట్టు వద్ద శ్రీ లక్ష్మి నారాయణ పూజ, కేదారేశ్వర పూజలు సాంప్రదాయకంగా పురోహితులు చేశారు. వేద పండితులు భక్తి ప్రవచనాలు నెక్కంటి బాలకృష్ణ కుటుంబ సభ్యులు భక్తి ప్రవత్తులు తో ఆలకించారు.నెలటూరు, కపిలేశ్వరపురం, వల్లూరు, కోరుమిల్లి గ్రామాల్లో భక్తులు ఆలయాలను దర్శించి పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం లింగాకారం లో దీపాలు వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రజా దర్బార్

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం (మనసులో మాట) నవంబర్ 18..** ప్రజా సమస్యలు పరిష్కారం లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం కూటమి పార్టీ నాయకుడు వాసంశెట్టి సత్యం, పట్టణ టీడీపీ అధ్యక్షుడుఉండవిల్లి శివ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్ లో పలు గ్రామాలకు చెందిన వారు పాల్గొని మంత్రి సుభాష్ కు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతీ అర్జీని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. తాను అందుబాటులో లేని సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ఏఎంసి వైస్ చైర్మన్ దడాల నాగార్జున, కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, కూటమి పార్టీ కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.



## వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులకు సత్కారం

**తాళ్ళరేవు (మనసులో మాట), నవంబరు 18:** వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన పలువురిని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కోఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఘనంగా సత్కరించారు. మండల కేంద్రమైన తాళ్ళరేవు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పిల్లి మణికంఠ, నీలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రెడ్డి సతీష్, కోరంగి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సంగాడి శ్రీనివాసరావులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిని పొన్నాడ దుస్సాలవాతో ఘనంగా సత్కరించి అభినందించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈసీ సభ్యుడు పితాని బాలకృష్ణ, జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్, కొపనాతి నాగరాజు రేవు మల్లేశ్వరి నాయకులు పాల్గొన్నారు.

## నేడు రైతులు ఖాతాల్లోకి పీఎం కిసాన్..

### అంబేద్కర్ భవన్ నుంచి వర్చువల్ సభకు ఏర్పాట్లు పూర్తి

**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 18:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా రైతులకి అందించే 7,000 నగదు ఈరోజు విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈరోజు పిఠాపురం అంబేద్కర్ భవన్ నందు వర్చువల్ సమావేశం ఏర్పాటు చేయబడుతుందని పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రైతులు జనసేన శ్రేణులు విచ్చేయాలని పిఠాపురం నియోజకవర్గ అయిదుగురు సభ్యులు కమిటీ తరపున ఆహ్వానిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## పిల్లంకలో వైభవంగా లక్షపత్రి పూజ మహోత్సవం



**తాళ్లరేవు (మనసులో మాట), నవంబరు 18:** మండల పరిధిలోని పిల్లంక, బ్రహ్మపురి గ్రామాల నడుమ వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయములో కార్తీక మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వర శర్మ (కాశిబాబు) పర్యవేక్షణలో పరిసర గ్రామస్తుల సహకారంతో స్వామివారికి ఉదయం విగ్నేశ్వర పూజ రుత్విక్ వరుణలు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, 11 ఆవృత్తులకు 11 రకాల ఫలాలుతో నివేదన చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. లక్ష పత్రీ పూజ, కుంకుమపూజ, మహానివేదన తరువాత నిరాజన మంత్రపుష్పములు, చతుర్వేద పారాయణ వేద పండితులచే మహాదాశీర్వాదం పండిత సత్కారం నిర్వహించారు. ఈ పూజలలో పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చుని ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తిశ్రద్ధలతో పరమశివుడికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, రెండు గ్రామాల ప్రజలు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్

# అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం




**ఏలూరు, నవంబర్, 18 (మనసులో మాట)..** జిల్లాలో మంజూరైన పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయవలసిందేనని, పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై తీవ్రమైన చర్యలు ఉంటాయని ఏలూరు పార్లమెంట్ సభ్యులు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ పుట్టా మహేష్ కుమార్ అధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో శాసనసభ్యులు బడేటి రాధాక్రిష్నయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులు, జాతీయ రహదారులు, జిల్లా రహదారులు, పరిశ్రమల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్.ఆర్.) నిధులు, రైల్వే ఓవర్ బ్రిడ్జి ల పనులు, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సేవలు, తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఉందన్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించేదిలేదన్నారు. జిల్లాలో రోడ్ల పరిస్థితిపై ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో రహదారులన్నీ ప్రయాణానికి అనువుగా ఉండాలని , అందుకు అనుగుణంగా జాతీయ రహదారులు, ఆర్. అండ్ బి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గుంతలు పూడ్చి మరమ్మత్తులు చేసారని, వాటికి వెంటనే మరమ్మత్తులు వచ్చాయన్నారు. కైకలూరు-భీమవరం, కైకలూరు-గుడివాడ రోడ్ల పనులకు సంబంధించి కాంట్రాక్టు సమయం పూర్తిఅయినప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఆర్ అండ్ బి అధికారులను ఎంపీ వివరణ అడిగారు. పనులు పూర్తిచేసేందుకు మరో 6 నెలల గడువు పొడిగించి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేసారు. ఈ విషయంపై ఎంపీ స్పందిస్తూ 6 నెలలలో తప్పనిసరిగా పనులు పూర్తిచేయించాలని, లేనిపక్షంలో కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ చేసి, చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రహదారులు,భవనాల శాఖ ద్వారా చేపట్టాల్సిన పనులు మొత్తం ఒకేసారి సర్వే చేసి గుర్తించి, ఒకే ప్రతిపాదనగా తయారుచేయాలన్నారు. ఏలూరు జంగారెడ్డిగూడెం రహదారి పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన 12 రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను వెంటనే పూర్తిచేసి, 2026, మార్చి నెల నుండి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధులు ద్వారా మంజూరై చేపట్టిన పనులు జనవరి నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 62 పెద్దతరహా పరిశ్రమలు ఉన్నాయని, వాటి టర్నోవర్ ను తక్కువగా చూపిస్తున్నాయన్నారు. వాటి జీఎస్టీ రిటర్న్ ను అనుసరించి వాటి టర్నోవర్ ను నిర్ణయించి అందుకు తగిన విధంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు సేకరించి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక సదుపాయాలు, సమస్యల పరిష్కారానికి ఖర్చు చేయాలనీ, ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేయనున్నట్లు ఎంపీ చెప్పారు. జిల్లాలోని కొల్లేరు అభయారణ్యం ప్రాంతంలో ప్రజల ప్రాథమిక అవసరాల కల్పనకు అటవీ శాఖ అధికారులు ఆటంకం కలిగిస్తున్నారని, ఇది మంచి పద్దతి కాదన్నారు. అటవీ శాఖ అధికారులు త్రాగునీరు, రోడ్లు, వరి సాంప్రదాయ సాగుకు కూడా ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ప్రస్తుతం 'దిశ' సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తరవాత సమావేశం నాటికి నూరుశాతం పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది పనితీరుపై విచారణ చేస్తానని ఎంపీ తెలిపారు.ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిరుపేద రోగులకు సరైన వైద్య సేవలు లభించడం లేదని, వైద్యులు, సిబ్బందిలో అలసత్వం, జవాబుదారీతనం లేకపోవడం కనిపిస్తున్నదన్నారు. రోగులకు మందులు ఇచ్చినట్లు కేస్ షీట్ల లో నమోదు చేస్తున్నారని, కానీ ఇవ్వడం లేదని తనకు ఎన్నో ఫిర్యాదులు అందాయని, రోగులకు సేవలు, మందుల వినియోగంపై సవివరమైన విచారణ చేయించి, నివేదికననుసరించి సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని ఎంపీ హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు మార్కెట్ యార్డ్ వద్ద ఆర్ ఓ బి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సీతంపేట ఆర్ ఓ బి కారణంగా దేవాలయం, కొందరి గృహాలకు ఇబ్బంది ఉన్నదని , ఆర్ ఓ బీ అలైన్మెంట్ మార్చాల్సిందిగా కోరారు. గుండుగొలను - హనుమాన్ జంక్షన్ మధ్య జాతీయ రహదారిలో కొన్ని రోడ్డు నిర్మాణంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించని కారణంగా వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని సరిచేయాలన్నారు.

చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి ప్రజల సేవలపై ప్రజల ఫిర్యాదులు నమోదుకు ప్రత్యేక యాప్ రూపొందించామని, చింతలపూడి నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. యాప్ లో ప్రజల ఫిర్యాదులను నిర్ధారించుకుని వైద్య సిబ్బందిలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకుచర్యలు తీసుకుంటున్నామన్నారు.

అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలోని రైతులు సంప్రదాయరీతిలో వరి సాగుచేసుకునేందుకు అటవీ శాఖాధికారులు అవకాశం కల్పించాలన్నారు. ప్రాథమిక సహకార సంఘాలు బకాయిలు చెల్లించాల్సిందేనన్నారు. సొసైటీలు తిరిగి రైతులు సేవలందించేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి లో నశ ముక్త భరత్ అభిమాన్ ప్రోగ్రాం





**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 18..** కేంద్రప్రభుత్వం వారిచే నిర్వహించ బడుచున్న నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వినియోగం వలన దుష్ప్రభావాలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు ది.18.11.2025వ తేదిన జె ఎన్ టీ యూ విశ్వ విద్యాలయం నందు గల అలుమ్ని ఆడిటోరియం నందు నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి 5 సంవత్సరాలు పూర్తి ఆయన సందర్భంగా జాతీయ స్థాయిలో గురునానక్ యూనివర్సిటీ అమృత్ సర్ పంజాబ్ రాష్ట్రము నందు నిర్వహించిన కార్యక్రమమునకు జాతీయ స్థాయిలో నశ ముక్త భారత్ అభియాన్ ప్రోగ్రమ్మే నిర్వహించాబడుచున్న అన్ని జిల్లా యంత్రాగం పాల్గొన వలసినదిగా ఇచ్చిన అదేశముల మేరకు మంగళవారం జరిగిన కార్యక్రమములో జె ఎన్ టీ యూ విద్యార్థులు గవర్నమెంట్ ఐ టీ ఐ కళాశాల విద్యార్థులు ఉన్నత అధికారులు పాల్గొని ముందుగా ర్యాలిలో నిర్వహించారు సదరు ర్యాలీని ఉద్దేశించి సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతుల హిజ్రాల వయోవృద్ధుల సంక్షేమ శాఖ కాకినాడ జిల్లా ఎ.వై.శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరముగా ఉంటూ భావి భారత భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తదుపరి విద్యార్థిని విద్యార్థులతో ఎస్. శ్రీనివాస్ అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ కాకినాడ ఎవై. శ్రీనివాస్ సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతుల హిజ్రాల వయో వృద్ధుల సంక్షేమ శాఖ కాకినాడ వారు మత్తు పదార్థాల వినియోగం పై ప్రతిజ్ఞ చేయించి వారి చేత ఆన్ లైన్ ద్వారా వారి వారి మొబైల్ ద్వారా ఈ-ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. తదుపరి కేంద్రప్రభుత్వం వారు నిర్వహించిన వర్చ్యువల్ సమావేసము నందు కార్యక్రమకునకు హాజరైన అధితులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనుట జరిగినది.

ఈ కార్యక్రమానికి డా ఆర్.ఎస్. రావు రిజిస్టర్ జె ఎన్ టీ విశ్వవిద్యాలయం కాకినాడ డా.. ఎన్.మోహనరావు ప్రిన్సిపాల్ జె ఎన్ టీ యూ కాకినాడ ఎస్. శ్రీనివాస్ అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ కాకినాడ ఎవై. శ్రీనివాస్ సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతుల హిజ్రాలఅండ్ వయో వృద్ధుల సంక్షేమ శాఖ కాకినాడ ఆంజనేయులు ఈగల్ టీమ్ కాకినాడ డాక్టర్ కాటన్ సైకియాట్రిస్ట్ జి జి హెచ్ కాకినాడ ఎం.వి.జి.వర్మ ప్రిన్సిపాల్ యి టీ కాకినాడ డా జి.శ్యామ్ కుమార్ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జె ఎన్ టీ యూ కాకినాడ డా. ఎన్. వినయ్ కుమార్ నోడల్ ఆఫీసర్ ఎన్ ఎం బి ఏ ప్రోగ్రమ్మే, జె ఎన్ టీ యూ కాకినాడ వారు మరియు జిల్లా నందు డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్న స్వచంధ సేవ సంస్థల ప్రతినిధులు ముఖ్య అతిధులుగా హాజరుయ్యారు.

## నిమ్మకాయల వారి సత్రం శిథిలావస్థ ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 18 :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గరలో గల నిమ్మకాయల వారి సత్రం శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దాతల సహకారంతో 1979లో నిర్మించబడిన ఈ విశ్రాంతి గృహం కాలక్రమేనా సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారింది. ప్రస్తుతం దీని పరిస్థితి దయనీయంగా ఉంది. బస్సులు, ఆటో ల కోసం వేచి ఉండే ప్రయాణికులు కూర్చునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు సరైన వసతులు లేకపోవడంతో వర్షం, ఎండలకు ఇబ్బందులు పడుతున్నారు.భవనం లోపల గోడల పైన, మొక్కలు మొలవడంతో గోడలు బీటలు వారుతున్నాయి. ఈ భవనం కూలిపోయే ప్రమాదం కూడా పొంచి ఉండడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత భవనాన్ని తొలగించి ఆ స్థానంలో ప్రభుత్వం ఆధునిక వసతులతో నూతన భవనం నిర్మించాలని ప్రయాణికులు స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



### మత్తు పదార్థాలు

## జీవితాలను ఛిద్రం చేస్తాయి

### మండపేట రూరల్ సీఐ దొరరాజు

### అంగర శ్రీ సిద్ధార్థ కళాశాలలో సదస్సు, మానవహారం

**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 18..** మత్తు పదార్థాలు జీవితాలను ఛిద్రం చేస్తాయని వాటి ప్రభావాలకు దూరంగా ఉండాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు అన్నారు. అంగరలోని శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాలలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ దుష్ప్రభావాలుపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, దేశంలో డ్రగ్స్ ప్రభావాల నివారణకై నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటామని, ప్రజలను మేల్కొలిపేందుకు తమ వంతు కృషి చేస్తామంటూ విద్యార్థులుచే ప్రతిజ్ఞ చేశారు. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర అధ్యక్షన, అంగర ఎస్సై జి.హరీష్కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పలు సామాజిక అంశాలను వివరించారు. సీఐ దొరరాజు మాట్లాడుతూ దేశం మొత్తం మత్తు పదార్థాల నుంచి విముక్తి కావడమనే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టామన్నారు. డ్రగ్స్ సామాజిక దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడమూ, ఇప్పటికే డ్రగ్స్కు అలవాటుపడినవారికి కౌన్సిలింగ్ ఇవ్వడమూ, డ్రగ్స్ ట్రాఫికింగ్ స్మగ్లింగ్లపై కఠిన చర్యలు తీసుకోవడమనే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. ఎస్సై జి.హరీష్కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత భారతదేశం సాధనకై విద్యార్థులు ముందు పథాన నడవాలన్నారు. శ్రీసిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర మాట్లాడుతూ చదువు సక్రమంగా సాగాలన్నా, మంచి ఉద్యోగ, వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. డ్రగ్స్ వ్యక్తినే కాకుండా మొత్తం సమాజాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. అనంతరం అంగర గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి గాంధీ సెంటర్లో మానవహారంగా నిలిచి నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.రమణ, అధ్యాపకులు ఎస్ఎస్వీ శ్రీనివాస్, కోశెట్టి పరదేశి, మేడపాటి తమ్మిరాజు, అనుసూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 11 కోట్లు మంజూరు



**కోటనందూరు (మనసులో మాట) నవంబర్ 18..** తుని నియోజవర్గ అభివృద్ధి ప్రణాళికలపై దృష్టిని కేంద్రీకరించిన ఎమ్మెల్యే యనమలదివ్యతన విజనరీతో ప్రజాఅవసరాలను తీరుస్తున్నారు.సహకార రంగం ద్వారా అన్నదాతలకు ఆర్థిక చేయూత అందించడంలోఆమె ఎప్పుడూముందువరసలోనేనిలుస్తారు.అన్నదాతలసాగునీటి కడగండ్లు తీర్చే యత్నంలో బిళ్ళనందూరు వద్ద రామరాజు ఆనకట్ట,పంపాప్రాజెక్టుస్థిరీకరణ వంటి పథకాలకు జీవం పోసిన ఎమ్మెల్యేయనమలదివ్యపుష్కర కాల్వ శివారు భూములకు సమృద్ధిగా సేద్యపు నీరందించేందుకు అపరభగీరథ ప్రయత్నం చేస్తున్నారు.మరోవైపుప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకుత్రీమాన్ కమిటీలనునియమించి, రైతుల అవసరాల మేరకు రుణప్రణాళికలు అమలుకు రంగం సిద్ధం చేయించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి తుని నియోజకవర్గంలో గల మూడు సొసైటీల ద్వారా రైతులకు 11 కోట్ల రుణ ప్రణాళికలను సిద్ధం చేసిన ఎమ్మెల్యే ఆయా సొసైటీ అధ్యక్షులకు ఎమ్మెల్యే యనమల దివ్య మార్గనిర్దేశం చేసారు. ఈనేపధ్యంలో రికవరీలు లేక చతికిలబడ్డ ఎస్.అన్నవరం సోసైటీ రైతులకు శుభ వార్త అందించారూ ఆసోసైటీ అధ్యక్షుడుపోలిశెట్టిరామలింగేశ్వరరావు.మేడంకృషిఫలితంగా తమ సొసైటీకి డీసీసీబీ 3కోట్ల రుణం ప్రణాళికకు గ్రీన్ సిగ్నల్ఇచ్చిందనిరామలింగేశ్వర రావు తెలిపారు.ఇక కోటనందూరు సొసైటీ గాడిలో పడింది. సొసైటీ అధ్యక్షుడు పెనుమచ్చ నాగేశ్వరరావు అభ్యర్ధన మేరకు ఎమ్మెల్యే యనమల దివ్య డీసీసీబీ ద్వారా 3 కోట్లు రైతులకు రుణ పరపతిలభించింది.సాధ్యమైనంత తొందరగా రైతులకు రుణాలు అందిస్తామని అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు.ఇక తేటగుంట సొసైటీ గా పిలువబడే ఎన్ఎన్ పట్నం సొసైటీ యనమల దివ్య చొరవతో భారీ ఆర్థిక రుణ ప్రణాళిక సాధించుకుంది.5 కోట్లు రుణాలు అందించే ప్రణాళికలుఎమ్మెల్యేయనమల దివ్యసిఫార్సులమేరకుఆమోద ముద్ర లభించిందని సొసైటీ అధ్యక్షుడు లాయర్ కృష్ణ తెలిపారు. ఏకకాలంలో మూడు సొసైటీల నుంచి 11 కోట్లరుణప్రణాళికలుమంజూరు చేయించిన మాజీ ఆర్థిక మంత్రియనమలరామకృష్ణుడు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య లకు సొసైటీ అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు.

## వీరవరంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం




**కిర్లంపూడి (మనసులోమాట) నవంబరు 18..** కిర్లంపూడి మండలం వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం కాకినాడ వాసన్ ఐ కేర్ మరియు కాకినాడ ఈ డి జి డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ శిబిరాన్ని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ లు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి పరిసర గ్రామాల నుండి సుమారు 200 మంది వరకు ఓపిలో పాల్గొనగా సుమారు 20 మంది కంటి ఆపరేషన్ లు నిమిత్తం కాకినాడ వాసన్ ఐ కేర్ కి తరలించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలోఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వవీరబాబు,టిడిపి నాయకుడు గొల్లపల్లి సూరిబాబు,దంత వైద్యులు బి.సుమన్ రాజు, వాసన్ కేర్ సిబ్బంది స్వామి వందన్, మార్కెటింగ్ నాగేంద్ర,అప్తాల్ రమేష్, టెక్నీషియన్ మణికుమార్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నదీ కోతకు గురవుతున్న

# గోదావరి నదీ పరివాహక ప్రాంతం

### పర్యటించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎంపీ గంటి హరీష్ బాలయోగి

**అమలాపురం (మనసులో మాట) నవంబరు 18 :** డాక్టర్ బి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కోనసీమ ప్రాంతం లో గల నది పరివాహక ప్రాంతాలలో గోదావరి వరద ప్రభావంతో నది కోతకు గురవుతూ ఉన్నాయి. ప్రతి ఏడాది వరదల సమయంలో లంక భూములు గోదావరి నదిలో కలిసిపోతున్నాయి. అప్పట్లో ఈ నదీ పరివాహక ప్రాంతాల్లో గోదావరి వరద ఉధృతి లంక భూములు నది కోతకు గురు కాకుండా గ్రోయిన్స్ నిర్మాణాలు చేపట్టేవారు. దీని వలన నదికోతకు కొంత ఉపశమనం కలిగేది .గత 30 సంవత్సరాల నుండి ఈ నది పరివాహక ప్రాంతాల్లో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో లంక గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది .ఈ నేపథ్యంలో మంగళవారం పి గన్నవరం మండలం లో పాశర్ల పూడి నుంచి ఆదుర్రు వరకు ఇటీవల వచ్చిన వరదకు నదీ కోత గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎంపీ గంటి హరీష్ బాలయోగిలు పడవపై వెళ్లి





పరిశీలించారు. గోదావరి వెంబడి నది కోతకు గురైన ప్రాంతాలు సుమారు రెండు కిలోమీటర్ల వరకు వీరు పర్యటించారు. ఈ నది కోత వలన లంక గ్రామ ప్రజలు కొబ్బరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వారి ఇబ్బందులను ఎంపీ ఎమ్మెల్యేలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నదీ కోతకు కొబ్బరి చెట్లు నదిలో కలిసిపోవడం,కష్టపడి పండించే వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని గ్రామస్తులు రైతులు ఎమ్మెల్యే ఎంపీలకు వివరించారు. వైనితేయ ,గోదావరి పరివాహక ప్రాంతాల్లో గ్రోయన్స్ నిర్మాణం చేపడితే ఈ సమస్య నుండి ఉపసవనం కలుగుతుందని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి గ్రోయన్స్ నిర్మణానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని లేనియెడల భవిష్యత్తులో లంక ప్రాంతాల ప్రజలకు, రైతులకు అపార నష్టం సంభవించే పరిస్థితులు నెలకొంటాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎంపీ హరీష్ బాలయోగి కు వివరించారు. ఇక్కడ ఉన్న లంక గ్రామాల ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కార మార్గాలకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీ హరీష్ బాలయోగి హామీను ఇచ్చారు.



### తెలుగు విశ్వ విద్యాలయానికి

# పూర్వ వైభవం తీసుకురండి

- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉప కులపతి డీ మునిరత్నం నాయుడుకి మంత్రి దుర్గేష్ సూచన
- రాజమహేంద్రవరంలోని నివాసంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన వీసీ మునిరత్నం నాయుడు
- తొలి వైస్ ఛాన్స్ లర్ గా బాధ్యతలు స్వీకరించిన డీ మునిరత్నం నాయుడుకు అభినందనలు తెలిపిన మంత్రి దుర్గేష్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం తొలి ఉప కులపతిగా బాధ్యతలు స్వీకరించిన డీ మునిరత్నం నాయుడు మంగళవారం రాత్రి మంత్రి కందుల దుర్గేష్ ను హుకుంపేటలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ఆయనను అభినందించారు. విశ్వ విద్యాలయానికి సంబంధించిన పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలుగు విశ్వ విద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని, తెలుగు భాషా పరిరక్షణకు పాటు పడాలని సూచించారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి దుర్గేష్ సూచనలు చేశారు.



## విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీ

### - ఉప్పాడ శాఖ గ్రంథాలయంలో..

**పిఠాపురం (మనసులో మాట), నవంబరు 18:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఐదవ రోజు మంగళవారం ఉప్పాడ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి తుమ్మలపల్లి జయ కృష్ణ ఆధ్వర్యంలో చిత్రలేఖం పోటీ నిర్వహించారు. సబ్-జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 145 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వాతావరణము -కాలుష్యం పై చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. సబ్ జూనియర్స్ కు నచ్చిన ఏదైనా చిత్రం గీయమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి తుమ్మలపల్లి జయకృష్ణతో పాటుగా ఉపాధ్యాయులు ఆర్.సీహెచ్ సాయి రామకృష్ణ, ఎస్ రమణ రాజు, ఆర్ నాగబాబు పర్యవేక్షించారు. బుధవారం ముగ్గులపోటీ నిర్వహిస్తామని చెప్పారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఈ నెల 20న అందజేస్తామని గ్రంథాలయ అధికారి తెలియజేశారు.



# తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలి

**పిఠాపురం (మనసులో మాట) నవంబరు 18:** నూతనంగా నియమితులైన తెలుగుదేశం పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిద్ధాంతపు ప్రదీప్ ఎస్ వి ఎస్ ఎల్ వర్మను మంగళవారం కలుసుకున్నారు. పిఠాపురం రాజా వారి కోట ఆవరణలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎల్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. వర్మకు వారి కృతజ్ఞతలు తెలిపి కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రియతమ నేత వర్మకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు సిద్ధాంతపు ప్రదీప్ తెలిపారు. పార్టీ బలోపేతానికి ఎస్సీల ఉన్నతికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి దళిత సోదరులంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఎస్సీల కి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్సీ కార్పొరేషన్ నిధులు దారి మళ్ళించారని ఆరోపించారు. దాదాపు




28 సంక్షేమ పథకాలు రద్దు చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా గత ప్రభుత్వం రద్దు చేసిన విదేశీ విద్య పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. ఎస్సీలకు కేటాయించిన నిధులు సక్రమంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎల్లప్పుడూ ఎస్సీ సోదరులకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొజ్జ సతీష్, నాయకులు సోమ సత్యనారాయణ, పిల్లి చిన్న, కరుప్రోలు శ్రీనివాసు,యర్రంశెట్టి శ్రీనివాసు, పుణ్యమంతుల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద గొల్లప్రోలులో

# క్లీన్ అండ్ గ్రీన్ అవగాహన శిక్షణ

**గొల్లప్రోలు (మనసులో మాట) నవంబరు 18:** గొల్లప్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్మెంట్ శాఖ ఆదేశాల మేరకు ఏపీఎస్ఐఆర్ డిపిఆర్ లో భాగంగా రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2025-26 సంవత్సర ప్రణాళికలో భాగంగా గొల్లప్రోలు మండల ప్రజా పరిషత్ అధికారి



సెలెట్ రాజ్ ఆధ్వర్యంలో మండల సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామసచివాలయ సిబ్బందికి గ్రామలలో క్లీన్ అండ్ గ్రీన్ అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయిలో పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, పరిశుభ్రత చర్యలను బలోపేతం చేయడానికి సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామసచివాలయ సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇ?చ్చారు. అంతేకాకుండా గ్రామాలు పచ్చగా, శుభ్రంగా ఉండేందుకు గ్రామీణ ప్రజల భాగస్వామ్యం కీలకమని, పర్యావరణ సంరక్షణలో ప్రజలను చైతన్యం చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యపాత్ర పోషించాలని ప్రజా ప్రతినిధులకు తెలిపారు. అంతేకాకుండా క్లీన్అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా చెట్ల నాటకం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, వర్షపు నీటి సంరక్షణ, గ్రామ స్థాయిలో శుభ్రత చర్యల అమలు వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలు పరిశుభ్రత సూచికల ఆధారంగా అభివృద్ధి చేయబడతాయని, రాబోయే కాలంలో పర్యావరణాన్ని సంరక్షణలో స్పష్టమైన ఫలితాలు తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సెలెట్ రాజ్,వివిధ గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




**పల్నాడు, నవంబర్ 18,(మనసులో మాట):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను కళాశాల డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎస్ఎఫ్ఐ నాయకత్వం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ ఈశ్వర్ షరీఫ్ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ 55 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించి. ఈ దేశానికి త్యాగాలు చేసే నాయకులను ఎస్ఎఫ్ఐ తయారు చేసింది అని అన్నారు. పల్నాడు జిల్లాలో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కై ఎస్ఎఫ్ఐ ఎన్నో పోరాటాలు నిర్వహించి విజయం సాధించారని అన్నారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయి కుమార్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలు తిరుపతి నగరంలో డిసెంబర్ 12 13 14 తేదీల్లో రాష్ట్ర కమిటీ నిర్వహిస్తుందన్నారు. వేలాదిగా విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర విద్యారంగా అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్న నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదని బకాయిలు ఉన్న ఫీజు రియంబర్స్, స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని మెస్ ఫీజులు పెంచాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మహాసభలో తీర్మానాలు చేసి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించి పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ కట్ట కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా గర్ల్స్ కన్వీనర్ కే నవిత, నాయకులు పవన్, రాధా తదితరులు పాల్గొన్నారు.

## సాయినాధునికి ప్రత్యేక పూజలు

### - భక్తులకు అన్న సమర్పణ



**ప్రత్తిపాడు, ( మనసులోమాట) నవంబరు 18:**కార్తీక మాసం సందర్భంగా ప్రత్తిపాడు తోట కాలనీలోని షిరిడీ సాయి మందిరంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సుందరకాండ పారాయణ, లలితా సహస్రనామం పారాయణ, గోవింద నామాలు సుమారు గంటన్నర పాటు ఆలపించారు. దైవ ధ్యానం వల్ల భక్తితో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పారాయణ బృందం మహిళలు అన్నారు. తమ బృందం ప్రత్తిపాడు మండలంలోని అన్ని దేవాలయాల్లో పారాయణలు చేశామని తెలిపారు. కార్తీక మాసంతో పాటు ధనుర్మాసం, శ్రావణ మాసాలలో ప్రతి రోజు స్థానిక తోట కాలనీలోని షిరిడీ సాయి మందిరంలోను, శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో లలితా విష్ణు సహస్ర నామాలు, సుందరకాండ పారాయణ ఏటా క్రమం తప్పకుండా ఆలపిస్తామని తెలిపారు. అనంతరం మందిరం ఆవరణలో నిర్వాహకులు భారీ సంఖ్యలో హాజరైన భక్తులకు అన్న సమర్పణ చేశారు.

### రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ పీఎం- కిసాన్ నిధుల జమను

# అధికారులు విజయవంతం చేయాలి

### - జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 18:** రైతుల ఖాతాల్లోకి ఈ ఏడాది అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అధికారులు విజయవంతంగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ బుధవారం తూర్పు గోదావరి జిల్లాలో అర్హులైన 1,14,991 మంది రైతులకు మొత్తం రూ.7,699.90 లక్షల నిధులు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ-2వ విడత క్రింద రూ. 5,749.55 లక్షలు, పీఎం- కిసాన్ 21వ విడత క్రింద రూ.1,950.34 లక్షలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ కానున్న నేపథ్యంలో, కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమగ్రంగా నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో, అలాగే ఆర్ఎస్కె కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటించాలని తెలియజేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామా నాయుడు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తదితరులు గోపాలపురం నియోజక వర్గం దేవరపల్లి మండలం గౌరిపట్నం ఆర్ ఎస్ కే పరిధిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని జేసీ వై మేఘా స్వరూప్ తెలిపారు. గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా అందుతున్న ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, గ్రీవెన్సులను క్లోజ్ చేసేటప్పుడు తప్పనిసరిగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.






ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద నూతన గృహాలు మంజూరు చేయడానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపీడీవోలు సర్వే చేసి గుర్తించాలని సూచించారు. సర్వే, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి స్వామిత్వ సర్వేలో పురోగతి సాధించాల్సిందిగా, ప్రతి వారం సమీక్ష చేపడతామని తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని అన్ని సంక్షేమ వసతి గృహాలను సందర్శించి మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత, భోజనం నాణ్యత, వార్డెన్ల అందుబాటు, మొత్తం సంక్షేమాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రోడ్లు- భవనాల అధికారులు సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను సందర్శించి భవనాల ఫిట్నెస్పై నివేదిక ఇవ్వాలని తెలిపారు. ప్రతి నెల ఒక రోజు వసతి గృహాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్లు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ టీ సీతారామమూర్తి, ఎస్డీసీ ఎస్ భాస్కర్ రెడ్డి, డీపీఓ వీ శాంతమణి, డీడీఓ పీ వీణా దేవి, ఏడీ సర్వే బీ లక్ష్మీనారాయణ, సీపీఓ ఎల్ అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
బుధవారం 19 నవంబర్ 2025


# ప్రతి ఒక్క వికలాంగులు వృద్ధులు
# ఉపయోగించుకోవాలి



**పలమనేరు నవంబర్ 18( మనసులో మాట):**భారత ప్రభుత్వము (సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖ) ఆర్టిఫిషల్ లింబ్స్ మణ్యుఫ్కచ్చరింగ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (అలింకో), కాన్పూర్ వారి సౌజన్యముతో ఈ మాసము తేది 24.11.2025 న జడ్పీ హై స్కూల్, వి.కోట నందు పలమనేరు నియోజకవర్గ వికలాంగులు వృద్ధ పౌరుల శారీరక అవసరాలు గుర్తించి వారికి అవసరమైన సహాయక / వసతి పరికరాలను ఎంపిక చేయు శిభిరాన్ని ఏర్పాటుకై జిల్లా కలెక్టర్, చిత్తూరు వారు ఆదేశించి యున్నారు. అందుపై, పలమనేరు పురపాలక సంఘ ప్రజలకు తెలియజేయడమేమనగా, ఈ యొక్క శిభిరము నందు అర్హులైన ప్రతి ఒక్క వికలాంగులు వృద్ధ పౌరులు వినియోగించుకొనవలసినదిగా పలమనేరు కమీషనర్ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

క్యాంపు నందు అందించు సహాయ పరికరాలు: వాకింగ్ స్టిక్స్ వాకర్లు 3/4 లెగ్ స్టిక్స్ క్రచ్చులువీల్చైర్లు హియరింగ్ ఎయిడ్స్. బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్స్ ట్రైసైకిల్స్ రోలేటర్లు ఎం.ఎస్.కిట్స్ అందులకు టాకింగ్ వాచ్లు" వైట్ కేన్లు టచ్ ఫోన్లు వాయిస్ ఫోన్లు' ఎల్బో క్రచ్చులు కుష్ఠరోగుల కిట్స్, డైసీ ప్లేయర్లు ఎం ఐ డి కిట్స్ ౨ స్మార్ట్ కేన్స్ కృత్రిమ అవయవాల్ను మొదలైనవి.అర్హతలు : బిలో పావర్టీ లైన్ (బీపీ ఎల్) కుటుంబాలకు చెందిన వారు.సహాయక పరికరాలు అవసరమై ఉండాలి. అర్హతను బట్టి ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ఉపకరణములు గుర్తించబడును.

వికలాంగులు( పిడబ్ల్యుడిఎస్ )తీసుకురావలసిన పత్రాలు : వృద్ద పౌరులు తీసుకురావలసిన పత్రాలు :2 సెట్స్ జిరాక్స్ కాపీలు 2 సెట్స్ జిరాక్స్ కాపీలు యు డి ఐ డి కార్డు / రసీదు 60 సం. ల లోపు %-% వైద్య సర్టిఫికేట్ తప్పనిసరి ఆధారు కార్డు 60. సం. పైబడిన వారికి వైద్య సర్టిఫికేట్ అవసరం లేదు వైద్య సర్టిఫికేట్ రేషన్ కార్డు / ఆదాయ దృవీకరణ పత్రము రేషన్ కార్డు / ఆదాయ దృవీకరణ పత్రము ఆధారు కార్డు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు 4 పాస్ పోర్ట్ సైజు ఫోటోలు 4 2 మొబైల్ నంబర్లు 2 మొబైల్ నంబర్లుముఖ్య సూచనలు:

ఇవి గుర్తింపు శిభిరాలు మాత్రమే, తక్షణ పంపిణీ జరగదు.

ఈ శిబిరాలకు వికలాంగుల పెన్షన్ తో ఎలాంటి సంబంధము లేదు. చిత్తూరు జిల్లా పరిధిలోని అర్హులైన వికలాంగులు వృద్ధ పౌరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

మరిన్ని వివరాల కోసం వార్డు సచివాలయాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.



## ఇళ్ల స్థలాల పంపిణికి
# అర్హులైన పేదలను గుర్తించండి
### అధికారుల సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

**పలమనేరు నవంబర్ 18 (మనసులో మాట):** పలమనేరు మున్సిపల్ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీకి అర్హులైన పేద లబ్ధిదారుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సూచించారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో రెవిన్యూ మున్సిపల్ అధికారులతో మంగళవారం ఆయన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబందించి టౌన్ హాల్, డ్రైనేజీ, చెరువు అభివృద్ధి పనుల తదితరుల అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇప్పటిదాకా పేదల నుంచి ఇళ్ల స్థలాల కోసం అందిన అర్జీలను పారదర్శకంగా పరిశీలించి నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ఇదివరకే స్థలాలు కలిగి ఇంటి రుణాలు అవసరమైన లబ్ధిదారులను సైతం వార్డు వారీగా గుర్తించి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని తెలిపారు. అతి త్వరలో పేదలకు పట్టాలు పంపిణీ చేసేలా అధికారులు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్షలో తహసీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్. వి. రమణా రెడ్డి,డీ.ఈసురేష్,ఏఈ స్నేహప్రియా,టీపీఎస్ ఇందిరా, సర్వేయర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు చిత్రలేఖనం వ్యాసరచన పోటీలు

**పలమనేరు నవంబర్ 18 (మనసులో మాట) :** స్థానిక గ్రంథాలయం పలమనేరు వారి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఆలోచన ఆసక్తిని సృజనాత్మకతను వెలుగు తీయడానికి ఇట్లాంటి పోటీలలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం వల్ల వారి ఆలోచన ఆసక్తిని ఒక లక్ష్యం వైపు పెట్టడానికి సాధ్యమవుతుందని గ్రంథాలయ అధికారి హేమ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం జరిగింది. విజేతలకు బహుమతులను ముగింపు సమావేశాలలో విద్యార్థులకు అందించడం జరుగుతుంది.

## ఆర్థిక సహాయాన్ని అందించిన
# బిజెపి నాయకులు



ధర్మవరం నవంబర్ 18 (మనసులో మాట) పట్టణంలోని 29వ వార్డుకు చెందిన షేక్ మహబూబ్ బాషా కుమారుడు షేక్ ఫారూఖ్ ఎడిమా వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని బిజెపి నాయకులు మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకుని వెళ్ళగా మెరుగైన వైద్య చికిత్స కొరకు ఏర్పాటు చేయడం జరిగిందని చేనేత నాయకులు గిర్రాజు నగేష్, పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని కూడా అందించడం జరిగిందని తెలిపారు. తదుపరి కుటుంబ సభ్యులు బిజెపి నాయకులకు కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓం ప్రకాష్ గౌడ్, మంజునాథ గౌడ్, నాగభూషణ ఆచారి, ప్రదీప్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి సీనియర్ నాయకుడిని కలిసిన ధర్మవరం బిజెపి నాయకులు అంబటి సతీష్



**ధర్మవరం నవంబర్ 18 (మనసులో మాట)** బిజెపి సీనియర్ నాయకుడు వెంకయ్య నాయుడుని ధర్మవరం బిజెపి సీనియర్ నాయకుడు అంబటి సతీష్ పుట్టపర్తిలో గౌరవంగా, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పుట్టపర్తి లోని సత్యసాయిబాబా నూరవ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా, అదేవిధంగా రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించడం జరిగిందని అంబటి సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా పలు విషయాలను వారితో చర్చించడం జరిగిందని వారు తెలిపారు.

# ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి!




**పలమనేరు నవంబర్ 18 (మనసులో మాట) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)ఆధ్వర్యంలో మంగళవారం పలమనేరు నగరంలోని ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి జయంతి ఉత్సవం జరిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి తిరుపతి ఏబీవీపీ విభాగ్ సంఘటన కార్యదర్శి సాయి సత్యనారాయణ, పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది ఎల్. భాస్కర్ మాట్లాడుతూ... ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక అని ఆమె 1828వ సంవత్సరం నవంబరు నెల 19 న మహారాష్ట్ర కు చెందిన వారణాసిలో నవంబర్ 19, 1828వ సంవత్సరంలో జన్మించిందని ఈమె తల్లిదండ్రులు మోరోపంత్ తాంబే, భాగీరథీబాయిలు అని ఆమె తల్లి చాలా తెలివైనదీ, ఆధ్యాత్మిక ధోరణి మెండుగా ఉండి లక్ష్మీబాయి గారిని ముద్దుగా మను అని పిలుచుకునేవారు అని కత్తిసాము, గుర్రపుస్వారీ, తుపాకీ పేల్చడం వంటి విద్యలంటే మనూకు మక్కువ ఎక్కువ. ఖడ్గం ధరించి, కళ్ళెం బిగించి గాలి విసురుకు ఉవ్వెత్తుగా ఎగిరే కురులతో గుర్రపు స్వారీ చేస్తూ నానా సాహెబ్ వెంట మనూబాయి దుసుకొని పోయేది అని లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసులోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది అని దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది అని ఝాన్సీలో మే 10, 1857లో మీరట్ లో భారత సిపాయిల తిరుగుబాటు మొదలయింది అని బ్రిటిష్ కి వ్యతిరేకంగా ఇది మొదటి తిరుగుబాటుగా నిలిచింది అని ఈ సమయంలో ఝాన్సీ లక్ష్మీబాయి ముఖ్య పాత్ర పోషించారని,పందులంటే ముసల్మానులకు ద్వేషమని, హిందువులకు ఆవులంటే పవిత్రమైనవని తెలిసినా కాని, వాళ్ళు యుద్ధములో తుపాకి గుండ్లు తగలకుండా వేసుకొనే తొడుగులకు, వాళ్ళు వాడే తుపాకీలకు పందులు, ఆవుల కొవ్వుని పూసారు. బ్రిటిష్ అధికారులు వాళ్ళను వాటిని వాడవల్సిందిగా బలవంత పరిచి, ఎవరైతే వినలేదో వాళ్ళని శిక్షించడం మొదలుపెట్టారు అని

ఇంతలో, మే 1857లో భారతదేశం ఉత్తర ఖండంలో మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం మొదలైంది అని ఈ క్లిష్ట పరిస్థితులలో ఆమె తన సత్తాని చాలా వేగంగా ప్రదర్శించి, ఝాన్సీ యుద్ధానికి సేనలను సమర్థవంతంగా తయారుచేసింది. ఈ తన సమర్థత వలన లక్ష్మిబాయి మధ్య కాలంలో వచ్చిన సామ్రాట్ల కలవర సమయములో కూడా ఝాన్సిని శాంతియుతంగా ఉంచి మార్చి 23 1858 లో బ్రిటిష్ బలగాలు ఝాన్సీ ని ఆక్రమించుకున్నప్పుడు ఆమె యుద్ధ వీరులతో కలిసి లొంగ కూడదని నిర్ణయించుకొని యుద్ధము సుమారు రెండు వారాలు జరిగి ఆమె తన బలగాలను తన చుట్టూ ఏర్పరచుకొని బ్రిటిష్ కి వ్యతిరేకంగా చాలా భయంకరంగా యుద్ధం చేసి బ్రిటిష్ పాలకుల వెన్నులో వణుకు పుట్టించింది. మొట్టమొదటి స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించిన వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి బ్రిటిష్ వాడి తూటాలకు యుద్ధభూమిలో దేహమైన ప్రాణమైన ఈ భరతమాతకే సమర్పణమంటూ భరతమాత ఒడిలో తుది శ్వాస విడిచింది. ఎంతో త్యాగము సాహసము చేసి మహిళ అంటే పూలు కాదు నిప్పు రవ్వలు భారత వీర మహిళలు అంటూ గుర్తుచేసి నేటి యువతీ యువకులకు ఆదర్శంగా నిలిచిన లక్ష్మీబాయి గారి జీవిత చరిత్రను మనమందరం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. భారతదేశ భోగంతో కాదు త్యాగంతో నిండిందని ఇలాంటి ఎంతోమంది స్వతంత్ర వీరుల త్యాగ ఫలితమే మన స్వతంత్రమని స్వతంత్ర భారతావనిలో మన వంతువనం ఏ దేశం కోసం సమయం ఇచ్చి దేశం కోసం ఆలోచన చేస్తూ నిత్యజీవితం కోసం జీవితం దేశం కోసం అని చెప్పిన వివేకానందుని మాటను మనం ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యు.ఎస్ ఉమా మహేష్, పూర్వ ఏబీవీపీ నాయకులు,వంశీ కృష్ణ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే తో పాటు
# మరో 10 మందిపై కేసు నమోదు



పలమనేరు నవంబర్ 18 (మనసులో మాట): పలమనేరు మాజీ ఎమ్మెల్యే తో పాటు మరో 10 మందిపై కేసు నమోదు అయినట్లు తెలుసుకొని 41ఏ నోటీసు తీసుకోవడం జరిగింది. ఓ ప్రభుత్వ స్థల విషయంపై మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ ప్రశ్నించినందుకు పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్న విషయం విధితమే ఇందుకు సంబంధించి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్కు రావడం జరిగింది. ప్రతిపక్ష పార్టీ బాధ్యతగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. దౌర్జన్యాలపై ప్రశ్నించినందుకు అక్రమ కేసులు పెడతారా? అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంటా టౌన్ కన్వీనర్ హేమంత్ కుమార్ రెడ్డి, చంద్ర, నాగరాజ్, రెడ్డప్ప రెడ్డి, ప్రహల్లాద, కమల్, హరీష్, ముజ్జు, రఘునాథ్ తో పాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు తీపికబురు
## నేడు పీఎంకిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు జమ

**కడప నవంబర్ 18 (మనసులో మాట) :** కడప వ్యవసాయం, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి: సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా రైతులకు అండగా నిలవాలని కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. అందులో భాగంగా కేంద్రంతో కలిసి 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేస్తోంది. పెండ్లిమర్రిలో బుధవారం నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా కర్షకుల ఖాతాల్లోకి రెండో విడత నిధులు జమ చేయనున్నారు.





# చిత్రలేఖనమునకు విశేష స్పందన..
### గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి



**ధర్మవరం (మనసులో మాట) నవంబర్ 18..** పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయం లో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు విద్యార్థులకు గ్రంథాలయం వాటి ప్రాముఖ్యత, సమాజంలో నేటి పాత్ర తో పాటు చిత్రలేఖనం పైన పోటీలను నిర్వహించడం జరిగిందని గ్రంథాలయ అధికారి ని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నచ్చిన జాతీయ నాయకుని చిత్రాలు గీయడం జరిగిందని ప్రముఖుల వ్యక్తుల చేత సెమినార్లను నిర్వహించుట మోడ్రన్ డిజిటల్ లైబ్రరీ గురించి తెలపడం జరిగిందన్నారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ లు రాజేశ్వరి దేవి గోపాల్ నాయక్ స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ రామకృష్ణ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు పెద్దన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది రాము, రమణ నాయక్ ,గంగాధర్, సరస్వతమ్మ, విద్యార్థులు 110 మంది పాల్గొనడం జరిగిందని తెలిపారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

బుధవారం 19 నవంబర్ 2025



# కామన్‌వెల్త్ లర్నింగ్‌తో ఓపెన్ వర్సిటీ ఒప్పందం

- సీఎం రేవంత్ సమక్షంలో కుదిరిన అవగాహన




**హైదరాబాద్,నవంబర్18(ఆర్ఎన్ఎ):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటుకు కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ తో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా ఓపెన్ వర్సిటీ అభివృద్ధి చెందనున్నది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అందించనున్నది. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్ గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ మేరకు దాని సిఇవో అధ్యక్షుడు పీటర్ స్కాట్ కు ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, వైస్ చాన్స్ లర్ ఘంటా చక్రపాణి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర లక్ష్యంలో

30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో 10 శాతం మాదే

ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు

# మేమూ భాగస్వాములమే

- వేగంగా అనుమతులు లభిస్తేనే పురోగతి సాధ్యం
- పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,నవంబర్18 (మనసులో మాట):**

హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సిఎం రేవంత రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. తెలంగాణ రైజింగ్–2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుందని చెప్పారు. హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమిలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా సిఎం వెల్లడించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధాని మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్లే మేం తెలంగాణ మోడల్ తీసుకొచ్చాం. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్లే మేం మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం అని వివరించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. తరవాత అభివృద్ధి గురించే మాట్లాడుతామని అన్నారు. అభివృద్ధిలో దూసుకు వెళ్లాలన్నదే తమ అభిమతమని అన్నారు. మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, టోక్యో, సింగపూర్ లాంటి వాటితోనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

# తుదిదశకు శాసనమండలి పునరుద్ధరణ పనులు

## పనులు పరిశీలించి సూచనలు చేసిన సీఎం రేవంత్



**హైదరాబాద్,నవంబర్18 (మనసులో మాట):**

శాసనమండలి భవనం పనులు చివరిదశకు చేరాయి. పాత శాసనసభ భవనాన్ని అందంగా తీర్చి ముస్తాబు చేస్తున్నారు. దీంట్లో మండలి కార్యకలాలపు జరుగనున్నాయి. దీంతో రెండు సభలు ఒకే ప్రాంగణంలోకి అందుబాటులోకి రానున్నాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పనులను సమీక్షించిన సిఎం పలు సూచనలు చేశారు. తుదిదశకు చేరుకున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు మండలిని జూబ్లీహాల్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో మండలికి వెళ్లాలంటే మంత్రులకు ఇబ్బందికరంగా మారింది. అలాగే ఏదైనా సమావేశం నిర్వహించేందుకు గతంలో జూబ్లీహాల్‌ను ఉపయోగించేవారు. తిరిగి దానిని పాతపద్ధతిలో పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయి. అసెంబ్లీ కార్యదర్శ నరసింహాచార్యులు పలువురు అధికారులు కూడా స్పీకర్ వెంట వచ్చారు.

## అర్బన్ నక్సల్స్ మాయలో పడి

నగరాల్లో జల్సా చేస్తూ వాళ్లు ఆస్తులు పోగేసుకుంటున్నారు

# ప్రాణాలు కోల్పోవద్దు

- మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలి
- వచ్చే మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**వేములవాడ, నవంబర్ 18 (మనసులో మాట):**

అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మి మావోయిస్టులు మోసపోయి, ప్రాణాలు కోల్పోవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో విలాసవంతమైన జీవితం గడుపుతూ, అమాయక పేదలను అడవుల్లోకి పంపి ప్రాణాలు తీస్తున్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆసుపత్రికి విచ్చేసిన సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. 'అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో కుటుంబ సభ్యులతో కలిసి జల్సా చేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పైరవీలు చేసుకుంటూ ఆస్తులు కూడగట్టుకుని కార్లలో తిరుగుతున్నారు. వారి మాటలు నమ్మిన అమాయకులు తుపాకీ పట్టుకుని అడవుల్లో తిరుగుతూ.. తిండీ తిప్పల్లేక ప్రాణాలు కోల్పోతున్నారు. మావోయిస్టుల చావుకు ఈ అర్బన్ నక్సల్స్ కారకులు. నక్సల్స్ కు మద్దతు ఇస్తున్న వీరు ద్రోహులు. అర్బన్ నక్సల్స్ చెప్పేదొకటి, చేసేదొకటి. వారి మాయలో పడి మోసపోవద్దు. మంచి ఆలోచనలతో సమాజంలోకి రండి. ప్రజలకు సేవ చేయండి" అని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

### 2026 మార్చి నాటికి మావోయిజం అంతమే లక్ష్యం

మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవడానికి మరో నాలుగు నెలల సమయం మాత్రమే ఉందని మంత్రి గడువు విధించారు. "వచ్చే 2026 మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతాం. అమిత్ షా మాట ఇస్తే నిలబెట్టుకునే నాయకుడు. తుపాకీ పట్టుకుని చర్చలు జరుపుతామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు. తుపాకీ వీడాల్సిందే. జన జీవన స్రవంతిలో కలవాల్సిందే" అని పునరుద్ఘాటించారు. లొంగిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, బుల్లెట్‌ను నమ్ముకుంటే ప్రాణాలు పోవడం తప్ప ఏమీ సాధించలేరని, బ్యాలెట్‌ను నమ్ముకుంటే అధికారంలోకి రాగలరని ఆయన మావోయిస్టులను ఉద్దేశించి పేర్కొన్నారు.

### హిడ్మా ఎన్‌కౌంటర్‌పై స్పందన

మావోయిస్టు నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై స్పందిస్తూ... "తుపాకీ ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదు. తుపాకీ పట్టుకుని అమాయకులైన దళిత, గిరిజనులను, పోలీసులను చంపారు. జాతీయ జెండా ఎగరేయొద్దని నక్సలైట్లు బీజేపీ నేతలను ఎంతోమందిని కాల్చి చంపారు. నక్సలైట్లది ఏ సిద్ధాంతం? తుపాకీ ద్వారా మీరు సాధించిందేమిటి? మీరు సాధించిందల్లా అమాయకులను పొట్టన పెట్టుకున్నారు, మీరూ బలైపోయారు" అని ఆయన ప్రశ్నించారు. తుపాకీతో కక్షమించే ప్రసక్తే లేదని, దేశంలో ఉన్నది ఆషామాషీ ప్రభుత్వం కాదని, మోదీ ప్రభుత్వం అని ఆయన స్పష్టం చేశారు.

## ఏరియా ఆసుపత్రికి రూ.1.5 కోట్ల వైద్య పరికరాలు



కేంద్ర మంత్రి బండి సంజయ్ నేషనల్ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సహకారంతో, సీఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలు చేసిన రూ.1.5 కోట్ల విలువైన 16 ముఖ్యమైన వైద్య పరికరాలను వేములవాడ ఏరియా ఆసుపత్రికి అందజేశారు. ఇందులో అల్ట్రాసౌండ్, ఈసీజీ మిషన్ వంటి పరికరాలు ఉన్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తోపాటు వైద్యశాఖ అధికారులతో కలిసి ఆయన పరికరాలను పరిశీలించారు. ఆసుపత్రి అంతా కలియ తిరిగి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమై ఆసుపత్రి అభివృద్ధి, పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులోనూ అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి బరోసా ఇచ్చారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం ఖరీదైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో ప్రభుత్వ ఆసుపత్రులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని, పేదలకు మెరుగైన సేవలందించడానికి యత్నిస్తోందని ఆయన తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ఆసుపత్రులకు కూడా ఇదే స్థాయిలో వైద్య పరికరాలు అందించేందుకు ఎన్ఎండీసీ ద్వారా మొత్తం రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులను సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు.అనంతరం, ఖాళీగా ఉన్న 89 వైద్య పోస్టుల భర్తీకి కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారని, యువ డాక్టర్లంతా దరఖాస్తు చేసుకుని ఉద్యోగాలు పొందాలని, పేదలకు సేవ చేయాలని బండి సంజయ్ కుమార్ కోరారు.

## ఏడు క్వింటాళ్లే కొంటామంటే..

పనికి రాని నిబంధనలతో రైతులకు ఇబ్బందులు

# మిగిలిన పంటను ఏం చేసుకోవాలి?

- పత్తి, సోయాబీన్ ను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి
- సర్కారు స్పందించకుంటే 21న జాతీయ రహదారుల దిగ్బంధం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆదిలాబాద్ పత్తి మార్కెట్ సందర్శన



**ఆదిలాబాద్,నవంబరు18(మనసులో మాట):**

ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటామంటే.. మిగిలిన పత్తిని రైతులు ఏం చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. పనికిమాలిన నిబంధనలు పెట్టి రైతులను అరిగోస పెడుతున్నారని పేర్కొన్నారు. అన్నదాతలకు మద్దతుగా ఈ నెల 21న జాతీయ రహదారుల దిగ్బంధం నిర్వహించనున్నట్లు కెటిఆర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆందోళన చేపడుతున్నామని అన్నారు. ఈ క్రమంలో కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు. రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలు మాత్రమే మార్గం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని రకాల పోరాటాలను చేసేందుకు మా పార్టీ సంసిద్ధంగా ఉన్నది. పార్టీ రైతన్నలకు అండగా ఉంటుంది. మొన్న ఆత్మహత్య చేసుకున్న హడావు దీపక్ కుటుంబానికి పార్టీ తరఫున కొంత ఆర్థిక సహాయం చేస్తాం. వెంటనే ప్రభుత్వం పంటల కొనుగోలు కోసం ఫింగర్‌ప్రిం÷–రట్ల నిబంధన, కేవలం 12 శాతం తేమ ఉండాలన్న నిబంధన, ఎకరానికి ఏడు క్వింటాల మాత్రమే కొంటామన్న నిబంధన ఇవన్నీటిని వెంటనే ఎత్తివేయాలి. కిసాన్ కపాస్ యాప్ సంబంధం లేకుండా పంట కొనుగోలు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు. రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తి తేమశాతం ఎక్కువగా ఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది. గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం పైన ఒత్తిడి తీసుకొచ్చి 20 నుంచి 22 శాతం తేమ ఉన్న పంటను కూడా కొనిపించాము. కానీ ఇప్పుడు కేవలం 12 శాతం తేమ ఉంటే కూడా కొనుగోలు చేయము అని చేతులు ఎత్తేసింది. రైతులు పంటలు అమ్ముకోలేక ఆత్మహత్యలు చేసుకుంటే కూడా పట్టించుకునే వారు లేరు కనీసం అడిగే వారు కూడా లేరు. కనీసం ఇప్పటిదాకా లక్ష క్వింటాళ్ల పంట కూడా కొనలేదు. ప్రైవేట్ వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల పంటను దోచుకుంటున్నది అని అనిపిస్తున్నది. లేకుంటే రైతన్నలకు ఎన్ని సమస్యలు వచ్చిన స్పందించకుండా ఉండదు అని కేటీఆర్ పేర్కొన్నారు. కనీస మద్దతు ధర రూ. 8,100 రైతుకు దక్కాల్సింది కానీ ఐదారు వేలు కూడా దక్కడం లేదు. సోయాబీన్ అమ్మకానికి సంబంధించి ఫింగర్ ప్రింట్ కావాలని చెప్పి ఒక నిబంధన పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. సొంత తల్లిదండ్రుల పేరు మీద ఉన్న పంటలు బిడ్డలు అమ్మాలంటే కూడా కొనుగోలు చేయడం లేదు. పత్తి పంట ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామనే ఒక అర్థరహితమైన నిబంధన పెట్టారు. ఆదిలాబాద్‌లో ఉన్న భూసార పరిస్థితుల వలన పది పదిహేను క్వింటాళ్ల వరకు ఎకరానికి పండుతుంది మరి మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలి. ఈరోజు మేము రైతన్నలను కలవడానికి వెళు_న్నామని తెలుసుకున్న ప్రభుత్వం నాటకాలు మొదలుపెట్టారు అని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంతో వీడియో కాన్ఫరెన్స్ అంటూ నాటకాలు మొదలుపెట్టారు. కానీ నిన్న జరిగిన క్యాబినెట్లో 50 శాతానికి పైగా తెలంగాణ జిల్లాలో పండుతున్న పత్తి పంట పైన కనీసం మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు సరఫరా నుంచి మొదలుకొని యూరియా సప్లై దాకా చివరికి పంట అమ్మకానికి సంబంధించి కూడా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. రాష్ట్రంలో రైతన్నల పంటలు కొనుగోలు చేసే పరిస్థితులు కూడా లేవు. దేశంలోనే అత్యుత్తమ పంటను పండించే రాష్ట్రం తెలంగాణ కానీ ఇక్కడి తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టి రైతన్నలను పట్టించుకోవడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. దేశంలో అద్భుతమైన నాణ్యత కలిగిన పత్తి పంట పండుతుంటే కేంద్రంలోని బిజెపి మాత్రం విదేశాల నుంచి పత్తిని దిగుమతి చేయించుకుంటుంది. పైగా ఇప్పటిదాకా ఉన్న దిగుమతి సుంకాలన్నింటిని ఎత్తివేసింది. కేవలం ఇతర దేశాల్లోని సరఫరాదారులతో చేసుకున్న ఒప్పందాల కోసమే తేమ శాతం, మొబైల్ అప్లికేషన్ ,ఎకరాకు 7 క్వింటాళ్ల వంటి అర్ధరహితమైన నిబంధనలు పెట్టి విదేశీ సరఫరాదారులతో చేతులు కలిపేందుకే దేశంలోని రైతన్నల నుంచి బిజెపి దేశంలోని రైతన్నల నుంచి పత్తి పంట కొనుగోలు చేయడం లేదు. కేంద్రం ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురాకుండా కేవలం ఎన్నికలు, రాజకీయాలపైన మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం వలన ఇన్ని సమస్యలు వచ్చాయి. ఇప్పటిదాకా పత్తి కొనుగోలు చేయాలని కనీసం కేంద్రం పైన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురాలేదు అని కేటీఆర్ నిలదీశారు. అధిక వర్షాల వలన నష్టపోయిన రైతన్నలందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలి. నష్టపోయిన ప్రతి రైతన్నకు ఎకరానికి 20000 చొప్పున కనీస నష్టపరిహారం చెల్లించాలని పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం. స్థానిక బిజెపి, కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చి రైతన్నలకు న్యాయం చేయాలి. వెంటనే ఇక్కడి కేంద్ర మంత్రులు, తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేలా స్థానిక రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకుపోవాలి. లేకుంటే వారి పైన రైతన్నల పోరాటం తప్పదు అని హెచ్చరించారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## రానంపల్లిలో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**బాన్సువాడ, నవంబర్ 18 (మనసులో మాట):**

రుద్రూర్ మండలం రానంపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన భూమి పూజ కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) మరియు రాష్ట్ర అగ్రోస్ చైర్మన్ ఈ కార్యక్రమాల్లో పాల్గొని శంకుస్థాపన చేశారు. వారి చేతుల మీదుగా 50 లక్షల రూపాయల వ్యయంతో రానంపల్లి నుంచి లింగంపల్లి వరకు చేపట్టనున్న మెటల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారురాలు అయిన కాసుల అంజవ్వ - హన్మండ్లు కుటుంబానికి గృహ నిర్మాణ పనుల కోసం భూమి పూజ నిర్వహించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, మండల ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మరోమారు ఐటీ దాడులు

### పాస్తాహౌజ్, షాగ్ హౌజ్, మెహిఫిల్ హోటల్ లో అక్రమాలు

### ప్రముఖ హోటల్ యజమానుల ఇళ్లల్లో సోదాలు

**హైదరాబాద్,నవంబరు18 (మనసులో మాట):**

నగరంలో మరోసారి ఐటీ దాడులు కలకలం రేపింది. ప్రముఖ హోటళ్ల చైర్మన్‌లు, డైరెక్టర్ ఇళ్లలో సోదాలు చేపట్టారు. హైద్రాబాద్ కేంద్రంగా నడుస్తున్న హోటల్స్ బిజినెస్‌పై ఐటీ సోదాలు నిర్వహించారు. మొత్తం 30 చోట్ల ఏకకాలంలో ఇన్కమ్ టాక్స్ అధికారులు సోదాలు చేపట్టారు. పిస్తా హౌస్, షాగ్ హౌస్, మేహిఫెల్ హోటల్లో యజమానుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. పిస్తా హౌస్, షాగౌస్ , మేహిఫెల్ హోటల్స్ ప్రతి ఏటా వందల కోట్లు వ్యాపారం చేస్తున్నాయి. ఈ హోటల్స్ ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. రాజేంద్రనగర్‌లోని పిస్తా హౌస్ ఓనర్ మహమ్మద్ మజీద్, మహమ్మద్ ముస్తాన్ ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు చేసారు. ఈ క్రమంలో రికార్డుల్లో చూపిన ఆదాయం, నిజమైన ఆదాయం మధ్య వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హవాలా, నకిలీ లావాదేవులు, అనుమానాస్పద ట్రాన్సాక్షన్ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్యాక్స్ చెల్లింపులో వ్యత్యాసం ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. పిస్తా హౌస్ ఓనర్ మజీద్ నివాసంలో ఆరు బృందాలు సోదాలు జరుపుతున్నాయి. పిస్తా హౌస్‌లో పనిచేసే వర్కర్ల ఇళ్లల్లోనూ, వర్కర్లకు కల్పించిన వసతి నివాసాల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. వారికి సంబంధించిన ఫోన్లు, కంప్యూటర్లను ఐటీ అధికారులు చెక్ చేశారు. ఫోన్లలో, కంప్యూటర్లో ఉన్న డేటాను ఐటీ శాఖకు సంబంధించిన హ్యాకర్లు విశ్లేషిస్తున్నారు. అయితే పిస్తా హౌస్ అకౌంటెంట్ మాత్రం అందుబాటులోకి రాని పరిస్థితి. బినామీల పేర్లతో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణల నేపథ్యంలో వర్కర్ల ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నాయి. సోదాల్లో కీలకమైన డాక్యుమెంట్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్ కి సంబంధించిన హార్డ్ డిస్కులు, కీలక పత్రాన్ని సీజ్ చేశారు. అంతే కాకుండా వర్కర్ల నుంచి ఐటీ అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు సమాచారం. కాగా.. సుమారు 600 మంది పైగా ఐటీ అధికారులు 30 బృందాలుగా ఏర్పడి నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోదాలు జరిపారు.

## ఐబొమ్మ కేసులో ఈడీ ఆరా

### హైదరాబాద్ సీపీకి లేఖ




**హైదరాబాద్,నవంబర్18(మనసులో మాట):**

'ఐ బొమ్మ' కేసులోకి ఈడీ రంగంలోకి దిగింది. దీనికి సంబంధించి హైదరాబాద్ సీపీకి ఈడీ లేఖ రాసింది. ఐ బొమ్మ కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు ఈడీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ కేసుకి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఈడీ రాసిన లేఖలో పేర్కొంది. ఇప్పటికే ఐ బొమ్మ యజమాని ఇమ్మడి రవి, అలియాస్ ఐబొమ్మ రవి బ్యాంక్ ఖాతా నుంచి రూ.3.5 కోట్లు ఫ్రీజ్ చేసిన పోలీసులు.. విదేశీ బ్యాంక్ అకౌంట్ల నుంచి పెద్దమొత్తంలో రవి ఖాతాకు నిధులు బదిలీ అయినట్టు భావిస్తున్నారు. నెలకు రూ.15లక్షలు క్రిప్టో వాలెట్ నుంచి రవి ఖాతాకు బదిలీ అయినట్టు తెలుస్తోంది. వీటిపై ఈడీ దర్యాప్తు చేయనుంది. మరోవైపు.. ఈ కేసుకి సంబంధించిన రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఐ బొమ్మ రవి నేరాన్ని అంగీకరించినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఐ బొమ్మ, బప్పం టీవీ పేరు మీద 17 వెబ్సైట్లు నిర్వహించినట్లు గుర్తింపు. క్రిప్టో కరెన్సీ వాలెట్ నుంచి రవి ఎన్నారై ఖాతాలకు నగదు బదిలీ చేశాడు. ఐబొమ్మ రవిని పట్టించిన రెండు డొమైన్లు ఒక డొమైన్ అమెరికాలో.. మరొక డొమైన్ అమీర్‌పేట్‌లో రిజిస్టర్ చేసిన రవి. విదేశీ పౌరసత్వం తీసుకున్న ఐ బొమ్మ రవి. దేశ డిజిటల్ భద్రతకు రవి ప్రమాదకరం అని పోలీసులు తెలిపారు.

## ఐబొమ్మ రవిని ఎన్‌కౌంటర్ చేయాలి

### నిర్మాత సి కళ్యాణ్ సంచనల వ్యాఖ్య



**హైదరాబాద్,నవంబర్18(మనసులో మాట):**

మూవీ పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు రవిని ఎన్ కౌంటర్ చేయాలని ప్రముఖ నిర్మాత సీ. కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తెలుగు ఫిలిం ఛాంబర్ మీడియా సమావేశం నిర్వహించింది. మూవీ పైరసీకి పాల్పడుతోన్న ఐబొమ్మ రవిని అరెస్ట్ చేసినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్ చెప్పారు ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు. అనంతరం ఛాంబర్ ప్రతినిధులు మూవీ పైరసీపై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్మాత సీ. కల్యాణ్ మాట్లాడుతూ.. కోట్లు పెట్టి సినిమా తీస్తే పైరసీ చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైరసీతో మూవీ ఇండస్ట్రీకి వేల కోట్ల నష్టం వాటిల్లేలా చేసిన రవిని అరెస్ట్ చేసిన ప్రభుత్వానికి, పోలీస్ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పోలీస్ సినీ ఇండస్ట్రీ తరుపున త్వరలో సన్మానిస్తామని చెప్పారు. నిర్మాత చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యుత్తమంగా తెలంగాణ పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని ప్రశంసించారు. ఐబొమ్మ సైట్ నిర్వాహకుడు రవిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు చాలా కష్టపడ్డారని కొనియాడారు. బడ్జె పెంచి సినిమా టికెట్ రేట్లు భారీగా పెంచుతున్నారని.. ఇది తప్పన్నారు. బడ్జెట్‌లో 90 శాతం ఆర్టిస్టులకి ఇస్తున్నారని.. ఆ భారం ప్రేక్షకుల మీద పడుతుందని అన్నారు. చిత్ర పరిశ్రమకు పెను సవాలుగా మారిన 'ఐబొమ్మ' పైరసీ వెబ్‌సైట్ కింగ్‌పిన్ ఇమ్మడి రవి అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. దమ్ముంటే నన్ను పట్టుకోండి అంటూ పోలీసులకే సవాల్ విసిరిన రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. విదేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన రవిని కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి నెట్టారు.

# ప్రతిపక్షం అన్నింటా ఫెయిల్

- ఇప్పడూ బాధ్యతను జాగృతి పోషిస్తుంది
- తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం తప్పే
- అందుకే మూడోసారి మట్టికరిచిన బీఆర్ఎస్
- జాగృతి అధ్యక్షురాలు కవిత



**ఖమ్మం, నవంబర్ 18 (మనసులో మాట):**

రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు. తుమ్మల లాంటి నేతను బీఆర్ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోందని వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. కొత్త రాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మక మైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని.. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జమలాపురం టెంపుల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జమలాపురం ఆలయంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. పాతర్లపాడులో సామినేని రామారావు దారుణ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రామారావు హత్యపై డీజీపీని కలువనున్నట్లు కవిత తెలిపారు. హత్యా రాజకీయాలు సరికాదన్నారు. రేపు (బుధవారం) హైదరాబాద్‌లో సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్‌ను ముట్టడించబోతున్నామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించి రైతాంగానికి సాగు నీరు అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి వచ్చే వరకు వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేవారు. తెలంగాణలో పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని.. సీసీఐతో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# వాట్సాప్‌లో మీ సేవ పోర్టల్

- నేరుగా పొందేలా అవకాశం
- ప్రారంభించిన తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్,నవంబర్18 (మనసులో మాట):**

రాష్ట్రంలో మీ సేవ సేవలు అందుబాటులోకి వచ్చాక కుల, ఆదాయ వంటి ఇతరత్రా సర్టిఫికెట్స్ పొందడం ఈజీ అయిపోయింది. అయితే ఈ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పదే పదే మీ-సేవ కేంద్రాలకు వెళ్లే శ్రమ తగ్గించడానికి, మీ-సేవకు సంబంధించిన అన్ని సేవలను ఇకపై వాట్సాప్ ద్వారానే అందించనుంది. తెలంగాణలో ఇకపై వాట్సాప్‌లోనే మీ-సేవ సర్టిఫికెట్లు అందనున్నాయి. వాట్సాప్ మీసేవ సర్వీసులను(మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్) బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణలో మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కి పైగా మీ సేవా సర్వీసులను వాట్సాప్ ద్వారా పొందే విధంగా ఏర్పాట్లు చేశారు. మెటా, మీ సేవ సంయుక్త భాగస్వామ్యంతో ఈ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. మీ సేవ సెంటర్స్ చుట్టూ తిరిగే పని లేకుండా సేవలను సులభతరం చేసింది తెలంగాణ ప్రభుత్వం.. వినియోగదాలు వాట్సాప్ లోనే సర్టిఫికెట్స్ పొందే అవకాశం కల్పించింది. మీ-సేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత దానికి సంబంధించిన తాజా అప్‌డేట్స్ అన్నీ వాట్సాప్‌లోనే చెక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా దరఖాస్తు చేసిన సర్టిఫికెట్ ఆమోదం పొందితే ఆ సర్టిఫికెట్‌ను సైతం వాట్సాప్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. 8096958096 వాట్సాప్ నెంబర్ ద్వారా మీ సేవ సర్వీసెస్ ఉపయోగించుకోవచ్చు. ఇన్కమ్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, రెసిడెన్సీ సర్టిఫికెట్, కమ్యూనిటీ / డేట్ ఆఫ్ బర్త్, పోలీస్ చలాన్, రెన్యువల్ ఆఫ్ రేషన్ షాప్స్, టెంపుల్ సర్వీసెస్, బిల్డింగ్ పర్మిషన్, వెహికిల్ లైఫ్ ట్యాక్స్, లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు ఇక వాట్సాప్ లోనే పొందొచ్చు. త్వరలోనే మరిన్ని వాట్సాప్ సర్వీసులను ప్రారంభించనున్నది ప్రభుత్వం.. వాట్సాప్ లో 580 ప్రభుత్వ సర్వీసెస్ ను అందించడానికి ప్రభుత్వ ప్రణాళికలు చేస్తోంది.

### టి సాట్ ద్వారా పోటీ పరీక్షలకు అవసరమైన కంటెంట్

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు నాణ్యమైన కంటెంట్ అందిస్తున్న టి- సాట్ ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్ష డీఎస్సీకి టెట్ అర్హత తప్పనిసరి కావడంతో అభ్యర్థులందరూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ ద్వార సంసిద్ధులు కావాలని సూచించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతీ ఏటా రెండు సీజన్లలో నిర్వహిస్తుండగా నిత్యం అందుబాటులో ఉండే టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో అభ్యర్థులకు ఉపయోగ పడుతుందని మంత్రి గుర్తుచేశారు. టి-సాట్ టీజీ టెట్-2026 డిజిటల్ కోచింగ్ పోస్టర్ ను సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో మూడు టెట్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, 2026 జనవరి నెలలో నిర్వహించే టెట్-2026 పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి విద్యాశాఖకు మెరుగైన వసతుల్ని కల్పిస్తున్నారని, 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు రికార్డు కాలంలో పూర్తి చేసారన్నారు. కేంద్ర గైడ్ లైన్స్ ప్రకారం టెట్ అర్హత ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడికీ తప్పనిసరి అయిన నేపథ్యంలో టెట్ కు హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయుల కోసం సైతం ప్రత్యేక కంటెంట్ అందిస్తున్నామని సీఈవో బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పరీక్షల తేదీలను అనుసరించి టెట్ పరీక్షలకు నవంబర్ 18,19వ తేదీలు మంగళ, బుధవారాల్లో లైవ్ ఓరియంటేషన్ తో పాటు మరో 44 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు సీఈవో తెలిపారు. టి-సాట్ నిపుణ ఛానల్ లో సాయంత్రం 5గంటల నుండి ఏడు గంటల వరకు, విద్య ఛానల్లో ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రతి రోజు నాలుగు గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయని సీఈవో ప్రకటించారు. టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ కు అవసరమైన స్జబెక్టులు చైల్డ్ డెవలప్మెంట్, సైకాలజీ, ఫిజికల్, బయాలాజికల్ సైన్స్, మాథ్స్, సోషల్ స్టడీస్ తో పాటు ఇంగ్లిష్, తెలుగు ఇతర స్జబెక్టులకు సంబంధించిన డిజిటల్ లెసన్స్ ప్రసారమౌతాయన్నారు. టెట్ పేపర్-1, 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు టి-సాట్ అందించే ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి కోరారు. టెట్ అర్హత పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ ప్రసారం చేసే ప్రత్యేక కంటెంట్ టి-సాట్ శాటిలైట్ ఛానళ్లతో పాటు, టి-సాట్ యాప్, యూట్యూట్ లో అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణే ప్రథమ ప్రాధాన్యత

- వాహనదారులు సురక్షిత ప్రయాణానికి సహకరించాలి
- రాత్రి 11 గంటల తర్వాత అనవసర ప్రయాణాలు మానాలి



రాత్రి వేళల్లో ప్రయాణం, రోడ్డు పక్కన పార్కింగ్‌పై సీపీ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాలు

**గోదావరిఖని, నవంబర్ 18 (మనసులో మాట):**

ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల భద్రత మరియు సురక్షిత ప్రయాణానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ స్పష్టం చేశారు. వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేలా, ప్రమాద రహిత ప్రాంతంగా మార్చాలనే సదుద్దేశంతో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలు తగ్గించాలని, రోడ్ల పక్కన వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని ఆయన పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో రాత్రి సమయంలో ఆలస్యంగా, తెల్లవారుజామున ప్రయాణాల కారణంగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో ట్రాఫిక్ పోలీస్ శాఖ మరియు లా అండ్ ఆర్డర్ పోలీస్ సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. నిద్రమత్తు, మద్యం సేవించి డ్రైవింగ్, మితిమీరిన అతివేగం వంటి కారణాల వల్ల రాత్రి, తెల్లవారుజామున ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, రాత్రి 11 గంటల తరువాత అవసరం లేని ప్రయాణాలు చేయకుండా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో రోడ్ల పక్కకు వాహనాలను నిర్లక్ష్యంగా పార్క్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సీపీ తెలిపారు. రోడ్లు, హైవేలు, జంక్షన్లు, సర్వీస్ రోడ్లపై బాధ్యతారహితంగా పార్క్ చేసిన వాహనాలపై ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప రాత్రి ఆలస్యంగా ప్రయాణాలు చేయడం మానుకోవాలి. రోడ్ల పక్కన, నేషనల్ హైవేలు, జంక్షన్లు మరియు సర్వీస్ రోడ్లపై వాహనాలను పార్క్ చేయకూడదు. వాహనంలో సాంకేతిక లోపం కారణంగా నిలిపివేయాల్సి వస్తే వెంటనే హెచ్చరిక లైట్లు ఆన్ చేసి, సహాయం కోసం హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలి. ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ, భద్రత మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్న సీపీ, రాత్రి వేళల్లో పర్యవేక్షణ, విజుబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ విధులు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు తెలిపారు.

# పత్తికి మద్దతు ధర ఇచ్చి కొనాలి

- ఢిల్లీకి వెళ్లి పత్తి సమస్యలు ప్రధానికి తెలిపాలి
- లేదంటే సిఎం ఇంటిముందే పత్తిపోసి ధర్నా చేస్తా
- వరంగల్ ఎనుమాముల మార్కెట్ సందర్శించిన హరీష్ రావు



**వరంగల్, నవంబరు 18 (మనసులో మాట):**

పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వకపోతే తెల్ల బంగారాన్ని రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలస్ ముందు పోసి ఇంటిని ముట్టడిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను హరీష్ రావు, బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీసీఐ తుగ్లక్ చర్యల వల్ల రైతులు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు విధిలేక దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నిలువునా ముంచుతున్నాయని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ రెడ్డి అరవైసార్లు ఢిల్లీకి వెళ్లారని.. మూటలు పంపుతున్నారు గానీ రైతుల సమస్యలు బడేబాయ్‌కు చెప్పరా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టారని.. మరి రైతులకు మద్దతు ధర ఇప్పించరా అంటూ నిలదీశారు. కపాస్ యాప్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలకంటే పంటపొలాల్లో దిష్టి బొమ్మలు నయమంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు సడలించారని.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాలు జరుపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావుతో పాటు పత్తియార్డును బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మధుసూదనాచారి, చల్లా ధర్మారెడ్డి, మాలోత్ కవిత పరిశీలించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని సందర్శించాక పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, బీజేపీ తప్పుడు విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సీసీఐ తుగ్లక్ వంటి పిచ్చి నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయి. పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారు. ఈరోజు రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవకాశం లేక అడ్డగోలుగా దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. పత్తికి మద్దతు ధర రూ. 8,100. కానీ, రూ.6 వేలకే రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. క్వింటాల్ మీద రూ.2000ల చొప్పున పత్తి రైతులు నష్టపోతున్నారు. మాటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరచేతిలో వైకుంఠం చూపించి, చేతల్లో నరకం చూపిస్తున్నాయని అన్నారు. వరదలు, తుఫాన్‌ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే తుగ్లక్ నిర్ణయాలతో మరింత ఇబ్బంది పెట్టడం సరికాదు. ఒకవైపు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట చేనులన్నీ దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 8 నుంచి 12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్ ని రద్దు చేయండి. స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పని. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బీజేపీ ఎంపీలు ఒక్కసారి కూడా నోరు విప్పరు. రైతుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడగరు. కేసీఆర్‌ని, బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు మరో పని చాతకాదు. కాంగ్రెస్ ప్రశ్నించదు. బీజేపీ అడగదు అంటూ మండిపడ్డారు. రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టినందుకు విజయోత్సవాలు చేస్తున్నారా?. యూరియా బస్తాల కోసం రైతులను లైన్‌లో నిల్చోపెట్టినందుకు విజయోత్సవాలా?. ములుగు నియోజకవర్గంలో చింతకుంట, మంగపేట మండలాల నుంచి వచ్చిన రైతు వెంకటేశ్వర్లు, రైతు లక్ష్మయ్య మక్కలు అమ్మడానికి ఎనుమాముల మార్కెట్‌కి వచ్చారు. క్వింటల్ మక్కలు రూ.1800 కు రైతులు అమ్ముతున్నారు, రూ.2400 మక్కకు మద్దతు ధర. మక్క రైతులు ఒక క్వింటాలకు రూ.570 నష్టపోతున్నారు. ఎవరికైనా మక్క రైతులకు పైసలు విడుదల చేశారా అని మార్క్ ఫెడ్ అధికారులను అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా విడుదల చేయలేదని సమాధానం ఇచ్చారు. పోయిన యాసంగిలో రైతులకు రావలసిన రూ.1,100 కోట్ల బోనస్‌ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఈ సంవత్సరం కొన్న రైతులకు కూడా రూ.1,400 కోట్ల బకాయిలు పడ్డాయి. పంటల భీమా తెస్తామన్న కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు అయినా పంటల బీమాను రైతులకు అందించడంలో విఫలమైంది. పంటల బీమా ఉండి ఉంటే నష్టపోయిన పంటకు రైతులకు నష్టపరిహారాలు అందేది కదా. బోనస్ ఎగ్గొడివితి. రైతుబంధు రెండు పంటలకు ఎగబెట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. కరెంటు నుండి కాంట దాకా అన్నీ సమస్యలే. కరెంటు లోవోల్టేజ్ వల్ల ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. రైతుబంధు రాదు. రుణమాఫీ జరగదు. బోనస్ ఎగ బెడతావు. పంటల బీమా లేదు. ఇంతే కదా రేవంత్ రెడ్డి. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ ఢిల్లీకి పోయి ప్రధానమంత్రిని కలిసి నిబంధనలు ఎత్తివేసి పత్తికొనే విధంగా చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. వరంగల్ వరదల్లో 20 వేల ఇండ్లు మునిగిపోయాయి. సకాలంలో గేట్లు ఎత్తి ఉంటే వరంగల్ నగరం మునిగిపోయేది కాదు. మునిగిపోయిన ఇళ్లకు రూ. 15 వేలు ఇస్తామన్నారు. రెండు నెలలు అయింది ఒక రూపాయి ఇవ్వలేదు. వెంటనే నష్టపరిహారం విడుదల చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు ప్రోత్సహిస్తున్నారనడం అవాస్తవం

- వామన్ రావు హత్య కేసులో రాజీకి వస్తే రూ. 100 కోట్లు ఇస్తానని పుట్ట మధు ఆఫర్
- తండ్రి గట్టు కిషన్ రావు ఆరోపణ

**మంథని, నవంబర్ 18 (మనసులో మాట):**

హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్ రావు-నాగమని దంపతుల హత్య కేసులో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తమకు అండగా ఉన్నారని, ప్రోత్సహిస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన ఆరోపణలు అవాస్తవమని వామన్ రావు తండ్రి గట్టు కిషన్ రావు స్పష్టం చేశారు. మంగళవారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ కేసులో రాజీకి వస్తే రూ. 100 కోట్లు ఇస్తామని పుట్ట మధు తమకు ఆఫర్ పంపారని సంచలన ఆరోపణలు చేశారు. "ఈ కేసులో రాజీకి వస్తే రూ. 100 కోట్లు ఇస్తామని పుట్ట మధు ఉప్పల్‌కు చెందిన ఒక న్యాయవాదితో ఆఫర్ పంపారు. రూ. 100 కోట్లు కాకపోతే ఒక ఫిగర్ చెప్పాలని, అవసరమైతే సుప్రీంకోర్టు జడ్జిని కూడా కొంటామని, మా అడ్వకేట్‌తో మాట్లాడారు" అని కిషన్ రావు ఆరోపించారు. తాను గత 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నానని, న్యాయ వ్యవస్థపై పూర్తి అవగాహన ఉందని ఆయన తెలిపారు. తన కొడుకు, కోడలును హత్య చేసిన నిందితులకు న్యాయపరంగా శిక్ష పడాలని మొదటి నుంచి పోరాడుతున్నానని, న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉంది కాబట్టే సుప్రీంకోర్టు వరకు వెళ్లామని అన్నారు. ఈ కేసును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించిందని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు అండదండలతో తాను సుప్రీంకోర్టుకు వెళ్లానని పుట్ట మధు ఆరోపించడం కేవలం శ్రీధర్ బాబుపై బురద చల్లడమేనని ఆయన పేర్కొన్నారు.

**ముద్దాయిల కోసం సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లారు?:**

వామన్ రావు సోదరుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ హత్యతో పుట్ట మధుకు గాని, ఆయన భార్యకు గాని సంబంధం లేదని ఆరోపిస్తున్నారని, ఒకవేళ సంబంధం లేకుంటే తమ కుటుంబాన్ని ఒక్కసారైనా పరామర్శించారా




అని ప్రశ్నించారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు వద్ద పుట్ట మధు తన తండ్రి కలిసి ఉండేవారని గుర్తు చేశారు. కిషన్ రావు, చంద్రశేఖర్ లు పుట్ట మధును నేరుగా ప్రశ్నిస్తూ... హత్యతో సంబంధం లేకుంటే, గుంజపడుగుకు చెందిన ముద్దాయిలైన పూదరి లచ్చయ్య, అక్కపాక కుమార్ ల కోసం 2022, 2023 సంవత్సరాలలో సుప్రీంకోర్టుకు వెళ్లడం నిజం కాదా అని ప్రశ్నించారు. "వారికి లక్షలు ఖర్చుపెట్టి బెయిల్ ఇప్పించింది నిజం కాదా? ఎందుకు నువ్వు ముందుండి నడిచి బెయిల్ ఇప్పించావు?" అని వారు పుట్ట మధును నిలదీశారు.

# 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తివేయాలి

- మార్కెట్ యార్డుల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి, నవంబర్ 18 (మనసులో మాట):**

పత్తి కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన కఠిన నిబంధనలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పెద్దపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అకాల వర్షాలు, అతివృష్టి కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సింది పోయి, నిబంధనలతో మరింతగా ముంచేయడం దారుణమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి మనోహర్ రెడ్డితో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, రామగుండం మాజీ శాసనసభ్యులు కోరకంటి చందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

**శాపంగా మారిన నిబంధనలు**

ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, ఎకరాకు కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధన సరికాదని, దీనిని తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు అకాల వర్షాల కారణంగా దెబ్బతిని, రైతులు ఏమాత్రం కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఇటువంటి సమయంలో దారుణమైన ఆంక్షలు, నియమాలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టడం శోచనీయమని పేర్కొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బాధ్యతగా మెలగాలి

**అధికారుల ఆదేశాలను తప్పక పాటించాలి:**
**మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



**మంథని, నవంబర్ 18 (మనసులో మాట):**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు, ట్యాబ్ ఆపరేటర్లు రైతులతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన సెంటర్ ఇంచార్జీలు, సూపర్ వైజర్లు, ట్యాబ్ ఆపరేటర్లతో మాట్లాడారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు, హమలీలతో సామరస్యంగా ఉండాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడతో సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. సెంటర్ ఇంచార్జీలు ఎవరి ఒత్తిళ్లకు గురికాకుండా ధాన్యం కాంటాలు చేపట్టాలని, అలాగే సహకార సంఘానికి ఎలాంటి వ్యాపార నష్టం రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ, రైతులు ధాన్యం పోసినప్పటి నుంచి నిర్ణీత తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి, ధాన్యాన్ని కాంటా చేసి రైస్ మిల్లులకు సరఫరా అయ్యే వరకు సెంటర్ ఇంచార్జీలు విధిగా రికార్డులను నిర్వహించాలని సూచించారు.రైతులు ధాన్యం పోసిన వెంటనే వారి నుంచి ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకం, మొబైల్ నంబర్, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ ప్రతులు తప్పనిసరిగా సేకరించి, ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలపై నిత్యం అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, విధి నిర్వహణలో ఏ మాత్రం అలసత్వం వహించరాదని, గోనె సంచులు షార్టేజీ రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, ప్యాడి సూపర్ వైజర్లు, సెంటర్ ఇంచార్జీలు, ట్యాబ్ ఆపరేటర్లు మరియు సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్**



**కోటపల్లి, నవంబర్ 18 (మనసులో మాట):**

భూ భారతి ద్వారా వచ్చిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు.మంగళవారం కోట్ పల్లి తహసిల్దార్ కార్యాలయంసందర్శించారు. భూ భారతి ద్వారా వచ్చిన దరఖాస్తు లను పూర్తి స్థాయి లో పరిష్కరించాలని, భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం కింద రైతులు, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపిన మీదట, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు.వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాల్సి ఉంటుందని అన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సమావేశమై భూభారతి దరఖాస్తుల పరిశీలన, విచారణ అంశాలపై మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ చంద్ర కిరణ్,తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# డ్రగ్స్ రహిత దేశం కోసం కలిసి కట్టుగా పోరాడాలి

**సీనియర్ సివిల్ జడ్జి డి. ఇందిరా**




**మహబూబ్ నగర్, నవంబర్ 18 (మనసులో మాట):**

దేశ పౌరులంతా కలిసి కట్టుగా డ్రగ్స్ కు దూరంగా ఉండటం ద్వారా డ్రగ్స్ రహిత దేశంగా రూపొందించడం సాధ్యమవుతుందని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి డి. ఇందిరా పిలుపునిచ్చారు. మంగళవారం జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ - ఖుషాల్ భారత్" అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. డ్రగ్స్ రహిత సమాజానికి అందరూ పూనుకోవాలని, డ్రగ్స్ వలన జరిగే అనర్థాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా అన్నారు. డ్రగ్స్ వినియోగం ద్వారా వచ్చే దుష్ఫలితాలు విద్యార్థుల జీవితాలను నాశనం చేయడంతో పాటు, వారి కుటుంబాలను సంక్షోభంలో నెట్టి వేస్తాయని తెలిపారు. "డ్రగ్స్ తమతో కలిగి ఉండటం, వాటిని సరఫరా చేసిన వారికి లేదా అమ్మిన వారికి భారతీయ శిక్షాస్మృతి మరియు నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్టెన్సెస్ చట్టం ప్రకారంగా జరిమానా, జైలు శిక్ష విధించడం జరుగుతుంది" అని ఆమె హెచ్చరించారు. ఒక్కసారి కేసు నమోదైతే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరిస్తూ, ఎన్డీపీఎస్ చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యుల మధ్య సాన్నిహిత్యం పెంచుకోవడం ద్వారా వారి యొక్క వ్యక్తిగత సమస్యలు తెలుసుకోవచ్చని, తద్వారా ఈ రుగ్మతల బారిన పడకుండా ఉండవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ కె.ఎస్. రవి కుమార్ మాట్లాడుతూ, యువతకు ప్రధాన శత్రువు మాదక ద్రవ్యాలే అని, వాటికి దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును కాపాడుకోవాలని కోరారు. యువతను నిర్వీర్యం చేయడానికి విద్రోహ శక్తులు డ్రగ్స్‌ను ఎరగా వేస్తున్నారని, వాటి పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# డ్రగ్స్ రహిత సమాజానికి పాటుపడాలి

**మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించాలి**

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, నవంబర్ 18 (మనసులో మాట) :**

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాశాము మొత్తం భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి వేణు, డీసీపీ కరుణాకర్ లతో కలిసి జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది చే మాదకద్రవ్యాల నిరోధన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు నియంత్రణ కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, డ్రగ్స్ రహిత జీవన శైలి అనుసరిస్తూ, మన చుట్టూ ఉన్న ఎవరు డ్రగ్స్ బారిన పడకుండా మన వంతు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. యువత జీవితాలను డ్రగ్స్ మహమ్మారి నాశనం చేస్తుందని, సరదా కోసం కూడా ఎటువంటి చెడు అలవాట్ల వైపు దృష్టి సారించవద్దని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ అమ్మకం కొనుగోలు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్న వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బి .వనజ, ఏసిపి గజ్జి కృష్ణ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్‌లో 'సోషల్ ఫెస్ట్'



**పెద్దపల్లి, నవంబర్ 18 (మనసులో మాట):**

పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్‌లో సోషల్ ఫెస్ట్ 2025 అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షులు అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ దేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ అద్భుతమైన సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ సంవత్సరం ఫెస్ట్ యొక్క థీమ్ "నో యువర్ డిస్ట్రిక్ట్ – మీ జిల్లా గురించి తెలుసుకోండి" కావడం విశేషం. విద్యార్థులు చారిత్రక స్మారకాలు, పురాతన దేవాలయాలు, వాస్తుశిల్ప నమూనాలతో పాటు, పరిశ్రమలు మరియు ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలోని అనేక ప్రముఖ, అంతగా తెలియని ప్రదేశాలను ఆకర్షణీయంగా ప్రదర్శించారు. కరీంనగర్ కేబుల్ బ్రిడ్జ్, ఇస్రో రాకెట్, భారత పార్లమెంట్ భవనం, ఇండియా గేట్, అయోధ్యలోని రామమందిరం, తిరుమల తిరుపతి దేవస్థానం, సమ్మక్క%–%సారలమ్మ జాతర, తాజ్ మహల్, ఎన్‌టీపీసీ వంటి భారీ మోడల్స్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. థీమ్‌కు అనుగుణంగా, విద్యార్థులు బొమ్మలమ్మ గుట్ట, బోగుల్ల గుట్ట, అండాలమ్మ దేవాలయం, గంపేశ్వర ఆలయం, రామగిరి ఖిల్లా వంటి చాలా మందికి తెలియని స్థానిక ప్రదేశాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుస్తకాల ద్వారా కాకుండా, ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకున్న వారి కృషి, నిబద్ధత ప్రదర్శన స్థాయిని పెంచాయి. ఈ ప్రదర్శనకు సోషల్ టీచర్లు రిజ్వాన్, తేజస్విని, కృష్ణవేణి, కావ్య మార్గదర్శకత్వం వహించారు. విద్యార్థుల ప్రతిభను, వినూత్న ఆలోచనలను ప్రదర్శించడానికి ఈ ఫెస్ట్ ఒక గొప్ప వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ప్రదర్శనను సందర్శించి, విద్యార్థులను ప్రోత్సహించడం మరింత ఉత్సాహాన్ని నింపిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, పాఠశాల పోషకులు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాన్సువాడలో ఘనంగా 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ



**బాన్సువాడ, సెప్టెంబర్ 18 (మనసులో మాట):**

మున్సిపల్ ఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణంలో 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో విస్తృతంగా చేపట్టారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాంతీయ ఆసుపత్రి, వివిధ పాఠశాలలు తదితర ప్రాంతాలలో ఉద్యోగులతో పాటు సాధారణ ప్రజలకు కూడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు మాట్లాడుతూ, "డ్రగ్స్ మహమ్మారి యువతను ప్రమాదకర దిశలో నెట్టేస్తుంది. ఒకసారి దానికి అలవాటు పడితే కుటుంబాలు, భవిష్యత్తు పూర్తిగా దెబ్బతింటాయి," అని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం మొత్తం కలిసి అవగాహన పెంచి, డ్రగ్స్ నుంచి దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, యువత మాదక ద్రవ్యాలకు గురవకుండా కుటుంబాలు మరియు విద్యాసంస్థలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, ఏఈ జగన్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ హన్మండ్లు, సతీష్ తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై మున్సిపల్ యంత్రాంగం యొక్క నిబద్ధతను ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

# యువత రాజకీయాలను మార్చాలి

- కుటుంబ వారసత్వ రాజకీయాలతో దేశానికి ముప్పు
- భారతీయ సంస్కృతి, సనాతన ధర్మమే మన బలం
- కేంద్ర మంత్రి బండి సంజయ్




**సిరిసిల్ల, నవంబర్ 18 (మనసులో మాట):**

భారతీయ సంస్కృతి, సనాతన ధర్మమే దేశానికి నిజమైన బలం అని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఎవరేమనుకున్నా, తాను హిందూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం పోరాడుతూనే ఉంటానని ఆయన పునరుద్ఘాటించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం, మేరా భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన "యూనిటీ మార్చ్" కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేలాది మంది యువతతో కలిసి బతుకమ్మ ఘాట్ నుంచి కొత్త చెరువు వరకు ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఒక యువతితో కలిసి దేశ ఐక్యతకు పాటుపడతామంటూ ప్రతిజ్ఞ చేశారు.

**సంస్కృతి, ధర్మ పరిరక్షణపై వ్యాఖ్యలు**

భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు పాకిస్తాన్ వంటి ఉగ్రవాద దేశాలు కుట్ర చేస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సర్దార్ పటేల్ స్ఫూర్తితో, నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆధ్వర్యంలో అందరం ఐక్యంగా ఉంటూ విచ్ఛిన్న శక్తుల ఆట కట్టించాలని ఆయన పిలుపునిచ్చారు. "మన సంస్కృతి, సాంప్రదాయం, సనాతన ధర్మమే భారతదేశానికి బలం. మన మట్టిలోనే ఆ బలం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. కుటుంబ వారసత్వ రాజకీయాలతో దేశానికి ప్రమాదమని పేర్కొన్న కేంద్ర మంత్రి, యువత రాజకీయాల్లోకి వచ్చి రాజకీయ సమీకరణాలను మార్చాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. యువత తప్పనిసరిగా రాజకీయాల్లోకి రావాలని, లేనిపక్షంలో కుటుంబ వారసత్వ రాజకీయాలే కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**విదేశీ శక్తుల కుట్రలు**

దేశం ఐక్యంగా లేకపోతే పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి ఉగ్రవాద దేశాలు మనలోని విభేదాలను వాడుకుని విధ్వంసం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని మంత్రి తెలిపారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, సంపదలో, శాంతిభద్రతల్లో, శాస్త్ర విజ్ఞానంలో భారత్ అగ్రభాగాన ఉండటాన్ని ఓర్వలేక కొన్ని దేశాలు చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం అమెరికా వంటి పాశ్చాత్య దేశాల రూపంలో, పాకిస్తాన్ వంటి ఉగ్రవాద దేశాల రూపంలో మన భారతీయ సనాతన ధర్మానికి, కుటుంబ వ్యవస్థకు పెను ప్రమాదం ఎదురవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మన ఎదుగుదలను ఓర్వలేక పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధిస్తున్నాయని, పక్కనున్న పాకిస్తాన్ ఉగ్రవాదులు దేశాన్ని సర్వనాశనం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు.

**డ్రగ్స్, కార్పొరేట్ కల్చర్‌పై హెచ్చరిక**

కొంతమంది అమాయక యువత పాకిస్తాన్ వంటి ఉగ్రవాద మూకల వలలో పడి, వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు. మరికొందరు కార్పొరేట్ కల్చర్ పేరుతో డ్రగ్స్, పబ్ కల్చర్‌కు అలవాటు పడి భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, మద్యం వంటి వ్యసనాల వల్ల దాదాపు 5 కోట్ల 70 లక్షల మంది భారతీయులు తీవ్రంగా నష్టపోతున్నారని గణాంకాలను ఉటంకించారు. "మన వ్యసనాలను, ఆశలను ఆసరాగా చేసుకుని విదేశీ శక్తులు మనల్ని, మన కుటుంబాన్ని, ఆ తరువాత మన దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పొంచి ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలంటే యువత రాజకీయాల్లోకి రావాలి. డ్రగ్స్‌పై మనమంతా యుద్ధం ప్రకటిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

**సర్దార్ పటేల్ ఆదర్శం**

నేటి యువతకు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ ఆదర్శమని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి సూచించారు. పటేల్ స్వార్థంగా ఆలోచించి ఉంటే 560 సంస్థానాలు భారత్‌లో విలీనమయ్యే అవకాశమే ఉండేది కాదని, తెలంగాణ పాకిస్తాన్‌లో భాగమయ్యేదో లేదా స్వతంత్ర దేశమయ్యేదో అని పేర్కొన్నారు. ఆపరేషన్ పోలో (పోలీస్ యాక్షన్) ద్వారా నిజాం కుట్రలను భగ్నం చేసి తెలంగాణకు విముక్తి కల్పించిన సర్దార్ పటేల్ మనందరికీ ఆరాధ్యుడని ఆయన కొనియాడారు. దేశం కోసం ఎన్ని ఇబ్బందులు వచ్చినా వెనకడుగు వేయకుండా కఠిన నిర్ణయం తీసుకునే గుండె ధైర్యం పటేల్ సొంతమని, ఆయన క్రమశిక్షణ, దేశభక్తిని యువత అలవర్చుకోవాలని బండి సంజయ్ అన్నారు. ఎంఎల్సీ అంజిరెడ్డి, జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ మహేశ్, అదనపు కలెక్టర్ నగేశ్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జరుగుతున్న "ఐక్యతా మార్చ్" కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించి, యువతలో ఐక్యతా స్ఫూర్తిని నింపాలని ఆయన మీడియాను కోరారు.

# డ్రగ్స్ మూలాలు పెకిలించివేయాలి




**నిరంతరం విస్తృత తనిఖీలు చేపట్టాలి**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, నవంబర్ 18 (మనసులో మాట):**

యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల మూలాలను పెకిలించివేయాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమ, విద్య తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాతుతూ మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు రాసిన చీటీ లేకుండా మత్తు మందులను, ఇంజక్షన్లను మెడికల్ షాపుల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మెడికల్ దుకాణాలలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో స్నేహిత కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విస్తృత అవగాహన కొనసాగించాలని అన్నారు. అవగాహన కార్యక్రమాల్లో పోలీసులను భాగస్వాములను చేయాలని తెలిపారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్ళు, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సంస్థలతోపాటు ఆన్లైన్ సంస్థలకు సంబంధించి గోదాములను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. డ్రగ్ డిడక్షన్ కిట్లు, పోలీస్ డాగ్ సేవలను వినియోగిస్తున్నామని అన్నారు. నాఖాబంధి చేపట్టి విస్తృత తనిఖీలు చేస్తున్నామని వెల్లడించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఏసీబీ రాకతో గోడదూకిన లంచగొండి ఎస్ఐ

**పట్టుకుని విచారణ చేపట్టిన పోలీసులు**

**ఎస్ఐ పట్టివేతతో గ్రామస్థుల సంబరాలు**


**మెదక్,నవంబర్18 (మనసులో మాట):**



మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్లో ఒక వింతైన ఘటన చోటుచేసుకుంది. సాక్షాత్తూ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ తన పోలీస్ స్టేషన్ గోడ దూకి పారిపోయాడు. ఒక కేసుకు సంబంధించి రూ. 20వేలు లంచం తీసుకుంటూ ఎస్ఐ రాజేశ్.. ఏసీబీకి పోలీస్ స్టేషన్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దీంతో అతడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సమయంలో అక్కడి నుంచి పరుగు లంకించుకున్నాడు. ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకుని పారిపోయాడు రాజేశ్. దీంతో ఎస్ఐ రాజేశ్ ని వెంబడించి, చివరికి ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అయితే, ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్సై రాజేశ్.. ఏసీబీకి చిక్కడంతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్న స్థానికులు.. పోలీస్ స్టేషన్ ముందు టపాసులు కాల్చారు. లంచగొండి ఎస్ఐని శిక్షించాలని కోరారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

- నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వభూములు, అస్సైన్మెంట్ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు.
- భూముల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, నవంబర్ 18 (మనసులో మాట):**

శరవేగంగా విస్తరిస్తున్న పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోబోతున్నట్లు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. భూముల పరిరక్షణకు ప్రజలందరూ సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్బో మెడోస్ కాలనీలో ప్రభుత్వ భూమి వివాదంపై ఎమ్మార్వో వెంకటేశం, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కృష్ణ లతో కలిసి ఆయన మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, రెవెన్యూ అధికారులు, గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, డెవలపర్స్ తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్న లక్ష్యంతో ఇళ్లను కొలుగోలు చేసిన కాలనీ వాసులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు. అందరి సమక్షంలో మరోమారు జాయింట్ సర్వే నిర్వహించి పూర్తి న్యాయం చేస్తామని తెలిపారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూముల వివరాలను సేకరించి.. కబ్జాలకు గురికాకుండా పూర్తిస్థాయి రక్షణ ఏర్పాట్లు చేయబోతున్నట్లు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ పార్కులు, రహదారులను కబ్జా చేసి.. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తే చట్టరీత్య కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. గజం భూమి కబ్జాకు గురైన కబ్జాదారులు జైలు ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కొన్ని మండలాల పరిధిలో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడానికి రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ ఫంక్షన్ హాల్లు, విద్యాసంస్థలు, సబ్ స్టేషన్లు, గోదాముల, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను వినియోగించబోతున్నట్లు తెలిపారు.

# భాషా పరిజ్ఞానం పెంచేలా 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్'

- -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, నవంబర్ 18 (మనసులో మాట):**

పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం వారి ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానంను మెరుగుపర్చి, రీడింగ్ స్కిల్స్ పెంపొందేలాగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లాలోని ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ప్రారంభించిన 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్' కార్యక్రమం అమలును ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వైరా మున్సిపాలిటీలోని గుట్టబడి ప్రాథమిక పాఠశాల, రెబ్బవరంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో కార్యక్రమం అమలును పరిశీలించారు. తరగతి గదుల్లో తిరుగుతూ విద్యా బోధనను గమనించారు. 2, 3, 4, 5 తరగతి విద్యార్థులతో మాట్లాడి, ప్రత్యేకంగా అందించిన రైమ్స్ గురించి అడిగారు. విద్యార్థులు బోర్డుపై రాసిన ఇంగ్లీషు అక్షరాలు, పదాలు, పద్యాలను ఉచ్చరించడం, అర్థం చేసుకోవడం, తిరిగి చెప్పగలిగే సామర్థ్యం, అలాగే ధ్వనులను బట్టి ఇంగ్లీష్ పదాలను గుర్తించే సామర్థ్యాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం, మధ్యాహ్న భోజనం నాణ్యత, కోడిగుడ్డు పంపిణీ, కూరల రుచి వంటి అంశాలపై విద్యార్థులను ఆరా తీశారు. తరువాత, రెబ్బవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో బోర్డు పరీక్షలకు సంసిద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. ఒత్తిడికి గురికాకుండా సులభంగా పరీక్షలు రాసేందుకు వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, విద్యా ప్రమాణాల పెంపుదలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఒక విద్యార్థికి చదివే సామర్థ్యం అందిస్తే జీవితాంతం ఉపయోగ పడుతుందని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధన చేయాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థి గంటసేపు చదివే సామర్థ్యంపై అభ్యాసన చేసేలా సాంకేతిక పరిజ్ఞానంతో ఒక బుక్‌లెట్‌ను తయారు చేయడం జరిగిందని తెలిపారు. బుక్‌లెట్‌లోని అంశాలను ఉపాధ్యాయులు తూ.చ. తప్పకుండా పాటిస్తూ పిల్లల సామర్థ్యం పెంపొందేలా కృషి చేయాలని అన్నారు. ఆంగ్ల అక్షరాలను ఫోనెటిక్ సౌండ్‌తో సహా నేర్పేలా కోర్సు డిజైన్ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారు చేశామని, దీనిని యూ.డి.ఐ.ఎస్.ఈతో అనుసంధానం చేయడం వల్ల అదనపు డాటా ఎంట్రీ అవసరం ఉండదని తెలిపారు. ప్రతి బుధవారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ (అక్షరాలు, పదాలు, వాక్యాలు) ఏ స్థాయిలో ఉన్నాయో కేవలం అప్‌డేట్ మాత్రం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెడితే ఈ కార్యక్రమాన్ని పరిపూర్ణంగా అమలు చేయవచ్చని, నెల రోజుల తర్వాత ప్రతి విద్యార్థి కనీసం ఒక పేరాగ్రాఫ్ చదివి అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి రోజు పాఠశాల సమయాల్లోనే ప్రాథమిక తరగతి విద్యార్థులకు అమలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షారైనా, పాల్గొన్నారు.

# క్రమంగా తగ్గుతున్న బంగారం ధరలు

## రూ.1.25 లక్షల వద్ద కొనసాగుతున్న తులం రేటు



**హైదరాబాద్,నవంబర్18(మనసులో మాట):**

దేశీయంగా పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలుతగ్గుముఖం పట్టాయి. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ. 1.25 లక్షలు పలుకుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం రూ. 1.14 లక్షల వద్ద కొనసాగుతోంది. అటు వెండి ధర సైతం కిలో రూ. 1.56 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా బంగారం ధరలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఈనెల 13వ తేదీన 10 గ్రాముల పసిడి రూ. 1.30 లక్షల వద్ద ఉంది. ఐదు రోజుల వ్యవధిలో రూ. 5వేల మేర తగ్గింది. వెండి కిలో రూ. 1.70 లక్షలు ఉండేది. అప్పటితో పోలిస్తే దాదాపు రూ. 15వేలు తగ్గింది. అప్పట్లో అంతర్జాతీయంగా ఔన్సు బంగారం 4200 డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు 4010 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ప్రస్తుతం ఔన్సు 49 డాలర్లుగా ఉంది. ఈ ధరలను అనుసరించి దేశీయంగానూ ధరలు తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా బంగారానికి, అమెరికాలోని వడ్డీ రేట్లకు విలోమ సంబంధం ఉంటుంది. ఫెడ్ వడ్డీ రేట్లు పెంచినప్పుడు బంగారం ధర పడుతుంది. తగ్గినప్పుడు పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమెరికా డాలర్ బలపడటం, వచ్చే నెల ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు క్షీణించడంతో పసిడికి డిమాండ్ తగ్గింది. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలపడడమూ మరో కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగిసిన నేపథ్యంలో కీలక ఎకనామిక్ డేటా ఈ వారం వెలువడనుంది. ఫెడ్ గత మీటింగ్‌కు సంబంధించిన మినిట్స్, సెప్టెంబర్ నెలకు సంబంధించి జాబ్స్ డేటా ఈ బుధ, గురువారాల్లో వెలువడనుంది. ఈ డేటా ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాన్ని, బంగారం ధరలను ప్రభావితం చేయనుంది. వాస్తవానికి వచ్చే నెలలో మరోమారు వడ్డీ రేట్లలో కోత ఉంటుందని తొలుత అంచనాలు ఉన్నప్పటికీ.. ఫెడ్ అధికారులు మాత్రం దీనిని తోసిపుచ్చుతున్నారు.




# బస్సు యజమానులుగా మహిళలు

## ఆర్థిక శక్తికి చోదకంగా పథకం

**హైదరాబాద్,నవంబర్18(ఆర్ఎన్ఎ):**

తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కార్ గ్రామీణ మహిళల సాధికారత కోసం మరో అద్భుతమైన స్కీమ్ ప్రవేశపెట్టింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ కింద, మహిళల స్వయం సహాయక బృందాలకు మొత్తం 600 బస్సులు అందించనుంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలు బస్సుల యజమానులుగా మారి, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించే అవకాశం లభిస్తుంది. వారిని బస్సులకు యజమానులు చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి కలుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలనకు కీలకంగా నిలవనుందన్నారు. ఈ స్కీమ్ ప్రకారం, ఒక్కో బస్సు ధర సుమారు రూ. 36 లక్షలు. మహిళా బృందాలు రూ. 6 లక్షలు ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన మొత్తాన్ని కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అందిస్తుంది. బస్సులు మహిళల యాజమాన్యంలో ఉంటాయి. కానీ, ఈ బస్సులను తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నడిపిస్తుంది. ప్రతి బస్సుకు నెలకు రూ. 69,648 చెల్లిస్తుంది. ఇందులో రూ. 19,648 ఆపరేషనల్ ఖర్చులకు, మిగిలినది లోన్ తిరిగి చెల్లింపునకు వాడతారు. ఇలా 7 సంవత్సరాలపాటు రిస్క్ లేకుండా స్థిర ఆదాయం లభిస్తుంది. కార్యక్రమం దశలవారీగా అమలవుతోంది. మొదటి దశలో 17 జిల్లాల్లో 151 మహిళా బృందాలు 151 బస్సులు పొందాయి. రెండో దశలో మిగిలిన 449 బస్సులు కొనుగోలు చేస్తారు. ఈ బస్సులు తెలంగాణలో అమలవుతున్న మహాలక్ష్మి స్కీమ్ కింద ఉచిత ప్రయాణాలకు సహాయపడతాయి. గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు అందేలా చేస్తాయి. ఇది ప్రైవేట్ బస్సులపై ఆధారపడకుండా, మహిళల యాజమాన్య బస్సులపై ఆధారపడేలా మార్చుతుంది. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా రూ. 5 కోట్లు కేటాయించింది.

# కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వర్ రావు
- జీతాలు చెల్లించాలంటూ జిన్నారం మున్సిపల్ కార్మికుల ధర్నా



**పటాన్ చెరు, నవంబర్ 18 (మనసులో మాట):**

జిన్నారం మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు గత ఐదు నెలలుగా బకాయిల్లో ఉన్న జీతాలను తక్షణం విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్మికులు మంగళవారం జిన్నారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక ధర్నా చేపట్టారు. ఉదయం ఐదు గంటల నుంచి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో కార్మికులు తమ విధులను పూర్తిగా బహిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం కార్మికుల కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. దసరా, దీపావళి పండుగలు పూర్తయినా కూడా కార్మికుల పట్ల అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతుండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశమన్నారు. గ్రామపంచాయతీ సమయంలో మూడు నెలలు, మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత మరో రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉంచడం అధికార నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఇప్పటికీ యూనిఫామ్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు కార్మికులకు అందించలేదని తెలిపారు. జీతాలు సమయానికి రాకపోవడంతో కార్మికులు అప్పుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ జీవో ప్రకారం ప్రతి కార్మికుడికి నెలకు రూ. 15,600 వేతనం చెల్లించాల్సిన బాధ్యత మున్సిపాలిటీదేనని గుర్తుచేశారు. కార్మికులు ఎంతో ఓపికతో ఇప్పటివరకు తమ విధులను నిర్వర్తిస్తున్నప్పటికైనా సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ముందుకు రావాలని, లేనిపక్షంలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులతో పాటు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిన్నారం కమిటీ అధ్యక్షుడు పి. నర్సింలు, శ్రీశైలం, కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి స్థానిక టిఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

# బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, నవంబర్ 18 (మనసులో మాట):**

బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బాల్య వివాహం గురించిన సమాచారం అందించి వివాహం జరగకుండా చూసిన జమ్మికుంట మండలం పాపక్కపల్లి పంచాయతీ కార్యదర్శి నరేందర్ రెడ్డిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సన్మానించారు. అదేవిధంగా కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు గ్రామంలో బాల్య వివాహం గురించి తెలిసి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించినప్పటికీ మరల వివాహం చేసేందుకు ప్రయత్నించడంతో ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మల అధికారులకు ఫిర్యాదు చేశారు. బాల్య వివాహం నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని కోర్టు నుండి ఉత్తర్వులు జారీ అయ్యేలా చూశారు. వీరిద్దరిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ సిబ్బంది, అధికారులపై ఉందని అన్నారు. కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికీ బాల్య వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తే సిడిపిఓ, సూపర్వైజర్, తహసిల్దార్, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా కేసు నమోదుకు ఫిర్యాదు చేయాలని అన్నారు. బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం ఎవరైనా 1098 హెల్ప్ లైన్ కు తెలియజేయాలని ఈ సందర్భంగా సూచించారు.

# నిండుగర్భిణి మృతి

## తట్టుకోలేక భర్త ఆత్మహత్య

## శోకసంద్రంలో కుటుంబం

**హైదరాబాద్,నవంబరు18(మనసులో మాట):**

సంతానం కలగాలని ఐవీఎఫ్ చికిత్స తీసుకుని, కవల పిల్లల కోసం ఆనందంగా ఎదురుచూస్తున్న ఆ దంపతుల జీవితం, కొద్ది గంటల్లోనే విషాదాంతమైంది. కడుపులోనే కవలలు కన్నుమూయడంతో ఆ షాక్‌కు తట్టుకోలేక నిండు గర్భిణి అయిన భార్య కూడా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. అయితే ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కనుమరుగు కావడంతో ముత్యాల విజయ్ అనే యువకుడి గుండె పగిలిపోయింది. శోకసంద్రంలో మునిగిన ఆ భర్త తన జీవితం ఇక శూన్యమని భావించి, శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక ఘటన ఆ ప్రాంతాన్ని కన్నీటిలో ముంచేసింది. బెంగళూరుకు చెందిన ముత్యాల విజయ్ (40), అతని భార్య శ్రావ్య (35) ఏడాదిన్నర కిందట శంషాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. విజయ్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. సంతానం లేని ఈ దంపతులు ఐవీఎఫ్ చికిత్స తీసుకోవడంతో భార్య గర్భం దాల్చారు. అందులోనూ కవలలు పెరుగుతున్నారని తెలియడంతో వారి ఆనందానికి అవధులు లేవు. దాదాపు ఎనిమిది నెలల గర్భిణి అయిన శ్రావ్యతో ఆ ఇల్లు సంతోషంతో నిండిపోయింది. కవలల రాక కోసం ఇద్దరూ ఎన్నో ప్రణాళికలు వేసుకున్నారు. అయితే, 16వ తేదీ రాత్రి, శ్రావ్యకు అకస్మాత్తుగా కడుపు నొప్పి మొదలైంది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అత్తాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు చెప్పిన విషయం ఆ దంపతులకు పిడుగుపాటు లాంటిది. గర్భంలో పెరుగుతున్న కవలలు ఇద్దరూ మృతి చెందారని వైద్యులు ధృవీకరించారు. ఈ వార్త తెలుసుకుని తట్టుకోలేక శ్రావ్య అక్కడే స్పృహ కోల్పోయింది. మెరుగైన వైద్యం కోసం ఆమెను గుడిమల్కాపూర్‌లోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూనే శ్రావ్య తుదిశ్వాస విడిచింది. ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కొద్ది గంటల వ్యవధిలోనే దూరమవడంతో భర్త ముత్యాల విజయ్ పూర్తిగా కుంగిపోయాడు. తన జీవితాన్ని ముందుకు నడపడానికి ఉద్దేశించిన నాలుగు ప్రాణాలు కళ్లముందే కనుమరుగు కావడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. ఈ తీరని బాధతో శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే విజయ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దంపతు మృతితో వారి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# ఆపరేషన్ కగార్ విజయవంతం అయినట్లే

## అంతర్గత కలహాలతోనే మావోయిస్ట్ పార్టీ పతనం

## గిరిజనుల సమస్యలపై పోరాటాలు ఆపలేం

## ప్రొఫెసర్ హరగోపాల్ వ్యాఖ్య

**హైదరాబాద్,నవంబర్18(మనసులో మాట):**



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ సక్సెస్ అయినట్లే భావిస్తున్నామని పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. అగ్రనాయకులంతా హతం కావడం, ఉన్నవారు లొంగిపోవడం, మావోలకు ప్రజల్లో మద్దతు కరువవ్వడం వంటి కారణాలతో వారి ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు మరో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఈ ఘటనపై ప్రొ. హరగోపాల్ హైదరాబాద్‌లో స్పందించారు. 25 ఏళ్ల క్రితం ఉన్న పరిస్థితులు ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో లేవన్నారు. అలాగే ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో వారికి మద్దతు లేదని చెప్పారు. మావోయిస్టు పార్టీ పూర్తిగా అంతమైనా ఆదివాసీల ఉద్యమాలు మాత్రం ఆగవని ప్రొ.హరగోపాల్ కుండబద్దలు కొట్టారు. పార్టీలోని భిన్నాభి ప్రాయాలు, విభేదాల వల్లే మావోయిస్టు పార్టీకి ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఃూజ్యంలోని మార్పులు, ప్రజల్లో మావోయిస్టు పార్టీకి సపోర్ట్ లేక పోవడం కూడా ఒక కారణమని ప్రొ. హరగోపాల్ స్పష్టం చేశారు. మావోయిస్టుల్లో చీలికలు, విభేదాలు, అభిప్రాయ బేధాలు వలన మావోయిస్టు పార్టీ క్షీణించిందని చెప్పారు. కేంద్ర కమిటీ నేతలు.. ప్రభుత్వం ఎదుట లొంగుబాటుకు వారి వారి వ్యక్తిగత అభిప్రాయాలు,కారణాలు ఉన్నాయని ఆయన విశ్లేషించారు. మూడు రాష్ట్రాల పోలీసుల తోపాటు, కేంద్ర ప్రభుత్వం సైతం హిడ్మాపై ఫోకస్ పెట్టిందన్నారు. హిడ్మా అనే వ్యక్తి మావోయిస్టు పార్టీలో చాలా బలమైన నాయకుడని అభివర్ణించారు. పార్టీ కోసం ఏదైనా చేయగలిగిన సామర్థ్యం ఉన్న వ్యక్తి హిడ్మా అని ప్రొ.హరగోపాల్ స్పష్టం చేశారు. ఏదైనా లక్ష్యం నిర్దేశిస్తే పూర్తి చేయగలడనే ఒక బలమైన నమ్మకం హిడ్మాపై పార్టీలో బలంగా ఉందని తెలిపారు. ప్రభుత్వాలు టెక్నాలజీ, ఆయుధాలు, డ్రోన్లతో అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయన్నారు. వాటిని మావోయిస్టు పార్టీ తట్టుకోలేక పోయిందని వివరించారు. మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించాలని కేంద్రం నిర్ణయించింది. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు ప్రాబల్యం ఉన్న ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో భద్రతా బలగాలతో జల్లెడ పడుతోంది. దీంతో వివిధ సందర్భాల్లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో వేలాది మంది మావోయిస్టులు మరణించారు. పలువురు అగ్రనేతలు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే వందలాది మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా ఏపీలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం పదుల సంఖ్యలో మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతాలకు తరలించి విచారిస్తున్నారు.

# నిర్మల్ జిల్లాకు జల సంచాయ్-జన్ భాగీదారి అవార్డు



**నిర్మల్, నవంబర్ 18 (మనసులో మాట):**

మరోసారి జాతీయ వేదికపై నిర్మల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. నిర్మల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయి-జన్ భాగీదారి అవార్డు లభించింది. మంగళవారం, కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ వేదికయ్యింది. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందిస్తూ, జిల్లాకు జలసంచాయ్-జన్ బాగీదారి అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘన సాధ్యమైందని స్పష్టం చేశారు. అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు వీరందరికీ చెందుతుందని తెలిపారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఉన్నారు. నిర్మల్ జిల్లాకు జల సంచాయ్- జన భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు స్వీకరించిన కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మహబూబ్ నగర్ జిల్లాకు..



**మహబూబ్ నగర్, నవంబర్ 18 (మనసులో మాట):**

జల సంరక్షణకు అత్యధికంగా పనులు చేపట్టినందుకు గాను, 6వ జాతీయ జల అవార్డుల్లో మహబూబ్ నగర్ జిల్లాకు అరుదైన గౌరవం లభించింది. 'జల్ సంచయ్-జన్ భాగీదారీ 1.0' విభాగంలో, కేటగిరీ 3 లో జిల్లా జాతీయ స్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. మంగళవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరైన కార్యక్రమంలో, కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మరియు డీఆర్డీఓ నర్సింహులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు కింద జిల్లాకు రూ. 25 లక్షల నగదు బహుమతి లభించింది. కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్ కింద చేపట్టిన జల్ సంచయ్-జల్ భాగీదారీ (జేఎస్‌బీ) పథకం 2024-25 సంవత్సరంలో డీఆర్డీఓ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా మహబూబ్ నగర్ జిల్లాలో జల సంరక్షణ పనులు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలోని 16 మండలాల పరిధిలో 19,439 జల సంరక్షణ పనులు చేపట్టారు. ఇందులో గృహాల్లో మ్యాజిక్ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, పత్తి చేలలో కుంటలు, ఎంఐ ట్యాంకులు, చెరువుల పూడికతీత, ఊట కుంటలు, చెక్ డ్యాంలు, గుట్టల వద్ద కందకాలు, వరద కట్టలు, బోర్వెల్ రీచార్జి స్ట్రక్చర్‌లు, రూఫ్ వాటర్ ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా భూగర్భ జలాలు పెంపునకు చర్యలు చేపట్టారు. ఈ వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఎప్పటికప్పుడు జల్ సంచయ్-జల్ భాగీదారీ పోర్టల్‌లో నమోదు చేసి అవార్డు వచ్చేందుకు కృషి చేసింది. జిల్లాకు జల్ సంచయ్-జన్ భాగీదారీ పురస్కారం లభించడం పట్ల కలెక్టర్ విజయేందిర బోయి హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమిష్టి కృషితో, విలువైన ప్రజల భాగస్వామ్యంతోనే ఈ పురస్కారం లభించిందని ఆమె అన్నారు. జిల్లాకు పురస్కారం రావడానికి కృషిచేసిన అధికారులు, సహకారం అందించిన ప్రజా ప్రతినిధులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకు పురస్కారం లభించడం పట్ల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆదిలాబాద్ జిల్లాకు..



**ఆదిలాబాద్, నవంబర్ 18 (మనసులో మాట):**

జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను అత్యంత విజయవంతంగా అమలు చేసినందుకు గాను, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక "జల్ సంచయ్- జన్ భాగీధారీ" కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానం సాధించింది. ఈ అరుదైన గుర్తింపుతో పాటు జిల్లాకు రూ. 2 కోట్ల నగదు ప్రోత్సాహాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ 2025 సెప్టెంబర్ 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. మంగళవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో, జిల్లా కలెక్టర్ రాజర్షి షా భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లాకు లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు పట్ల జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, కలెక్టర్ రాజర్షి షాకు అభినందనలు తెలియజేశారు.

# సీఎం భద్రాద్రి పర్యటన ఖరారు!

- మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానం
- డిసెంబర్ మొదటి వారంలో పర్యటన
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**కొత్తగూడెం, నవంబర్ 18 (మనసులో మాట):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అధికారికంగా ఆహ్వానించారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించి, ఖచ్చితంగా జిల్లా పర్యటనకు వస్తానని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల ఆహ్వానం మేరకు సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ, డిసెంబర్ 1 నుండి 8 వరకు ఏ తేదీ-నైనా కార్యక్రమాన్ని చేపట్టవచ్చని, అనుకూలమైన రోజు నిర్ణయించుకుని తెలియజేయాలని సూచించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన ఖరారైంది. సీఎం రాక ఖరారైన వెంటనే మంత్రి తుమ్మల, విద్య శాఖ సెక్రటరీ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు మరియు సంబంధిత శాఖలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమ వేదిక, స్టేజ్, లేఅవుట్ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రోడ్డు, వసతులు, పార్కింగ్, రాకపోకల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, భద్రత విషయంలో లోపాలు లేకుండా పోలీసు శాఖతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. అతిథుల నిర్వహణ, వసతి, మీడియా సెంటర్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తుమ్మల అధికారులకు నిర్దేశించారు. విశ్వవిద్యాలయ భవనాలు, ల్యాబ్‌లు, మౌలిక వసతుల పరిశీలనకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

### దేశానికే గుర్తింపునిచ్చే వర్సిటీ

కొత్తగూడెం మైనింగ్ విశ్వవిద్యాలయం దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక సంస్థగా మారనుందని మంత్రి తుమ్మల తెలిపారు. 300 ఎకరాల్లో నిర్మించిన ఈ వర్సిటీలో ఇప్పటికే ఆధునిక ల్యాబ్‌లు, పరిశోధన కేంద్రాలు, అంతర్జాతీయ ప్రమాణాల విద్యా వసతులు ఉన్నాయని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ విద్యా రంగం జాతీయస్థాయిలో కొత్త గుర్తింపు పొందనుందని మంత్రి వివరించారు. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేయడం, దానికి భారత మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్ పేరును నిర్ణయించడం మంత్రి తుమ్మల నిరంతర కృషి వల్లే సాధ్యమయ్యాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వర్సిటీ ప్రారంభోత్సవం వల్ల వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు, యువతకు పరిశోధనా, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, పరిశోధన సంస్థలు రావడానికి మార్గం సుగమం అవుతుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో విద్య-పరిశ్రమల సమన్వయంతో ఉపాధి ఉద్యోగాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

- డ్రగ్స్ బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు
- క్రలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, నవంబర్ 18 (మనసులో మాట):**

మత్తు పదార్థాల నిర్మూలనకై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని సమాజానికి తోడ్పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. మత్తు పదార్థాల బారిన పడి యువత తమ జీవితాన్ని నాశనం చేసుకోరాదని ఆయన సూచించారు. మంగళవారం అనంతగిరిపల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలుర) పాఠశాల మరియు కళాశాల నందు శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన (నషా ముక్త్ భారత్) కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు వాడటం వలన గుండె జబ్బులు సహా అన్ని అవయవాలు పాడవటానికి కారణమవుతాయని తెలిపారు. ప్రపంచం ఆరోగ్యవంతులుగా చూడాలంటే మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని అన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, అందువల్ల క్రమశిక్షణతో, ఓపికగా చదువుకోవాలని, మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. చదువుతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "నిషేధిత పదార్థాలను తీసుకోవడం తప్పు. చదువు వదిలేసి మత్తుకు అలవాటు పడితే జీవితాంతం ఇబ్బందులకు గురికావలసి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్న, తీసుకున్నట్టు కనిపించిన సమాచారాన్ని వెంటనే అధికారులకు ఇవ్వాలని కోరారు.

### దేశ భవిష్యత్తు యువతపైనే: ఎస్పీ నారాయణరెడ్డి

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ, నిషా యుక్త భారత్ కార్యక్రమంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, యువత చెడు అలవాట్లకు గురి కాకూడదని, వాటికి బానిస కావద్దని పిలుపునిచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే యువత ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. విద్యార్థులకు ఎవరైనా ఏమైనా పదార్థాలు ఇచ్చినచో తీసుకోకూడదని, ఈ విషయాన్ని వెంటనే ఉపాధ్యాయులకు లేదా ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తామని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామి అవుతానని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ నరసింహారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు

**కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**మహబూబాబాద్, నవంబర్ 18 (మనసులో మాట):**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై విస్తృతంగా పర్యటించి, కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని మూడుపూగల్, అయోధ్య, ఆమనగల్ గ్రామాల్లో ఐకేపీ, సహకార శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్రాల వద్ద రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, టెంట్స్, చైర్స్ వంటి సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని కలెక్టర్ సూచించారు. సన్న వడ్లు, దొడ్డు వడ్ల కొనుగోలు చేసే కేంద్రాలను వేరువేరుగా ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, వాతావరణ మార్పులు వంటి అంశాలపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, డబ్బులు త్వరితగతిన వారి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో గన్నీ సంచులు, తార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్, ప్యాడీ క్లీనర్స్, వేయింగ్ మిషన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కేంద్రాలలో ధాన్యం రాక వివరాలు రిజిస్టర్, గన్నీ సంచుల రిజిస్టర్, రైతుల వారి కొనుగోళ్ల చెల్లింపుల రిజిస్టర్, రవాణా, స్టాక్ రిజిస్టర్‌లను కలెక్టర్ పరిశీలించి, అక్కడున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అధికారులు అన్ని కేంద్రాలను పర్యవేక్షించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ తనిఖీల్లో ఏడీఏ శ్రీనివాసరావు, తహసిల్దార్ రాజేశ్వరరావు, ఏవో తిరుపతి రెడ్డి మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పటేల్ కృషితోనే దేశం ఐక్యతతో ఉంది

**హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్**


**హనుమకొండ, నవంబర్ 18 (మనసులో మాట):**

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి వల్లే భారతదేశం నేటికీ ఐక్యతతో ఉందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల (కేడీసీ) ప్రాంగణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 'మై భారత్', ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన 'సర్దార్150 ఐక్యత పాదయాత్ర'ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత దేశంలో స్వేచ్ఛ కోసం తపించేవారని, ఎన్ని భాషలు మాట్లాడినా, ఎన్ని ప్రాంతాలు ఉన్నా మనమందరం ఒకటేనని చాటి చెప్పేవారని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో పటేల్ కృషి ఎంతో ఉందని కొనియాడారు. భారత దేశ ప్రజలను చైతన్యపరిచి ఏకతాటిపై నడిపించిన మహనీయుడని ప్రశంసించారు. ప్రజలు ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ స్నేహ శబరీష్ 'ఐక్యత పాదయాత్ర'ను జెండా ఊపి ప్రారంభించకముందు.. డ్రగ్స్ రహిత భారతదేశంగా తీర్చిదిద్దడానికి భారత ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రతిజ్ఞను యువతకు చేయించారు. ఐక్యత పాదయాత్ర కేడీసీ కాలేజ్ గ్రౌండ్ నుండి ప్రారంభమై పోలీస్ కమిషనరేట్ మీదుగా అంబేద్కర్ సర్కిల్, కాళోజి కూడలి, ఏకశిలా పార్క్, బాలాసముద్రం, హనుమకొండ బస్ స్టేషన్ మార్గం గుండా తిరిగి కేడీసీ కాలేజ్ గ్రౌండ్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోతు దేవిలాల్, కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కాకతీయ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, కాకతీయ యూనివర్సిటీ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ ఇస్తారి, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, డాక్టర్ అప్పయ్య, నామినేటెడ్ మెంబర్స్ జయంత్ లాల్, సాంద్ర మధు, తీగల భరత్, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీకి చెందిన 10 టీ, 4 ఎయిర్, 1 సిటిఆర్, 8టీ బెటాలియన్ల సిబ్బంది, అలాగే మెప్మా మహిళా సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# రెండో టెస్ట్ కోసం ప్యాడ్‌ను తీసేసి ప్రాక్టీస్!



సౌతాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా 30 పరుగుల తేడాతో ఓడిపోయిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్‌లు సౌతాఫ్రికా స్పిన్నర్ల బౌలింగ్‌లో పరుగులు తీయడానికి చాలా కష్టపడ్డారు. ఈ సమస్యను అధిగమించేందుకు భారత జట్టు ఇప్పుడు వినూత్నంగా, చాలా సాహసోపేతమైన ప్రాక్టీస్ విధానాన్ని మొదలుపెట్టింది. ఈ స్పెషల్ ట్రైనింగులో ఆటగాళ్లకు గాయాలయ్యే ప్రమాదం ఉన్నా, దాన్ని లెక్కచేయకుండా బ్యాటర్లు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. గువహతిలో నవంబర్ 22 నుంచి జరగబోయే రెండో టెస్టుకు ముందు టీమ్ ఇండియా అనుసరిస్తున్న ఈ గంభీరమైన ప్లాన్ వివరాలు చూద్దాం. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్టులో వైఫల్యం తర్వాత, భారత బ్యాటర్లు ప్రత్యేకంగా స్పిన్నర్లను ఎదుర్కోవడానికి ఒక వినూత్న వ్యూహాన్ని అనుసరించారు. బ్యాట్స్‌మెన్‌లు ఒక ప్యాడ్‌ను తీసేసి (ముందు కాలుకు ఉండే ప్యాడ్) సుమారు మూడు గంటల పాటు స్పిన్నర్ల బౌలింగ్‌ను ఎదుర్కొని ప్రాక్టీస్ చేశారు. ముందు కాలుకు ప్యాడ్ లేకుండా బ్యాటింగ్ చేయడం అంటే, బంతి కాలికి లేదా ఇతర భాగాలకు తగిలితే గాయమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇది ఒక పాత పద్ధతి. దీని ద్వారా బ్యాట్స్‌మెన్‌లు బంతిని కేవలం తమ ముందు ప్యాడ్‌తో అడ్డుకోవడానికి ప్రయత్నించకుండా, బ్యాట్‌ను మాత్రమే ఉపయోగించి ఆడటానికి అలవాటు పడతారు. భారత లెఫ్ట్ హ్యాండర్లలో బ్యాక్ ఫుట్‌పైకి వెళ్లి ఆడే ధోరణి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాక్టీస్ వారికి స్పిన్నర్ల బౌలింగ్‌ను ముందుకు వచ్చి ఆడటానికి, ప్యాడ్‌ను కాకుండా బ్యాట్‌ను ఎక్కువగా ఉపయోగించడానికి సహాయపడుతుంది. సోమవారం జరిగిన ఐచ్ఛిక ప్రాక్టీస్ సెషన్‌కు సీనియర్ సభ్యుల్లో రవీంద్ర జడేజా సహా కేవలం ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే హాజరయ్యారు. లెఫ్ట్ హ్యాండర్ సాయి సుదర్శన్ ముందు కాలుకు ప్యాడ్ లేకుండా దాదాపు మూడు గంటల పాటు సాధన చేశాడు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ గాయం కారణంగా రెండో టెస్ట్‌కు దూరమయ్యే అవకాశం ఉండటంతో, సుదర్శన్ అతని స్థానాన్ని భర్తీ చేసే ఛాన్స్ ఉంది. మొదటి టెస్ట్‌లో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఆడి, ఆశించిన స్థాయిలో రాణించని ధ్రువ్ జురెల్ కూడా సుదర్శన్ లాగే ఒక ప్యాడ్ తీసి ప్రాక్టీస్ చేశాడు. గువహతి టెస్ట్‌లో కూడా టీమ్ మేనేజ్‌మెంట్ అతన్ని అదే పాత్రలో కొనసాగించే అవకాశం ఉంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సీతాంశు కోటక్ దగ్గరుండి సుదర్శన్ ప్రాక్టీస్‌ను పర్యవేక్షించారు. బ్రేక్ సమయంలో గంభీర్ వారిద్దరితో ఎక్కువ సమయం మాట్లాడటం కనిపించింది. స్పిన్నర్లకు వ్యతిరేకంగా ధైర్యంగా ఆడినప్పటికీ, ఈ ఇద్దరు బ్యాటర్లు పేస్ బౌలర్లను ఎదుర్కోవడంలో మాత్రం కొద్దిగా ఇబ్బంది పడ్డారు. పేస్ బౌలర్ల ముందు సుదర్శన్, జురెల్ అప్పుడప్పుడు ఇబ్బంది పడ్డారు. నెట్ బౌలర్ల స్వింగ్ బంతులకు కూడా వారి బ్యాట్‌కు ఎడ్జ్ తగలడం గమనించవచ్చు. గిల్ రెండో టెస్ట్ ఆడటం దాదాపు అసాధ్యం కావడంతో, యువ ఆల్‌రౌండర్ నితీష్ రెడ్డిని సౌత్ ఆఫ్రికా ఎ తో జరుగుతున్న ఇండియా ఎ సిరీస్ నుంచి వెనక్కి పిలిపించి, కోల్‌కతాకు తీసుకువచ్చారు. అయితే, అతను ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదు.



## ఈ సీజన్‌లోనూ కెప్టెన్‌గా పాట్ కమిన్సే !

సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కొత్త కెప్టెన్‌ను నియమిస్తారనే ప్రచారానికి యాజమాన్యం ఫుల్‌స్టాప్ పెట్టింది. వచ్చే సీజన్‌లోనూ పాట్ కమిన్సే కెప్టెన్‌గా ఉంటారంటూ సోషల్ మీడియాలో ఓ పోస్టర్‌ను షేర్ చేసింది. గతంలో కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ కెప్టెన్ పేరును ధ్రువీకరించింది. కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. తాజాగా సోమవారం నవంబర్ 17న, ఫ్రాంచైజీ తన X హ్యాండిల్‌లో ఆస్ట్రేలియన్ పాట్ కమిన్స్‌ను మూడోసారి SRH కెప్టెన్‌గా కొనసాగుతారని స్పష్టం చేసింది. దీంతో వరుసగా మూడోసారి ఫ్రాంచైజీ పగ్గాలు చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా కమిన్స్ ప్రస్తుతం వెన్ను గాయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. గాయం కారణంగా యాషెస్ టెస్ట్‌కు దూరమయ్యాడు. దీంతో నవంబర్ 21 నుంచి ఇంగ్లాండ్‌తో ప్రారంభమయ్యే సిరీస్ ఓపెనర్‌లో స్టీవ్‌స్మిత్ ఆస్ట్రేలియాకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అయితే డిసెంబర్ 4 నుంచి బ్రిస్బేన్‌లో ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌కు పాట్ కమిన్స్ ఫిట్‌గా ఉంటాడని అంతా భావిస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ 2026 ఐపీఎల్ కోసం తమ జట్టును నియమించుకొని, అందులో ఎనిమిది మందిని పేర్లు ప్రకటించింది. వారు మహమ్మద్ షమీని లఖ్‌నవూకు రూ.10 కోట్లకు (100 మిలియన్ రూపాయలు) కొనుగోలు చేశారు. వారు ఆడమ్ జంపా, రాహుల్ చాహర్, వియాన్ ముల్డర్‌తో సహా అనేక మంది ఆటగాళ్లు ఉన్నారు. మినీ–వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి సన్‌రైజర్స్ వద్ద ఇప్పుడు 25.50 కోట్లు మిగిలి ఉన్నాయి. దీని వల్ల జట్టు స్లాట్‌లను పూరించడానికి మరో 10 మంది ఆటగాళ్లను పొందేందుకు వీలు కలుగుతుంది. ఎందుకంటే నియమాలు ప్రతి జట్టు గరిష్ఠంగా 25 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి అనుమతిస్తాయి. ఇటీవలి సీజన్లలో బాగా రాణించిన కోర్ జట్టును నిలుపుకుంది. కమిన్స్ కెప్టెన్సీలో, హైదరాబాద్ 2024 లో రన్నరప్‌గా నిలిచింది. కానీ 2025 సీజన్‌లో తమ ప్రదర్శనను కొనసాగించడంలో విఫలమై ప్లేఆఫ్‌కు అర్హత సాధించలేకపోయింది. ఆ జట్టు 14 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలు, ఏడు ఓటములు, ఒక డ్రాతో ఆరో స్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న పాట్ కమిన్స్ 2014లో సన్‌రైజర్స్ కెప్టెన్సీని చేపట్టాడు. అంతకుముందు కోల్‌కతా నైట్ రైడర్స్, దిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2024 కి ముందు కమిన్స్ సన్‌రైజర్స్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్, 2023 ODI ప్రపంచ కప్ విజయం తర్వాత, 2024 వేలంలో ఆస్ట్రేలియన్ ఆటగాడు ఐడెన్ మార్క్రామ్ తర్వాత ఆయన స్థానంలో కమిన్స్ బాధ్యతలు స్వీకరించాడు. అతని సారథ్యంలో 2024లో ఫైనల్ చేరిన సన్‌రైజర్స్, 2025లో ఆరోస్థానంలో నిలిచింది. మొత్తంగా కమిన్స్ కెప్టెన్సీలో 30 మ్యాచ్‌లు ఆడగా అందులో 15 గెలిచి, 14 ఓడింది. ఓ మ్యాచ్‌లోనైతే ఫలితం తేలనేలేదు.

## బవుమా అరుదైన రికార్డు..

సొంతగడ్డ స్పిన్ పిచ్ మనకు అడ్డా! అలాంటి చోట, 124 పరుగుల టార్గెట్‌ను ఛేదించలేక టీమ్?ఇండియా కుప్పకూలడం ఫ్యాన్స్‌కు పెద్ద షాక్. 15 ఏళ్ల తర్వాత మన గడ్డపై సౌతాఫ్రికా టెస్ట్ గెలిచి చరిత్ర సృష్టించింది. అయితే, ఈ ఓటమి కంటే ఎక్కువగా ఇప్పుడు సౌతాఫ్రికా కెప్టెన్ గురించే పెద్ద చర్చ నడుస్తోంది. అతను కెప్టెన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా ఓడిపోలేదు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో కూడా గెలిచాడు. సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా ఒక అరుదైన రికార్డును కొనసాగిస్తున్నాడు. అతను టెస్ట్ కెప్టెన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు సౌతాఫ్రికా ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. బవుమా మొత్తం 11 టెస్టులకు నాయకత్వం వహించగా, అందులో 10 మ్యాచ్‌లలో సౌతాఫ్రికా గెలిచింది, మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అతని కెప్టెన్సీలోనే ఆస్ట్రేలియాపై డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా గెలిచారు. ఇప్పుడు టీమ్?ఇండియా లాంటి బలమైన జట్టును సొంత గడ్డపై ఓడించి, తన అజేయమైన రికార్డును కొనసాగించడం విశేషం. ఈ మ్యాచ్ ఓటమికి పూర్తిగా భారత బ్యాటర్లదే బాధ్యత. 124 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్?ఇండియా, కేవలం 93 పరుగులకే కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. మన టాప్ ఆర్డర్ పూర్తిగా ఫెయిల్ అయింది. యశస్వి జైస్వాల్ (0), కేఎల్ రాహుల్ (1), కెప్టెన్ రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (13) దారుణంగా విఫలమయ్యారు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (31), రవీంద్ర జడేజా (18), అక్షర్ పటేల్ (26) కాసేపు పోరాడినా, అది విజయానికి సరిపోలేదు. స్పిన్ పిచ్‌పై సౌతాఫ్రికా స్పిన్నర్లు చెలరేగిపోయారు. ఈ పిచ్‌ను ఇండియా స్పిన్నర్లు (జడేజా, అక్షర్, కుల్దీప్) కోసం తయారుచేశారు. కానీ, మన స్పిన్నర్ల కంటే సౌతాఫ్రికా స్పిన్నర్ సైమన్ హార్మర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 8 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. మరోవైపు కేశవ్ మహారాజ్ కూడా కీలక వికెట్లు తీశాడు. మన బ్యాటర్లు సొంత పిచ్‌పైనే స్పిన్‌ను ఆడలేక చేతులెత్తేయడం విమర్శలకు తావిస్తోంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సౌతాఫ్రికా మన గడ్డపై టెస్ట్ మ్యాచ్ గెలవడం ఇదే తొలిసారి. ఓటమి తర్వాత కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ, "మేము ఈ లక్ష్యాన్ని ఛేదించాల్సింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఒత్తిడి పెరిగిపోయింది" అని ఒప్పుకున్నాడు. అయితే, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం పిచ్‌ను వెనకేసుకొచ్చాడు. "ఇది ఆడలేని వికెట్ ఏమీ కాదు. మాకు కచ్చితంగా ఇలాంటి వికెట్లే కావాలి. క్యూరేటర్ మాకు పూర్తి సపోర్ట్ ఇచ్చాడు" అని అన్నాడు. అంటే, మనకు కావాలని స్పిన్ పిచ్ తయారు చేయించుకుని, మనమే అందులో ఫెయిల్ అయ్యామని గంభీర్ పరోక్షంగా ఒప్పుకున్నాడు. ఇది గత 6 హోమ్ టెస్టుల్లో ఇండియాకు 4వ ఓటమి కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా గెలిచిందంటే, దానికి కెప్టెన్ బవుమా బ్యాటింగ్ కూడా ఒక కారణం. రెండో రోజు ఆట ముగిసేసరికి సౌతాఫ్రికా 93/7తో, కేవలం 63 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు ఇండియా త్వరగా వికెట్లు తీస్తుందనుకుంటే, కెప్టెన్ బవుమా (55 నాటౌట్) అడ్డుగోడలా నిలబడ్డాడు. కార్బిన్ బాష్ (25)తో కలిసి 44 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ ఆధిక్యమే చివరికి మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆసీస్‌ను డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఓడించి, ఇప్పుడు ఇండియాను సొంతగడ్డపై ఓడించి, బవుమా తన కెప్టెన్సీకి తిరుగులేదని నిరూపించుకున్నాడు.



## గంభీర్ వల్లే టీమిండియాకు ఓటమి

**టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్**

సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియాకు ఎదురైన ఓటమి నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గంభీర్ అనాలోచిత నిర్ణయాల కారణంగానే టీమిండియా విజయాలు అందుకోలేక పోతుందని అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా గంభీర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలోకి టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ చేరాడు. నేరుగా గంభీర్‌పై విమర్శలు చేయకపోయినా.. టీమిండియా మేనేజ్‌మెంట్ కారణంగానే ఘోర పరాజయాలను ఎదుర్కొంటుందని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా జట్టు వాతావరణం దెబ్బతిన్నదని, టీమ్‌లో ఒక్క ప్లేయర్ కూడా స్వేచ్ఛగా ఆడలేకపోతున్నారని ఆరోపించాడు. జట్టులో పదే పదే మార్పులు చేయడంతో ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుందని తెలిపాడు. ఏ ఒక్క ప్లేయర్‌కు కూడా టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి మద్దతు లభించడం లేదన్నాడు. 'జట్టులో ఎవరు ఆడినా.. వారికి టీమ్ మేనేజ్‌మెంట్ మద్దతు ఉందనే భావనలో లేరు. ఒక్కరు కూడా ఆటగాళ్లను వెనకేసుకొని రావడం లేదు. జట్టులో ప్రతీ ఒక్కరు భయంతో ఉన్నారు. జట్టులో చోటు ఉంటుందో లేదోననే భయంతోనే ఆడుతున్నారు. ఒక్కరు కూడా స్వేచ్ఛగా ఆడటం లేదు. సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ చేసిన తర్వాత కూడా జట్టులో అతని చోటు ఖరారు కాలేదు. సెంచరీ తర్వాత అతను తిరిగి జట్టులోకి కూడా రాలేకపోయాడు. సాయి సుదర్శన్ 87 పరుగులు చేశాడు. అతను కూడా తదుపరి మ్యాచ్ ఆడలేదు. జట్టు అంతా గందరగోళంలో ఉంది.' అని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మహమ్మద్ కైఫ్ చెప్పుకొచ్చాడు. ఆటగాళ్లకు వరుసగా అవకాశాలు ఇచ్చి, వెన్ను తట్టి ప్రోత్సహించాలని కైఫ్ సూచించాడు. అప్పుడే ఆటగాళ్లు ఎలాంటి బెరుకు లేకుండా స్వేచ్ఛగా ఆడగలరని అభిప్రాయపడ్డాడు. ఇలా చేస్తేనే టీమిండియాకు ఆశించిన ఫలితాలు దక్కుతాయని చెప్పాడు. కోల్‌కతా వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. 124 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా ఛేదించలేకపోయింది. పూర్తిగా బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌ను సిద్ధం చేయడంతో భారత బ్యాటర్లు తడబడ్డారు. ఈ తరహా పిచ్‌ను తానే తయారు చేయించానని గంభీర్ అంగీకరించాడు. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## టెస్ట్ క్రికెట్‌ను ఖూనీ చేస్తున్నారు

**మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్**

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా ఎదుర్కొన్న పరాజయంపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక టీమిండియా 93 పరుగులకే కుప్పకూలడంపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇలాంటి ర్యాంక్ టర్నర్లను తయారు చేస్తూ టెస్ట్ క్రికెట్‌ను పూర్తిగా నాశనం చేస్తున్నారని జట్టు యాజమాన్యంపై మండిపడ్డారు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ ఓటమి అనంతరం తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన హర్భజన్ సింగ్.. "టెస్ట్ క్రికెట్‌కు RIP (రెస్ట్ ఇన్ పీస్). వారు ఈ ఫార్మాట్‌ను పూర్తిగా నాశనం చేశారు. కొన్నేళ్లుగా ఇలాంటి పిచ్‌లు తయారు చేస్తున్నారు. జట్టు గెలుస్తోంది కాబట్టి ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదు. కానీ ఇది సరైన పద్ధతి కాదు" అని ఆరోపించారు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ ఓటమి అనంతరం తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన హర్భజన్ సింగ్.. "టెస్ట్ క్రికెట్‌కు RIP (రెస్ట్ ఇన్ పీస్). వారు ఈ ఫార్మాట్‌ను పూర్తిగా నాశనం చేశారు. కొన్నేళ్లుగా ఇలాంటి పిచ్‌లు తయారు చేస్తున్నారు. జట్టు గెలుస్తోంది కాబట్టి ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదు. కానీ ఇది సరైన పద్ధతి కాదు" అని ఆరోపించారు. ఇలాంటి పిచ్‌లపై ఆడటం వల్ల ఆటగాళ్లు ఏ మాత్రం ఎదగరని హర్భజన్ అభిప్రాయపడ్డారు. మీరు గానుగెద్దులా ఒకేచోట తిరుగుతున్నారే తప్ప ముందుకు వెళ్లడం లేదని భజ్జీ మండిపడ్డారు. బ్యాటర్లకు పరుగులు ఎలా చేయాలో కూడా తెలియని విధంగా పిచ్‌లను తయారుచేస్తున్నారని అన్నారు. నైపుణ్యంతో కాకుండా పిచ్ వల్లే వికెట్లు పడుతుంటే.. సమర్థుడైన బౌలర్‌కు, బ్యాటర్‌కు తేడా ఏముంటుందని ఆయన ప్రశ్నించారు. తొలి టెస్టులో రెండో రోజే 15 వికెట్లు పడటం, మూడో రోజు రెండు సెషన్లలోపే మ్యాచ్ ముగియడంతో పిచ్‌పై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తాయి.

## బాబర్‌పై కొరడా ఝుళిపించిన ఐసీసీ



పాకిస్తాన్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాట్స్‌మెన్ బాబర్ అజామ్ పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ చర్య తీసుకుంది. ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని లెవెల్ 1 నిబంధనను ఉల్లంఘించినందుకు గాను, బాబర్ అజామ్‌పై అతని మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించారు. ఈ సంఘటన శ్రీలంకతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో జరిగింది. ఆటగాళ్ల క్రమశిక్షణ విషయంలో ఐసీసీ ఎంత కఠినంగా ఉంటుందో ఈ సంఘటన మరోసారి నిరూపించింది. రావల్పిండిలో నవంబర్ 16న జరిగిన పాకిస్తాన్ %జం% శ్రీలంక మూడో వన్డే మ్యాచ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. పాకిస్తాన్ బ్యాటింగ్ చేస్తున్న 21వఓవర్‌లో, బాబర్ అజామ్ అవుట్ అయిన తర్వాత క్రీజ్ వదిలి వెళ్లే ముందు తన బ్యాట్‌తో స్టంప్స్‌ను కొట్టాడు (లేదా బంతిని స్టంప్స్‌పై కొట్టాడు). ఈ చర్యను ఐసీసీ ఆచార నియమావళిలోని ఆర్టికల్ 2.2 ఉల్లంఘనగా పరిగణించారు. ఈ ఆర్టికల్ అంతర్జాతీయ మ్యాచ్‌ల సమయంలో క్రికెట్ పరికరాలు, మైదాన పరికరాలు లేదా ఫిట్టింగ్‌లను దుర్వినియోగం చేయకుండా ఉండాలని చెబుతుంది. జరిమానాతో పాటు బాబర్ అజామ్ క్రమశిక్షణ రికార్డులో ఒక డీమెరిట్ పాయింట్ కూడా యాడ్ చేశారు. గత 24 నెలల కాలంలో బాబర్ అజామ్‌కు ఇది మొదటి తప్పిదం. మైదానంలో ఉన్న అంపైర్లు, థర్డ్ అంపైర్, ఫోర్త్ అంపైర్ ఈ ఆరోపణలను నమోదు చేశారు. ఆ తర్వాత ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ ఆఫ్ మ్యాచ్ రిఫరీ అయిన అలీ నఖ్వీ జరిమానాను ప్రతిపాదించారు. బాబర్ అజామ్ తన తప్పును అంగీకరించడంతో, ఎలాంటి అధికారిక విచారణ అవసరం లేకుండానే జరిమానాను ఆమోదించారు. ఈ మూడో వన్డే మ్యాచ్‌లో పాకిస్తాన్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. శ్రీలంక జట్టు 45.2 ఓవర్లలో కేవలం 211 పరుగులకే ఆలౌట్ అయింది. సదీరా సమరవిక్రమ 48 పరుగులు చేశాడు. పాకిస్తాన్ బౌలర్లలో మహమ్మద్ వసీం జూనియర్ 3 వికెట్లు తీశాడు. పాకిస్తాన్ 44.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి గెలిచింది. పాకిస్తాన్ తరఫున ఫఖర్ జమాన్ 55 పరుగులు, మహమ్మద్ రిజ్వాన్ 61 పరుగులు, హుస్సేన్ తలత్ అజేయంగా 42 పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్ జెఫ్రీ వాండర్సే 3 వికెట్లు పడగొట్టాడు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# రాజశేఖర్ సరసన రమ్యకృష్ణ



యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈమధ్య జోరు పెంచిన విషయం తెల్సిందే. హీరోగానే కాకుండా సపోర్టింగ్ రోల్స్ లో కూడా చేయడం మొదలుపెట్టారు. ఇప్పటికే ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రాజశేఖర్ కు అదేమీ ఆశించిన ఫలితాన్ని అందించలేదు. ఇక ప్రస్తుతం బైకర్ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నాడు. ఒకపక్క సపోర్టింగ్ రోల్స్ లో నటిస్తూనే ఇంకోపక్క హీరోగా కూడా రాబోతున్నాడు. తాజా సమాచారం ప్రకారం తమిళ్ లో సూపర్ హిట్ అయిన లబ్బరు పందు సినిమాను రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ కళ్యాణ్, దినేష్, శ్వాసిక, సంజన కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమా ఓటీటీలో తెలుగు వెర్షన్ లో కూడా రిలీజ్ అయ్యి ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమానే రాజశేఖర్ రీమేక్ చేస్తున్నాడు. ఇందులో దినేష్ పాత్రలో రాజశేఖర్ నటిస్తుండగా.. హరీష్ కళ్యాణ్ పాత్రలో విశ్వదేవ్ రాచకొండ నటిస్తున్నాడు. ఇక హీరోయిన్ గా రాజశేఖర్ కుమార్తె శివాని నటిస్తుంది. సినిమా మొత్తానికి హైలైట్ అంటే.. శ్వాసిక పాత్రనే అని చెప్పాలి. క్రికెట్ అంటే పిచ్చి ఉన్న భర్తను.. ఆ పిచ్చి మాన్పించి, అందరి మూడ్ను గౌరవంగా నిలబడాలని, ప్రేమించి పెళ్లి చేసుకొని బయటకు వచ్చాకా.. తన కుటుంబానికి అల్లుడును గొప్పగా చూపించాలని ఆరాటపడే పాత్రలో ఆమె ఎంతో అద్భుతంగా నటించింది. ఆ పాత్ర ఎవరు చేస్తారు అనే డైలమా నేటితో తీరిపోయింది. రాజశేఖర్ భార్యగా శివగామి రమ్యకృష్ణను అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రకు ఆమె పర్ఫెక్ట్ అని చెప్పొచ్చు. అంతేకాకుండా రాజశేఖర్– రమ్యకృష్ణ జోడీకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అల్లరి ప్రియుడు లాంటి హిట్ తరువాత వీరిద్దరి కాంబోలో దీర్ఘ సుమంగళీ భవ, బలరామ కృష్ణులు సినిమాలు వచ్చాయి. 1998 తరువాత ఈ జంట మళ్లీ కలిసి కనిపించలేదు. దాదాపు 27 ఏళ్ళ తరువాత మరోసారి ఈ జంట ఈ రీమేక్ తో కలవనున్నారు. అప్పటి కెమిస్ట్రీ ఇప్పుడు కూడా వర్క్ అవుతూ అవుతుందని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజముంది అనేది తెలియాల్సి ఉంది.



# త్వరలోనే ఉస్తాద్ భగత్ సింగ్

## దర్శకుడు హరీష్ శంకర్ కీలక ప్రకటన

గబ్బర్‌సింగ్ తర్వాత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ , హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' కొన్ని సన్నివేశాలు మినహా ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సాంగ్‌లో వింటేజ్ లుక్‌ను రివీల్ చేశారు. మళ్లీ ఇప్పటిదాకా సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ త్వరలోనే రిలీజ్ చేస్తామంటూ ఇటీవల టీమ్ చిన్న హింట్ ఇచ్చిన సంగతి తెలిసిందే! తాజాగా దర్శకుడు హరీష్ శంకర్ అధికారికంగా వెల్లడించారు. అల్లరి నరేష్ హీరోగా నటించిన '12ఎ రైల్వే కాలనీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అప్‌డేట్ గురించి అడగ్గా... 'చిన్న కరెక్షన్... ఉస్తాద్ గురించి చిన్న న్యూస్ ఉండదు. పెద్ద న్యూస్ ఉంటుంది. డిసెంబరులో ఫస్ట్ సాంగ్ వస్తుంది. త్వరలోనే డేట్ చెబుతాం. డిసెంబర్ 31కి మీకు జోష్ వస్తుందందని చెప్పగా ఫ్యాన్స్ ఫుల్ జోష్ ఫీలయ్యారు. పవన్‌కల్యాణ్ సరసన రాశీఖన్నా, శ్రీలీల నాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల రాశీఖన్నా కూడా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అలాగే పవన్‌కు సంబంధించిన షూట్ మొత్తం పూర్తయింది.



# మహారాణి పాత్రలో నయనతార

నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేశారు. మంగళవారం నయన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సినిమాలో నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ వీడియో పంచుకున్నారు త్వరలోనే ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ వస్తాయని వెల్లడించింది. నవంబర్ 26న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు తెలిపింది.



# పట్టాలకెక్కనున్న జై హనుమాన్

తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన 'హనుమాన్' కి సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రాన్ని ప్రకటించారు దర్శకుడు ప్రశాంత్. ఇందులో ప్రధాన పాత్రలో కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి పోషించనున్నారు. ఈ సినిమాను అనౌన్స్ చేసి చాలా కాలమే అయింది. దీనికి సంబంధించి రిషబ్ లుక్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే రిషబ్ బిజీగా ఉండటం, డేట్స్ కుదరక ఈ సినిమా ఇంకా సెట్స్ మీదకి వెళ్లలేదని టాక్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి రిషబ్ వరుసగా ఐదారు నెలలు ప్రశాంత్ వర్మకి కాల్షీట్స్ ఇచ్చినట్లు చిత్ర బృందం నుంచి సమాచారం అందింది. ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది శుభవార్తే అవుతుంది. అయితే ఈ సినిమా డిలే అవ్వడానికి దర్శకుడు ప్రశాంత్ వర్మ, రెమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డితో ఉన్న విభేదాలు, ఆర్థిక లావాదేవీలు కూడా ఓ కారణమని తెలుస్తుంది. అయితే దర్శకనిర్మాతలు ఇద్దరు ఆ రచ్చను ఫిల్మ్‌ఛాంబర్‌లో పెట్టారు. వారే ఇష్యూకి సొల్యూషన్ ఇస్తారని దర్శకుడు ఇటీవల ఓ లేఖ ద్వారా తెలిపారు.

# జక్కన్న వ్యాఖ్యలపై వానరసేన మండిపాటు



ఇటీవల హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన 'వారణాసి' సినిమా టైటిల్స్ గ్లింప్స్ వేడుకలో జక్కన్న చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని రాష్ట్రీయ వానరసేన ఎస్ఎస్ రాజమౌళిపై సరూర్ నగర్ పోలీసుకు ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, రాజమౌళి పై కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో ఎవరూ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన సంఘం సభ్యులు పోలీసులను కోరారు. రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన కార్యక్రమంలో సాంకేతిక సమస్య తలెత్తింది. రాజమౌళి బాధతో పాటు అసహనానికి గురయ్యారు. స్టేజి మీద ఆయన మాట్లాడుతూ.. 'నాకు దేవుడి మీద నమ్మకం లేదు. నా తండ్రి విజయేంద్రప్రసాద్ నాతో మాట్లాడుతూ.. 'టెన్షన్ పడకు. అంతా హనుమ చూసుకుంటాడు. వెనకుండి నడిపిస్తాడు' అన్నారు. కానీ, సాంకేతిక లోపం కారణంగా ఈవెంట్ ఆగినపుడు ఇలాగేనా నడిపించేది అని కోపం వచ్చింది. నా భార్య రమాకు హనుమాన్ అంటే చాలా ఇష్టం. కానీ, ఎందుకిలా అయిందని నాకు కోపం వచ్చింది' అని అన్నారు. ఇదిలా ఉండగా మరో చిక్కులో ఇరుక్కున్నారు రాజమౌళి. హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యలు వివాదం కొనసాగుతుండగా 'వారణాసి' టైటిల్ పై ఫిల్మ్‌చాంబర్‌లో మరో నిర్మాత ఫిర్యాదు చేశారు. ఈ టైటిల్ తాను ఎప్పుడో రిజిస్టర్ చేసినట్లు తెలిపారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169.
PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861